# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని
# శృంగార సంకీర్తనలు - మధుర భక్తి

48820



రచయిత

డా. అంగలూరు శ్రీరంగాచారి

ఆగస్టు 1995

Rs :50=00

# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని
# శృంగార సంకీర్తనలు - మధుర భక్తి

రచయిత

డా. అంగలూరు శ్రీరంగాచారి

ఆగస్టు 1995

ప్రధమ ముద్రణ
ఆగస్టు 1995
1000 ప్రతులు

CENTRE
48820

ప్రచురణ కర్త
**డా. ఎ. శ్రీరంగాచారి**
నెం 361, బి ఎస్. ఆర్ కాలనీ,
వనస్థలిపురం,
హైదరాబాద్

ప్రింటర్స్
**శ్రీ రాజేశ్వరి ప్రింటర్స్ అండ్ స్టేషనర్స్**
కాచీగూడా,
హైదరాబాద్ - 27
ఫోన్ 666919

సర్వహక్కులు రచయితవి

***తిరుమల తిరుపతిదేవస్థానం వారి ఆర్థిక సహాయముతో ప్రచురణ***

ప్రాప్తిస్థానము
**ఎ. హరిప్రసాద్**
నెం 361, బి ఎస్ ఆర్ కాలనీ,
వనస్థలిపురం,
హైద్రాబాద్ - 500 070

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | పండితాభిప్రాయములు | ౧-౨౦ |
| 2. | పదకవితా పితామహుని జీవితము – రచనలు | 3-20 |
| 3. | పదకవితలు పుట్టుపూర్వోత్తరములు | 21-32 |
| 4 | రసవిచారము – రస సంఖ్య | 33-50 |
| 5 | భక్తి స్వరూపము – నిర్వచనము | |
| | మధురభక్తి – నిర్వచనము మధురభక్తులు | 51-82 |
| 6. | అన్నమాచార్యుని మధురభక్తి | 83-228 |
| 7. | సింహావలోకనము | 229-238 |
| | సంఖ్యాసూచి | |
| 8. | కృతజ్ఞతాంజలి | |
| | ప్రస్తావన | i-v |

# ఎదలోని మాట

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలు - మధుర భక్తి అనే సిద్ధాంత వ్యాస ప్రతిని ముద్రించడానికి ఆర్థిక సహాయం కోసం వెంకటేశ్వరస్వామితో పాటు మరొక విశ్వవిద్యాలయాన్ని కూడా అర్థించాను. ఒరకంగా ఇది దురాశో పేరాసో అయ్యుంటుంది. చదువుల తల్లిని ఆర్థిక సహాయం కోరడం అజ్ఞానమేమో।

అయితే ఆమె తిరస్కరించిన నెలలోనే స్వామి - ఏడు కొండలనుండి కటాక్షించాడు దాని ఫలితమే పదిహేను వేల రూపాయిల వరం - అప్పుడు నాకనిపించింది. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుని శరణు వేడుతూ మళ్ళీ ఇతర దేవతలను ప్రార్థించకూడదని కదా ఆర్యోక్తి. వెంటనే అన్నమయ్యగారి సంకీర్తన జ్ఞాపకం వచ్చింది

నరహరి నీ దయ మీదట నా చేతలు కొన్నా
శరణాగతియును -జీవుని స్వతంత్రము రెండా!
శరణాగతిలో మర్కటకిశోర న్యాయానికి తావు లేదు కదా।

ఇలా తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థికసహాయ పథకం నుండి తత్సంబంధ అధికారులకూ, ఆ కమిటీ మెంబర్లకూ భూరిగా ఆర్థిక సహాయాన్ని అందించాలనే సంకల్పం కల్పించి వారి ద్వారా శ్రీనివాసుడు తన కీర్తనలలోని అన్నమయ్య అంతరంగాన్ని అంతరార్థాన్నీ వెలువరించే అవకాశాన్ని కల్పించాడు.

తి. తి. దే. ఆర్థిక సహాయ సంఘానికి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారికి, ఎడిటర్ గారికి, వారి వారి కార్యాలయ సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు అర్పిస్తున్నాను.

కోరినంతనే స్వల్పవ్యవధిలో ఇతర కార్యక్రమాలు మానుకొని నా మీది వాత్సల్యంతో అభిమానంతో పెద్దలు పండితులూ తమ తమ అమూల్యాభిప్రాయాలు వ్రాసి యిచ్చినారు. వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని సర్వాంగ సుందరంగా ముద్రించి యిచ్చిన శ్రీరాజేశ్వరి ప్రింటర్స్ వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు

చివరగా ఒక్క మాట. ఈ పుస్తక ముద్రణకైన ఖర్చులో మూడు వంతులు స్వామియే భరించాడు దీన్ని అమ్ముకోవడం నాకిష్టం లేదు. మేం చేస్తున్న అన్నమాచార్య సంకీర్తనా ప్రచారంలో ఈ పుస్తకం కూడా ఉచిత పాత్ర నిర్వహిస్తే అదే పదివేలు. మీకిది నచ్చుతుంది కదూ

దాసానుదాసుడు
**రంగాచారి**

ప్రొ. ఇ. శివారెడ్డి M A , Ph D (Telugu), M A (Sanskrit)
Chairman, B O S.,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు
యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాదు - 500 007

27-7-95

## అభినందన తిలకం

పదసాహిత్యానికి పరమోన్నతస్థితి కల్పించినవారు తాళ్ళపాక కవులు అందులో అన్నమాచార్యుల సేవ అనితరసాధ్యం అయితే అన్నమాచార్యుల పదకవితా సృష్టిని పలుకోణాల నుంచి పరిశీలించి అందులోని లక్షణ - విలక్షణతలను ప్రకటించవలసి ఉంది ఇంతకు ముందు ఈ కృషికి పూనుకొని సఫలీకృతులైన వారు కొందరున్నారు. వారి కోవలో నిలువదగిన కృషి చేశారు. డా అంగలూరు శ్రీ రంగాచారి.

అన్నమయ్య సంకీర్తనలలో శృంగార రస ప్రపూర్ణము లైనవే ఎక్కువ అందులోను మధురభక్తికి మనికి పట్టులయిన సంకీర్తనలూ ఎక్కువే డా. శ్రీ రంగాచారిగారు వీటిలోని మౌలికాంశాలను పరిశీలించి యీ సిద్ధాంతవ్యాసాన్ని రచించారు వృత్తి వల్ల, చిత్తవృత్తివల్ల, పాండితీ ప్రకర్షవల్ల ఆయన యీ పనికి అన్ని విధాల అర్హులు విషయ సేకరణలో రచనా విధానంలో వారు ప్రదర్శించిన ప్రయత్నసిద్ధులు గొప్పవి

పద్యకావ్యాల్లో తప్ప పదకవితల్లోని మధురభక్తిని అనుశీలించిన సిద్ధాంత వ్యాసాలు మృగ్యం. డా శ్రీ రంగాచారి మధుర కవితాలక్షణాలు సాకల్యంగా విశ్లేషిస్తూ నిరూపించారు ఈ సిద్ధాంత వ్యాస గ్రంథంలో, నాయికా లక్షణాల్ని, రస వివరణను వారు పరిశీలించిన పద్ధతి రుచిరంగా, రమణీయంగా ఉంది. ఆయన స్వయంగా వీటిని పాడి మనల్ని మెప్పించినట్లే వివరించి మనల్ని మెప్పించగలరు ఈ సిద్ధాంతవ్యాసానికి మలిదశలో నేను పర్యవేక్షకుడుగా ఉన్నాను. ఈ పరిశోధకుని యీ కృషి ఫలవంతమూ, గుణవంతమూ, స్ఫూర్తి మంతమూ అనేది నా విశ్వాసం. తనకూ, స్వీకృత విషయానికీ, పర్యవేక్షకునికీ గౌరవాపాదకమయిన ఈ సిద్ధాంత వ్యాసం రచించినందుకు డా శ్రీ రంగాచారిగారిని ఇతోధిక వృద్ధి ఆకాంక్షిస్తూ అభినందన తిలకం దిద్దుతున్నాను

ఎల్లూరి శివారెడ్డి

## డా. ఎం. కులశేఖరరావు

రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్,

ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైద్రాబాద్

ప్రాచీన నాట్య శాస్త్రకారుడైన భరతముని, తదితర లాక్షణికులు భక్తిని నవరసాల్లో చేర్చకపోయినా, కవులు, రచయితలు, ఆ విశేషాన్ని పరిగణలోనికి గ్రహించకయే, భక్తిని తమకావ్యాలకు ఆలంబనంగా చేసి కొని చాలాకాలంగా రచనలు చేస్తూ వస్తున్నారు కావ్య సంబంధమైన అన్ని లక్షణాల్లో సంస్కృత మార్గాన్నే అనుసరించిన తెలుగు కవులు భక్తిని అవలంబించడంలో లక్షణకారులను అతిక్రమించినట్లే కనిపిస్తుంది. ఎందుచేతనంటే, భక్తి, యథార్థానికి భావమే అయినా, దానిక ఒక సమున్నత ప్రాధాన్యాన్ని కల్పించి దాన్ని రస స్థితికి చేర్చినారు అందువల్లనే కాబోలు, తెలుగువారు భక్తి రసకావ్యాలు, భక్తి రసగేయాలు అని వ్యవహరించడం పరిపాటి అయిపోయింది

తెలుగు సాహిత్యాన్ని, ప్రారంభం నుంచి, విశిష్టాద్వైత సంప్రదాయం ప్రభావితం చేస్తూనే ఉన్నది ఆంధ్రమహాభారతంలో శ్రీకృష్ణుని పై అర్జునునికి గల భక్తి విశిష్టాద్వైతానికి భిన్నం ఏమీ కాదు శాంతి పర్వంలోను, అనునాసిక పర్వంలోను, భీష్ముని ప్రవచనాల్లో ఈ సంప్రదాయం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను గుబాళిస్తూనే ఉంటుంది. అయితే మహాభారతాన్ని భక్తి కావ్యంగా పరిగణించవలసిన పని కాదు

క్రీ శ 13,14 శతాబ్దాల్లో జీవించిన మహా భక్తుడు కృష్ణమాచార్యులు, ఆంధ్రరచయితల్లో భక్తి భావబంధురంగా రచనలు చేసిన వారిలో ప్రప్రథముడు ఈయన, తరువాతి కవులకు, రచయితలకు మార్గదర్శకుడైనాడు కాబట్టి ఈతనికి ప్రథమాంధ్ర సంకీర్తనాచార్యులనే గౌరవం ఉన్నది ఈ మహానుభావుడు నాలుగులక్షల రచన సంకీర్తనలు వ్రాసినాడట కాని మనదాకా కేవలం 60-70 మాత్రమే వచ్చినాయి ఇవన్నీ భక్తి భరితాలే. ఇవన్నీ విశిష్టాద్వైత సంప్రదాయ పరిమళాన్వితాలే. నాలుగు లక్షల వచనాలు లభిస్తే వాటిలో మధురభక్తి భావ భరితమైనవి ఎన్ని ఉండేవో తెలియవచ్చేది దొరికిన వాటిలో అక్కడక్కడా ఈ వాసన లేకపోలేదు

విజ్ఞులు, లక్షణం తెలిసినవారు ఎంతకాదన్నా, పోతన్నగారి భాగవతం భక్తి రసకావ్యమని లోకమంతా వక్కాణిస్తుంది దీనికి కారణం ఆయన కావ్యంలో సమృద్ధిగా ఉండే భక్తి ప్రపత్తి తత్త్వాలే విశిష్టాద్వైతసారమైన నవవిధ భక్తులు అడుగడుగునా సాక్షాత్కరించడమే గజేంద్రునిది నీవే తప్ప ఇతఃపరమెరుగ అనే ప్రపత్తి మార్గమైతే, భీష్ముడు ఆ పరాత్పరుని సేవ్య సేవకవృత్తితో

సేవించి తరించినాడు కుంతీదేవి, రుక్మిణీదేవి ఈ మార్గాన్నే అనుసరించి ఆయన సాన్నిధ్యం చేరుకొన్నారు ఇక గోపికలదే విచిత్రమైన భక్తి మార్గం అదే మధురభక్తి భక్తులకు, భగవంతునికి ఉండే ప్రేయసీ ప్రియుల సంబంధం కాని ఇది లౌకికం కాదు పాంచభౌతికమైన శారీరకం కాదు. అలౌకిక మైంది పోతన్నగారు ఈ మధురభక్తి భావాన్ని ఎంత ఉన్నతంగా అందించినారో పాఠకులందరికి తెలుసు తమిళ దివ్య ప్రబంధాల్లో ఉన్న నమ్మాళ్వారుల మధురభక్తి, గోదాదేవి తిరుప్పావైలో ప్రదర్శించిన భక్తి పోతన్న గారిని ఎంతవరకు ప్రభావితం చేసిందో ఇంకా పరిశీలన చేయవలసి ఉన్నది. ఒక్కమాట మాత్రం నిర్వివాదాంశమే అదేమంటే, శ్రీరామానుజులు ప్రతిపాదించి ప్రచారం చేసిన విశిష్టాద్వైత సిద్ధాంతం చేత ప్రభావితుడై పోతన తన భాగవత కావ్యాన్ని భక్తికావ్యంగా సంతరించి దానిలో నవవిధ భక్తులు ప్రదర్శించినాడనేది

తెలుగు సాహిత్యరంగంలో, పోతన గారికి కొద్దికాలం తరువాత తాళ్ళపాక అన్నమాచార్యులు ప్రకాశించినారు పోతన సహజపండితుడైతే, అన్నమాచార్యులు సహజ సంకీర్తనాచార్యులు ఇద్దరు కూడా లౌకికంగా విద్యాబుద్ధులు నేర్చిన వారు కాదు ఇద్దరికీ, శ్రియఃపతికరుణచేతనే కవిత్వము, భక్తి అబ్బినాయి ఆయన అనుగ్రహం వీరిపైన పరిపూర్ణంగా ఉండడం చేతనే కాబోలు, వారి రచనలు ప్రజల్లో బహుళప్రచారం చెందినాయి వారి కీర్తి అజరామరమైంది

కొన్ని వేల సంకీర్తనలను రచించి, తెలుగు సంకీర్తనసాహిత్యానికి వన్నెచిన్నెలు తెచ్చిన తాళ్ళపాక అన్నమాచార్యులను గురించి, డాక్టరు అంగలూరి శ్రీరంగాచార్యులు ఇప్పుడు మరొక మంచి సిద్ధాంత గ్రంథం రచించినారు. ఇదివరకు వచ్చిన సిద్ధాంతగ్రంథాలకంటే దీన్ని నేను విశిష్టంగా భావిస్తున్నాను ఎందుచేతనంటే దీనిలో నవరసాల్లో ప్రధానరసమైన శృంగారానికి సంబంధించిన సంకీర్తనల చర్చ ఉన్నది దానిలోను, మధురభక్తి ప్రధానాలైన పాటల విశ్లేషణ ఉన్నది డాక్టరు శ్రీ రంగాచార్యులు విశిష్టాద్వైత సంప్రదాయాభిజ్ఞులు దివ్య ప్రబంధాను సంధానం చేసినవారు అందుచేత అన్నమాచార్యుల మధురభక్తికి సంబంధించిన ఈ గ్రంథం ఉత్కృష్టంగా వెలువడింది

ఈ సిద్ధాంతగ్రంథంలో భూమికగా, అన్నమాచార్యుల జీవితచరిత్రను గురించి, పురందరదాసుతో ఆయన సాంగత్యం గురించి, ఉన్నది లక్ష్యం వివరించినప్పుడు లక్షణచర్చకూడ ఉండవలె కాబట్టి, రసవిచారము, రస సంఖ్యను గురించి ప్రామాణిక చర్చ చేసినారు శ్రీ శ్రీరంగాచార్యులవారు విశిష్టాద్వైతసిద్ధాంతంలో ముఖ్యభాగమైన భక్తి, ప్రపత్తులను, వాటి తాత్త్విక విశేషాలను ఈ పరిశోధకులు సందర్భానుసారంగా ఉట్టంకించినారు

అన్నమాచార్యుల భక్తితత్వాన్ని అవగాహన చేసుకోవడానికి ఈ భాగం చాల ఉపకరిస్తుంది

ఇక ఐదవ ప్రకరణం ఈ వ్యాసానికి సారభూతమైంది మధుర భక్తి స్వరూప స్వభావాలు దీనిలో ప్రపంచితమైనాయి అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల్లో ఈ విశేషం ఎట్లా నిక్షిప్తమై ఉన్నదో సూక్ష్మ పరిశీలన జరిగింది అన్నమాచార్యులు తనను తాను నాయికగా భావించుకొని, నాయకుడైన శ్రీ వేంకటేశ్వరుడు తనకెంతటి ప్రియతముడైనవాడో చెప్పడానికి అనేక గేయాలు వ్రాసినారు ఈ పరిశోధకులు ఆ గేయాల్లో ముఖ్యమైన వాటిని ఉదాహరించి, అన్నమాచార్యుల మధురభక్తి బావాన్ని, దాని విభిన్న కోణాలను విశ్లేషించి చూపించినారు ఒకచోట ఈ భావం ఎంత గాఢంగా ఉన్నదో చూడండి.

లీలవాని సరసము లేని నవ్వేలా
ఆలించి వాడువినని మాటలేలా,
సోలినిద్దరునొక్కటై చూడని యద్దమేలా
తాలిమితో లోలోనేతలపోతే చాలును
ఈ కడ వాడు గూడని యీ జవ్వనమేలా
ఆకువాడు మడిచియియ్యని తమ్ములమేలా?

ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలు యథార్థానికి ఈ మధుర భావాలు అలౌకికమే యైనప్పటికి, అన్నమాచార్యుల వారు వీటికి సాధారణ గుణాలు ఆపాదించి వీటిని మధుర తరంగా చేసిన వైనం చదివేవారిని ముగ్ధులను చేస్తుంది.

ఈ నాటి సాహిత్య పరిశోధనలో, తాత్త్విక విషాయలమీద చాల మంది ఆసక్తి చూపించడం లేదు. అటువంటి సమయంలో, డాక్టరు అంగలూరు శ్రీరంగాచార్యులవారు సాంప్రదాయకమైన ఒక విషయాన్ని గ్రహించి, తలస్పర్శిగా చర్చించడం నాకు ఆనందాన్ని కలిగించింది. వారు చేసిన ఈ కృషి ప్రశంసనీయం. శ్రీ రంగాచార్యులవారిని నేను అభినందిస్తున్నాను

విజ్ఞానపురి - విద్యానగరం
హైదరాబాదు 27-7-95

**ఎం. కులశేఖరరావు**

కె.వి. నరసింహమూర్తి ఎమ్. ఎ.
ప్రధానాచార్యులు
గీతా విజ్ఞాన ఆంధ్ర కళాశాల
నల్లగొండ

24-7-1995

సకల కళ్యాణ నిలయుడు, ఆశ్రిత వత్సలుడు, ముక్తి ప్రదుడునైన శ్రీనివాసుని ముప్పదిరెండు వేల సంకీర్తనలతో సేవించి తరించినాడు అన్నమయ్య అట్టి అన్నమాచార్యుని రచనలను సంకీర్తనా భాండారము నుండి వెలువరించి వెలుగులోనికి దెచ్చి కీర్తిశేషులై తరించినారు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఇప్పటివరకు వెలుగు చూచిన పండ్రెండు వేల పదకవితలలో ఏడు వేల శృంగార కీర్తనలను సాకల్యముగా పరిశోధించి అందలి 'మధురభక్తి'ని తేట తెల్లముగ చేసిన మిత్రులు శ్రీమాన్ అంగలూరి శ్రీరంగాచార్యులు గారు ధన్యులు, అభినందనీయులును వీరికి గల సంగీత పరిజ్ఞానం, సాహిత్యాభినివేశం, పదకవితా పితామహుని సంకీర్తనలపై గల అనురక్తి ఈ సిద్ధాంత వ్యాసమును ప్రశంసాపాత్రముగ దిద్ది తీర్చిన వనుటలో అతిశయోక్తి లేదు.

నల్లగొండ పరిశోధకమండలి అభినందనల నందిన ఈ మిత్రుని లేఖిని బహుజన బహుళ ప్రయోజనకర ప్రామాణిక రచనలను పరంపరగా వెలువరించుగాక। శ్రీనివాసుని అనుగ్రహము సదా సంప్రాప్తించుగాక।

శుభాకాంక్షలతో

**కాశావజ్ఝల వేంకట నరసింహమూర్తి**

డా. కందాళ వేంకటాచార్యులు

రిటైర్డ్ తెలుగు లెక్చరర్ - విజయనగరం

22-7-95

వేదనము, ఉపాసన, ధ్యానము, పర్యాయపదములు. ధ్యానము తైలధారవలె అవిచ్ఛిన్న స్మృతి సన్తానరూపము కావలెను. అట్టి ధ్రువమైన స్మృతినే అపవర్గమునకు (మోక్షమునకు) ఉపాయముగా శ్రుతి, స్మృతులు పేర్కొన్నవి. అట్టి స్మృతి దర్శన సమానాకారమగును. స్మర్యమాణమగు స్వరూపము సాక్షాత్కరమునొందినచో ప్రకృతితో జీవునకున్న సంబంధము విడిపోవును. కర్మ క్షయమగును.

భగవంతుడు ఎవరిని వరించునోవానికే సాక్షాత్కరించును. ప్రియతముడైన వానినే ఆయనవరించును. ఎవనికి భగవంతుడు ప్రియతముడో భగవన్తునకు నాతడే ప్రియతముడు. అట్టి వానినే భగవంతుడు వరించును. కావున ధ్యానము ప్రీతిపూర్వకము కావలెను.

అట్టి ప్రీతి కల్గుటకు భగవన్తునితో జీవునకు గల సంబంధ జ్ఞానము కలుగువలెను. ఆ సంబంధములు తొమ్మిది విధములుగా విభజింపబడినవి.

పితాపుత్ర సంబంధము, రక్షక రక్ష్య సంబంధము, శేషిశేష సంబంధము, భర్తృ, బార్యా సంబంధము, జ్ఞేయజ్ఞాత్ర సంబంధము, స్వామి సొత్తుల సంబంధము, ఆధార, అధేయ సంబంధము, ఆత్మా శరీరముల సంబంధము, భోక్తృభోగ్య సంబంధము అనునవి ఈ సంబంధములు.

ఏ సంబంధ జ్ఞానమైనను ప్రేమను పెంచును, ప్రేమయే అక్కర లేదు పగనైన వగనైన, ప్రాణభీతినైన, భగవన్తుని స్మరించినచో ఆయన అనుగ్రహము కల్గుననియు, ''కామోత్కంఠతగోపికల్, భయముననకంసుండు'' అను భాగవతపద్యము దానికిసాక్ష్యముగా గ్రహింపవచ్చుననియు పెద్దలందురు. కాని నారదభక్తి సూత్రములను బట్టి ప్రేమరూపమైన ధ్యానమునకే ప్రాధాన్యము కన్పట్టుచున్నది. రామానుజ సంప్రదాయమునదియే. (1) అధాతోభక్తి వ్యాఖ్యాస్యామః, (2) సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా, (3) అమృతరూపాచ, ఇత్యాది సూత్రములతో భక్తి స్వరూపమును, నారదమహర్షి ఆనతిచ్చినారు.

భగవంతుని స్వరూప, రూప, గుణ, విభూతులయందవగాహనమొనర్చిన, ఆళ్వార్లును, కబీరు, సూరదాసు, మీరా, మొదలగువారును ప్రేమకే ప్రాధాన్యమిచ్చినారు ఆ ప్రీతిలోనే స్వామి సాక్షాత్కారము నొందినారు. అమృతత్వమును అందినారు

శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, అని ఎనిమిది రకములు భక్తి మార్గములు తెలుపబడినవి.

అందు సంకీర్తనమునకు ఎక్కువ ప్రాధాన్యమునిచ్చి భగవద్గుణానుభవమునొందినవారు ఆళ్వార్లు. ఆ కోవకు చెందినవారే త్యాగరాజు, అన్నమాచార్యులు, రామదాసు మొదలగువారు.

పన్నిద్దరాళ్వార్లును, మానసికముగ భావించి, వాచికముగ కీర్తించి, కాయికముగ సేవించినవారే. విభవావతార స్వరూపములను, అర్చామూర్తులలో సాక్షాత్కరించుకొని కీర్తించినారు. కౌసల్యగా, దేవకిగా, యశోదగా, తమను భావించుకొని పుత్రునిగా స్వామిని ప్రేమించి ఊయలనూపుచును, నీళ్లుపోయుచును, రక్షపెట్టుచును, మురిసిపోయినారు అర్చాస్వరూపమునే ఎక్కువగ భావించి వరించినారు.

అట్టి అర్చామూర్తులలో ప్రథముడు కలియుగనాథుడు శ్రీ వేంకటాద్రి నిలయుడు అయనకే కాలమెల్లాం, ఉడనాయ్‌మన్ని, అడిమైశెయ్యవేణ్ణు అని శరకోపులు ఆనతిచ్చినారు. ఉలగముణ్ణపెరువాయా! అలర్ మేల్‌మంగైయుఱై మార్పా! అని నోరారాపిలిచి, ఉన్నడికీ అమర్న్దుపుగున్దేనే అని సెలవిచ్చినారు.

ఆ తీరుననే తాళ్ళపాక అన్నమాచార్యులవారు కూడా ఎన్నో కీర్తనలలో పరమాత్మతో తమకు గల సంబంధమును ధ్యానించుచు శృంగార కీర్తనలలో కేవలము భార్యాభర్తృ సంబంధమును భావించి పరమానందమునందినారు. కీర్తనలన్నియు తిరువేంగడముడయాన్ మీదనే చేసినారు. ఆళ్వార్లు భావించినట్లు స్వామియే తనను తాను స్తోత్రము చేసి కొన్నాడని తలంచి సంకీర్తనమొనర్చిన మహానుభావులు అన్నమాచార్యులవారు.

కేవలము నాయికా నాయక సంబంధమునే భావించి, జయదేవుడు, క్షేత్రయ్య, మొదలగువారివలె శృంగార సంకీర్తనలొనర్చినారు. ఆ శృంగార సంకీర్తనలను మాత్రము ఆధారముగా చేసికొని అన్నమాచార్యుల వారి మధురభక్తిని వివరించుచు శ్రీమాన్ డాక్టరు అంగలూరు శ్రీ రంగాచార్యుల వారొనర్చిన పరిశోధన ఫలముగా వెలువడిన సిద్ధాన్తవ్యాసము చదివి ఆనందించే భాగ్యాన్ని వారు ప్రసాదించినారు.

మధురాతీతి (గృహ్ణాతీతి) మధురా అని మధుర శబ్దమునకు వ్యుత్పత్తిని ప్రసాదిస్తారు పెద్దలు మధువు మకరందము కాదు విష్ణుపదము నుండి భక్తులకు లభించు అద్వితీయ స్వరూపము కాదు విష్ణువే. ఛాందోగ్యమున మధువిద్యలో ఉపాస్యమైన స్వరూపము. అట్టి మధువుకు, ఆళ్వార్లు ఎనక్కు, "త్తేనే" అని ఆస్వాదించినారు ఆ స్వరూపమును గ్రహించి, ఆనందించి పరవశత్వమునొంది తన్మయులైనవారు అన్నమాచార్యులవారు

ఆళ్వార్లు, తమిళమునను, కబీరు మొదలగువారు వారి వారి ప్రాంతీయ భాషలలోను గానము చేసినారు. ఆంధ్రుల అదృష్టము చేత అన్నమాచార్యులవారు తెనుగున, అందును జనపదముల వెలయుచున్న భాషలోని పదములతో సంకీర్తనమొనర్చి ఆంధ్రులకు భక్తి భిక్ష పెట్టినారు

ఆ కీర్తనలను తీసికొని అనేక గ్రంధములను పరిశీలించి తత్పరిశోధనకు ఫలముగానందించిన ఈ సిద్ధాన్తవ్యాసము, సామాన్యులనే కాక మాన్యులను కూడా కమలాకాముకుడైన పరమపురుషునివైపు త్రిప్పుచు అనుసందించిన వారిని మంగళతరంగముల నోలలాడించును

శృంగార నాయికలందఱి యవస్థలను, అన్నమాచార్యులు తమ కీర్తనలలో అనుభవించినట్లు నిరూపించినారు అనుకూల, దక్షిణ, ధృష్ట, శర, నాయకులస్థితులను వేంకటనాధునిలో గనుగొని కీర్తించినారు అన్నమాచార్యులువారే అలర్మేల్మంగైగా రూపొందినారు అట్టి తన్మయత్వమే లేనిచో నిట్లు కీర్తింపలేరని నిరూపించినారు శ్రీమాన్ డాక్టర్ శ్రీరంగాచారిగారు

సహృదయులగు భావుకులు, రసికులై, శ్రీ అన్నమాచార్యులవారి కీర్తనలలో వీరు చూపినసొబగును చూరగొని ధన్యులు కావలెనని కోరుకొనుచున్నాను అదియే వీరి కృషికి తగిన ఫలము

ఇట్లు

**డా కందాళ వేంకటాచార్యులు**

**టి.పి. శ్రీరామచంద్రాచార్యులు, ఎం. ఎ.**
''బృందావని'' సింహాచలం,
విశాఖపట్నం - 530 028. 23-7-95

# సహృదయ సాధువాదం

వరాహస్వామి నాటి నుండి సంకీర్తనం భాగవత్ప్రీతికరంగా తల్లాభోపాయాలలో తలమానికంగా వెలుగొందుతూనే ఉంది. 'స్వస్యచ కీర్తనం' అంటాడు వరాహస్వామి భూమిదేవితో.

సరే సరి, 'శ్రవణం, కీర్తనం' అని ద్వితీయంగానైనా అద్వితీయంగా కీర్తనాన్ని పేర్కొంటాడు ప్రహ్లాదుడు

'జిహ్వే కీర్తయ' అని ఆళువార్లందరి పక్షాన ఎలుగెత్తి కీర్తన గరిమను చాటినారు శ్రీ కులశేఖరులు

భగవదుపాసన విధులలో లింగవయస్సులతో, కులగోత్రాలతో పని లేకుండా సర్వకాల సర్వదేశాలలోనూ, సర్వులకూ అందుబాటులో ఉండేది అర్థమైన ఫలాన్ని అందించేది కీర్తనం.

'సతతం కీర్తయన్తః' అని గీతాచార్యుడు కీర్తనానికి ఒకచక్కని ప్రక్రియను నిర్దేశించినాడు దండె, చిటితాళములు పూని చిందులు వేస్తూ భక్తులు శ్రీహరిని కీర్తించటానికి పై వాక్యమే ప్రేరకమేమో

కీర్తనం కావించటం అదీ తాత్వికంగానో శుష్కవైరాగ్య ధోరణిలోనో కాకుండా సరస శృంగార సరణిలో హృదయం ద్రవించి, ప్రేమ వెల్లువగా పెల్లుబికి తేనెలూరు పదవాహినులు ప్రవహించి, భక్తులకు ఆమోతలందించటం ప్రక్రియలోని విశేషం.

సంకీర్తనం అనగానే చటుక్కున తలపున మెదిలేవారు ఇటు దివ్యసూరులు అటు మీరాసూరులు వీరంతా మురారి పదచింతనాస్పద పదకృతులనాలపించినవారే.

వీరంతా ఎండి బీటలు వారిన ఎదలవారు కారు ఇంకిపోయి, నెరియలు వారిన కనుగొలకుల వారూ కారు

మరి, భక్తిమాధ్వీకఝురులు ఎదల నింపుకొన్నవారు. ముదశ్శ్రు సముదయాంచిత నయనోజ్జ్వలులు. వీరి పాట విని పరవశించి గాలి తలయూచినది. ఏరు సుంతగతియాపి అట్టె నిలిచినది. కొమ్మలు వంగినవి, కొండలు కరగినవి. దేవదేవుడు దివినుండి భువికి దిగివచ్చినాడు.

అట్టివారిలో ఆళువారులు ప్రముఖులు. వారిలో తలమానికం తల్లి ఆండాళు. వీరందరూ శృంగార రసఝురులు. ఈ శృంగారం అలౌకికం, పరమదివ్యం. ఇదే మధురోజ్జ్వలం. కడకు మధుర భక్తిగా మనకు పరిచితం.

భక్తుడు తనయందు స్త్రీత్వాన్ని ఆరోపించుకొని తన సర్వస్వాన్ని ప్రియునికి భగవంతునికి సమర్పించుకోవడం ఇందులోని వైలక్షణ్యం. శ్రీమన్నిగమాంత దేశికమహాస్వాములు గోదాస్తుతిలో అన్న ఈ మాటలు ఇప్పట్టున స్మరణీయాలు – 'భోక్తుం తవ ప్రియతమం భవతీవ గోదే, భక్తిం నిజాం ప్రణయ భావనయా గృణంతః ఉచ్చావచైః విరహ సంగమజై రుదంతైః శృంగారయంతి హృదయం గురవస్త్వదీయాః'

ఈ మధురభక్తి సంప్రదాయ ప్రవర్తకులైన ఆళువారులకు వారసులు తెలుగునాట భక్తి వాహినులను ప్రవహింపజేసిన తాళ్ళపాకవారు. అన్నమయ్యగారి మధుర భక్తి సాహితి ఒక దివ్య పీయూష మహాసాగరం. దీన్ని ఈదడం, దీని లోతులు చూడడం 'అబ్ధిర్లంఘితయేవ' అన్నట్టిదే.

అయినా రక్తితో, భక్తితో, ఆసక్తితో, తపనతో, తనివితో, మనసుతో ఈ సాగరం లో దిగి వీలయినంత లోతులకు వెళ్ళి ఎదనిండా మధురసాన్ని తాము నింపుకొని 'ఏకస్స్వాదు నభుంజీత' కనుక మనకూ కొన్ని పీయూషశీకరాలను అందించ పూనుకొన్నవారు మా తమ్ములు చి. శ్రీమాన్ అంగలూరి శ్రీరంగాచార్యులు.

శ్రీ రంగాచార్యులు చదువులతల్లి ఒడిలో ఇరువంకల పాలుత్రావి పెరిగిన సహృదయుడు. మధురభక్తి మరగులెరిగి అన్నమయ్యగారి పదాలలో వాటిననుశీలించి జనావళికి తెలుపగల మధురోజ్జ్వల మానసము కలవాడు సంగీత సాహిత్యాలతో పాటు, సంప్రదాయ సౌరభాన్ని ఎదనిండా నింపుకొన్నవాడు. అన్నమయ్యగారి మధుర భక్తి సామ్రాజ్య వైభవాన్ని మనముందు చేతనైనంత నిలుప పూనుకొన్నవాడు. ఆ ఉద్యమంలో కృతకృత్యుడై, సహృదయుల మన్ననలనూ అందుకొన్నవాడు.

శ్రీమాన్ శ్రీ రంగాచార్యులు తన సిద్ధాంత వ్యాసంలో ఐదు ప్రకరణాలలో అన్నమయ్య సాహితీ మధురిమను ఆవిష్కరించినాడు. సర్వసాధారణంగా, లాంఛనంగా, మూడు ప్రకరణాలు పూర్వరంగంగా సాగినా నాలుగైదు ప్రకరణాలలో తన కృషినంతనూ నింపినాడు.

మనముందు నిలిపినాడు.

అలంకారికంగా ఆధ్యాత్మికంగా కామశాస్త్రపరంగా అశ్లీలానికి అనౌచిత్యానికి తావు లేకండా అసిధారావ్రతంగా అన్యూనాతిరిక్తంగా అయిదవ ప్రకరణాన్ని అరచించినాడు ఇందులో అడుగడుగునా సాహితీమాధుర్యానుశీలనం అలంకారికంగా గోచరిస్తుంది గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో మాధుర్యాన్ని మహాభావంగా, పంచమభావంగా పేర్కొంటారు ఆ పంచమభావమహోజ్వల వైభవం ఈ పంచమప్రకరణంలో బహుధా ప్రకటితం కావడం యాధృచ్ఛికమే అయినా సమీచీనంగా సాగింది

అన్నమయ్యగారు వేల పదాలు పాడినారు శృంగారాన్ని మధురంగా, ఉజ్వలంగా, బహువిధంగా నిర్వహించినారు. అలంకారశాస్త్రానికి ఉదాహరణసర్వస్వముగా నిలువదగినవీ వారి పదాలు. అలంకార శాస్త్రంలో ప్రముఖంగా కనవచ్చే అష్టవిధ శృంగార నాయికా స్వరూపాన్ని నిరూపించి, వారిని అన్నమయ్య పదాలలో అన్వేషించి పొందికగా పోడిమితో మనముందు నిలిపినారు శ్రీ రంగాచార్యులు. ముగ్ధాదినాయకీక్రమాన్ని తదంతర్గత భేదాలను అనుశీలించి అన్నమయ్యగారి పదాలలో ఒదిగిన వారిని వెదకి చూపినారు. ఆళువారుల భక్తి సాహితిలో తరచుకనవచ్చే అలంకారికులు ప్రస్ఫుటంగా వినిపించే సఖీ, దూతి ప్రభృతి నాయికా సహాయులను నిర్దేశించి నిరూపించినారు. కామశాస్త్రకారులు పేర్కొన్న చతుర్విధ శృంగార నాయికలనూ వెదకి పట్టుకొన్నారు.

అనుకూలాది చతుర్విధ నాయకులనూ తిరువేంకటపతిలో ఆవిష్కరించినారు. శృంగారానికి పరిపుష్టిని ప్రసాదించే విప్రలంభావస్థలనూ విశ్లేషించినారు. కడకు రసాబాసానికి సైతం ఒక చమత్కారమైన పరిష్కారాన్ని ప్రసాదించి ఆధ్యాత్మిక సమన్వయంతో దానిని అన్నమయ్యలో అనుశీలించినారు. శృంగారం భక్తిగా పర్యవసించి కీర్తనల రూపంలో తెలుగు సాహిత్యంలో ఆధ్యాత్మిక జయకేతన కింకిణులుగా నిలిచినట్లు ధ్వనింపచేసినారు.

సరళమైన భాషలో మృదువైన శైలిలో, తనదైన బాణిలో విషయాన్నంతనూ అటు అలంకారికంగా ఇటు ఆధ్యాత్మికంగా తుల్య సమన్వయం కావిస్తూ అరకొరలు లేకండా, ఔచిత్యాన్ని వీడకుండా నలుగురి చేత ఔననిపించుకొనేట్లు శ్రీరంగాచార్యులు ఈ పరిశీలనాన్ని కావించినారు. సహృదయులకు భక్తులకు, సంగీత సాహిత్యవల్లభులకు, పరిశోధకులకు, సర్వులకూ ఈ గ్రంథం ఎదవిందు కావిస్తుందనడంలో సందేహం లేదు.

**శ్రీరామచంద్రాచార్య**

23-7-95

శ్రీమతేరామానుజాయ నమః

**డా. మాడభూషిణి రంగాచార్యులు**

విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు,

నాగార్జున డిగ్రీకళాశాల, నల్లగొండ

శ్రీనివాస నిలయము

# ఆప్త వాక్యము

శ్రీమాన్ అంగలూరు శ్రీరంగాచార్యులు నాకు ఆప్తమిత్రులు. రెండు దశాబ్దాలనుండి సన్నిహితసంబంధము కలిగియున్నాము. నేను ఆచార్యులవారితో కలిసి మద్రాసు, తంజావూరు, తిరుపతి గ్రంథాలయములలో పరిశోధన కొఱకు అనేక గ్రంథములను చూచితిమి 1982లో వుభయులము తాళ్ళపాక సందర్శించి అన్నమాచార్యుల పూర్వీకుల గృహములను, అచ్చటి దేవాలయములను సందర్శించితిమి అప్పటికే ఆచార్యులవారికి అన్నమాచార్యుల సంకీర్తనలపై పరిశోధన చేయవలయునను సంకల్పము కలిగినది ఇది భగవంతుని కృపాకటాక్షమే కాని వేరు కాదు భగవంతుడు ఒక జీవాత్మకు తన సన్నిధికి చేర్చుకోవలయునని భావించినచో నిర్హేతుక జాయమానకృపాకటాక్షములు ప్రసరించి తన వైపు జీవులనులాగుకొనును. ఇట్టిదే ఆచార్యులవారి విషయములో జరిగినది సామాన్య పరిశోధన కంటే భగవత్సంబందమైన భక్తి ప్రపత్తుల గురించి చేయుపరిశోధన విశేషమైనది

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలు మధురభక్తి సిద్ధాంతవ్యాసము అమూలాగ్రముగా పరిశీలించితిని వ్యాసకర్త అన్నమాచార్యుల జీవిత విశేషములను అనేక సామాన్యవేత్తల వ్యాసములను చూచుటయే గాకస్వయముగా తాళ్ళపాకకు అనేకపర్యాయములు వెళ్ళి స్థానికులలో చర్చించి విషయనేకరణచేసి వివరించిరి వంశావళిని సాధ్యమైనంతవరకు సమగ్రముగా వివరించిరి ద్వితీయ ప్రకరణములో పదకవితలు పుట్టు పూర్వోత్తరములు నిర్ధారించిన తీరు ఆచార్యులవారి సాహిత్య పరిశోధనలో గల శ్రద్ధకు తార్కాణము. తృతీయ ప్రకరణములో గావించిన రసచర్చ, సమగ్రముగా సాగినది చతుర్థ ప్రకరణములో రసములలో భక్తి రసమునకు కల్పించిన స్థానము ప్రశంసాపాత్రము. భక్తి ప్రపత్తుల గుఱించి పూర్వాకాలంకారికులు మతములను సమన్వయ పరచి, భక్తి రసప్రాధాన్యమును జోడించి, మానవ జీవితమును ధరించుటకెట్లుపకరించునో సోదాహరణముగానిరూపించిరి

ఈ సిద్ధాంతవ్యాసములో పంచమ ప్రకరణము ప్రధానమైనది అన్నమయ్య శృంగార కీర్తనలు మధురభక్తి ఆలంబమై అలౌకిక శృంగారమును అనగా శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి పదకవితా పితామహుడైన అన్నమాచార్యుల సంబంధమును జీవాత్మ పరమాత్మ సంబందమును సూచించుచును. పరమాత్ముని నాయకునిగాను తాను (అన్నమయ్య) నాయికగాను బావించిన సంకీర్తనలు రచించి పాడి స్వామి కర్పించిన ధన్యజీవి అన్నమయ్య మధురభక్తి సంకీర్తనలు వివరించు సందర్భమున అష్టవిధనాయికల లక్షణములను అందుకుదాహరణముగా అన్నమయ్య సంకీర్తనలను ఆచార్యుల వారు చూపించినతీరు శ్లాఘనీయము. శృంగార నాయికలు అనుభవించిన దశకామావస్థలు విశ్లేషించి చూపిన తీరు ఆచార్యుల వారి ప్రతిభకు తార్కాణము. దీనిని సాధించుటలో ఆచార్యుల వారికి భగవంతుని పరిపూర్ణకటాక్షము కలదని నా దృఢ విశ్వాసము.

''నాహం వందే తవచరణయోర్ద్వంద్వమద్వంద్వ హేతోః

కుంభీపాకంగురుమపిహరే నారకం నాపనేతుం

రమ్యారామామృదుతనులతానందనేనాపిరంతుం

భావేభావై హృదయభవనేభావయేయంభవంతం''

అని కులశేఖరాళ్వార్లు సాయించినట్లుగా ఆచార్యుల వారింకా భగవత్సేవ సాహితీపరముగా చేయవలయునని ఆకాంక్షించుచు ఆ వేంకటేశ్వర స్వామివారు ఆచార్యులవారి కాయురారోగ్య ఐశ్వర్యములు ప్రసాదించవలయునని ప్రార్థించుచు విరమించుచున్నాను

బుధజనవిధేయుడు

డా. మాడభూషిణి రంగాచార్యులు

# ఆప్తవాక్యం

భగవత్ప్రాప్తికి, భక్తి కన్న సులభమార్గము మఱియొక్కటి లేదు భక్తి వృక్షకుసుమమే ప్రపత్తి మార్గము తత్ఫలమే భగవత్ప్రాప్తి బహుజన్మ కృతపుణ్య విశేషమునకాని యది సిద్ధింపదు ప్రపత్తి రూపభేదమే మధురభక్తి ఆ మధురభక్తి 'శ్రీతాళ్ళపాక అన్నమాచార్యుని శృంగార కీర్తనలందెట్లు ప్రతిఫలించినదో విశ్లేషించి చూపు విశిష్ట పరిశోధనమే డా. అంగలూరు శ్రీ రంగాచార్యగారి సిద్ధాంతము.

డా అంగలూరు వారు నాకు, నాకనుటకన్న, మా పరిశోధకమండలి మిత్రులకెల్లరకును సన్నిహితులు. హితులు పరిశోధనరతులు వారు వస్తుతః పరమ వైష్ణవులు. వారి విష్ణుభక్తియే, పరమ వైష్ణవుడైన అన్నమయ్య కీర్తనలవైపు వారి హృదయమును సమాకర్షించి, వారి శృంగార కీర్తనలందలి మధురభక్తిని వివేచింపజేసి, విశిష్ట పరిశోధనగ్రంధమును తెలుగువారికందించినది నల్లగొండ జిల్లాలో అన్నమయ్య కీర్తనలను ప్రచారము సేయునిమిత్తము, వారు, వారి సహచరులు పురుషోత్తమాచార్యులుగారు, ఎన్నియో భక్తి సంగీత విభావరుల నిర్వహించిరి ద్విశతాధిక సంకీర్తన సభలు నిర్వహించిన దీక్షాదక్షతలు, భగవద్భక్తి ప్రేరకములనునది నిశ్చయము వారియందునిగూఢమైన దైవభక్తి, సాహిత్య సంశోదనముచే వన్నెకెక్కినది వారి సంగీత పరిజ్ఞానము, గాన పాటవము భక్తికి రక్తి చేకూర్చి, మధురభక్తికి, మహత్తర నిశ్రేణికారూపము నందినవి అన్నమయ్యగానముతో, నలమేలుమంగా మనోహరునికి నివాళులర్పించినవి

వారి సిద్ధాంతగ్రంధమును పఠించియెంతో సంతసించితిని అన్నమయ్య జీవితము, పూవుపుట్టగనే పరిమళించునన్న సామెతను సార్ధకము చేసినది పదకవితల పుట్టుపూర్వోత్తరాల వివరణ, రససంఖ్యాచర్చ, భక్తి స్వరూపమును మధురభక్తి స్వభావమును విశ్లేషించిన తీరు, స్పష్టసుందరములు మధురభక్తిని, అన్నమయ్య శృంగార కీర్తనలతో సమన్వయించి చూపిన వైనము శతధా ప్రశంసనీయము దైవభక్తి, సాహిత్యశక్తి, సంగీతరక్తి సంపుటీకరణమునంది మధురభక్తి మహనీయతత్త్వమును ప్రకాశింపజేసినవి వారి యీ కృషి పండితజన సంతోషకరమైనది, సహృదయహృదయాహ్లాదజనకమైనది భక్తలోక సంభావ్యమైనది వారి యీ కృషి నిరంతరము సాగి, శ్రీ వేంకటేశ కృపాలబ్ధికి హేతుభూతము కాగలదని విశ్వసించుచు, నమస్కరింతును

ఇట్లు

**డా. వారణాసివీర నారాయణశర్మ**

పరిశోధక మండలి, నల్లగొండ.

భాషాప్రవీణ - ఎమ్ ఎ (తెలుగు)
వ్యాకరణ సాహిత్య విద్యాప్రవీణ
**డా. ఎస్.టి.కె. ఎస్. రంగాచార్యులు,** ఎమ్ ఎ పి హెచ్ డి
ఎస్ జి.వి.పి కె. జె ఓ డిగ్రీ కాలేజి
రాజమండ్రి - 533.105

22-7-95

శ్రీ గురుభ్యోనమః

మహాతపస్సంపన్నులు భగవత్తత్త్వవిదులు పరమకారుణికులైన ఋషులు జీవులను ఈ సంసార బంధములనుండి విముక్తులను చేసి భగవత్సన్నిధానమున నిరతిశయానందమునొందువారుగా చేయాలనే సత్సంకల్పముతో మోక్షదాయకములగు అనేక మార్గములనుపదేశించిరి శ్రుత్యుపారూఢమగు తురీయ పురుషార్థమగు మోక్షమే మన ఆర్షసంస్కృతికి తుదిమెట్టు అట్టిమోక్షమును పొందుటకు వేదవ్యాసుల వారు జ్ఞానమార్గమును, జైమిని మహర్షి కర్మమార్గమును పాణిని మహర్షి పరావాగ్రూపమార్గమును, కపిలమహర్షి సాంఖ్యమార్గమును, పతంజలి మహర్షి యోగమార్గమును ఉపదేశించిరి ఇంకను ఎన్నో మార్గములను ఎందరో మహర్షులు ఉపదేశించిరి అన్ని మార్గములకు ప్రాప్యము మోక్షమే ‘‘ఉపేయప్రతిపత్త్యర్థా, ఉపాయా అనంతాః’’ అనిజగద్గురువు భర్తృహరి చెప్పినట్లు మోక్షమును పొందుటకు ఎన్నో మార్గములున్నప్పటికి లాఘవ పక్షపాతియగు మానవుడు సులభమైన మార్గమునే ఆశ్రయించును. ఇది సర్వదా నిశ్చప్రచము.

జ్ఞానమార్గము, కర్మమార్గము మానవులు ఆచరించుట కష్టము. భగవత్పతంజలియోగ దర్శనము కూడ అట్టిదే. మిగతా మార్గముల కంటే ఈ యోగ మార్గము ననుసరించుట కొంత ఎక్కువ కష్టమయిననూ వాటికంటే ఎక్కువ ప్రత్యక్షఫలదము మరియు యోగాభ్యాసము అన్ని దర్శనములకు ఆధారభూతము ఉపకారకత్రయము. ఏ మనచిత్తవృత్తి నిరోధముచేయనిదే జ్ఞానమార్గమయిన, కర్మమార్గమయిన, భక్తిమార్గమయిన సులభముగ అచరణసాధ్యముకాదు ఫలదాయకము కానేరదు. అందువలననే జ్ఞానయోగము, కర్మయోగము, సాంఖ్యయోగము, విభూతియోగము అని శబ్దయోగఘటితముగా గీతాశాస్త్రము చెప్పుచున్నది అనగా అన్ని దర్శనములకు యోగము ప్రధానాంగభూతము. దాని ప్రాశస్త్యమును, ఆవశ్యకతను గుర్తించియే పాశ్చాత్యవిపశ్చిద్వర్యులు కూడా దర్శనాంతరాపేక్షయా యోగ దర్శనము నందు ఎక్కువ ఆసక్తి శ్రద్ధ చూపుచున్నారు.

ఇట్టితరి 11వ శతాబ్దము వారయిన భగద్రామానుజులు జ్ఞాన కర్మాదిమార్గములు

సర్వమానవాళికి అందుబాటులో లేనందున ఆచరణ సుకరము కానందున అందరికీ సులభతరమయిన శ్రుత్యుపారూఢమయిన ఆర్షమూలకమయిన భక్తి మార్గమును మోక్షసిద్ధికై మనకుపదేశించిరి మరియు యోగదర్శనమున యమనియమాద్యష్టాంగయోగము సామాన్య సాధకునికి దుస్సాధ్యము చాలా నియమములు పాటించవలెను ఒకవేళ సాధకుడు శ్రమతో తన్నియమ పరిపాలన చేసినందున వానికి సంప్రజ్ఞాతసమాధిసిద్ధించినప్పటికీ కొంతమందికి అసంప్రజ్ఞాత సమాధి సిద్ధించుట చాలా కష్టము. ఈ రకమైన ఇబ్బందులను దృష్టిలో నుంచుకొనే భగవద్రామానుజులు సులభమైన భక్తి మార్గమును ఆచరింపజేసిరి పతంజలి మహర్షి కూడా ఈ విప్రతిపత్తిని గుర్తించియే అట్టి సాధకుడు మోక్షమును పొందుటకు ఉత్తమ మార్గముగా " ఈశ్వర ప్రణిధానాద్వా" అని ఈశ్వరప్రణిధానమును ఉపదేశించిరి. ప్రణిధానమనగా సర్వకర్మార్పణ పూర్వకము అసంప్రజ్ఞాత కారణీభూతము అయిన భావనావిశేషము అదే "సర్వధర్మాన్‌పరిత్యజ్యమామే కంశరణం వ్రజ" అని గీతాచార్యులు చెప్పిన శరణాగతి అదే రామానుజులుపదేశించిన భక్తి మార్గము. పతంజలి యోగసూత్రములకు భాష్యకర్త అగు వేదవ్యాసులుపై యోగసూత్రమును వ్యాఖ్యానించుచు "భక్త్యావర్జితః ఈశ్వరః కల్పప్రళయమహాప్రళయేషు సంసారిణః పురుషాన్ ఉద్ధరిష్యామి ఇతస్స్వవచనాత్ సంకల్పమాత్రేణతంభక్తమను గృహ్ణాతి" అని మోక్షఫలప్రాప్తికి భక్తి మార్గమే ఉత్తమ మార్గమని స్పష్టీకరించిరి. సర్వకర్మార్పణ పూర్వకభక్తివలననే భగవంతుడు భక్తున కధీనుడగును

"సాత్వస్మిన్ పరమప్రేమరూపా", సాపరానురక్తి రీశ్వరే మొదలగు నారద, శాండిల్యాదుల భక్తి సూత్రముల వలన నిరంతర పరమాత్మ ధ్యానమే భక్తి అని స్పష్టముగా తెలియుచున్నది. అందుకే భగవద్రామానుజులు "ధ్యానంచ తైలధారా వద విచ్ఛిన్నస్మృతి సంతాన రూపమ్" అని శ్రీ భాష్యమున స్పష్టపరచినారు. శంకరాచార్యుల శారీరక మీమాంసాభాష్యమునకు సుప్రసిద్ధవ్యాఖ్యాత, సర్వతంత్ర స్వతంత్రుడగు శ్రీ మధుసూదన సరస్వతి భగవద్భక్తి రసాయనమను గ్రంథములో భక్తితత్త్వమునకు మహాసామ్రాజ్య పట్టాభిషేకము నొనరించెను ఆ మహానుభావుడే శంకరభాష్యమునకు వ్యాఖ్యానమగు అద్వైత సిద్ధికి వివరన

"ధ్యానాభ్యాస వశీకృతేన మనసాయన్నిర్గుణం నిష్క్రియం,
జ్యోతిః కించనయోగినో యదిపరం పశ్యంతి పశ్యంతుతే,
అస్మాకంతు తదేవలోచన చమత్కారాయ భూయాచ్చిరం
కాందీ పులినేషు సుందరమహో నీలం మహోధావతి"
అని తన మనస్తత్వమును స్పష్టముగ ఆవిష్కరించెను.

ఇవ్విధముగ మోక్షదాయకమయిన మార్గములలో ఉత్తమోత్తమమయిన భక్తి మార్గాన్ననుసరించి తరించిన ఎందరో మహానుభావుల గురించి వినియున్నాము. వారిలో మన అన్నమాచార్యులు ఒకరు ఆయన పరమభాగవతోత్తములగు నారద తుంబురులవలె సంకీర్తన మార్గాన్ననుసరించి మధురభక్తికి పట్టము కట్టినాడు అన్నమయ్య రచనలలో ఏడు కొండలవాడైన తిరువేంకటనాధుడే నాయకుడు లక్ష్మీదేవి, భూదేవి, నీళాదేవి మొదలయిన నాయికలు ఎంతమందియున్నను అలమేల్మంగయే ప్రధాన నాయిక విశిష్య అన్నమయ్యయే స్వీయముగ నాయికయై విరహమును అనుభవించుచు దేవదేవుని సంసర్గముచే అమందానందకందళిత హృదయాంతరంగుడై మధురానుభూతులను అనుభవించును.

అట్టి అన్నమయ్య సంకీర్తనలలో మధురభక్తిని ఆలవాలముగ తీసికొని సిద్ధాంతవ్యాసమును వ్రాసిన శ్రీమాన్ డా అంగలూరి శ్రీరంగాచార్యులుగారు ఎంతో ధన్యులు, అదృష్టవంతులు. వీరు అన్నమయ్య సంకీర్తనా స్వరూపమును అందలి భావనాపటిమను చాలా చక్కగా వివరించినారు రసస్వరూపమును చూపి భక్తి రసమునకు సాక్షాద్దేవదేవుడే ఆలంబన విభావమగుటం జేసి ఇతరరసముల కంటె భక్తి రసమే ఉత్కృష్టమయినదని సప్రమాణముగ చూపినారు. రసరాజయిన శృంగారమునకు భగవంతుడే ఆలంబన విభావమయినపుడు అదియే భక్తిగా వివర్తమగును అందువలననే అన్నమయ్య కీర్తనలలో భక్తి రసమునకు శృంగార రసము అంగీభావమునొందినది. అందువలననే వాటికి శృంగార కీర్తనలని వ్యవహారము కల్గినది అలంకార శాస్త్రములో పేర్కొనబడిన అష్టవిధనాయికలు, చతుర్విధనాయకులు, నాయికా సహాయకులు అన్నమయ్య కీర్తనలలో చోటు చేసుకొన్నారు. వీటి స్వరూప స్వభావములను రంగాచార్యులుగారు విస్పష్టముగా చూపినారు. వీరికి సాహిత్యమునందే గాకసంగీతమునందు కూడా పాండిత్యముండుటచే కుడిఎడమలవ్యత్యాసము లేకుండగ సంగీత-సాహిత్యమార్గగాములై అన్నమయ్య భక్తి రసమును జక్కగ ఆస్వాదించి ప్రయోజక కర్తృత్వమును బడసినారు ''యోమేభక్తః సమేప్రియః'' అని గీతాచార్యుడు చెప్పినట్లు భక్త్యావిష్టులై వ్రాసిన ఈ సిద్ధాంతవ్యాసము వారికి ఉత్తమర్ణత్వము కల్గించుననుటలో సందేహము లేదు.

శ్రీమత్కాశ్యప వంశవారిధివిధుం గోపాలవర్యాత్మజమ్
శ్రౌతస్మార్తవిచారసారచతురం శరజిత్త్రాప్తాగమాన్తద్వయమ్
శ్రీమత్పాణినిసూత్రపారనవిధౌ వ్యాఖ్యాప్రపంచే గురుమ్
వందే పార్థముఖేన శోభితపదం శ్రీ సారధిం ప్రత్యహమ్

ఇట్లు

**రామానుజదాసుడు**

ఎస్. టి. కె రంగాచార్యులు

**ఎం. పురుషోత్తమాచార్య** ఎం. ఏ.,
వ్యవస్థాపక అధ్యక్షులు
శ్రీ అన్నమాచార్య సంకీర్తనా ప్రచార సమితి,
నల్లగొండ.

25-7-95

నిజాయితీ, చిత్తశుద్ధి పడుగు పేకలుగా కలనేత చేసిన మనోహర రచనాశిల్పం ఈ పరిశోధనా గ్రంథం. తెలియని వారికి కూడా పరమ మిత్రులు కాదగిన వారు శ్రీరంగాచార్యులుగారు. తెలుగు సాహిత్యంలో అపూర్వ ప్రయోగాలలో శతాబ్దాలను శాసించగలిన అన్నమాచార్యుని అపురూప సంకీర్తన లెన్నింటినో ఈ గ్రంథంలో పరిచయం చేసిన ఆచార్యులు ధన్యులు.

ఏ భాషా సాహిత్యానికైనా గేయమే ప్రాతిపదిక అని సాహిత్య పండితుల అభిప్రాయం. సామాన్య ప్రజల ముఖస్థమైన తెలుగు గేయవాఙ్మయానికి సంస్కృత సాహిత్య పరిమళ స్నేహంలో ఒక మార్గ పద్ధతిలో విశిష్ట స్థానానికి నన్నయను ఆదికవిగా పేర్కొంటూనే తర్వాతి కవులు కవిత్వమంటే పద్యం తప్ప మిగతావి ఏవీ కవిత్వం కావు అని కొట్టి పారేసేంత అభ్యుదయం సాధించారు. మధ్య కాలంలో ఎన్నిరకాల ప్రక్రియలు ప్రకాశించి ప్రజల్ని బులిపించినా గేయమే ఇప్పటికీ రాజ్యమేలుతున్నదనేది నమ్మలేని నిజమని పైకి కాకున్నా తమ అంతరంగాల్లో నైనా అందరూ ఒప్పుకుంటున్నదే.

అన్నమయ్య కాలంలో ఇలా కీర్తనలు రాసుకుంటూ పాడుకుంటూ దైవసేవలో సాగిపోయే 'కవులు' అని చెప్పదగిన వాళ్ళు వేళ్ళ మీదలెక్క పెడుతూ పోతే మొదటివేలైన అన్నమయ్య దగ్గరే ఆగిపోతుందేమో ఆనాటి వారు ఈ కీర్తనలను సాహిత్య దృష్టితో పరిశీలించడానికి ప్రయత్నించలేదు ఎందుకంటే అది ప్రబంధయుగం పాదం మోపిన కాలం. పుంఖానుపుంఖాలుగా పద్యకావ్యాలు ప్రజల్లోకి వస్తున్నకాలం. నేటికీ సుప్రసిద్ధులుగా వెలుగుతున్న శ్రీనాధుడు, పోతన, అనంతామాత్యుడు, జక్కన, పిల్లలమర్రి పిన వీరన వినుకొండ వల్లభరాయడు మొదలైన మహాకవులు అన్నమయ్య కాలంలో పద్యసుగంధాలను వెదజల్లి ఉక్కిరి బిక్కిరి చేశారు. ఆ మత్తులో పడ్డవారెవరికీ అన్నమయ్య కీర్తనలు కంటికానలేదు. పదకవితా సౌరభం అందలేదు. అందుకే వెల్లంకి తాతంభట్టు లాంటి మహానుబావులు మరో ముందడుగు వేసి పద సాహిత్యాన్ని అభ్యంతరకరమైన భాషా ప్రయోగంలా తిట్టిపోశారు. కాని 500 సంవత్సరాల తర్వాత ఆ పద సాహిత్యమే విశిష్ట గౌరవాన్ని సంపాదించి అన్నమయ్యను

కీర్తిశిఖరాలపై కూర్చోబెడుతుందని వారెవ్వరూ ఊహించియుండరు. ఈ వైభవానికి ఆద్యులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారైతే దీనికొనసాగింపుకు రాళ్ళపల్లి, అనందమూర్తి, రామసుబ్బశర్మ లాంటివారెందరో కృషి చేశారు. చేస్తున్నారు. ఆ పరంపరలో ఇప్పుడు మరొక ఆధునికులు శ్రీ రంగాచార్యులుగారు.

భక్తి అనేది ఒక మానసిక రోగం అనీ, మతిభ్రమ చిత్త చాంచల్యం లాంటి హెల్యూసినేషన్ కోవకి చెందిందనీ హేతువాదమ్మన్యులు, సాంకేతికవైజ్ఞానికశాస్త్రాలను సరిగా అర్థం చేసుకోలేని ఆంగ్రాభిమానులు భావిస్తున్న వర్తమానకాలంలో, భక్తిని, అదీ మధురభక్తిని అన్నమయ్య కీర్తనలతో సమన్వయం చేస్తూ రచన చేయడం ఆచార్యులవారి సాహసానికి ఆధ్యాత్మికాభిమానానికి భక్తిమాధుర్య ప్రకటనాసక్తికి మచ్చుతునక. వారికి లభించిన 12 వేల కీర్తనల్లో అధికబాగం శృంగార కీర్తనలే కావడంతో వారికి చేతినిండా పని దొరికింది. 1981లో నేను వారితో కలిసి తాళ్ళపాక బ్రహ్మోత్సవాలకు వెళ్ళినపుడు అన్నమయ్య కీర్తనలపట్ల వారి పరిశీలనను అప్పుడప్పుడు గమనిస్తూ వచ్చాను. అప్పుడే వారిలో ఒక ఊహ ఊపిరి పోసుకున్నదేమో అనిపించింది. ఆ ప్రయాణం మా యిద్దరినీ అన్నమయ్య కీర్తనల ప్రచారంవైపుగా నడిపించింది తత్ఫలితంగా 1981 లో నల్లగొండలో శ్రీ అన్నమాచార్య సంకీర్తనా ప్రచారసమితి ఏర్పడింది

అయితే అంతకుముందే 1979లో 12వ సంపుటం చదివిన రంగాచారిగారిలో మెదలిన ఓ కదలికకు ఇప్పుడు ఓ శిల్పం ఏర్పడివుంటుంది. అందుకే తమ సంకల్పానికి ఓ రూపుదిద్దుకొని 1982లో పరిశోధనకు అనుమతి పొందడం జరిగింది. 12 వేల కీర్తనల్ని అధ్యయనం చేసి, తమ అభిమాన విషయాన్ని మధించి వెలికి తీయడానికి 12 సంవత్సరాలు పట్టింది. ఆచార్యులవారికి అదీ, అన్నమయ్య సాహిత్యంలో ఉండే లోతైన తాత్త్విక సంపద ఈనాటికి ఇలా వెలుగుచూడడం మహదానందాన్ని కలిగిస్తున్నది.

'ముత్యాలసరాలు' అంటూ అధునిక కవిత్వానికి కొత్తపుంత చూపాడు గురజాడ అంటూ చంకలు గుద్దు కుంటున్నారు. కాని ఈ పని అన్నమయ్య ఎప్పుడో చేశాడు అని చెప్పడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు ఎందుకంటే అన్నమయ్య రచనలన్నీ గాన యోగ్యమైన మాత్రా ఛందస్సులో సాగినవే. ఆయన ఎక్కువగా త్రిశ్ర, చతురశ్ర, ఖండజాతులలో రచనలు చేశారు అయితే మాత్రలను బిగింపుగా కాకపాడుకోవడంలో ఊపిరిపీల్చుకోవడానికి తీసుకునే వ్యవధికోసం. ఒకటి రెండు మాత్రల్ని కావాలనే వదిలేస్తూ రాశారు. ఆయన రచనలను గుర్తుపట్టడానికి యతిప్రాసల నియమమే Light house లాంటిది అన్నట్లు వాటిని ఖచ్చితంగా పాటించారు. అంతేతప్ప '' ఏతాళంలో పాడుకోదల్చేస్తే ఆ తాళానికి ఒదిగిపోవడం'' అనేది అన్నమయ్య రచనల్లో లేదు. గాయకుడో బాణీకర్తో బలవంతంగా

అక్షరాలను లాగి, మాత్రల్ని విరిచి ఖండను త్రిశ్రగానో, త్రిశ్రను చతురశ్రంగానో చేసి సాహిత్యాన్ని భ్రష్టు పట్టిస్తే అది అన్నమయ్య తప్పు కాదు అసలు ఈ మాత్రా ఛందస్సు అనేది సంగీతశాస్త్రంలోని లయ విభాగంలోనిది తాళశాస్త్రంలో త్రిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్ర, సంకీర్ణ అనే అయిదు జాతులు నడకను నిర్దేశిస్తాయి ఇవి అయినా ప్రజలు తాము అల్లుకుని, పాడుకొనే గేయ రూపాలనుంచే రూపొందించబడ్డాయని విజ్ఞుల ఆలోచన

శృంగార రసశాస్త్రంలో ఆంగిక విషయాలైన అష్ట విధనాయికలు, స్వీయాదులు, స్త్రీజాతులు, దూతికాదులు, స్థాయీ భేదాలు, మన్మథావస్థలు మొదలైన వాటన్నిటినీ అన్నమయ్య రచనల్లో నిరూపించగలిగిన ఆచార్యుల వారు శృంగార నాయకులను కూడా వదిలిపెట్టలేదు. ఇవి వారి సమగ్రపరిశీలనకు తార్కాణం కూలంకషం అనే పదం ఎంతో విస్తృతమైనదీ అయినా ఈ గ్రంథం విషయంలో అది బాగా వర్తిస్తుందని చెప్పవచ్చు

సూరదాస్ ప్రస్తావన ఈ గ్రంథంలో తెచ్చారు దానికి ఈ క్రింది పంక్తులు చేరిస్తే బాగుంటుంది

సూరదాస్ ఓ చోట ఇలా అంటాడు

पुतली पलंग बिछाय
अपनी पिय को रिझाय

ఇవి మధురభక్తిని చక్కగా ప్రకటిస్తున్నాయేమో ఆలోచింపమనవి.

అసలు ''మధురభక్తి'' ఎందుకు? అని ప్రశ్నించుకుంటే ఓ విశేషం స్ఫురిస్తుంది మిగతా భక్తి మార్గాలలో కన్న మధురభక్తి మార్గంలోనే తాదాత్మ్యం (సంలీనత) బాగా కలుగుతుంది కనుక భగవంతునిలో లీనం కావడం మరింత సులభమని భావించడానికి అవకాశం ఉంది పుట సంఖ్య 86 లో,

''కాంతాది విషయిక రతి వలన సుఖం తృప్తితో అంతమగును కాని భగవద్రతి అట్లు కాదు ఒక మారు ఆయన దివ్యస్వరూపం . '' అనే వాక్యాలు జీవిత సత్యాలు ఎందుకంటే ఇప్పటికీ తిరుపతి వెళ్ళి స్వామిని దర్శించేవాళ్ళు తిరిగి వచ్చేప్పుడు ఒక్కసారైనా వెనక్కు తిరిగి చూడకమానరు అంతటి దివ్య మంగళ విగ్రహం దర్శనమాత్రంగానే జన్మ సాఫల్యం కావాలని ఆ స్వామి రూపం నభూతో నభవిష్యతి

ఒక మధురానుభూతిని మన మనస్సులలో సృష్టింపగలిగిన గ్రంథాన్ని తెలుగువారికి ప్రసాదించి నందుకు దివ్యమధురసకలశాన్ని మన చేతుల కందించినందులకు శ్రీ రంగాచార్యులవారు అభినందనీయులు

**ఎం. పురుషోత్తమాచార్య**

# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని
# శృంగార సంకీర్తనలు – మధుర భక్తి

## ప్రథమ ప్రకరణము

### పద కవితా పితామహుని జీవితము – రచనలు

# పద కవితా పితామహుని జీవితము

పద కవితా పితామహుడుగా పేరు గాంచిన తాళ్ళపాక అన్నమాచార్యుడు యేడు కొండలవాడైన శ్రీనివాసుని సేవించి, ఆయనపై ముప్పది రెండు వేలకు పైగా కీర్తనలు రచించి, తరించిన మధుర భక్తుడు ఆయన రచనల్లో శృంగార సంకీర్తనలే ఎక్కువ.

పూర్వ కవులెవరును ఆత్మకధలు వ్రాసికొన్నట్లు గోచరింపదు తిక్కన, శ్రీనాధుల గురించి తరువాతి వారైన కేతన దుగ్గనలు కొంత సంగ్రహవివరణ ఇచ్చినట్లు వారి గ్రంధములే సాక్ష్యములు. తెలుగు కావ్యములలో గ్రంధకర్తృవంశమును, కృతిపతుల వంశాదికములను సంగ్రహముగ వివరించిన వారు లేకపోలేదు.

తాళ్ళపాక వంశము నందు కవిత్వము చెప్పినవారికి మూలపురుషుడు అన్నమాచార్యుడే ఆయనకు పూర్వము ఆ వంశమునందు కొన్ని తరముల వారున్నను వారు కవిత్వము చెప్పినట్లు గాని, పద రచనల వంటి రచనలు చేసినట్లుగాని కనపడదు అందుచే ఆ వంశము నందలి కవులకు అన్నమాచార్యుడే మూల పురుషుడని చెప్పక తప్పదు.

అన్నమయ్య జీవిత చరిత్రను ఆయన సమకాలీనుడును, ఆతని మనుమడు నగు చిన తిరుమలాచార్యుడే వ్రాసిపెట్టెను ఇది ద్విపద కావ్యము. ప్రామాణిక రచనా ధురంధరుడని పేరు పొందినవాడు చిన తిరుమలయ్య.

పొత్తపినాడు అని పేరు పొందిన రాయలసీమలోని యొక ప్రాంతమునకు చెందిన తాళ్ళపాక గ్రామము అన్నమయ్య జన్మస్థలము ఆ గ్రామమిప్పుడు కడప జిల్లాలోని రాజంపేట తాలూకా కేంద్రమునకు సమీపమున నున్నది. తాళ్ళపాక గ్రామమును తిరుమల తిరుపతి దేవస్థానమువారు దత్తత తీసికొని అభివృద్ధి చేయుచున్నారు

అన్నమాచార్యుని వంశమువారు నందవరీక బ్రాహ్మణ శాఖకు చెందినవారు ఋగ్వేదులు అశ్వలాయన సూత్రులు. భారద్వాజస గోత్రులు. లక్కమాంబ, నారాయణసూరి అను పుణ్యదంపతుల నోము ఫలమే అన్నమయ్య.

"రాజీవ నయను వర ప్రసాదమున (
దేజంబు మతియు నెంతే విస్తరిల్ల
లక్కమాంబకు బుణ్య లావణ్యనిధికి
చక్కని గ్రహము లుచ్చమున మూడలర
అనుపమ లగ్నంబునందు వైశాఖ
మున విశాఖను జగంబున నుల్లసిల్ల
జనియించె నన్నమాచార్యుండు " 1.

అని చిన తిరుమలాచార్యుడు వివరించెను

లక్కమాంబ నారాయణ సూరిదంపతులకు పెద్ద కాలము వరకు సంతానము లేదయ్యెను శ్రీనివాసుని కరుణకు పాత్రులగు నిమిత్తము ఆ దంపతులు తిరుమలకు చేరుకొనిరి నడిరేయి నారాయణ సూరికి శ్రీవేంకటేశ్వరుడు కనబడి (కలలో) నందక మను పేరిటి తన ఖడ్గమును ప్రసాదించెనట. దానినే వారు వర ప్రసాదముగా భావించి ఇంటికేగిరి కాలక్రమమున లక్కమాంబ గర్భవతియై రాజీవనయనుని వరప్రసాదమున అన్నమయ్య జన్మించినట్లు పై ద్విపద వలన తెలియుచున్నది. నందకాంశమున జన్మించిన అన్నమయ్య బాల్యముననే హరిభక్తుడయ్యెనని తెలియుచున్నది

"పరమ సుజ్ఞాన సంపద పొదలంగ
బుట్టుచు నతడు నేర్పున దల్లి జిడ్డు
వెట్టరమ్మని యుగ్గు పెట్టఁబోయినను
పనిబూని తిరుమలప్పని ప్రసాదంబు
గొనుమని యనక లోగొనడు కేరుచును
వెంకటపతి పేరు వివరించిపాట
పొంకించకుండి పోరూరడిలను
కొండలప్పనికి మొక్కుమటంచుననక
యొండు లాగున జలు లొనరించడతడు" 2.

అట్టి అన్నమయ్యకు ఐదు వసంతములు నిండి నంతనే తల్లిదండ్రులు ఉపనయనము గావించిరి అన్నమయ్యకు కొండలయ్య దయచేత విద్యలన్నియు పిన్న వయసుననే కరతలామలకము లైనవి పాడిన పాట పరమ గానము ఆడిన మాట అమృత కావ్యము అయినది.

"ఆడిన మాటెల్ల అమృత కావ్యముగ
పాడిన పాటెల్ల పరమ గానముగ
తన కవిత్వమునకు తన గానమునకు
కనుగొని సకల లోకములు గీర్తింప
వెంకటపతి మీద వింత వింతలుగ
సంకీర్తనంబులు నవరించు నిచ్చ" 3.

ఇట్లు పదములు పాడుకొనుచు ఇంటి పనులను సైతము ఏమరక చేయుచుండెడివాడు.

# అన్నమయ్య వైరాగ్యము

ఇట్లుండగా నొకనాడు జననీ జనకులును, అన్నా వదినలును పసులకు కసవు తెమ్మని అడవికి పంపగా, అచ్చట పచ్చిగడ్డి కోయునపుడు కడవ్రేలు తెగి నెత్తురు కారజొచ్చినది అంత నాతనికి జ్ఞానోదయమైనది ఈ లోకము పైనను, సంసార బంధముల యెడలను రోత కలిగినది.

"తగు బంధులా తనకు తల్లులును దండ్రులును
వగలబెట్టుచు తిరుగు వారే గాక" 4.

అనుకొని లౌకిక బంధములను తెగకోసి హరినామగానము చేయుచు ఆయననే కొలిచి జీవింతునని యెంచి తిరుమలకు పోవు యాత్రికుల గుంపుతో కలిసి, భజనలు చేయుచు, సంకీర్తనలు పాడుచు, పోయి కొండలెక్కుట ప్రారంభించెను బారెడు పొద్దెక్కినది వాడి మయూఖుని వేడి కిరణముల ధాటికి తట్టుకొనలేని పసిబాలుడు అలసి సొలసి ఒక చల్లని చెట్టు నీడకు చేరుకొనెను కాళ్ళకు పాదరక్షలు అట్లే యున్నవి. ఆకలి, అలసటలు రెంటిచే పీడింపబడిన యాతడు సొమ్మసిల్లి నట్లు నిద్రింపగా జూచి జాలిపొందిన అలమేల్మంగ పెద్ద ముత్తైదువ రూపు ధరించి, బాలుని యొద్దకేతెంచి అతని నూరడింపుచు,

"ఏమిటి కిట పడి యున్న వాడవు లేచి అడలక రమ్మన్న" 5

బలుదవ్వున నడచి రాకడ, ఆకలి దప్పులు, వీని వలన అలసిన నాకు

"కన్నులు కానరావు మాయమ్మ, అందుల
కొక యుపాయముఁ జెప్పి నాకు కందర్ప
జనకుని కనజేయవమ్మ" 6

అని అన్నమయ్య పలుకగా ఆజనని బాలుని కరుణించి ఇట్లనినదట-

"బాలక! ఇది సకల సాలగ్రామ మయము
ఘనులకు నిది జెప్పుగాళ్ళ నెక్కంగ జనదు
నీ చెప్పులు సడలించి వైచి
కనుగొను కన్నుల కనవచ్చుననిన" 7

విని అన్నమయ్య అట్లే చేసెను అంత నా ప్రాంత మంతయు సాలగ్రామ మయముగ తోచినది. వాని యందు శ్రీమన్నారాయణుని సర్వావతార మూర్తులు గోచరించినవి. అంత నాతడు వానికి భక్తితో నమస్కరించెను అలమేల్మంగమ్మ అన్నమయ్యకు తాను హరితో గలిసి భుజించిన ప్రసాద శేష భాగమును అందించినది

ఆ ప్రసాదమును భక్తియుక్తుడై స్వీకరించిన అన్నమయ్య తత్ప్రభావమున పరమ సారస్వత పారీణుడగుచు ఆశువుగా అలమేల్మంగ పై ఒక శతకమును చెప్పెను దాని యందలి ఒక పద్యము -

యోగ్యత లేనికష్టుడ, నయోగ్యుడ నన్నిటు జూడ గర్వని
ర్భాగ్యుడ, నీ కృపామతికి ప్రాప్తుడ నోయలమేలు మంగ సౌ
భాగ్యము నీ కృపాగరిమ ప్రాప్యము కావు మటంచు సారెనీ
భాగ్యవతీ శిరోమణిని బ్రస్తుతి జేసెద వెంకటేశ్వరా"          8

అట్లు అలమేల్మంగచే ఆశీస్సులను పొందిన అన్నమయ్య పాదరక్షలను అట వదలి ఎడారి యందలి విశేషములను తెలిసి కొనుచు, పోయెను వేంకటాద్రి పై స్వామి పుష్కరిణిలో తానమాడి, స్వామిని దర్శించి సంకీర్తనలతో స్వామిని భజించెను అతని గాత్ర సౌలభ్యమునకు మెచ్చిన అర్చకులు అతనికి తీర్థ శరగోపాదులను అనుగ్రహించిరి నాటికి అన్నమయ్య ఎనిమిది వత్సరముల ప్రాయము వాడు మాత్రమే.

"ఈ రీతి వెనిమిది యేడుల పిన్న
బాలుడయ్యును నిష్ఠ బని బూని యతడు"          9

ఆ మరునాడు శనివారము కొండలలో నున్న అనేక తీర్థములలో అవగాహన మొనర్చిన అన్నమయ్య

. . . . . . . . దా గట్టు చేర
నది యెండ నారెడు నంతలో వలనె
వితత వృత్తంబుల వేంకట పతికి
శతకంబు కుతుకంబు సమకూర జేసి నాడు          10

ద్వాదశోర్ధ్వపుండ్రములను ధరించి వేంకటేశ్వరుని దర్శింపబోవ కాలాతీత మైనందున ద్వారములు బంధింప బడి యుండెను. అప్పుడు అన్నమయ్య వేంకటేశ్వరునిపై వేంకట శతకము అనునొక్క శతకము జెప్పగా తాళములు వానియంతట అవియే యూడి పడి ద్వారములు తెరచుకొనెను అంత అర్చకుడరుదెంచి, అన్నమయ్యను జూచి, "భళి భళీ" యని మెచ్చుకొని, ఆచెంత గల సకల దేవతా దర్శనముతో పాటు శ్రీనివాసుని దర్శనమును చేయించెను.

ఆ విధముగ అన్నమయ్య ప్రతినిత్యము స్వామిని సేవింపుచు, ఒక యరుగుపై కాలము గడుపుచుండెను. ఒకనాటి రాత్రి వేంకటేశ్వరుడు హరి భక్తి పరాయణచిత్తుడైన ఘన విష్ణుడు అనెడి యతికి స్వప్నమున సాక్షాత్కరించి, అన్నమయ్యను గూర్చి చెప్పి, అతనికి పంచ సంస్కారములు చేయవలసినదిగా ఆనతిచ్చెను

అంత నాయతి మరునాటి యుదయమే అన్నమయ్యను కనుగొని శ్రీనివాసుని యానతిమేరకు అన్నమయ్యకు పంచ సంస్కారములు గావించి వైష్ణవునిగ జేసెను. అటు పిమ్మట ఆయన అన్నమయ్యతో లిసి ఇతర వైష్ణవుల పంక్తిని భుజించి, తాను గాంచిన స్వప్నము గూర్చి అందరకు విశదీకరించెను.

ఇట్లు కొన్ని దినములు గడచిన పిమ్మట అన్నమయ్యను వెదకి కొనుచు అతని తల్లి లక్కమాంబ తిరుమలకు చేరుకొన్నది. అన్నమయ్యను కనుగొనిన యామె కొడుకును తాళ్ళపాకకు రమ్మని కోరగా అన్నమయ్య నమ్మతింపడయ్యెను అంతనొకనాటి రాత్రి నారాయణుడు అన్నమయ్యకు కలలో సాక్షాత్కరించి.

"జనని వాక్యము ద్రోయ జనదు కుమార
పోయి రమ్మనిన ..........."    11

అన్నమయ్య మేల్కాంచి, అచ్యుతుని కొనియాడి మ్రొక్కుచు జననితో గూడి తాళ్ళపాకలోని తన నివాసమున కరిగెను. ఎల జవ్వనమున నున్న తమ కొడుకును వివాహితునిగ చూడనెంచి అతనిని వెంట నిడుకొని కులము వారిండ్లకు బోయి వారి యాడు బిడ్డలను ఇచ్చి పెండ్లి చేయుడని కోరిరి. కాని అన్నమయ్య దాసరి వలె "హరి హరీ" యని పాటలు బాడుకొను వాడనియు, అట్టి వానికి తాము యేగతి పడుచుల నిత్తుమనియు పలికిరి అంత నారాయణుడే వారలకు స్వప్నము లందుగుపడి అన్నమయ్యకు మీ మీ పడుచుల నిచ్చి పెండ్లి చేయుడని యాన తిచ్చెనట. అప్పుడా యూరి వారు "అన్నన్నా" యని పశ్చాత్తాపపడి తిరుమలమ్మ, అక్కలమ్మ యనెడి పేరిటి కన్యలను ఇరువుర నిచ్చి ఆగమోక్త ప్రకారంబున వివాహములు జరిపించిరి అటు పిమ్మట కొంత కాలమునకు అహెూబిలము నందలి ఆదివన్ శఠకోపయతి కడకేగి అన్నమయ్య సకల వేదాంత పరనంబు చేసి ఆవెనుక రామాయణాది గ్రంథములు సేవించెను. రామాయణమును కీర్తనలు రూపమున పాడగా విని అచ్చెరువొందిన అచ్చటి వారందరు ఈతడు తుంబురుడో, నారదుడో కాకున్న మానవ మాత్రుడు ఇట్టి మధురాలాపన చేయగలడా యని వేనోళ్ల గొనియాడిరి ఈ వార్త టంగుటూరి ప్రభువగు సాళ్వ నరసింగ రాయడను సూర్యవంశపు రాజు చెవుల సోకినది. ఆరాజు అన్నమయ్యను సకల మర్యాదలతో గౌరవించి తన పురమునకు రమ్మని ప్రార్థింప నాతని తోడఁ గలసి అన్నమయ్య టంగుటూరి కేగినట్లును, అన్నమయ్య ఆశీఃప్రభావముచే నరసింగరాయడు పెనుగొండ ప్రభువు అయ్యెననియు అన్నమాచార్య జీవిత చరిత్రమున వర్ణింప బడి యున్నది అంత, నా పెనుగొండ ప్రభువు అన్నమయ్యను తన కడకు రప్పించుకొని యనేక విధముల నాతనిని గారవించి,

"సన్నుతంబైన మీ సంకీర్తనములు
విన నాకు మిక్కిలి వేడుకయ్యెడును
అనఘాత్మ వినిపించు . . .మనిని నగ్గురుడు 12

దండెలు శృతి గావించి మేలైన సంకీర్తనలు బాడెను అంతట రాయలు అన్నమయ్యను పెక్కు భంగుల కీర్తించి, అనేక సత్కారములు వేడ్కగావించి తన నగరికి సమీపముననే యొక మందిర మందున అన్నమయ్యను ఉండజేసెను అనుదినము వేంకటేశునిపై సంకీర్తనములు వినుచుండెడి వాడటరాయలు. ఒకనాడు రాయలు అన్నమయ్యను తగు రీతిని సత్కరించి, ఆతని చేత శృంగార సంకీర్తనలు బాడించుకొని వినెను అట్టి సంకీర్తనలలో మేలు బంతి వంటిదైన "ఏమొకో చిగురుటధరమున " అను కీర్తన బాడగా విని యారేడు చొక్కి

"తలయూచి యిది కవిత్వంబని మెచ్చి
. . . .. ... .. ............ ....... .....
పదరక వేంకట పతి మీద నుడువు
పదముల రీతి నాపై నొక్క పదము
చెప్పుమా యనపుడు జెవులిరుగేల
నప్పళింపుచు మూసి హరిహరీ యనుచు" 13

హరి ముకుందుని గొనియాడు నా జిహ్వనిను గొని యాడ నేరదని తిరస్కరించి రాజు కొలువు వీడి పోదొడంగ రాజు మిక్కిలి కోపించి, భటులచే అన్నమయ్యను పట్టి తెప్పించి "మూరు రాయర గండ" అనుడి పేరుగల సంకెల తగిలించి చెరసాలలో వేయించెను అప్పుడు హరికీర్తనాచార్యుడైన అన్నమయ్య

"సంకెల లిడువేళ జంపెడు వేళ
నంకిలి ఋణదాత లాగెడు వేళ
వదలక వేంకటేశ్వరుని నామంబె
విదలింప గతిగాని వేఱొండు లేదు" 14

అను నర్థములు వచ్చునట్లు సరగున నొక్క సంకీర్తనంబు చెప్పి ముకుందుని శరణు జొచ్చుటయు, చూచువారి గుండెలు ఝల్లన శృంఖలలు ఘల్లున వీడినవి అంత భటులు పరుగున పోయి రాజుతో విన్నవించిరి. కాని రాజు ఆ విషయమును విశ్వసింపక చెఱసాలకు పోయి అన్నమయ్యకు తిరుగ సంకెలలు వేయింపగా ఆ భక్తుడు తిరిగి అదే సంకీర్తన పాడగా కాలి సంకెలలు చేతి చీలలు చెచ్చెర నూడి పడినవి కన్నులార గాంచిన రాయల గుండెలు అదిరినవి. మేను ఝల్లుమన్నది. హరి భక్తుని పాదములపై వ్రాలి శరణు

వేడినాడు అన్నమయ్యను అనేక విధముల ప్రస్తుతించి షడ్రసోపేత పదార్థములతో విందారగింప జేసి, బంగరు పల్లకి ఎక్కించి, పల్లకి కొమ్మునొకదానిని భుజముపై నుంచుకొని స్వయముగ మోసెనట. అంత అన్నమయ్య సంతృప్తుడై పశ్చాత్తాపము కన్న మించిన శిక్ష లేదని రాయలకు తెలిపి, హితబోధ గావించి కొండల రాయని సేవార్థియై తిరుమలకేగి శేషాద్రి వాసుని పై శృంగార మంజరి యనెడి గ్రంధమును రచించి స్వామికి సమర్పించెను.

"ఆడుచుఁ బతక మా కన్నల జోల
పాడగా నాడెల్ల బసి బిడ్డనైతి
నాకృష్ణమాచార్యునధ్యాత్మ వినుతి
రాకఁగొన్నాళ్ళు విరక్తుండ నైతి
జగతి నీ శృంగార సంకీర్తనముల
కగపడి మంచి ప్రాయపువాడనయితి" 15

అని వేంకటేశ్వరుడు అన్నమాచార్యుని కనుగొని పలికి గౌరవింపగా మధుర భక్తుడైన అన్నమయ్య "ఓ దేవా! నిన్ను గొనియాడ నేనెంతటి వాడను తండ్రీ" యని పరి పరి విధముల ప్రార్థించి అంబుజోదరుని ఎంతగనో మెప్పించి ధన్యుడయ్యెను.

అన్నమయ్యకు శ్రీనివాసుని ప్రభావము చేత సకల వాచా శుద్ధి యుండెడిదట. నవ్వుచునైన దీవెనల నిచ్చినచో నిజముగ నట్లే జరిగెడివట ఆగ్రహించినచో నది శాపమే నట

"జగతిపై సకల వాచా శుద్ధి గలిగి
నగుచునైనను దీవెనల నిచ్చెనేని
అలిమీరఁగినిసి యొల్లమి దిట్టెనేని
అల రెండు నెపుడు బ్రత్యక్షమై జూపు" 16

ఇట్లు తన వాచాశుద్ధితో అన్నమయ్య కొన్ని మహిమలను చూపినట్లు అన్నమాచార్య చరిత్రలో గలదు.

వానిలో జీడి మామిడి చెట్టొకటి అన్నమయ్య మహిమచే తియ్య మామిడి పండ్లను ప్రసాదించిట, కుమార్తెకు పెండ్లి చేయగోరిన బ్రాహ్మణునకు పిలిచి వలసినంత ధనమిచ్చి ద్వాదశి కన్యాదానమిచ్చుట మొదలైనవి కొన్ని గలవు ఆయనను శరణు వేడి ఎందరో జనులు తమ యాపదలను తొలగించుకొన్నట్లు చిన తిరుమలాచార్యుడు వ్రాసినాడు.

# అన్నమయ్య - పురంధర దాసుల చెలిమి

పాండురంగ విఠలుని కీర్తించి తరించిన పురందరదాసు అన్నమయ్యను దర్శించి అతనిని అనేక విధముల పొగడెనట. అన్నమయ్యను పురందరదాసు వెన్నునిగా భావింపగా అన్నమయ్య అతనని విఠలునిగా భావించి గౌరవించెనట.

సంకీర్తనలు కాక అన్నమయ్య ఇతర రచనలు పెక్కులున్నట్లు తెలియుచున్నది, వానిలో అధిక భాగము ప్రస్తుతము అలభ్యములు

అన్నమాచార్యునకు శ్రీనివాసుని కృప వలన నరసయాచార్యుడు, తిరుమలాచార్యుడు అను కుమారులు కలిగిరిం వారును తండ్రివలెనే విద్యల నెల్ల బొంది కాంచనాంబరునిపై భక్తి కలిమి పెంపొందగ ప్రశస్తి గాంచిరి.

అన్నమయ్య గురించి అతని కుమారుడైన పెద తిరుమలాచార్యుని నాలుగవ కుమారుడైన తిరువెంగళనాథుడు రచించిన "అష్టమహిషీ కళ్యాణము"న తాతగారైన అన్నమాచార్యుని గురించిన ప్రశస్తి ఇట్లున్నది

"హరి భక్తు డశ్వలాయన సూత్రధారి
పరమ విద్యా సింధు పారంగతుండు
వనజాత జాత సర్వ సురేంద్రముఖులు
గనలేని వేంకట గ్రావాధి నాధు
పదములు శోభనాస్పదములౌతనదు
పదములు బహుదేశ పదములు జనుల
గన జేసి పంచమాగమ సార్వభౌము
డన బ్రసిద్ధికి నెక్కి యఖిల విద్యలను
నన్నయాచార్యుండె యన దాళ్ళపాక
యన్న మాచార్యుడాయత కీర్తి జెలగె"        17

అట్లన్నమయ్య

"శౌరి కథా సుధా సల్లాప గరిమ
ధారుణి నెంతయు దనరారు చుండె"

అని అన్నమాచార్యుని జీవిత చరిత్రము ముగింపబడెను కాని ఈ గ్రంధము నందు అన్నమయ్య జనన కాలాదికములు గాన రావు.

అన్నమయ్య క్రీ శ 1408 లో జన్మించి క్రి శ. 1503లో పరమపదించినట్లు రాగిరేకుల మీది వ్రాతల వలన తెలియుచున్నది. ఆయన జీవితమునకు సంబంధించిన శాసనస్థమైన ఆధారములు ఇంతకు మించి కానరావు

ఈ రాగిరేకులు అన్నమాచార్యుని రెండవ కుమారుడు పెద తిరుమలాచార్యుడు చెక్కించినవి. తండ్రిగారిచే రచింపబడిన సంకీర్తనల నన్నింటిని ఆయన రాగిరేకులపై చెక్కించి తిరుమలలోని దేవస్థానమందలి ఒక అరయందు భద్రపరచెను. దానికే "సంకీర్తనా భాండాగారము" అనియు, "తాళ్ళపాకవారి అర" అనియు పేర్లు ఇది ప్రస్తుతము స్వామి వారి హుండీకి ప్రక్కన గల రామానుజాచార్యుని సన్నిధికి ప్రక్కన గలదు

ఆ భాండాగారమున లభించిన రాగిరేకుల వలన అన్నమయ్య జననాదికములకు సంబంధించిన వివరములు తెలియును.

"స్వస్తి శ్రీ జయాభ్యుదయ శక వర్షంబులు 1346 అగు నేటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళ నాధుండు ప్రత్యక్షమైతేను అది మొదలు గాను శాలివాహన శక వరుషంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ నిరుధానకు తిరువేంగళ నాధుని మీదను అంకితము గాను తాళ్ళపాక అన్నమాచార్యుడు విన్నపం చేసిన అధ్యాత్మ సంకీర్తనలు "అని మొదటి రేకు మీద గలదు. అట్లే "శృంగార సంకీర్తనలు" ప్రారంభమందును గలదు. 18

రాగి రేకులలోని వ్రాతలను బట్టి అన్నమయ్యకు 16వ యేట స్వామి ప్రత్యక్షమైనట్లు తెలియుచున్నది శ్రీవైష్ణవ మతము నందలి పన్నిద్దరాళ్వారులలో నొకరైన శ్రీ నమ్మాళ్వారును 16వ యేటనే ప్రజ్ఞా ధురంధరుడై దివ్య ప్రబంధ రచనకు కడంగినాడు. ఈతనికే "శఠకోపయతి" అని పేరు

అన్నమయ్య ఎనిమిదవ యేటనే ఇంటిపై రోసి తిరుమలకు చేరుకొనెను కాని రాగిరేకులలో "16వ యేట స్వామి ప్రత్యక్షమైతేను" ఆనాటి నుండి సంకీర్తనా రచన కావించినట్లు వ్రాయబడి యున్నది. దీని నిట్లు సమన్వయింప వచ్చును అన్నమయ్య ద్విజుడు, ద్విజుడనగా రెండు జన్మములు గల వాడని యర్థము అనగా బ్రాహ్మణుడని భావము మాతృ గర్భమునుండి బయట పడినపుడొక జన్మము, ఉపనయనమై గురూపదేశమైన వెంటనే మరియొక జన్మమైన బ్రహ్మచర్యము నుండి మరియొక పుట్టువును ప్రాప్తించును. ఆ దినములలో ఎనిమిదవ యేటనే ఉపనయనము విధిగ జరిగెడిది. కనుక అన్నమయ్యకు ద్వితీయ జన్మము ప్రాప్తింప చిన ఎనిమిదేండ్లకు స్వామి దర్శనము లభించినదని యూహింపదగును వెరసి పదియారు వర్షముల ప్రాయముగ చెప్పుకొనవచ్చును

అన్నమయ్య వంశము వారు నందవరీక స్మార్త బ్రాహ్మణులు ఈ నందవరీకు లందరును పదియవ శతాబ్దమున కాశీనగరము నుండి ఆంధ్రదేశమునకు తరలి వచ్చిన శుద్ధవైదిక బ్రాహ్మణులు అని "చౌడేశ్వరీ మహాత్మ్యము"లో చెప్పబడినట్లు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు వ్రాసినారు 19

నేటి కర్నూలు జిల్లాలో పాణ్యం, బనగానిపల్లె గ్రామముల మధ్య నున్న "నందవరము" అను గ్రామము రాజధానిగ జేసికొని నందుడను రాజు పాలించుచుండెను అతనికి నిత్యము ఉషఃకాలమున కాశీగంగలో స్నానమాచరించి తెల్లవారక మునుపే తన స్థానమునకు చేరవలెనని పేరాస యుండెడిదట దత్తాత్రేయ సిద్ధుని సహాయమున పాదుకలు సంపాదించి ఒక సారంగ మార్గమున తన కోర్కెను తీర్చుకొను చుండగా ఒకనాడు భార్య ఈ విషయమును కనిపెట్టి మారాము చేసి తానును కాశికి బోయి అచటి గంగలో స్నానము చేసినదట. కాని ఆయమ ఇంటికి దూరమగుటచే మంత్ర ప్రభావము పని చేయక పోవుట వలన రాజు అక్కడ స్నానము చేయుచున్న బ్రాహ్మణులను వేడుకొనగా వారతనిని తెల్లవారక మునుపే నందవరమునకు పంపగలిగిరట ఆ సందర్భమున వారు కోరిన దేదైన ఇత్తునని రాజు వారికి వాగ్దానము చేసెనట. ఇది కాశిలో చాముండేశ్వరీదేవీ ఘట్టమున ఆదేవి సాక్షిగ జరిగినదట. కాలక్రమమున కాశిలో కరవు సంభవింపగా ఆ బ్రాహ్మణులు కొందరు నందవరమునకు వచ్చి రాజును సాయము కోరగా రాజు మాట తప్పెనట. సాక్ష్యము చూపింపుడని కోరగా ఆ బ్రాహ్మణులు ఛాముండేశ్వరిని వేడుకొనిరి ఆమె రాజు వద్దకేతెంచి యదార్థము గుర్తు చేసి రాజుచే ఆ బ్రాహ్మణులకు నందవరము గ్రామమును ధారాదత్తము చేయించి, వారి ప్రార్థనపై ఆదేవి అచ్చటనే స్థిరపడినదట"

ఇట్లా బ్రాహ్మణులు నందరాజు కారణమున రాబడిన వారగుటచే నంద వైదీకులనియు, నందవరమున నివసించుటచే నందవరీకులుగ పిలువబడుచున్నారు

అట్టి నందవరీక శాఖకు చెందిన వంశమే మన తాళ్ళపాక వారిది. వైదిక బ్రాహ్మణులైన ఆ వంశము వారు అన్నమయ్య కాలము నుండి వైష్ణవులైనారు స్మార్త బ్రాహ్మణ శాఖకు చెందిన అన్నమయ్య ఘన విష్ణుడు అనియెడి యతి వలన పంచ సంస్కారములు పొంది వైష్ణవుడాయెను

పంచ సంస్కారములు:-

1. తాపము :- చక్రాంకితము - సమాశ్రయణము
2 పుండ్రము :- తిరుమణి, శ్రీచూర్ణములు దిద్దుట
3 నామము:- ద్విజన్ముడు కనుక పునర్నామ కరణము
4. మంత్రము:- మంత్రోపదేశము

5. వైష్ణవేష్టిలేకయజ్ఞము :- అర్చావిధి, పూజ

ఈ యైదింటిని పంచ సంస్కారములందురు ముద్రాధారణము అయిన పిమ్మట వైష్ణవ వృద్ధులు ఆ వటువును బంతి నిడుకొని భుజింతురు. దీనికే తళిహ నియమము అని పేరు.

అన్నమయ్య వంశావళి

నారాయణుడు

విఠ్ఠలుడు

నారాయణుడు

విఠ్ఠలుడు

నారాయణుడు

నారాయణ సూరి - లక్కమాంబ

అన్నమాచార్యుడు

1) నరసింహాచార్యుడు (నరసింగన్న)    2) పెద తిరుమలాచార్యుడు

1.చినతిరుమలాచార్యుడు (తిరువెంగళప్ప) 2 అన్నయ్య 3 పెదతిరువెంగళనాథుడు 4 చినతిరువెంగళనాథుడు (చిన్నన్న) 5.కోనేటి తిరువెంగళనాథుడు

పెద తిరుమలాచార్యుని కుమారులలో నాలుగవ వాడైన చిన్నన్న (చిన తిరువెంగళ వాథుడు) వంశ మీ క్రింది విధముగ నున్నట్లు శ్రీ మానవల్లి రామకృష్ణ కవి గారు తెలిసికొన్న విషయము లిట్లున్నవని డా॥ వేటూరి ఆనందమూర్తిగారు తెలిపిరి (21)

చిన్నన్న

వెంకటేశయ్య    అప్పయ్య

సోమయ్య

బుచ్చన్న

పెరుమాళ్ళయ్య

రామయ్య

పెరుమాళ్ళయ్య    అప్పళాచార్య

వెంకట రమణయ్య

సూర్యనారాయణయ్య

నేడు ప్రసిద్ధిలోనున్న పలువురు తాళ్ళపాక వారు తాము చిన్నన్న వంశము వారమని చెప్పుకొందురు. చిన్నన్న సుప్రసిద్ధుడు.

అన్నమయ్య కుమారులలో పెద్ద వాడైన నరసింగన్న యను నాతడు నిరుపమాన కవిత్వము చెప్పినట్లు చిన్నన్న వ్రాసిన "అష్టమహిషీకళ్యాణము" వలన తెలియుచున్నది ఇతడు క్రీ.శ. 1546 నాటికే దివ్యధామము నందినాడు.

అన్నమయ్య ద్వితీయ కళత్రము అక్కలమ్మ. ఆమె యందు జన్మించిన కుమారుడే పెద తిరుమలాచార్యుడు ఇతనికి తిరుమలమ్మ,నరసమ్మ అను ఇరువురు సోదరీమణులు ఇతడు 1553 వరకు జీవించిన వాడు.

ఇతని పెద్ద కుమారుడు చిన తిరుమలాచార్యుడు. అన్నమాచార్యుడే ఈతనికి బ్రహ్మోపదేశము గావించెను. ఇతడు 1495 ప్రాంతముల జన్మించి యుండవచ్చును అష్టభాషా కవి చక్రవర్తి యని ఇతనికి బిరుదము కలదు. చిన్నన్నగా ప్రసిద్ధి గాంచిన వాడు పెద తిరుమలాచార్యుని నాల్గవ కుమారుడు. ఇతడు తన తాతగారైన అన్నమార్యుల చరిత్రమును ద్విపదగా రిచంచెను. ఒక దినములో వేయి ద్విపదలు స్వామిని నుతించుచు వ్రాసిన వాడు.

ఇట్లే వంశము వారందరును చిన్నన్న కాలము వరకును సంకీర్తనలు, ఇతర గ్రంధములు రచించినట్లు తెలియుచున్నది.

## అన్నమయ్య రచనలు

అన్నమాచార్యుడు వైరాగ శృంగార సంకీర్తనలు ముప్పది రెండు వేలు చెప్పెనని అన్నమాచార్య చరిత్రము ద్విపదలో కలదు. (26)

దినముకొక్క కీర్తనకు తక్కువ కాకుండ, తిరుమలలో స్వామి ప్రత్యక్షమైన పదునారవ యేట నుండి అన్నమయ్య దివ్యధామము నందు వరకు పదములు చెప్పినాడట.

"యోగ మార్గంబున నొక కొన్ని, బుధులు
రాగిల్ల శృంగార రస రీతి కొన్ని
వైరాగ్య రచనతో వాసింపకొన్ని
సారస నేత్రుపై సంకీర్తనములు
సరసత్వమున దాళ సముఖముల్ గాగ
పరమ మంత్రములు ముప్పది రెండు వేలు" (27)

ఈ ముప్పది రెండు వేలు గాక అన్నమయ్య పన్నెండు పద్య శతకములు

రచించినట్లు తెలియుచున్నది. సకల భాషల యందును ప్రతి లేని నానా ప్రబంధములను రచించినట్లున్నది

"ప్రవిమల ద్విపద ప్రబంధ రూపమున
నవముగా రామాయణము, దివ్యభాష
నా వెంకటాద్రి మహాత్మ్యమంతయును
గావించి, రుచుల శృంగార మంజరియు
శతకముల్ పది రెండు సకల భాషలను
ప్రతి లేని నానా ప్రబంధముల్ చేసి" (21)

కాని ఈ గ్రంధములలో శృంగార మంజరి దక్క ఇతరములు అనుపలభ్యములు ఇది అన్నమయ్య కుమారుడైన పెద తిరుమలా చార్యుడు రాగిరేకులపై చెక్కించెను ఇదయే తిరుమల తిరుపతి దేవస్థానము వారిచే 1935లో 'The minor works of Thallapakam Poets" అను పేరిట ప్రకటింప బడినది. దీని పరిష్కర్త రావు బహద్దుర్ కె. సీతారాంరెడ్డి గారు

సంకీర్తన లక్షణ మను పేరిటి గ్రంధమును తన తాతగారైన అన్నమాచార్యుడు రచించినట్లు చిన్నన్న వ్రాసెను. అది సంస్కృత గ్రంధము. దీనికి పెద తిరుమలాచార్యుడు వ్యాఖ్యానము రచించెను. కాని ఇది అనుపలభ్యము. ఈ సంస్కృత గ్రంధమునే చిన తిరుమలాచార్యుడు పద్య గ్రంధముగ ఆంధ్రీకరించెను. దీనిని తన తండ్రియైన పెద తిరుమలాచార్యుని యనుమతితో తెనిగించినట్లు సంకీర్తన లక్షణమున చిన్నన్నయే చెప్పికొనెను. ఇదియు "The minor works of Thallapakam Poets" అను గ్రంధమున తిరుమల తిరుపతి దేవస్థానము వారిచే 1935లో ప్రకటింపబడెను.

"ధరలో తాళులపాక యన్నయ గురూత్తంసుండు సంకీర్తనా
పరిశుద్ధిన్మును చేయ బూని తగ నుత్పాదించెఁ దల్లక్షణం
బరుదై మించి సంస్కృతంబున గవీంద్రానంద సంధాయియై
పరిపూర్ణాఖిల శాస్త్ర సమ్మతముగా భావజ్ఞతానౌననన్"
"అలరుఁ దాళ్ళపాక యన్నయార్య సుతుండు
తిరుమలార్యుడఖిల దేశికుండు
తత్సుతాగ్రజుండ ధర లోన జినతిమ్మ
యాహ్వాయుండ దండ్రి యనుమతమున"
"పరమామ్నాయ సమానమై వెలయు మత్పైతామహ గ్రంధమున్

వరచాటూక్తి మదీయ పుణ్య జనక వ్యాఖ్యాతమున్ వేడ్కఁదా
చరణాంభోరుహముల్ మదిందలచి సచ్ఛాస్త్రజ్ఞులింపొందగా
వరుసంచెప్పెద పద్యరూపమున దద్వాక్యాను సారంబుననొ (29)

అన్నమాచార్యుడు వ్రాసినట్లు చెప్పబడుచున్న పన్నెండు శతకములలో రెండింటి పేర్లు మాత్రమే తెలియుచున్నది. వానిలో నొకటి అన్నమయ్య తొలిసారిగ కొండలెక్కునపుడు అలమేల్మంగను ప్రస్తుతించుచు ఆశువుగా చెప్పిన "అలమేల్మంగా శతకము", మఱి యొకటి "శ్రీవేంకటేశ్వర శతకము"

"వితత వృత్తంబుల వేంకట పతికి
శతకంబు కుతుకంబు సమకూర జేసి" (30)

కాని ఈ రెండు గ్రంధములును ఒకటే కావచ్చునని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు అభిప్రాయ పడిరి. అలమేల్మంగాంబికా శతకము నందలి యొక పద్యము నాధారముగా వారట్లు అభిప్రాయ పడినారు. ఆ పద్యమిది.

"అమ్మకు దాళ్ళపాక ఘనుడన్నడు పద్యశతంబు జెప్పెఁగో
కొమ్మని వాక్ప్రరిసూనముల గూరిమితో నలమేలు మంగకున్
నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మద మంది వర్ధిలుము జవ్వని లీలల వెంకటేశ్వరా (31)

అని వేంకటేశ్వరాంకితముగ నుండుటయును, ప్రతి పద్యమునను అలమేల్మంగాంబికా స్తుతి యుండుటచేతను, ఆ వేంకటేశ్వరశతకమే ఈ అలమేల్మంగాంబికా శతకమని కీ శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు భావించి యుండిరి.

కాని వారి కుమారులు శ్రీ. వేటూరి ఆనందమూర్తిగారు తద్భిన్నమైన అభిప్రాయమును వెలిబుచ్చినారు.

"ఈ రెండును వేర్వేరు శతకములే వాని భేదముల నిట్లు చూపవచ్చును" (32)

1 అలమేలు మంగకు నాకు మార్గమున చెప్పిన శతకము అన్నమాచార్యుని తొలి రచనము అది ఏ ఛందమున వ్రాయబడినదో తెలియదు అన్నమయ్య ఎనిమిదేడుల వయసున కొండనెక్కుచు చెప్పినది.

2 వెంకటేశ్వర శతకము మలిరచనము. వృత్త పద్యశతకము అన్నమయ్య కొండపై స్నానము చేసిన పిమ్మట బట్టలు ఆరునంతలో చెప్పినది ఆ పద్య పఠనము వలననే మూసియున్న ఆలయ ద్వారములు తమంత దామవే తెరచుకొనినవి. స్వామి యర్చన వేళ నీ శతకము నాతడు పఠింపగా స్వామి మెడలోని ముత్యాలపేరు స్వామి పాదములపై పడునట్లు ప్రసాదించెను. కనుక ఇదియును అలమేల్మంగాంబికా శతకమును ఒకటి గానేరవు (33)

అన్నమాచార్యుని సంకీర్తనలను శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఆంధ్ర వేదమని పేర్కొనిరి (34)

శ్రీ వైష్ణవ సాంప్రదాయమున ఆళ్వారులు రచించిన పాశురములకు ద్రావిడ వేదమని పేరు. ఇవి నాలాయిరమ్ అనగా నాలుగు వేలు. దీనికే పంచమాగమము అని పేరు ద్రావిడ ప్రబంధములలోవలె అన్నమయ్య కీర్తనలలో భక్తి, శరణాగతి, ప్రపత్తి మొదలైనవి చోటు చేసికొన్నవి అధ్యాత్మకీర్తనలతో పాటు శృంగార కీర్తనలు గూడ నుండుటచే వాని యందు నాయికా, నాయక భావము ఆత్మ పరమాత్మల సంయోగము వలె స్పష్టమగుచున్నది.

"శృతులై శాస్త్రములై పురాణ కధలై సుజ్ఞాన సారంబులై
యతిలోకాగము వీధులై వివిధ మంత్రార్ధంబులై నీతులై
కృతులై వేంకట శైలవల్లభు రతిక్రీడారహస్యంబులై
నుతులై తాళుల పాక యన్నయవచోనూత్నక్రియల్ చెన్నగున్ (35)

ఇది అన్నమాచార్యుని మనుమడైన చిన్నన్న చెప్పిన పద్యము.

"ఎంత భక్తియున్నను, మరెంత పాండిత్యమున్నను ఒక్క వెంకటేశ్వరునిపై అసంకీర్ణములగు ఇన్ని భావ పరంపరలను సృష్టింపగల రాసిక్య మింకొకరికి లేదనుట నిర్వివాదమైన సత్యము" అని శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు తెలిపిరి (36)

"ఈ శృంగార సంకీర్తనలు అభినయించుటకు తగినవి" అన్ని శ్రీ విస్సా అప్పారావు గారి అభిప్రాయము (37)

మార్పులను చేర్పులను సహింపని విధముగ అన్నమయ్య కవిత్వము విలసిల్లినది ఆ పదములలో అన్నమయ్య అధికముగ పోషించినది భక్తి సహిత శృంగారము. అది భగవద్రతికి సంబంధించినది పార లౌకికమైనది.

అధ్యాత్మిక రచనలలో సంఘ సంస్కరణాభిలాష గోచరించును. సాంఘిక దురాచార ఖండన, సర్వ మానవ సౌభ్రాతృత్వము, జీవేశ్వరుల అభేదము గోచరించును. హరిజనులకు ఆలయ ప్రవేశము కల్పించినవి ఆయన రచనలు. రాజులను, వారి నిరంకుశత్వమును నిరసించినవి ఆయన పదములు. భూమీశులను సిరి చెలువుని దాసులుగా మార్చినవి ఆయన సంకీర్తనలు. ఆయన వాడిన సామెతలు, లోకోక్తులు ఎనలేనివి. తెలుగు నుడికారపు సొంపులు ఒంపులు వింత అందములను సంతరించుకొననవి. రాయలసీమ మాండలిక పదములు ఆయన సంకీర్తనలలో నర్తించినవి.

అన్నమయ్య వాడిన రాగములు ఆయన కాలముననే ఎక్కువగా పరిమితమైనవిగా తోచుచున్నవి వానిలో కొన్నింటిని ఇప్పుడేయే పేర్లతో పిలచుచుండిరో తెలియదు

అన్నమయ్య గాని, ఆ వంశములోని ఇతర గాయకులు కవులు గాని తాళములను పేర్కొనలేదు ఏ కీర్తనను ఏ రాగములో వారు పాడుకొనిరో వ్రాసియున్నది కాని (రాగి రేకులపై) ఏ తాళములో ఏ గతిలో ఎట్లు పాడుకొన వలయునో వివరింపలేదు. వారు భక్తికి, రాగమునకు, భావమునకు మాత్రమే ప్రాధాన్యము నిచ్చినట్లు తెలియుచున్నది ఆ సంకీర్తనములను పరిశీలించిన వారికి ఎవరికైనను ఈ విషయము తేట పడగలదు కాని అంత మాత్రమున ఆ సంకీర్తనలు అసంబద్ధమైనవి గను, లయబద్ధము కానివిగను తలంప పని లేదు ఏ తాళములో పాడుకొన దలచిన ఆ తాళమునకు అందలి పదములు ఒదిగి నిలచును భక్తి భావముతో పాడుకొను వారికి ఇట్టివి ఆటంకము కానేరవు

ఆధ్యాత్మిక రచనలు భక్తి వైరాగ్యములకు నిలయములు. శృంగార సంకీర్తనలు మధుర భక్తి పూరితములు. అవి అన్నియు ముక్తి మార్గ సోపానములును, మోక్షదాయకములును.

# సంఖ్యా సూచి

1 అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట 9

2. అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట 10

3,4. అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట 11

5,6 అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట 16

7 అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట 16

8. అన్నమాచార్య చరిత్ర పీఠిక 8
వేటూరి ప్రభాకర శాస్త్రి

9,10 అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట 23,24

11. అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట. 29

12 అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట 32

13. అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట 36

14 అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట 38

15,16 అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద)
చిన తిరుమలాచార్యుడు పుట. 42

17. అష్ట మహిషీ కళ్యాణము - తా తిరువెంగళనాధుడు (చిన్నన్న)
ద్విపద. తి.తి.దే ప్రచురణ - 3 వ పుట.

18. అన్నమాచార్యుల ఆధ్యాత్మకీర్తనలు మరియు
అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు - తి తి.దే. ప్రచురణ 1976, 1980

పుటలు I
19. శృంగార సంకీర్తనలు - పీఠిక - గౌరిపెద్దిరామ సుబ్బశర్మ పుట. 32
20. Minor Works of Tallapakam Poets, T.T.D. ప్రచురణ అట్ట తరువాతి పుటలు.
21 తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు
డా॥ వేటూరి ఆనందమూర్తి పుట. 124
22,23. అన్నమాచార్య జీవిత చరిత్రము - ద్విపద - చిన్నన్న - పుట. 45
24. అన్నమాచార్య జీవిత చరిత్రము - ద్విపద - చిన్నన్న పుట. 48
25. సంకీర్తన లక్షణము - చిన్నన్న - పద్య సంఖ్య 15,16,17
26. అన్నమాచార్య చరిత్రము - చిన్నన్న - (ద్విపద) పుట. 24
27 అన్నమాచార్య చరిత్ర పీఠిక - కీ. శే॥ వేటూరి ప్రభాకర శాస్త్రి
28. తాళ్ళపాక కవుల సాహిత్యము - పరిశీలన
డా॥ వేటూరి ఆనందమూర్తి పుట. 325
29 తాళ్ళపాక కవులకృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు
డా॥ వేటూరి ఆనందమూర్తి పుట 328
30. అన్నమాచార్య చరిత్ర పీఠిక - కీ శే వేటూరి ప్రభాకర శాస్త్రి పుట. 116
31 సంకీర్తన లక్షణము - చిన్నన్న - పద్య సంఖ్య 12
32. శృంగార సంకీర్తనలు - 12వ సంపుటము - గౌరిపెద్ది రామసుబ్బశర్మ పీఠిక పుట. 59
33. క్షేత్రయ్య పద సాహిత్యము - పీఠిక పుట. 14, విస్సా అప్పారావు.

48820

# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని
# శృంగార సంకీర్తనలు – మధుర భక్తి

## ద్వితీయ ప్రకరణము

## పద కవితలు – పుట్టు పూర్వోత్తరములు

## II. పద కవితలు – పుట్టు పూర్వోత్తరములు

ఏ భాష యందైనను పద్యము కన్న ముందుగ పదమే ఉద్భవించు ననియు అదియే కవిత్వమునకు మూలమనియు విమర్శకుల యభిప్రాయము. ఈ విషయమును వివరించుచు డా॥ ఎస్. గంగప్ప గారిట్లు నుడివిరి.

"ప్రపంచం లోని ఏ సాహిత్యాన్ని పరిశీలించినా పద పద్య కవితల్లో పదకవిత్వమే ముందావిర్భవించిందన్న విషయం సర్వ ప్రాచ్య పాశ్చాత్య విపశ్చిద్వర్యులూ అంగీకరించారు. ప్రాక్తన మానవుడు సుఖ దుఃఖాది అనుభూతుల్ని పొందినపుడు తదనుగుణంగా ఆడి పాడుకోవడంలోనే ఈ పద కవిత పుట్టింది" (38)

ఈ పదకవితావిర్భావాన్ని గూర్చి R.S Moulton పండితుని అభిప్రాయము ఉల్లేఖించ తగ్గది "The improvised lyrical song, communal or individual, a popular or artistic is probably the sumplest and most spontaneous form of lyric expression ..The true song is primarily. The instructive out burst of emotion or emotional thought in language which by aptness of word and rythem echoes suggests the underlying emotion and melody of tune and harmony of stanza is adopted to such modulations of the singing voice as naturally distinguish emotional utterence. ...... Thesongis therefore more than any other lyric kind, a musical cry" (39) పద కవితావిర్భావమును గూర్చి Moulton పండితుని యభిప్రాయము ఇంకను ఇట్లున్నదని డా॥ఎస్. గంగప్ప గారే ఇట్లు వ్రాసిరి.

"that the popular or the traditional bollad is FOLK POETRY, i.e., poetry that has orginated usually in oral form among a homogeneous non-literary people. and has been handed down among them by word of mouth, is generally concended" (40).

పద రచనకు గల పరిపూర్ణ స్వరూపమును గూర్చి డా॥ ఎస్. గంగప్ప గారు ఇట్లు వ్యాఖ్యానించిరి.

"మన దేశములో చాల పాత పాటలు వేద సూక్తములు. మనుష్య జాతికే అవి మొదటి రచనలు, అని యూహింప వలసి యున్నది. వాటి గానమందు తాళము లేదు అన్నది మన మిక్కడ గమనింప వలసిన తత్త్వము ......నేటికిని తెలుగులో పరమ ప్రాచీన పద్ధతి యని చెప్పదగిన పల్లెపాటలు కపిలె పాటలు మొదలగునవి కొన్ని తాళ నియమము లేకుండనే పాడబడుచున్నవి. ఈ రాగ తాళములు రెంటిని కలిపి హృదయంగమము లైన భావములను వెలవరుచు భాషను అనుకరించుటయే పద

రచనకు పరిపూర్ణ స్వరూపము..       ... ." . "మన పద్యము లన్నియు పదముల పరిణామములే అని భావించుటకు పెద్ద సూక్ష్మ దృష్టి అక్కర లేదు" అన్న రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మగారి మాటలు చక్కని నిదర్శనములు (41)

పదాలు ప్రాఙ్నన్నయ కాలము నుండియే తెనుగున కలవని తెలియుచున్నది సాధారణముగ అవి అజ్ఞాత కాల కర్తృకములు కర్తృత్వమూ, కాలమూ స్పష్టముగ తెలిసినవి తాళ్ళపాక వారి పదములే అని చెప్పవచ్చును. ఇతర జానపదముల వలెనే తాళ్ళపాక వారి రచనలలో వివిధ వస్తు విషయములు చోటు చేసికొననవి. ఈ పదములలో సంస్కృత కీర్తనలు కూడ కలవు

నన్నయకు పూర్వమే శాసనాదులలో తెనుగు భాష ఎడనెడ గోచరించినను, సీసము, మధ్యాక్కర, గీతాది దేశికవితా ఛందస్సులు అటనట పొడ సూపినను ఆదికవి యని నన్నయకు మాత్రమే ప్రఖ్యాతి లభించినట్లు, అన్నమయ్య కన్న ముందుగనే వివిధ రూపములలో పద కవితలు తెలుగునాట ప్రచారములో నుండినను ఆయనకు మాత్రమే "పద కవితా పితామహుడు" అను బిరుదము లభించినది. అన్వర్థమై నది కూడ ఆ సంకీర్తనలకు మాత్రమే మొదటి సారిగా కాలమూ కర్తృత్వమూ లోక విదితము లై నవి

గద్య పద్య కవిత్వముల కన్న ముందుగ నుద్భవించినది గేయమే. ఈ గేయము ఆడుచు పాడుకొన బడునది కావున దీలో పదవిన్యాసము, రాగము, పాట (పలుకు) అను మూడంశములున్నవి. ఈ మూడు విషయములు క్రమముగ నాట్య, సంగీత, పద్యములుగా మారినట్లు గా చెప్పవచ్చును

పద్యము లందలి భాగములకు పాదము అని పేరు. వీనినే చరణము లనియు వ్యవహరింతురు అట్లే పదము లందలి భాగములకు పాదములని కాక చరణము లనియే వ్యవహారమున్నది.

సాధారణముగ పదము మూడు భాగములుగ నుండును. అవి పల్లవి, అనుపల్లవి, చరణము అనునవి. పల్లవి ఒకటి రెండు పాదములు కలిగి యుండును. అనుపల్లవి ఒక పాదము లేదా రెండు పాదములు కలిగి యుండును

ఉదాహరణకు ఈ క్రింది కీర్తనలను పరిశీలింప వచ్చును.

1. పల్లవి: జగదానందకారక – జయజానకీ ప్రాణ నాయక ||జగ||
   అనుపల్లవి: గగనాధిప సత్కులజ రాజరాజేశ్వర
   సుగుణాకర సురసేవ్య భవ్యదాయక సదా సకల ||జగ|| (42)

* * * *

2. పల్లవి: ఎందరో మహానుభావులు – అందరికి వందనములు ।ఎందరో।
అనుపల్లవి: చందురు వర్ణుని యంద చందమును హృదయార
విందమున జూచి బ్రహ్మానంద మనుభవిచువారు ।ఎందరో।(43)

* * * *

3. పల్లవి: కనకన రుచిరా – కనక వసన నిన్ను ।కనకన।
అనుపల్లవి: దినదినమును మనమున చనువున నిన్ను ।కనకన। (44)

* * * *

4. పల్లవి: తక్కువేమి మనకు – రాముండొక్కడుండు వరకు ।తక్కు।
అనుపల్లవి: పక్కతోడుత భగవంతుడు మన
చక్రధారియై చెంతనె యుండగ ।తక్కు। (45)

* * * *

5 పల్లవి: రామా దయ జూడవె – భద్రాచల
రామా నను బ్రోవవే ।రామా।
అనుపల్లవి: రామా దయజూచి రక్షించి మము నేలు
రామా రణరంగ భీమా జగదభి ।రామా। (46)

* * * *

6. పల్లవి: మొదలుండ గొనలకు మోచి నీళ్ళు వోయనేల ।మొద।
అనుపల్లవి: ఎదలో నీవుండగా – ఇతరము లేల ।మొద। (47)

* * * *

7. పల్లవి: ఛీ ఛీ నరుల దేటి జీవనము ।ఛీ ఛీ।
అనుపల్లవి: కాచుక శ్రీహరి నీవే కరుణింతు గాక ।ఛీ ఛీ। (48)

* * * *

8. పల్లవి: ఆట వారి గూడి – తౌరా (బొమ్మలాట) ।ఆట।
అనుపల్లవి: ఆటవారి గూడి – అన్నిచోట్ల బొమ్మ
లాట లాడించగ – నధికుడు వైతివి ।ఆట। (49)

* * * *

9. పల్లవి: రూకలై మాడలై రువ్వలై తిరిగేని ।రూకలై।
అనుపల్లవి: దాకొని ఉన్నచోట తానుండ దదివో ।రూకలై। (50)

47 నుండి గల సంకీర్తనలు అన్నమాచార్యునివి ఈయన పదములలో లేక సంకీర్తనలలో అనుపల్లవి అరుదుగా గోచరించును మీరా బాయి పదములు అనుపల్లవి లేనివి

ఈ పదాన్ని గమనింతము

పల్లవి: पायो जी मै तो राम रतन धन पायो "पायो जी"

చరణం1: वस्तु अमोलक दी म्होरे सतगुरु
किरुपा करि अपनायो "पायो जी"

చరణం5: मीरा के प्रभु गिरिधर नागर
हरस हरस जस पायो "पायो जी" (51)

పైన చూపిన కీర్తనలలో చాల వరకు పల్లవి ఒక పాదముతోను, అనుపల్లవి రెండేసి పాదములతోను ఉండుట గమనార్హము ఒండు రెండు తావులందు పల్లవి రెండు పాదము లుండుటయును గాంచవచ్చును అనుపల్లవి ఒకే పాదముతో నున్నది "కనకన రుచిరా" అనే కీర్తన

చరణములు, ప్రతి పదము లేక సంకీర్తనలలో రెండు నుండి ఐదు వరకు ఉండును కాని మహాకవియై భక్తాగ్రగణ్యుడైన జయదేవకవి విరచించిన గీత గోవిందము నందలి గీతములన్నియు అష్టపదులే. అన్నమయ్య పదాలలో కొన్ని అయిదు కన్న ఎక్కువ చరణములు కలవి

పల్లవి (ధృవమ్) మాధవే, మాకురు మానిని, మానమయే

చరణం 1 హరి రభిసరతి – వహతి మధు పవనే
కిమపర మధిక సుఖం – సఖి భవనే ।మాధవే।

చరణం2 తాళఫలా దపి – గురుమతి విలసం
కిము విఫలీకురుషే – కుచ కలశం ।మాధవే।

చరణం3 కతి న కధిత మిద – మనుపద మచిరం
మా పరిహర హరి – మతిశయ రుచిరం ।మాధవే।

చరణం4 కిమితి విషీదసి – రోదసి వికలా
విహసతి యువతి సఖా – తవ సకలా ।మాధవే।

చరణం5. మృదు నలినీ దళ – శీతల శయనే
హరి మవలోకయ – సఫలయ నయనే ॥మాధవే॥

చరణం6. జనయసి మనసి – కిమితి గురు ఖేదమ్
శృణు మమ వచన – మనహిత ఖేదమ్ ॥మాధవే॥

చరణం7. హరి రుపయాతు, వదతు – బహు మధురమ్
కిమితి కరోషి హృదయ – మతి విధురమ్ ॥మాధవే॥

చరణం8 శ్రీజయదేవ భణిత – మతి లలితమ్
సుఖయతు రసిక జనం – హరి చరితమ్ ॥మాధవే॥ (52)

అయిదు కంటే అధిక చరణములు గల అన్నమయ్య కీర్తనలు కొన్ని

పల్లవి: దశవిధా చరణం తన్న భవతి
దశ విధావస్థార్థం తే తత్ర ॥దశ॥

చరణం1. స్థాపయిష్యామి వేదా నితి వ్యాజేన
దీపితోయం మత్స్యదేహః పురా
వ్యాపారోయ మేవం నచ తరుణ్యా
రూప జలధౌ కేళి రుచయే తత్ర ॥దశ॥

* * * *

చరణం11 మారయిష్యామి కలి మత మితి వ్యాజేన
క్రూర కల్క్యవ తార కోపః పురా
ధీర వేంకట నగాధీశ ఏవం నఖలు
భీరు మూర్వీం సంప్రీణయితు మాత్ర ॥దశ॥ (53

ఈ సంకీర్తన యందు 11 చరణములుండుటయే గాక ఇది సంస్కృత కీర్తనయు నయి యుండుట గమనార్హము

పల్లవి: సీతక పడును – దోసిటి పాల మగడు
బాతి పడిన నగపడు నటెవీడు ॥సీతక॥

చరణం1. మూడు గాళ్ళ పెద్ద మునలి పవులు గొన్న
పాడి మేకల వాల పాశము
వేడి జుట్టిన తల్లి వేకటియై కన్న
వాడు వీడు కిన్న వాడటే వీడు ॥సీతక॥

* * * *

చరణం7 రవ్వల సేతల రాకాశి నయని
కొవ్వున ముదము తెక్కొలుగని
యివ్వల దిరు వేంకటేశుడై యున్నాడు
గువ్వెక నిను జట్టి గొనె గదె వీడు ॥సీతకు॥ (54)

ఇది అచ్చ తెనుగున గల సప్త చరణ సహిత ఏల పదము. ఈ క్రిందిది అన్నమాచార్యుని 24 చరణములు గల ఏల పదము ఏల పదమును గూర్చి సంకీర్తన లక్షణమందు చిన తిరుమలాచార్యుడు ఇట్లు వివరించెను

"నాయకాహ్వాన పూర్వమై నయము గలిగి
మ్లేచ్ఛ పరిభాష దగి రాగ మిళితమైన
యేల పాట పదంబు నా నిల జెలంగు
మహిత నాయక సంబుద్ధి మధ్యమగుచు" (55)

అట్టి లక్షణములు గలిగిన ఈ క్రింది ఏల పాట సుప్రసిద్ధ మైనది.

విరహిణి అయిన నాయిక తపించి నాయకుని ఆహ్వానించుచున్నది.

పల్లవి: మేడలెక్కి నిన్ను జూచి – కూడేననే యాసతోడ
వాడు దేరి వుస్సురందురా – వెంకటేశ
యాడ నుంటి విందాకనురా ॥మేడలెక్కి॥

చరణం1 పిక్కటిల్లు చన్నులపై – చొక్కపు నీ వుంగరము
గక్కననే నద్దుకొందురా – వెంకటేశ
లక్కవలె ముద్రలంటెరా –– ॥మేడలెక్కి॥

* * * *

చరణం24. ముమ్మాటికి నీ బాసలే – నమ్మివున్నదాన నేను
కుమ్మరించరా నీ కరుణ – వెంకటేశ
చిమ్మచీకటెల్ల బాయను. ॥మేడలెక్కి॥ (56)

"పదమునకు రాగ తాళములు రెండును సమాన మూల ద్రవ్యములు. పాల్కురికి సోమన కాలము నాటికే ఈ పేరు స్థిరపడినది. సామాన్య గేయమును నర్థము గల పదము శృంగార రస మయమై రాగ తాళ బద్ధమైన రచనకు వాడుట సంగీత రసికుల సంప్రదాయమైనది. తుమ్మెద పదములు, ప్రభాత పదములు మొదలగునవి పదములను పేరుతో నున్నవి. మువ్వ గోపాల పదములు మున్నగునవి శృంగారాత్మకములు. తర్వాత కాలమున శృంగార రసాత్మకమైనదే పదమను పేర పిలువ బడినది". (57)

"తెలుగు పద సాహిత్యానికి క్రీ.శ 15వ శతాబ్ది వసంత కాలం .. .. ... ... పట్టుగొమ్మ తాళ్ళపాక అన్నమాచార్యుడు" (58)

తెనుగు కన్నడములలో పదమునే పాటగా వ్యవహరింతురు ఇందు చరణ మన్నది పాటలోని భాగమే

"ప్రక్రియా వైవిధ్య దృష్టితో చూచినపుడు తెనుగున ఇతిహాస పురాణ ప్రబంధాదులు, క్షేత్ర మహాత్మ్యాదులును పరాశ్రయ కవిత్వమునకు చెందినవి వీని యందు కవితా వస్తువు నూహించు నవకాశము మిగుల స్వల్పము. వర్ణనల యెడల, అలంకారముల పట్టున భావములకు తావుండు నేమో కాని వస్తువును మార్చు నవకాశ ముండదు". (59)

భావాత్మకములై, స్తుతి ప్రాధాన్యము కలిగిన స్తోత్ర, దండక, ఉదాహరణ, రగడ, శతక, సంకీర్తనాదులు ఆత్మాశ్రయ కవితా విభాగమునకు చెందినవి. వీనియందు వస్తువు కవిచే నెన్నుకొన బడును.

పదమూడవ శతాబ్ది నాటికే పదములుగా వ్యవహరింపబడిన ఈ గేయ రచనలు పదునైదవ శతాబ్దము నాటికి అనగా తాళ్ళపాక కవుల కాలమునకు సంకీర్తనలుగా పేరొందినవి వీరికి పూర్వము కృష్ణమాచార్యుడు అను భక్తుడు వచన సంకీర్తనములను రచించెను

ఇట్టి వచన సంకీర్తనములను ముందుగా శైవ మతప్రచారమునకై బసవేశ్వరుడు అక్కమహాదేవి మొదలగు వారు రచించి ప్రచార మొనర్చిరి. అవి భక్తి తత్వమునకు పెన్నిధులు. అవి వచనములే యయ్యును భక్త్యావేశమున పాడుకొనుటకు అనువైనవి ఈ వచనములను కన్నడిగులు భక్తి ప్రేరితులై విరివిగా పాడుకొని పరవశించిరి (60)

పదకొండవ శతాబ్దికి చెందిన భగవద్రమానుజాలు గద్య త్రయ మనుపేర వచన సంకీర్తనలను రచించిరి. ఇవి కడుంగడు ప్రసిద్ధమైనవి. అవి, శ్రీరంగ గద్య, శరణాగతి గద్య, వైకుంఠ గద్య అనునవి. కాని యవి సంస్కృతమున రచింపబడినవి ఇవి జన సామాన్యమునకు సులభ గ్రాహ్యములు కావు. ఆ కారణముననే నయి యుండనోపు - "వైష్ణవ మత ప్రచారార్థమై వైష్ణవ మతాచార్యులు కొందరు ఛందో రహితములు సర్వజన సులభ గ్రాహ్యములు నైన వచనముల తెలుగున గూడ వెలయించుటకు ప్రయత్నము చేసి యుందురు. అట్టి వారిలో శ్రీకృష్ణమాచార్యులొక్కరు" (61)

ఈయన పదమూడు, పదునాలుగు శతాబ్దులకు చెందిన వాడు ఈయన నాలుగు లక్షల వచనములు రచించెను.

"కృష్ణమాచార్యులు చాతుర్లక్ష వచనములు రచించెనట" (62)

ఈ వచనములకే సంకీర్తనలనియు, వచనము లనియు, తాళగంధి చూర్ణము లనియు పేర్లు కలవు. వీనికే తరువాతి కాలమున విన్నపములని పేరు వచ్చినట్లు తెలియుచున్నది.

తాళ్ళపాక అన్నమాచార్యుని పుత్రుడు పెద తిరుమలాచార్యుడు రచించిన "శ్రీ వేంకటేశ్వర వచనములకు" విన్నపములు " అనియు పేరుండుట గమనింప దగును

పదము అన్న దానికి వేర్వేరు నిఘంటువులు ఈ విధముగ నిర్వచించినవి

1. శబ్ద రత్నాకరము:-

| | |
|---|---|
| 2 లఘు శబ్దార్థ దీపిక: | పాదము, పద్యచరణము, వాక్యము, పాట, శబ్దము, వేద పద విభాగము |
| 3 సూర్యరాయాంధ్ర నిఘంటువు | పాదము, అడుగు, పద్యపాదము, లేక పద్య చరణము, వాక్యము, శబ్దము, పాట, గీతి భేదము |
| 4.A Practical Sanskrit Dictionary - By Arthur Anthony Macdonnel (Sanskrit - Telugu) | पद= Quarter<br>Quarter verse word, readng of veda in which the words are given seperately irrespective of the rules of Sandhi |
| 5. Apte Sanskrit-English Dictionary | Padam- విరచిత పదం -Aquarter line of a stanza, verse-verse -kavitha, Padyam Kavyam-Slokam<br>Charanam , Padam ఛందోబద్ధమ్, శ్లోక పద్యరచన. |
| 6. Theodoro Benfery Sanskrit - English Dictionary | पद= A verse, A kind of reading Veda without applying the rules of sandhi. |
| 7 V.S. Abtes enlarged Edition (Dictionary) | पद= A fourth Part of a Stanza. |
| 8. ఆంధ్ర వాచస్పత్యము (కొట్రు శ్యామశాస్త్రి | పదము - పద్యపాదము, చరణము (వాక్యము, పాట అని కొందరు) |
| 9. సంగీత శబ్దార్థ చంద్రిక అరిపిరాల సత్యనారాయణ మూర్తి, విజయవాడ 1954 | పదము: నాయికా నాయక లక్షణములు కలిగి శృంగార రస ప్రధానమై నట్టి సంగీత రచనలకు పదములని పేరు. |

ఇందు పల్లవి, అనుపల్లవి చరణములను విభాగములు గలిగి యుండును దీనిలోని సంగీతము యొక్క నడక నెమ్మదిగను, ఆకర్షణీయముగను ఉండును సాహిత్యము, పాండితీ ప్రతిభ గలిగి గంభీరమైన వేదాంతార్థము యిమిడి వుండును. పదములు రచించిన వారిలో ప్రముఖుడు క్షేత్రయ్య

క్రియా, కారక క్రియలచే ధైర్యశౌర్యాదులను జెప్పబడు నట్టి ప్రబంధములోని ఆరు అంగములలో మూడవ దానికి గల పేరు

# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలు - మధుర భక్తి

## తృతీయ ప్రకరణము

## రసవిచారము - రస సంఖ్య

## రస విభాగము - రస సంఖ్య

రసమును గూర్చి మొదట చెప్పినవాడు భరతుడు. బ్రహ్మ దేవుడు చతుర్వేదముల నుండి వివిధ వస్తువులను చేర్చి నాట్యమును సృష్టించెనని భరతుడు చెప్పెను

జగ్రాహ పాఠ్యం ఋగ్వేదా త్సామభ్యోగీత మేవచ ।

యజుర్వేదా దభినయాన్ రసా నాదర్వణాదపి ॥ (1)

అనగా ఋగ్వేదము నుండి పాఠ్యమును, సామవేదము నుండి గీతములను, యజుర్వేదము నుండి అభినయమును, అథర్వణ వేదము నుండి రసములను గ్రహించి నట్లు తెలియచున్నది.

సహృదయుల హృదయమున నున్న స్థాయియే రసము ఈ విషయమే దశరూపకమున నిట్లు చెప్పబడినది

''విభావై రనుభావైశ్చ సాత్వికై ర్వ్యభిచారిభిః

ఆనీయ మానః స్వాదుత్వం స్థాయీ భావేరసః స్మృతః ॥ (2)

విబావానుభావ వ్యభిచారి భావములచే నాస్వాద్యమాన మగు స్థాయీ బావము రసము అని దీని భావము

''విబావాను భావ వ్యభిచారి సంయోగా ద్రస నిష్పత్తిః (3)

అని బరతుడు నిర్వచించినాడు.

స్థాయి యనగా స్థిరముగ నిల్చునది ఎన్ని యాఘాతములు వచ్చినను. చలింపక స్థిరముగ నుండు భావము స్థాయీ బావము.

సముద్రమున మధుర జలములు గల నదులెన్నిగలిసినను సముద్రమందలి క్షార గుణము ఇసుమంత యైనను తగ్గదు అట్లే తనలో నెన్ని సంచారి భావములు కలిసినను వానిని మించనీయక తానే స్థిరముగ నిల్చు భావమే స్థాయీ బావము

గరిమ నదులెన్ని గలసిన గప్పుకొనుచు
జలధి గనుపట్టు రీతి, సంచారి భావ
సంచయములెన్ని గలసిన మించనీక,

తాన కనుపట్టు బావంబు స్థాయి దలప. (4)

మనో వికారమే బావము '' వికారో మానసొ బావః''

''నిర్వికారాత్మకే చిత్తే భావః ప్రదమ విక్రియాః''.

ఎట్టి వికారములు లేని చిత్తమున మొదటి వికారము భావము అనబడును.

''భావయతి జ్ఞాపయతి హృదయ గతిమితి బావః'' (5)

''హృదయ గతమును తెలుపునది భావము'' అని వ్యుత్పత్తి (6)

కనుక స్థాయీ భావమనగా చిరస్థాయిగా (రసస్ఫూర్తి కలుగు వరకు)

సహృదయుల హృదయములనుండు బావము

అందువలన నిట్టి స్థాయీ భావమునే రసమని చెప్పవచ్చును

జగత్తునకు ప్రదాన సారభూత మేది కలదో దేనిని యోగులు రుచ్య మానములుగ తలతురో దేనిని సాక్షాత్కరించుకొని శాశ్వతానందమనుబవింతురో ఆ పరమాత్మయే రసపదమున కర్థము ఆలంకారికు లిట్టి యుభయార్థము గల రసపదమును గ్రహించి దీనిని కావ్యమున వ్యవహరించిరి కావుననే కావ్యానందము బ్రహ్మానంద సహోదరమని నుడివిరి.

ఇట్టి రసమును కావ్యము నందలి నాయకాదుల వర్ణనచే వారి రూపమును ఊహించుకొనియో, దృశ్యకావ్యమైనచో నాయకానురూపులగు నటులను ప్రత్యక్షముగ గాంచియో వారితో తాదాత్మ్యము నందియో వారనుభవించు నట్టి ఆయా రసములను సామాజికుడు లేక ప్రేక్షకుడు ఆస్వాదించును ఒకరకముగ తానే నాయకుడై ఆ రసమునందలి చమత్కారమును తానేపొంది యానందించును.

ఇట్టి రసము పలు విదములని ఆలంకారికులు నుడివిరి. వారి దృష్టిలో రసములు తొమ్మిది. కాని భరతుడు ఎనిమిది రసములనే పేర్కొనెను. ఈవిషయమున లాక్షణికులు అనేకులు అనేక విదముల అభిప్రాయములను వెలిబుచ్చిరి. వీరిలో మూలపురుషుడన దగిన భరతుడు.

శృంగార హాస్యకరుణాః రౌద్ర వీరభయానకాః
భీబత్సా ద్భుత సంజ్ఞౌచే త్యష్టౌ నాట్యేరసాః స్మృతాః
ఏతేహ్యష్టౌ రసాః ప్రోక్తా ద్రుహిణేన మహాత్మనః (7)

వీనికి స్థాయీ బావము లివి

రతిర్హాసశ్చశోకశ్చ క్రోదోత్సాహౌ భయం తదా

జుగుప్సా విస్మయశ్చేతి స్థాయీ బావాః ప్రకీర్తితాః ॥ (8)

చాలా కాలము వరకు పండితులు రసములు ఎనిమిది అనియే భావించుచు వచ్చిరి శాకుంతలాది మహాకావ్యకర్తయైన కాళిదాసు ''విక్రమోర్వశీయము''న నిట్లనెను.

''మునినా భారతేన యః ప్రయోగో ॥

భవతీత్వష్టరసాశ్రయోనియుక్తః'' (9)

వరరుచి యను నాతడును ''ఉభయాభిసారికా'' గ్రంధమున ''షట్స్థానాని గతిద్వయమ్ అష్టౌ రసాః'' అని అష్ట రసములనే చెప్పెను దండియు ఎనిమిది రసములనే పేర్కొనెను ఈవిషయమును గూర్చి డా॥ రాఘవన్ గారు ఇట్లు వ్రాసిరి

"On the side of theorists, the writers on Poetics, Rasas were only eight upto the time of DANDI who briefly described and illustrates only the eight Rasas" (10)

భరతుడు శాంతమును రసముగా అంగీకరింప లేదు. అసలు శాంతమును గూర్చి ప్రస్తావించనే లేదు

కాని తర్వాతి వారు శాంతమును గూడ చేర్చి రసములు తొమ్మిది యనిరి. ముమ్మటుడు, ఆనంద వర్ధనుడు, అభినవ గుప్తుడు మొదలగు వారు ఈ వాదమును ప్రతిపాదించిరి పూర్వీకులలో శాంతముతో కలిసి రసములు తొమ్మిదియని ఒప్పుకొన్నవాడు వాసుకి యను నాతడు.

రజస్తమో విహీనాత్తు సత్యవతాత్ సచిత్తతః

మనాగ స్పృష్ట బాహ్యార్థాత్ శాంతోరస ఇతీ రితః। (11)

ఇట్లే కోహలుడును అభిప్రాయడెనట ప్రసిద్ధిగాంచిన అలంకారికులలో నవరసములను ప్రతిపాదించినవాడు ఉద్భటుడు నాట్యశాస్త్ర వ్యాఖ్యాతలలో ప్ర~ ~ుడీతడు నాట్య శాస్త్రము నందే నవరస నిర్దేశక ప్రాయమైన పాఠమున్నదని చెప్పెను

''భీభత్సాద్భుత శాంతాశ్చనవ నాట్యే రసాః స్మృతాః'' (12)

కాని ఈపారమును ఉద్భటుడే మార్చియుండ వచ్చునని కొందరి యభిప్రాయము ఆనంద వర్ధనుడు, భట్టలొలుడు ఈ కొవకు చెందినవారే

అభినవ గుప్తాచార్యుడు నవరస వాదులలో ప్రముఖుడని చెప్పవచ్చును విద్యానాథ, జగన్నాథులును వారి ననుసరించినవారే

ఇది యిట్లుండ రుద్రటుడు రసములలో ప్రేయస్సు అను దానిని జేర్చి దశ రసములను నుడివెను దానికి స్నేహమును స్థాయీ బావముగ పేర్కొనెను.

స్నేహ ప్రకృతిః ప్రేయాన్ సంగత శీలార్ధనాయకో భవతి

స్నేహస్తు సాహచర్యాత్ ప్రకృతే రుపచార సంబంధాత్ (13)

అటు పిమ్మట ''భక్తి, వాత్సల్యము, ప్రీతి, స్నేహము, శ్రద్ధ, మృగయ మొదలగున వెన్నియో ఇతర రసములు క్రమముగ బయలు దేరినవి'' (14)

చివరకు వ్యబిచారీ బావములలో ఒక్కొక్కటియు రసములుగా వ్యవహరింపబడు నట్టిస్థితికివచ్చెను ఈసందర్భమున ''అనంతావైరసః'' అన్నట్లైనదని శ్రీమాన్ చలమంచర్లరంగా చార్యులుగారు నుడివిరి (15)

నాట్యమున రసము లెనిమిది యనియేగదా భరతుని యభిప్రాయము దానికి ఆలంకారికులు కారణము నిట్లు చెప్పిరి నాట్యము లేకనాటకమున నటుడు అభినయించుటకు వీలులేనిది శాంతము శాంత రసము శమసాధ్యమగుట వలన అది నటుని యందు సంభవింపదు అని కొందరి యబిప్రాయము.

కాని అభినవ గుప్తుడు ''రసము రస నిష్టము కాదు. అది సామాజిక నిష్టము కనుక శాంతము గూడ రసముగ నుండ వచ్చును'' అని వివరించెను

దానికి సరిపోవు నట్లుగ సంగీత రత్నాకరమున నిట్లు చెప్పబడినది

అష్టావేవ రసానాట్యే ఇతికేచి దయాచుదన్

తదచారు యత కించి న్నరసం స్వదతే నట (17)

నాట్యమున ఎనిమిది రసములే యుండునని కొందరనిరి ఎందుకనగా రసము నటనిష్టము కాదు. నటుడు రసాస్వాదకుడు కాదు.

బౌద్ధ జైన కవులు ఐదవ శతాబ్దముననే శాంతమును అంగిరసముగ అంగీకరించిరి. కొందరు శాంతమును దయా వీరముగ అంతర్భవింప జేసిరి.

కాని భరతుడు శాంతమును రసముగ నిర్దేశింప లేదు కావున అది రసము కాదని కొందరి మతము కావ్య మందైనను అధికారిక రసముగా కాక ప్రాసంగిక రసముగా మాత్రమే

గ్రాహ్యమని కొందరు. తుదకి కావ్యమునను నాటకమునను గూడ అంగిరసరముగా గ్రాహ్యమేనని అభినవ గుప్తాదులు సిద్ధాంతీకరించిరి

ఇట్టి శాంత రసమునకు శమము స్థాయీ భావము ఈ రెండును పర్యాయ పదములై యగుట జేసి ఇది చెల్ల నేరదని కొందరనిరి రుద్రటుడు సమ్యా జ్ఞానమే స్థాయీ భావ మనెను కాని ఇదియును పర్యాయ పదమే

ఆనంద వర్ధనుడు తృష్ణాక్షయ సుఖమే స్థాయీ బావమనెను

హేమ చంద్రుడును ఈ భావమునే ప్రకటించెను భోజుడు "ధృతి" శాంతమునకు స్థాయీ భావమనును కొదరు నిర్వేదము స్థాయీ భావ మనిరి కాని తత్త్వ జ్ఞానము వలన కలిగిన నిర్వేదమే శాంతమునకు స్థాయి అసలు శాంతమే ప్రదాన రసమని ఆనంద వర్ధన అభినవ గుప్తుల సిద్ధాంతమయినట్లు కొందఱి వ్రాతల వలన తెలియుచున్నది అభినవ గుప్తుని గురువగు బట్టతాతుడు ఇదే అభిప్రాయమును దెలిపినట్లు కాణే పండితుడు తన INTRODUCTION TO SAHITYA DARPANA లో వ్రాసినాడు

We know that Bhattatouta was the Guru of Abhinava Gupta and that he wrote a work called "KAVYAKOUTHUKA" on which Abhinava Gupta wrote a vivarana One of his doctrines was that SANTA was at the Head of all rasas as it led on Moksha

ఇది యిట్లుండ రుద్రటుడు దశమ రసము నొక దానిని ప్రతి పాదించెను. అదియే ప్రేయో రసము. స్నేహ ప్రకృతి ప్రేయాన్ అను దానికి స్నేహము స్థాయీ భావముగా పేర్కొనెను మరియు "అన్యోన్యం ప్రతి సహృద్యా ర్వ్యవహారోయం మతస్త్ర" అనియు చెప్పెను

భరతుడు ఆయా రసముల నెట్లు ఉచ్చరింప వలయునో చెప్పుచు వాత్సల్యమును పేర్కొనెను. దీనిని చూచి సాహిత్య దర్పణ కారుడు "అథమునీంద్ర సమ్మత వత్సలో రస" అని ఆరంభించి దానికి స్థాయీ భావముగ వాత్సల్యమును జెప్పెను పుత్ర భ్రాతాదులు ఆలంబనములు వారి చేష్టలు, ప్రవర్తన ఉద్దీపనములు. ఆలింగనాదులు అను భావములు హర్షాదులు వ్యభిచారి భావములు.

ఈ ప్రేయ వాత్సల్య రసములు లైంగికములు కావు అని పై వివరణము వలన తెలియు చున్నది. దీనినే ప్రొఫెసర్ వి. రాఘవన్ గారు ఇట్లు చెప్పిరి

"close on the foot steps of Santa an aspect of love called preya or Vatsalya covering cases of non-sexual love like that between Parents and Children, Elders and Youngsters became a Rasa

The olden preya of BHAMAH and DANDIN as speech expressive of Non-Sexual love developed into new Rasa.

DANDIN says that this preya is very closely related to Srinagara but is distinct Since Prithi is the basis of the former whereas Rathi is the Sthayi of Sringara (18)

ఇవియే కాక ఇంకను ఇతర రసములు మరి కొన్ని చెప్పబడినవి అవి లౌల్య, మృగయ, అక్ష రసములు. లౌల్యము హాస, రతి మొదలైన వానియం దంతర్భవించునని అభినవ గుప్తుడు పేర్కొనెను

ధనంజయుడు ప్రీతి, భక్తి అను మరి రెంటిని ప్రతి పాదించెను వానికి తోడుగా పైన పెర్కొనిన మృగయ, అక్ష రసములను దనంజయుడు చెప్పెను. సుఖ, దు ఖ, వ్యసన, ఉదాత్త, ఉద్ధత మొదలైన వెన్నియో కాలాంతరమున చేరినివి ఈ సంఖ్య దాదాపు పదమూడుకు చేరు కొనినది

భవభూతి "కరుణ రసమే అన్ని రసములకు ప్రకృతి" యని చెప్పెను

" ఏకో రస కరుణ ఏవ నిమిత్త బేదా

ద్భిన్న పృధక్పృధ గివాశ్రయతే వివర్తాన్

వర్త బుద్బుద తరంగ మయాన్ వికారాన్

నంబోయదా సలిల మేవహితత్సమస్తమ్" (19)

అనగా కరుణ రసము మాత్రమే నిమిత్త భేదముచే శృంగారాది రసరూపములను బొదించున్నదని యాతని భావము.

మొత్తము పై లోకమున నిప్పుడు నవరసము లనియే రస సంఖ్య నిర్ధారింప బడి యున్నది

## భక్తి రసము - సంక్షిప్త చర్చ

భక్తిని రసముగా అంగీకరించి అదియే నిజమైన రస మనియు ఇతరములు రసములు

కానేరవనియు వాదించి నిరూపించిన వారును కలరు.

అసలు భక్తి రసమగునా లేదా అని చర్చించిన వారిలో ప్రథముడు ధనంజయుడు. ఇతడు దశరూపకమున భక్తి కేవలము భావమే కాని రసము కాదని వివరించెను. భక్తి, ప్రీతి మొదలైనవి బావములే యనియు, అవి హర్షోత్సాహాదులలోనే అంతర్భవించుననియు, అందువలన వానిని ప్రత్యేక రసములుగ పేర్కొన లేదనియు నొక్కి చెప్పెను.

అభినవ గుప్తుడును, మమ్మటుడును, హేమ చంద్రుడును భక్తి రసము గాదని త్రోసి పుచ్చిరి.

మమ్మటుడు కావ్య ప్రకాశమున "రతిర్దేవాదివిషయావ్యభిచారీ తధాంజిత. భావప్రోక్త:"

అని దేవాది విషయక రతి భావమే కాని రసమే కాదని నిరాకరించెను

" ఉజ్వల నీలమణి" కర్త యగు రూపగోస్వామి యను నాతడు భక్తిని రసముగ పేర్కొనిన వారిలో ప్రథముడు. ఇతడు భరతుడు చెప్పిన అష్ట రసములతో పాటు శాంత, వాత్సల్య, ప్రేమ, భక్తి యను వానిని అంగీకరించెను.

ప్రేమను గూర్చి బాగుగ వివరించిన వాడీతడే ప్రేమను అంగీరసముగను, శృంగార మును అంగరసముగను పేర్కొనిన వాడును ఈతడే. చిత్త ద్రవమును స్థాయి భావముగనీతడే వచించెను. భక్తిని రసముగా నంగీకరించుటయే గాక నిరూపించుటకు పూనుకొని కృతకృత్యు డైనవాడు మధు సూదన సరస్వతి యను కవి వరేణ్యుడు జన్మత. అద్వైతియైనను కృష్ణ భక్తిని సమర్ధించినవాడు ఈ విషయ మీ క్రింది శ్లోకమును గమనించిన తెలియును.

"ధ్యా నాభ్యాస వశీకృతేన మనసా యన్నిర్గుణం నిష్క్రియం
జ్యోతి: కించన యోగినోయది సరం పశ్యంతి పశ్యంతుతే
అస్మాకం తు తదేవలోచన చమత్కారాయ భూయాచ్చిరం
కాలిందీ పులి నేషు సున్దర మహో నీలం మహోధావతి" (20)

మధుసూదన సరస్వతి భక్తిని రసముగ ప్రతిపాదించి నిరూపించిన గ్రంధము "భగవద్భక్తి రసాయనము" అను గ్రంధము.

"నవరసమిళితం వా కేవలం వాపుమర్థమ్
పరమ మిహై మకున్దే భక్తి యోగం వదన్తి" (21)

అని ఆ గ్రంధ ప్రారంభమున మధుసూదన సరస్వతి చెప్పెను ముకుందుని విషయ మైనట్టి నవరస మిళితమైనది గాని కేవలమైనదిగాని యగు పురుష్ఠామునే భక్తి యోగముగా చెప్పుచున్నాను అని శ్లోకార్థము.

''ఇతడు భక్తిని జ్ఞానము నందు అంతర్భవింప చేయుట తగదని చెప్పినాడు. మానవ హృదయములలో నుండు భేదములచే కొందరు జ్ఞానమును, కొందరు భక్తిని ఆశ్రయింతురు. స్థిర చిత్తమున నిర్వేద సాధన మొనర్చిన వారు జ్ఞాన మార్గమును అవలంభింతురు. ద్రుత చిత్తు లైనవారు భగవత్కథాశ్రవణము, భాగవత ధర్మ శ్రద్ధ కలిగి బక్తి నాశ్రయింతురనియు వచించినాడు'' (22) అని తిప్పాభట్ల రామ కృష్ణ మూర్తి గారు వ్రాసినారు

భక్తిని మధుసూదన సరస్వతి ఇట్లు నిర్వచించినాడు

''ధృతస్య భగవద్ధర్మోద్ధారా వాహిక తాంగతా
సర్వేశో మనసోవృత్తిర్భక్తి రిత్యభిధీయతే'' (23)

భగవద్గుణము వలన ద్రవించిన మనసు యొక్క ధారావాహిక మగు (తైలధారవలె) మనోవృత్తి (స్మృతి) భక్తి యనబడును.

మనసు లక్క వంటిది అది విషయ తాపము వలన మెత్తబడును కామ క్రోధాది గుణములు చిత్తమను లక్కను ద్రవింపజేయు తాపకములు. అగ్ని శమించినచో లక్క తిరిగి కారిన్య మందును పై గుణములు శమించినపుడు మనసు యదాస్థితిని పొందును

''చిత్త ద్రవ్యం హి జతువత్ స్వభావాత్ కఠినాత్మకమ్
తాపకైః విషయై ర్యోగే ద్రవత్వం ప్రతి పద్యతే'' (24)

ఒకసారి ముద్ర వేసికొనిన విషయము యొక్క రూపము, మనసు కఠినత్వము పొంది తిరిగి భ్రమించినను పూర్వ ముద్రిత రూపమును విడువదు ఈ వస్త్వాకారమే స్థాయీ భావము అనబుడునని మధుసూదన సరస్వతి యొక్క సిద్ధాంతము.

''స్థాయీ భావ గిరాZతోZసౌ వస్త్వా కారో భిధీయతే
వ్యక్తశ్చర రసతామేతి పరానన్ద తయా పునః!! (25)

భగవానుడు (శ్రీహరి) స్వయముగా పరమానంద స్వరూపుడు తదాకారము మనో గతమై పుష్కల రస రూపమును పొందుచున్నది.

''భగవాన్ పరమానంద స్వరూప స్వయ మేవహి
మనోగత స్తదాకారో రసతా మేతి పుష్కలమ్'' (26)

కాంతాదివిషయము లందును సుఖము (నిరతిశయానందము) కలుగుటకు కారణము లున్నవి కాని అవి మాయా కల్పిత ఆనంద హేతువులు

''కాంతాది విషయే ష్వస్తి కారణమ్ చిద్ఘనమ్
కార్యాకారతయా భావే ప్యావృత మాయయా స్వత ॥

కనుక ఇట్టి భక్తికి భగవంతుడు అలంబనము. తులసీ చందనాదులు ఉద్దీపన విభావములు. నేత్ర విక్రియాదులు అనుభావములు. నిర్వేదాదులు వ్యభిచారులు దీనికి భగవదాకారత స్థాయిభావము ఇట్టి చిత్త వృత్తి ఇట్టిది యని చెప్పరాని ఆనంద రూపమైన రసమును పొందును ఇప్పట్టున ఒక సందేహము కలుగక మానదు పరమానంద స్వరూపుడు భగవంతుడు అతడే ఆలంబనము, స్థాయిభావమును అయన సరమానంద స్వరూప పూర్ణమైన చిత్తమే. ఇది ఎట్లు కుదురును? అనునది ప్రశ్న. కాని దానిని మధుసూదనుడే ఇట్లు వివరించెను.

''నాస్యాలంబన విభావ స్థాయి భావయోరైక్యం బింబ
ప్రతిబింబ భావత్వేన భేదస్య వ్యవహార సిద్ధత్వాత్
ఈశ జీవయోరివ''. (28)

ఆలంబనమైన పరమానంద స్వరూపుడు స్వతంత్రుడు. ఒక విధముగ నతనిని బింబముగ పరిగణింప వలెను మనసు నందలి స్థాయీభావము అతని ప్రతిబింబమే. కనుక ఆలంబనమునకు స్థాయీ భావమునకు ఏకత్వము అపాదింపరాదు. జీవేశ్వరుల బింబ ప్రతిబింబ భావము ప్రసిద్ధమైనదిగా గ్రహింపవలెను.

ఇతర భావములకు వలె భగవద్విషయిక మనోవృత్తి అస్థిరము కాదు. అది సుస్థిరమైనది. అందుచే భక్తి స్థాయి భావము నందుట ఉపపన్న తరము.

ఎవని చిత్తము ద్రవించి దానియందు భగవదాకారత్వము ప్రవేశించునో అతడు తదాకార భావము వలన ఎప్పటికిని కృతకృత్యుడగును. అట్టి పవిత్రమైన పరమానంద స్వరూపుని ఆకారము మనో వీధిని ప్రకాశించు చుండుటచే, ఇతర భూతములను లేక ఇతర విషయములను గ్రహించినపుడు కూడ మనో వికారము కలుగక సర్వ భూతముల యందును భగవంతుడే గోచరించును. అట్టి సర్వవ్యాపకత్వ భావము వలన అతడు భాగవతోత్తముడు

అనబడును

''సర్వభూతేషుయ పశ్యేద్భగవద్భావ మాత్మనా
భూతాని భగవదాత్మా త్యన్యేష భాగవతోత్తమ '' (29)

భగవదాకార రూపస్థాయి భావము వ్యంజకమనుట చేత రసరూపమును పొందును సాక్షాత్కృత భగవదాకారమే రసము అది పరమానంద స్వరూపము. ఇతర దేవతా విషయమున సమస్థాయిత్వము లేకపోవచ్చును పరమానంద రూపుడైన కృష్ణ సంబంధ భక్తిస్థాయిత్వముననే రస భావము కూడ సంభవించును

లోగడ నుడివినట్లు ద్రవ రూపమైన లక్కయందు కలిపిన రంగు కఠిన రూపము నందినప్పుడును ఎట్లు స్థిరముగ నిలచి యుండునో ద్రవించిన చిత్తము నందు ముద్రింప బడిన భగవదాకారత విషయాంతర గ్రహణము చేత లుప్తము కానేరదు. కామ క్రోధాదులు అట్లు కాదు. అనేక విషయ గ్రహణము వలన వాని స్థాయి భావము మారు చుండును. కాని బగవద్భక్తి విషయమున ఇట్టి మార్పు లుండవు. మనోవృత్తికి ఆనంద గోచర మగుటచే రసత్వము చెప్పవచ్చును.

''కాంతాది విషయ రత్యాదులకు గూడ రసత్వము గౌణముగా సమర్థించి, భగవద్భక్తిని బట్టి చూడ లౌకిక రసములకు పరమానంద రూపత్వము లేనందున న్యూనత్వము కూడ మదుసూదన సరస్వతిచే చూపబడినది. కాంతాది విషయకరతి స్వాతి శయమైనది స్వల్పకాలికమును, వినాశియునైనది.

దేవాది విషయకరతి అట్టిదికాదు అది నిరతిశయమైనది. అనంతమైనది. అవినాశియు నైనట్టిది కనుకనే అది రసమైనది''. (30)

భగవద్విషయిక రతి వలన ఆనందము ననుభవించు భక్తుడు దానిని విస్మరించుట గాని, కోల్పోవుట గాని జరుగదు. అది నిరతిశయానందము అదియే స్థాయిభావము, స్థాయి యనగా ''స్థిరత్వము కలది'' అని కదా యర్థము

లౌకిక నాయికా, నాయక శృంగార విషయమునను ఆనందమే పమమావధియైనను తృప్తితో ఆ యానందము అంతరించును

దేవాది విషయక రతి విషయమున అట్లు కాదు. స్థాయి భావము అనంతమైనది. ఎంత ఆనంద మనుభవించినను తృప్తి తీరదు. అది మానసిక మైనది. భౌతిక ఇంద్రియ సంబంధి కాదు అది విస్మరింప బడుట కాని, అంతరించుట కాని జరుగదు.

''రతిర్దేవాది విషయే---'' అను ఆలంకారిక మతమును ఖండించినాడు. దేవాది

విషయ మనగా ఇతర దేవతలైన ఇంద్రాదులకు సంబంధించినదే కాని పరమానంద స్వరూపుడగు భగవంతునకు సంబంధించినది కాదు. ఇంద్రాది దేవతా విషయికమైనది భావమే కావచ్చును. కాని పరమానంద స్వరూపుడైన బగవంతునికి సంబందించినది కేవలము భావన కాదు అది నిజమైన రసము భక్తి రసము సుఖ దు:ఖాదులచే చలింపనిది

జ్ఞానము స్వయం ప్రకాశకము ఆనందకరము అయినను రజస్తమో గుణముల ప్రతి బంధకము చేత సుఖ వ్యక్తి పదాస్పదము కాదు.

చేదిదేశాధీశునకు రజోగుణము గల సత్త్వాంశ వలన ఈర్ష్యచే కలిగిన ద్వేష మిశ్రితమైన మనోవృత్తి వలన పరానంద రూపుడైన శ్రీకృష్ణుని విషయము సుఖము కలిగించ లేదు కంసునకు తమోగుణాధికమైన సత్త్వాంశ వలన భయముతోడి ద్వేష మిశ్రిత మనోవృత్తి కృష్ణ విషయమున సుఖము కలిగించ లేదు.

అట్టి వారికి భావి జన్మలలో రజస్తమో గుణములనెడి ప్రతి బాదకములు తొలి చిత్త ద్రుతి కలిగి భక్తి రస స్వరూపమును పొందినది

''తయోర్భావి శరీరేతు ప్రతి బంధక్షయేసతి
సైవ చిత్త ద్రుతిర్భక్తి రసతాం ప్రతిపద్యతే'' (31)

చిత్తద్రుతి కలిగినప్పుడే భక్తి కలుగును. అది లేనందున వేనుడను వానికి మోక్షము లేదు

ద్రుతౌ సత్వాంభవేద్భక్తి రద్రుతౌమనః కించన
చిత్త ద్రుతే రభావేన వేనస్తు కతమో అపిన (32)

రజస్తమో విహితమైన భగవద్విషయకమైన జ్ఞానము రతియన బడును

బగవద్రతి నానా రస సమ్మేళనము. వర్ణ సమ్మేళనముచే చిత్త మెట్లు మనోల్లాసకర మగునో భగవద్రతియు నట్లే.

ఇతర రసముల విభావాదులు లేకుండ కేవల శుద్ధభక్తి యైనచో అది భక్తిరస మనబడును.

ఇట్టి భగవద్రతి క్షుద్ర రసముల కన్న పరిపూర్ణమును పరిపుష్టమును ఐనది. మిణుగురుల కన్న సూర్యతేజము మిన్నకదా.

పరిపూర్ణ రసాక్షుద్ర రసేభ్యో భగవద్రతాః
ఖద్యోతే భ్య ఇవా దిత్య ప్రభవే బలవత్తరా (33)

అని చెప్పుచు ద్వితీయెల్లా సొంతమున మధుసూదనుడిట్లు చెప్పెను

" ఇహోను భవ సిద్ధోపి సహస్రగుణితో రసః
జడేనేవ త్వయా కస్మా దకస్మాదపలప్యతే

అనగా మామూలు రసముల కన్న వెయ్యిరెట్లు అధిక గుణములు గల భక్తి రసమును అంగీకరింపక పోవుట మూర్ఖుడు చేయు పని అని దీని భావము.

"రసోవైసః" అని చెప్పుటచే భక్తియందుండునది సుఖము మాత్రమే అని చెప్పవలెను దానిని మించిన దేదియు భక్తి యందుండదు.

అంతియే కాక

"దేవాంతరేషు జీవత్వాత్ పరానంద ప్రకాశనాత్
తద్వేజ్యం పరమానంద రూపేన పరమాత్మని" (34)

ఇతర దేవతల విషయమున నీ భక్తి పరానంద ప్రకాశకము కాదు. కనుక నది రసము కాపోవచ్చును. దేవతలు కూడ జీవులే కదా.

అట్లే కాన్తాది విషయములో రసత్వము పోషింపబడదు. సంపూర్ణ సుఖమునకు అచట తావు లేదు.

కాన్తాది విషయా వాయే రత్యాద్యాస్తత్ర నేదృశమ్
రసత్వం పుష్యతే పూర్ణ సుఖాస్పర్శిత్వ కారణాత్"

ఇట్లు మధుసూదనసరస్వతి భక్తిని రసముగా నిరూపించుచు తద్భిన్నమైన దేదియు రసము కానేరదని ఖండితముగా నుడివినాడు.

భక్తిరసమును గూర్చి డా సంగమేశంగారు ఇట్లనిరి

यद्यपि प्रसिद्द शृन्गार आदि नौ में भक्ति को नहीं मिलाहै । तथापि कई प्राचीन आलकारिको के मत में भक्तिभाव भी अनुकूल विभाव ही के साहचर्य से रस रूप मे परिणत होने मे समर्थ है। शन्डिल्य ने सानु रूप से कहा है कि भक्ति ब्रह्म संस्थान है । छान्दोग्य के अनुसार जो ब्रह्म संस्था है वह अमृतत्व को प्राप्त करता है। शान्डिल्य ने यह भी कहा है कि रस शब्द से प्रतिपाद्य होने के कारण से भक्ति राग-रूप है। "रसो वै स:" रस ह्ये वायं लब्ध्वा नन्दी भवति इत्यादि शृति वाक्यो से ब्रह्म जो रस-रूप प्रमाणित होता है, उन्ही के आधार पर अनृत रूपा,

फलरूपा अथवा सिद्धिरूपा भक्ति को भी रस माना जा सकता है। तभी नारद ने इसे प्रमाण निरपेक्ष एवं परम शान्ति और परमानन्द रस कहा है। (सूरदास और अन्नमाचार्य - पु. ४६)

"యో వేదానపి సంనస్యతి, కేవల మవిచ్ఛిన్నాను రాగం లభతే" (35)

"శాంతి రూపాత్ పరమానంద రూపాచ్ఛ" (36)

దీనిని బట్టి చూడగా శాండిల్యాదులు భక్తిని రసముగ పరిగణించినట్లు గ్రహింప వచ్చును.

రసమే జీవనము. అలౌకిక సంబంధము కలిగినప్పుడు అనగా భక్తితో కూడినపుడు, దివ్య శృంగారముగా మారినపుడు భక్తి రసమనబడును. అట్టి దివ్య రసానుభూతి పొందుట ప్రతి జీవికి తన జన్మహక్కై యున్నది. ఈ విషయమున ప్రొఫెసర్ భగవత్ కుమార శాస్త్రి గారి యభిప్రాయ మిట్లున్నది.

"Rasa is the fundamental joy of life, love of life
------------The mortal aspects of Rasa are turned
into immortal ones when diverted towards HIM
or comprehended in His LILA" (37)

మొత్తము పై విచారించి చూడగా భక్తి యనునది రసమే కాని కేవల భావము కాదనియు, రసమున కుండ వలసిన విభావాది భావములు, అలంబన మొదలైన వన్నియును భగవంతుడే యనియు దీనికి గల స్థాయి భావము సుస్థిరమైనదనియు, ఇతర రసముల వలె చంచలమైన తాత్కాలికమైన, నశించునదైన స్థాయి భావము వంటిది భక్తి రసమున లేదనియు సుస్పష్ట మగుచున్నది భక్తి రసము నందలి సుఖానుభూతి వంటిది ఇతర రసములందు మృగ్యము మనోగతమైన అనంత సుఖానుభూతి భక్తి రసము వలన గలుగును భక్తునకు కావలసినది అట్టి సుఖమే. ఎవనియందలి అనురక్తి వలన, ఆత్మకు తైలధార వలె అవిచ్ఛిన్నమైన పరమానందానుభూతి కొనసాగునో అదియే భక్తి రసముగ నెంచవలెను.

అట్లు దివ్య రసానుభూతిని కలిగించుచు, నిరంతర సుఖాను భూతిని ప్రసాదించు హరి ముకుందుని యందలి భక్తిని రసమనుటకు ఎట్టి విప్రతిపత్తియు కలుగరాదు.

# సంఖ్యాసూచి

1. నాట్యశాస్త్రము - భరతుడు (1-17)

2 కావ్యాలంకార సంగ్రహ వివరణ - సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి పుట - 279

3 కావ్యాలంకార సంగ్రహవివరణ - సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి పుట - 279

4 5 కావ్యాలంకార సంగ్రహ వివరణ - సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి పుట - 279

6 కావ్యాలంకార సంగ్రహ వివరణ - సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి పుట-281

7 నాట్యశాస్త్రము భరతుడు (16-1)

8 నాట్య శాస్త్రము భరతుడు (18)

9. విక్రమోర్వశీయమ్ - కాళిదాసు - 18

10 Number of Rasas - Dr Raghavan

11 ఆంధ్రప్రతాపరుద్ర యశోభూషణము పుట 289

చలమచర్ల రంగాచార్య

12 రససిద్ధాంతము - ఆంధ్రుల వరివస్య పుట 152

13 కావ్యాలంకారము - (15-17)

14.15 ఆంధ్ర ప్రతాపరుద్రయశోభూషణము - వ్యాఖ్యానము - పుట 290

16 కావ్యాలంకార సంగ్రహము - తృతీయా శ్వాసము

17 కావ్యాలంకార సంగ్రహము - పుట 299

18. The Number of Rasas - by V Raghavan Chapter VI Page No. 119

19. ఉత్తర రామ చరిత్ర - భవభూతి

20 అద్వైత సిద్ధి (చివరి శ్లోకము) - మధుసూదన సరస్వతి

21. భగవద్భక్తి రసాయనము - ప్రదమొల్లాసము - ప్రథమశ్లోకము - మధుసూదన సరస్వతి.

22. రససిద్ధాంతము - ఆంధ్రుల పరివస్యపుట - 178 తిప్పాబొట్ల రామకృష్ణ మూర్తి.

23. భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి ప్రథమోల్లాసము 3వ శ్లోకము

24. భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి - ప్రథమోల్లాసము - 4వ శ్లోకము

25. భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి, ప్రథమోల్లాసము - 9వ శ్లోకము

26. భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి, ప్రథమోల్లాసము- 10వ శ్లోకము

27 భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి, ప్రదమోల్లాసము- 11వ శ్లోకము

28 భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి - 18వ పుట

29. భాగవతము - (11-2-45)

30 భగవద్భక్తి రసాయనము - దామోదర శర్మ పీఠిక

31 భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి - ద్వితీయోల్లాసము -55వ శ్లోకము

32. భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి - ద్వితీయోల్లాసము - 57వ శ్లోకము

33 భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి - ద్వితీయోల్లాసము -76వ శ్లోకము.

34. భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి ద్వితీయోల్లాసము - 74 వ శ్లోకము

35 36 నారద భక్తి సూత్రములు - 49, 60

37 The Bhakti cult in Ancient India - Page -411 by Prof Bhagabat Kumar Sastri. M.A ,

# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలు - మధుర భక్తి

౨౭౪౨౦

## చతుర్థ ప్రకరణము

భక్తిస్వరూపము - నిర్వచనము

మధుర భక్తి - నిర్వచనము

మధుర భక్తులు

చతుర్థ ప్రకరణము

# భక్తి స్వరూపము - నిర్వచనము

భజ అనుధాతువు నుండి భక్తి శబ్ద మేర్పడినది బగవంతుని భజించుటయే భక్తి యని అర్థము.

''సాత్వస్మిన్ పరమ ప్రేమ రూపా'' (1)

అట్టి భక్తి దీని యందు పరమ ప్రేమ రూపముగా నున్నది అని పై సూత్ర భావము ఇచట ''పరమ ప్రేమ రూపా'' అను సమాసమున గొప్ప బావము ఇమిడి యున్నది భక్తి అనుభవైక వేద్యము మాత్రమే. ఆ అనుభూతి అలౌకికమైనది. లౌకిక ప్రేమకును పరమ ప్రేమకును హస్తి మశకాంతర మున్నది. భక్తుని ప్రేమ నిరంతర భగవద్ధ్యానము తో కూడి యుండును సర్వము మరపింప జేయును సామాన్యుని ప్రేమ వివిధ భావముల కాశ్రయమై అహంకార పూరితమై యుండును. అనగా నేను నాకు అను భావములను ఆశ్రయించి యుండును.

''సా పరానురక్తి రీశ్వరే'' (2)

అని శాండిల్య భక్తి సూత్రములు తెలుపుచున్నది అమితమైన ప్రేమ గలిగి యుండుటయే భక్తి యని దీని భావము.

యస్యదేవే పరా భక్తి ర్యధాదేవే తధాసురౌ<br>
తస్యైతే కధితామ్యర్థా ప్రకాశంతే మహాత్మనః (3)

నిజమైన భక్తి కలవాడే భగవత్సాక్షాత్కారమును పొందగలడు అని శ్వేతాశ్వతరోపనిషత్తు.

''నిరంతర పరమాత్మ ధ్యానమే భక్తి. దీని యందు కర్మ జ్ఞానము లిమిడి యుండును. స్వధర్మ జ్ఞాన వైరాగ్య సాధ్య భక్త్యైకగోచరుడు నారాయణుడు'' అని శ్రీమాన్ ముడుంబై రామకృష్ణమాచార్య వ్రాసిరి. (4)

అనగా స్వధర్మాచరణము నందు నిష్ట కలిగి తన్మూలమున జ్ఞాన సంపన్నుడై తత్కారణమున ఉపలబ్ధమైన వైరాగ్య జనితమైనది భక్తి యని తాత్పర్యము. కనుక భక్తి యనునది ఉపాయ మనియు,, అది చేతనుని ప్రవర్తన పై ఆధారపడి యున్నదనియు తెలియును దీనినే సాధ్యభక్తి యందురు.

"Karma Yoga and Gnana Yoga are means to Mukti only through Bhakti Yoga Bhakti Yoga is the direct pathway to perfection, as it leads to the very heart of the relegious consiousness" (5)

అని ప్రొఫెసర్ పి ఎన్ శ్రీనివాసాచారి గారు వివరించిరి

నిరంతరం పరమాత్మ ధ్యానమే భక్తి అని గ్రహించి నపుడు ధ్యానమును గూర్చి పరిశీలించుట అవసరము.

''ధ్యానంచ తైలధారావ దవిచ్ఛిన్నస్మృతి సంతాన రూపమ్'' (6) అని భగవ ద్రామానుజులు ఆనతిచ్చిరి

అనగా ధ్యానము తైల ధార వలె ఎడతెగని స్మరణ రూపమున ఉండవలెనని తాత్పర్యము

పరమాత్మసాక్షాత్కారమునకు శ్రవణము, మననము, ధ్యానము మొదలైనవి మాత్రమే కాక పరమ ప్రేమయు ముఖ్యము ఇదే భక్తి

''ప్రేమాత్మక ధ్యానము పలు పర్యాయములు ఆవర్తింపవలెను అని శాస్త్రము లుపదేశించుచున్నవి ''అనేక జన్మ సంసిద్ధమ్'' అన్నట్లు చిరకాల సాధ్యమైనది భక్తి ఇది దేహావసానానంతరమే పలము నిచ్చునది ''తస్య తావదేవ చిరం యావన్నవిమోక్ష్యం'' అని ఛాందోగ్యోపనిషత్తు (7)

జీవుడు దేహమును విసర్జించిన మరుక్షణమే యాతని భక్తికి ఫలము లభించును ఎంత భక్తి కలిగినను జీవుడంతకు పూర్వము చేసిన కర్మఫల మనుభవించుటకు జన్మాంతరముల నెత్తిన వెనుకనే భక్తి ఫలము అనుబవింప వీలగును. అమిత ప్రయాసానంతరము ఫలము నిచ్చునది. భక్తి యని తెలియుచున్నది.

''బక్తిః అంతిమస్మరణ నియతి'' అని ముడుంబై రామకృష్ణమాచార్యుల వారు వివరించిరి. (8)

భక్తికి సంబంధించిన యజ్ఞ యాగాది కర్మలు చేయుటకు జాతి లింగ, కుల, గుణ, క్రియాదులయు, ప్రదేశ నియమాదులయు అవరోధములు కలవు తపమునకును ఇట్టి నియమములే కలవు

కర్మాదులచే లభించు స్వర్గ ఫలము అశాశ్వతమైనది. దీనికి అంగములుగా పశుపుత్రాది ఫలములును ఉండును. అస్థిర చిత్తులచే పొందబడనిది భక్తి.

''హృదయము ప్రేమార్ద్రమై పరమాత్ముని యందు నిష్కామ భావమున లగ్నమగుట భక్తి యని స్థూలముగ నిర్వచింపవచ్చును'' అని డా కె. గోపాలకృష్ణారావు గారు వ్రాసిరి. (9)

"meditation deepens into Bhakti and it is the
practice that becomes the direct path-way "

Bhakti is continuous meditation on Brahman touched with love or Priti It is absolute devotions to Bhagavan as the life of your life, and is love for loves sake The true Bhakti is the true gnani as he knows that Bhagavan alone in the source and satisfaction of life".

"Bhakti is continuous meditation in which representation acquires the vividness of living presence" (10)

అని పి ఎన్ శ్రీనివాసాచారి గారు వివరించిరి

''తేషాంజ్ఞానీ నిత్య యుక్త ఏకభక్తి ర్విశిష్యతే
ప్రియోహి జ్ఞానినో త్యర్థ మహం సచమప్రియః
ఉదారా స్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైన మేమతమ్
అస్థిత స్సహి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్
బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే
వాసుదేవ స్సర్వమితి సమహాత్మాసు దుర్లభః'' (11)

ఇది భగవద్గీత యందలి విజ్ఞాన యోగమనెడి సప్తమాధ్యాయములో శ్రీ కృష్ణ పరమాత్మ అర్జునునికి చేసిన ఉపదేశ భాగము. ఇంతే కాక ఆ పరమాత్మ తన భక్తులలో ఉత్తము లెవరో ఈ విధముగా స్పష్టమొనర్చినాడు.

''మయ్యా వేశ్య మనోయేమాం నిత్యయుక్తా ఉపాసతే
శ్రద్ధయా పరయోపేతా స్తేమే యుక్త తమా మతాః'' (12)

''మనసు నాయందే ఏకాగ్రము చేసి, అపరిమిత శ్రద్ధా వంతులై ఎడతెగని భజన ధ్యానాదులతో సకల కళ్యాణ గుణ పరిపూర్ణుడనైన నన్ను ఉపాసించు వారే యోగము తెలిసిన వారిలో అత్యుత్తములని నా యభిప్రాయము'' (13)

భక్తునకు దేనియందును కోరిక యుండరాదు. బహిరంతరముల శుచియై యుండవలెను. దుఃఖ రహితుడును, శత్రు మిత్రులయందు, మానావ మానముల యందు సమ బుద్ధి గలుగు వారు, నిందాస్తుతుల యందు సముడైన వాడును కావలెను'' అని పరమాత్మ గీతలో వివరించినాడు.

''అనపేక్ష శ్శుచిర్దక్ష ఉదాసీనో గత వ్యథః
సర్వారంభ పరిత్యాగీ యోమద్భక్త స్స మే ప్రియః
సమశ్శత్రౌచ మిత్రేచ తథామానావమానయో :
శీతోష్ణ సుఖ దుఃఖేషు సమస్సంగ వివర్జితః'' (14)

''పరమాత్ముని గూర్చి నిక్కము, నిష్కళంకమునగు అన్వేషణమే భక్తి యోగము. ఇది ప్రేమమున జనించి, ప్రేమమున వికసించి, ప్రేమముననే లయించును''. (15)

''విషయ సుఖాదిక ఫలాపేక్షను విడిచి సమస్త కర్మములను పరమ గురుడగు ఈశ్వరునకు అర్పించుటయే భక్తి విశేషమగు ప్రణిధానము'' (16)

"By Bhakti we mean on intense love of God" (17) అని లాలా కన్నూమల్ గారు వ్యాఖ్యానించిరి.

"Bhakti is pure affection for the highest living, who although he has the whole world within him" అన సువీరాజైస్వాల్ గారు నిర్వచించిరి (18)

''భక్తి యొక రసపారవశ్యమునకు లోనైన భవ్యస్థితి. అదియే అమృత స్వరూపము. ''రసోవైసః'' అనుటచేత నాపరతత్వము భక్తికి మాత్రమే సులభము'' అని శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు వివరించిరి. (19)

భక్తిని గూర్చి భాగవత మిట్లు వివరించుచున్నది.

''మద్గుణ శ్రుతి మాత్రేణ మయ సర్వగుణాశ్రయే
మనోగతి రవిచ్ఛిన్నా యథా గంగాంభసో ంబుధౌ
లక్షణం భక్తి యోగస్య నిర్గుణస్య హ్యాదాహృతం
అహైతుక్య వ్యవహితా యా భక్తి పురుషోత్తమే. (20)

భగవంతుడు సర్వాంతర్యామి '' ఇందు గలడందు లేడను సందేహము వలదు'' అని పోతన గారు చెప్పినట్లు సకల చరాచర సృష్టి యందు నెలకొని యున్నవాడు అట్టి సకల

వ్యాపి యైన నారాయణుని కల్యాణ గుణములను విన్నంత మాత్రమున ఫలాపేక్ష రహితమగు ప్రకృతిలో నొకడై ప్రకృతి యందలి చరాచరము లన్నింటిని దర్శించుచునే మనోదృష్టిని చలింపనీయక, గంగా జలము ఏ విధముగ సముద్రము వైపునకు నిరంతరాయముగ ప్రవహించునో, అట్లే భక్తుడు తన భావమును సడలనీయక, భగవంతుని యందే తన మనసును లగ్నము చేసి అవిచ్ఛిన్నముగ ధ్యానించునో అట్టి స్థితిని భక్తి యందురు అని పై శ్లోక తాత్పర్యము. శ్రీ భాష్యమున భగవ ద్రామానుజులిట్లు వ్యాఖ్యానించిరి.

''తత్ర భక్తిర్నామ నిరవధి కానం తానవద్య కల్యాణ గుణగణత్వం
జ్ఞాన పూర్వకః స్వస్వాత్మాత్మీయ సమస్త వస్తుభ్యో నేక గుణా
ధికో ంతరాయ సహస్రే ణాప్య ప్రతిబద్ధో నిరంతర ప్రేమ ప్రవాహః''

''సామాన్యమైన ఆరాధనతో మొదలిడి భగవానుని యందు గాఢానురక్తి యై మించు దివ్యానుభూతిని పొందుటకై చేయు సాధనమే భక్తి (21) అని శ్రీ చిరంతనానంద స్వామి అనువాదము.

''కింపునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా
అనిత్య మసుఖం లోక మిమం ప్రాప్య భజస్వమామ్'' (22)

అని గీతాచార్యుడు అనగా భగవంతుని యందుండెడి ప్రేమయే భక్తి యని చెప్పవచ్చును. ఇట్టి భక్తికి స్త్రీ పురుష లింగభేదము కాని వయో జాతి కుల భేదము గాని లేవని గీతాచార్యుని వివరణము.

మన మహర్షులు భక్తిని గూర్చి ఇట్లు చెప్పిరని డా. మహతీశంకర్ గారు ఉదాహరించిరి (23)

1. పరాశరుడు - పూజాదుల అనురాగమే భక్తి.
2. శాండిల్యుడు :- విరోధము లేని ఆత్మరతియే భక్తి.
3. స్వప్నేశ్వరుడు - భగవన్మహిమాను భూతి వలన కలుగు ప్రీతియే భక్తి
4. గర్గుడు :- భగవత్కథాను రాగమే భక్తి.
5. రూపగోస్వామి :- జ్ఞానకర్మ రూపావ గుణాలను తొలగించి అనన్య కాంక్షారూపమున భగవదనుభూతిని పొందుటయే భక్తి.

16వ శతాబ్దికి చెందిన వాడైన మధుసూదన సరస్వతి అను యతివరుడు భక్తి నిట్లు నిర్వచించెను.

ద్రుతస్య భగవద్ధర్మాద్ధారా వాహిక తాం గతా
సర్వేశే మనసో వృత్తిః భక్తి రిత్యభిధీయతే'' (24)

అనగా భగవద్గుణము వలన ద్రవించిన మనసు యొక్క ధారావాహిక మగు (అవిచ్ఛిన్నమగు) మనోవృత్తి భక్తి యనబడును

''భగవద్విషయికమై అవిచ్ఛిన్నమనోవృత్తి భగవదాకారమగును అట్లగుటయే భక్తి'' (25)

''నారద పాంచరాత్రము''న భక్తిని గూర్చి ఇదే యభిప్రాయము వ్యక్తమైనది

''మనోగతి రవిచ్ఛిన్నా హరౌ ప్రేమ పరిప్లుతా
అభిసంధి వినిర్ముక్తా భక్తిర్విష్ణు వశంకరీ'' (26)

''మనస్సు ప్రేమార్ద్రమై తైలధారారూపంబున నిష్కామముతో బగవంతుని వంకకు నిరంతరము ప్రవహించుట భక్తి యగును. (27)

''అనిర్వచనీయమ్ ప్రేమ స్వరూపమ్'' (28)

అని నారద భక్తి సూత్రములు చెప్పుచున్నది ప్రేమ యనునది నిర్వచించుటకు అసాధ్యమైనది అట్టి యెడ ప్రేమ సంబంధ భక్తిని ఏక వాక్యమున నిర్వచించుట కష్ట సాధ్యమైనది వేద పురాణాదులును, ఇతిహాసాది గ్రంథములును భక్తి తత్వమును ఎన్నియో విధముల నిర్వచించినవి అన్నియును సుదీర్ఘ వివరణములే.

నారద మహర్షి యంతటివాడే భక్తిని సూత్రీకరించి పెక్కు శ్లోకములను చెప్పెను ''లౌకిక వ్యాపారములను నిరోధించి ఒక విధముగ వానిని త్యజించి నారాయణుని పట్ల ప్రేమాధిక్యము కలిగి యుండుటయే భక్తి'' అని నారద సూత్రముల సారాంశముగ చెప్పుకొనవచ్చును

అవిచ్ఛిన్నమగు ప్రేమానురక్తిని బగవంతుని యందు కలిగి మనో వాక్కాయ కర్మలచే ఆతనిని నిరంతరము ధ్యానించుటయే భక్తిగా నెంచవచ్చును

''శ్రియఃపతి కల్యాణ గుణ చేష్టితములను, తద్దివ్య మంగళ విగ్రహ సౌందర్యమును హృదయ దఘ్నముగా అతృప్త అమృతమును వలె అనుభవించుటయే భక్తి'' (29)

# సగుణ నిర్గుణ శ్రుతులు

ఈశ్వరు డొక్కడే అతడు నిత్యుడు అనంత కల్యాణ గుణ సంపన్నుడు. సద్గుణుడు అనగా దోష రహితుడు సగుణ శ్రుతులు పరమాత్ముని కల్యాణ గుణములను బోధించును నిర్గుణ శ్రుతులు హేయ గుణములను నిషేధించును

శ్రుతి.- యేష ఆత్మా విజరో, విమృత్యుర్, విశోకో, విజిగిత్సో అపిపాసః, సత్యకామః సత్యసంకల్పః

జీవుడు అణు స్వరూపుడు, జ్ఞానానందమును పొందిన జ్ఞాన స్వరూపుడు అనగా స్వయం ప్రకాశుడు. ఈశ్వరుడు విభావుడు అనగా సర్వ వ్యాపకుడు. జీవుని జ్ఞానానందాదులు కర్మ సంచితములు

లోకము నందలి దుర్వ్యవహారంబులను, భేదంబులను, జూచిన వారికి లౌకిక సంబంధ వైరాగ్యము కలుగును. అట్టి యెడ నిర్గుణములను త్యజించుటకు సిద్ధపడుదురు కాని నిర్గుణ త్యాగము వలన ఫలము లేదు. దానికి తోడు ఉత్తమ జ్ఞానము, విశ్వాసము అవసరము అట్టి వారికే ప్రయత్న సిద్ధి కలుగును

మోక్ష సాధనకు సగుణోపాసనయు, నిర్గుణ త్యాగమును బీజము లగును ఈ విషయమునే భాగవత మిట్లు చెప్పుచున్నది.

''శాస్త్రష్వియానే వసు నిశ్చితో నృణాం
క్షేమస్య ప్రద్యగ్వి మృశేషు హేతు
అసంగ ఆత్మ వ్యతిరిక్తాత్మన్
ధృడారతి ర్బ్రహ్మణి నిర్గుణేచయా'' (30)

భక్తి ప్రధానముగ రెండు విధములు. ఒకటి సాధన, మఱి యొకటి ప్రేమ - సాధన భక్తిని భాగవతము తొమ్మిది మార్గములలో సూచించినది.

''శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మ నివేదనమ్'' (31)

సాధన భక్తి ఫలించి ప్రేమ భక్తిగా పరిణమించును. సాధన భక్తి ఉపాయము కాగా, ప్రేమ భక్తి ఉపేయ మగు చున్నది.

ఆసక్తిని బట్టి నారద భక్తి సూత్రములు భక్తిని పదనొకండు విధములుగా చెప్పుచున్నవి

''గుణ మహాత్మ్యాసక్తి, రూపాసక్తి, పూజాసక్తి, స్మరణాసక్తి, దాస్యాసక్తి, సఖ్యాసక్తి, వాత్సల్యాసక్తి, కాంతాసక్తి, ఆత్మనివేదనాసక్తి, తన్మయాసక్తి, పరమ విరహాసక్తి, ''రూపా ఏకధా అపి ఏకాదశా భవతి'' (32)

ఈ పదకొండు విధముల భక్తులకు డా. మహతీ శంకర్ గారు ఈ క్రింది విదములుగా ఉదాహరణముల నొసంగిరి. (33)

1 గుణమహ్మాత్మ్యాసక్తి .- నారద భీష్మాదులు
2 రూపాసక్తి .- బృందావన స్త్రీలు
3. పూజాసక్తి '- అంబరీషాదులు
4. స్మరణాసక్తి '- ప్రహ్లాదుడు
5. దాస్యాసక్తి - హనుమదాదులు
6 సఖ్యాసక్తి - కుచేలుడు, ఉద్ధవుడు, అర్జునుడు
7. వాత్సల్యాసక్తి '- యశోదాదులు
8 కాంతాసక్తి .- రుక్మిణీ సత్యభామలు
9. ఆత్మనివేద నాసక్తి .- విభీషణాదులు
10. తన్మయతాసక్తి '- సనత్కుమారాదులు
11 పరమ విరహాసక్తి - గోపికలు

తనను భజించు భక్తులు నాలుగు విధమల వారినిగా శ్రీకృష్ణ భగవానుడు అనతిచ్చెను.

''చతుర్విధా భజంతే మాం జనా సుకృతి నోర్జున
అర్తో జిజ్ఞాసు ర్ధార్థీ జ్ఞానీచ భరతర్షభ'' (34)

ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు అనువారు ఎల్లప్పుడు సత్కార్యాచరణము నందే నిమగ్నులై నన్ను భజించుచుందురు'' వీరందరిలో జ్ఞాని మాత్రమే శ్రేష్ఠుడట. అంతడే పరమాత్మకు ప్రియమైన వాడట.

దీనికి సరిపడు బావములు కలదే కులశేఖరాళ్వారు అను నొకవైష్ణవాళ్వారు వ్రాసినాడు.

''జిహ్వేకీర్తయ కేశవం మురరిపుం చేతో భజ శ్రీధరం
పాణి ద్వంద్వ సమర్చ యాచ్యుతకథాః శ్రోత్రద్వయం త్వంశృణు
కృష్ణంలోకయ లోచనద్వయ హరేః గచ్ఛాంఘ్రి యుగ్మాలయం
జిఘ్రఘ్రాణ ముకుంద పాద తులసీం మూర్ధ న్నమాధోక్షజమ్'' (37)

ఇట్లే శ్లోకములను బట్టి చూడ భాగవతము నందలి ఈ క్రింది శ్లోకము స్ఫురింపక మానదు.

వాణీ గుణానుకథనే శ్రవణౌ కథాయాం
హస్తౌచకర్మసు మనస్తవ పాదయోర్నః
స్మృత్యాం శిరస్తవ నివాస జగత్ప్రణామే
దృష్టిః సతాం దర్శయే స్తు భవత్తనూనామ్ (38)

# భక్తి – ప్రపత్తి

శ్రీ విశిష్టాద్వైతమున సాధన, సాధ్య భక్తులకే భక్తి ప్రపత్తి యని పేరు

వీని యందు సాధన భక్తి గూర్చి భాగవతమున స్పష్టపరవబడినది కర్మజ్ఞానాను గృహీతమగు భక్తియే సాధన భక్తి. ఇదియే ఉపాయము. భగవంతుడు ఉపేయము

భగవన్నిర్హేతుక జాయమాన కటాక్షము చే కలుగునది సాధ్య భక్తి. దీనికే ప్రపత్తి యని పేరు. దీని యందు ఉపాయోపేయములు భగవంతుడే. ఈ సాధ్య భక్తికే శరణాగతి న్యాసము, ఉపాయ స్వీకారమనెడి పేర్లును గలవు. ఈ ప్రపత్తి లేక శరణాగతి వలననే జాంబవంత, హనుమంత, గజేంద్రాదులు ''పునరపి జననం పునరపి మరణం'' అను దానికి అతీతమైన పరమ పదము నందిరి. ఈ ప్రపత్తి మార్గమునకును, వయో, జ్ఞాన, జాతి భేదములు లేవు. యజ్ఞాది కర్మలచే నగు సాధన భక్తి పశు పక్ష్యాదులకు దుర్లభము. ప్రపత్తికి అట్టి దురవస్థ లేదు ఏ జీవియైనను దీని ద్వారమున పరమానంద స్థితిని పొందవచ్చును.

అద్వైత మతమున పశుపక్ష్యాదులు సైతము మోక్షము నందినట్లు దృష్టాంతరములు కలవు. ''శ్రీకాళహస్తి మహాత్మ్యము'' నందు సాలెపురుగు, ఏనుగు, పాము శివభక్తిచే సాయుజ్యము నందినవి గదా! అని కేవలము శరణాగతి తత్వమునే అవలంభించిన వనుటలో సందేహము లేదు.

ఈ సాధన, సాధ్య భక్తులకే లౌకిక, అలౌకిక భక్తులనియు, లేదా దివ్యాదివ్య భక్తులనియు పేళ్ళు. లౌకిక కర్మాదులచే ప్రకటింప బడునది సాధన భక్తి లేక అదివ్య భక్తి. మానసికమై అవిచ్ఛిన్నమగు తైలధారవలె కొనసాగునది అలౌకిక లేక దివ్య భక్తి.

ఇట్టి ప్రపత్తి వలననే గజేంద్రాదులు పరమ పదము నందిరి మానవులలో విద్యా గంధము గలవారికే దక్క నితర జీవులకు భక్తి యందధికార ముండదని కొందరి మతము. కాని పైనుదహరించిన పశు పక్ష్యాదులు పై వాదమును ఖండించు చున్నావా యనునది తోపక మానదు. వానికి విద్యా సంబంధము లేదు కదా! అంతియే కాదు రామాయణము నందలి జటాయువు. సంపాతి, వానరశ్రేణి ఇవి యన్నియు వేద వేదాంగములు చదువుకొన్నవే యని నిరూపింపలేదు గదా. అయినను వానికి మోక్షమబ్బలేదా ! కనుక మోక్షార్థము గ్రంథ జ్ఞానము గాని, కనీసము అక్షర జ్ఞానము కాని అవసరము లేదని దీని వలన స్పష్టమగు చున్నది. ఇదే భావమును శ్రుతులు గూడ స్పష్టమొనర్చినట్లు శ్రీమాన్ మొలుగు రామానుజాచార్యుల వారు తమ వ్యాసమున వివరించిరి.

వ్యాదస్యా చరణం ధృవస్య చవయో విద్యా గజేంద్రస్యకా?
కాజాతి ద్విదురస్య యాదవ పతే రుగ్రస్యకింపౌరుషమ్?
కుబ్జాయాః కమనీయ రూప మధికం తత్సుధామ్నోదనమ్
బక్తాతుష్యతి కేవలం నచగుణైః భక్తి ప్రియోమాధవః

'' ఆత్మా వివృణుతే తనూగ్ం స్వామ్'' అను నీ శృతియు ప్రపత్తినే బోధించుచున్నది

''నాయమాత్మా ప్రవచనేన లభ్యోనమేధయా బహు జనశ్రుతేన
యమే వైష వృణుతే తేన లభస్తస్యైష ఆత్మా వివృణుతే తనూగ్ంస్వామ్
అను శ్రతి వలనను ప్రపత్తియే గొప్పదని స్పష్టమగుచున్నది

ఈ శ్రుతి యందలి పూర్వార్థము భగవంతుడే సాధనమనియు బోధించుచున్నది. (40)

భగవద్గీతయు ఈ శరణాగతినే ప్రభోదించుచున్నది

''శిష్యస్తేహం శాధిమాం త్వాం ప్రపన్నమ్'' (41)

గీతావతరణకు కారకుడు అర్జునుడే అతని ప్రపత్తియే దానికి కారణము

''తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత
తత్రుసాదా త్పరాం శాంతి స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్'' (42)

అందువలన సర్వ విధముల ఆపరమాత్మ ''నన్నే శరణు పొందుము అన్నింటికి మూలమైన నాకరుణచే శాశ్వత శాంతి పదమును చేరుకొనగలవు'' అని అర్జుననకు స్పష్టమొనర్చెను

సర్వ ధార్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వాం సర్వ పాపేభ్యో మోక్ష యిష్యామిమాశుచః (43)

చరమ శ్లోకముగ ప్రసిద్ధి నందిన ఈ శ్లోకమున గూడ పరమాత్ముడు శరణాగతినే బోధించినాడు.

కర్మమునకు జ్ఞానము సహకారి. జ్ఞానమునకు భక్తి సహకారి భక్తికి ప్రపత్తి సహకారి. కర్మ జ్ఞాన బక్తులను ఆచరిపం లేని వారికి ఆదారము ప్రపత్తి ఇది ఆచరింపగలిగినచో తక్కినవన్నియు త్యాజ్యంబులే

''సర్వదర్మాన్ పరిత్యజ్య'' అన్నప్పుడు తన ధర్మము లన్నియు వదలి వేయమని భావము కాదు పైన పెర్కొన్న కర్మ జ్ఞాన భక్తి మార్గము లనెడు ధర్మములకై వెంపరలాడక నన్నొకనివే శరణు వేడుటయే ఉత్తమ ధర్మమని భగవానుని ఆనతి ప్రపత్తి కలవాడే ప్రపన్నుడు

అనగా ఇందు గల డందు లేడను సందేహముడిగి సర్వవ్యాపి నారాయణుడు అను జ్ఞానము కలిగి ''త్వమేవ శరణం మమ'' అనగలిగిన జీవుడే ప్రపన్నుడు ఏ జన్మయందు జీవుడు ప్రపన్నుడగునో ఆ జన్మ తోనే వానికి మోక్ష ప్రాప్తి దేహాంతర ప్రాప్తి కలుగదు దీనికి నియమ నిష్టలు లేవు. కేవలము శరణాగతియే ప్రధానము. ఒక్క మాటలో చెప్పవలెనన్న ''నేను నీవాడను కాపాడుము'' అని రెండు చేతులెత్తి అచంచల విశ్వాసముతో పరమాత్మను శరణు వేడుటయే ప్రపత్తి

ఇతఃపూర్వమే వివరించినట్లు ప్రపత్తికి తరతమ భేదములు లేవని శ్రీమాన్ ముడుంబై రామకృష్ణమా చార్యులు తమ వ్యాసమున ఈ క్రింది శ్లోకమును ఉదహరించుచు వివరించిరి

''నజాతి భేధం నకులం నలింగం నగుణక్రియాః నదేశ కాలౌ
సర్వ ఏవప్రపద్యేరన్ సర్వదాతార మచ్యుతమ్'' (44)

భక్తి ప్రపత్తులను తద్జ్ఞలు ఇట్లు విశ్లేషించి చూపినాడు

భక్తిని మర్కట కిశోర న్యాయముచే పోల్చిరి. అనగా భక్తుడు అల్పమైన స్వశక్తి పై నాధారపడి తన యోగక్షేమములకొఱకు తాపత్రయ పడుచు కర్మ జ్ఞాన భక్తులను ఆచరించును శాంత, దాస్య సఖ్య వాత్సల్య ప్రేమ భావముల ప్రకటించును అనగా మర్కట కిశోరము తన తల్లి కడుపును గట్టిగ పట్టుకొని తల్లితో పాటు కొమ్మనుండి మఱి యొక్క కొమ్మకు పయనించుట అన్నమాట ఇచట తల్లి బాధ్యత ఏమియును లేదు. ఇట్టిదే జీవాత్మ పరమాత్మల సంబంధము. భగవంతుని గూర్చి ప్రార్థించును గాని జీవుడు తన రక్షణకై తన ప్రయత్నములను మానడు కనుక భగవంతుడు మన (భక్తుల) రక్షణకై ఎట్టి ప్రయత్నమును చేయడు.

ప్రపత్తి అట్లు కాదు. మార్జాల కిశోర న్యాయము వంటిది. మార్జాలము తన పిల్లలను తానే రక్షించును. ఆహారము సంపాదించి అందించును. స్థానాంతరములకు గొని పోవును శత్రువుల నుండి రక్షించును. ఇట్లు పిల్లల ప్రమేయము గాని ప్రయత్నమేమియు నుండదు భారతమంతయును తల్లిది అవి నిర్వికారముగ తల్లిగనమ్మి సంచరించును. ప్రపత్తి యందు జీవాత్మ పరమాత్మల సంబంధము ఇట్టిదే. సమస్త భారమును భగవంతునిపై నుంచి భక్తుడు

ధ్యాన నిమగ్నుడగును. తనను గూర్చికాని, తన కుటుంబమును గూర్చి కాని ప్రపన్నునకు ఆలోచనయే కలుగదు. తాను నిమిత్త మాత్రుడు. పరమాత్మలో ఐక్యమగుటకై అతడు పరితపించును. ఆత్మ, పరమాత్మల మేలి కలయికకై అతడెదిరి చూచును. ఇదియే శరణాగతి.

''మామేకం శరణం వ్రజ'' అని శ్రీ కృష్ణ పరమాత్మ గీతలో ఉపదేశించినట్లు కురురాజ సభలో ద్రౌపది తన్నుదాను రక్షించుకొనుటకు ప్రయత్నించి నంత వరకు కృష్ణుడామెను గమనించుచు వచ్చెనే గాని రక్షించుటకు గమకించలేదు. చివరకామె తన ప్రయత్నములన్ని మాని రెండు చేతులనెత్తి ''హే కృష్ణ అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ'' అన్ననే కాని ఆమెకు అక్షయ వలువలను ప్రసాదించలేదు. కావున శరణాగతి యే గొప్పదని తేచుచున్నది.

ఏ వస్తువును ఆశ్రయించి మానవుడు తృప్తి చెందునో, ఏ వస్తువును పొంది మరి ఇతరములను కోరకుండునో అట్టి ప్రేమను భక్తి అనియు, ఆ పరమాత్మునే తమ నాధునిగ భావించి ఆ భావము నందే తన్మయులై ఆ పరంధాముని అనంత కల్యాణ గుణ విశేషములను తనివి దీర వర్ణించుచు సంకీర్తనము చేసినచో అది శరణాగతి ( ప్రపత్తి) అనియు భావింపవలెను.

ఇట్టి ధర్మ సూక్ష్మములను గ్రహించిన వారిలో అన్నమాచార్యుడొకడు. తన ఆధ్యాత్మిక శృంగార సంకీర్తనలో ఇట్టి ప్రపన్నతను వ్యక్త పరచిన ప్రపన్నుడాయన.

అన్నమయ్య జన్మతః అద్వైతి యైనను శ్రీవైష్ణవ యతులకడ పంచ సంస్కారములను పొంది శ్రీ వైష్ణవుడయ్యెను.

ఇతఃపూర్వమే వివరించినట్లు నవ విధ భక్తి మార్గములలో సంకీర్తనామార్గమును అనుసరించి తరించిన వారు అన్నమాచార్యులే. నారదాదులు అనుసరించినదియు ఈ మార్గమే. శ్రీ వైష్ణవసిద్ధ పురుషులు (ఆళ్వారులు) అనుసరించినదియు ఈ మార్గమే. సంకీర్తనగా పద్ధతి మోక్షమునకుసుగమ మార్గము. '' ఇది సున్నితము, సూక్ష్మము సూటియు నైనది యగు త్రోవ'' అని శ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారు నిరూపించిరి. (45)

అన్నమాచార్యునికి పూర్వమే ''సింహగిరివచనములు'' అను పేర కీర్తనలను (వచన) రచించిన కృష్ణమాచార్యుడు అనుసరించినదియు నీ మార్గమే. తత్పూర్వులును ద్వాపరాంతకాలము నుండి మొదలై పన్నిద్దరాళ్వారులుగ ప్రసిద్ధిపొందిన శ్రీవైష్ణవయతులును అనుసరించినదీ మార్గమే.

వీరిలో నమ్మాళ్వారు ప్రముఖులు. మధురకవికులశేఖరులు, గోదాదేవి, తొండరడిప్పొడి (విప్రనారాయణుడు), తిరుప్పాణ్, తిరుమంగై యాళ్వార్ మొదలైన ఆళ్వారులు రచించిన సంకీర్తనలు పేర్కొన దగినవి ఇవి పాశురములు అను పేరున తమిళమున ప్రసిద్ధి నందినవి. ఈ నాటికి దివ్య స్థలములైన వైష్ణవ ఆలయములలో అనునిత్యము అనుసంధింపబడుచున్నవి

నమ్మాళ్వారు కలియుగ ప్రారంభమున 4 3 వ దినమున అనగా వైశాఖ శుద్ధ చతుర్దశీ శుక్రవారము నాడు జనియిచి, చతుర్వేదములని ప్రసిద్ధి గాంచిన తిరువిరుత్తము, తిరునాశిరియము, పెరియతిరువన్దాది, తిరువాయ్మొజి అను నాలుగు దివ్య ప్రబంధములు రచించిరి (46)

అంతకు మునుపే భారత దేశమున గల వైష్ణవము క్రమక్రమముగ వృద్ధి చెంది పదకొండవ శతాబ్ది నాటికి క్షీణదశ యందుండెను. 1 1 వ శతాబ్దిలో రామానుజాచార్యులు అను వైష్ణవ మతోద్ధారకులు అవతరించి విశిష్టాద్వైతము అనునొక క్రొత్త సిద్ధాంతమును ప్రతిపాదించి వైష్ణవమునకు ఊపిరి పోసి దశ దిశల వ్యాపింపచేసిరి కాని 1 3 వ శతాబ్ది ప్రాంతమున బౌద్ధ, జైన మత ప్రాబల్యముచే వైష్ణవము తిరిగి క్షీణదశకు వచ్చెను. అటు పిమ్మట 1 5, 1 6 శతాబ్దుల కాలములో విజయనగర ప్రభువులు వైష్ణవ మతావలంబులై వైష్ణవమును ఉన్నత శిఖరము నధిరోహింప జేసిరి.

వైష్ణవము 1 5 వ శతాబ్దిలో తిరిగి కాళ్ళూని నిలదొక్కుకొను సమయమున ఆశతాబ్దపు తొలినాళ్ళలో స్మార్త బ్రాహ్మణ కుటుంబమున (అద్వైత) జన్మించిన అన్నమయ్య విష్ణు భక్తుడై, ఆ శ్రీనివాసుని ఆనతి మేరకు వైష్ణవ స్వాములను ఆశ్రయించి, పంచ సంస్కారములను పొంది వైష్ణవుడయ్యెను. విష్ణు పారమ్యములైన వేలాది అధ్యాత్మ శృంగార సంకీర్తనలను రచించెను. వైష్ణవ స్వాముల సాంగత్యమున విష్ణు తత్త్వము నెఱిగిన అన్నమయ్య మోక్షకారకమైనదియు, సులభమైనదియును ఐన కీర్తనామార్గమును అనుసరించినాడు వేలాది సంకీర్తనల రచనల ద్వారా ఆయన వైష్ణవ మత ప్రచారమునకు కారణ భూతుడయ్యెను కీర్తనామార్గమున వైకుంఠధామున దివ్య సన్నిధికి చేరుకొన్న ప్రపన్నుడు అన్నమాచార్యుడు

ఇట్లు సంకీర్తనలచే తరించిన వారు అన్నమయ్యకు పూర్వులే కాక, ఆయన సమకాలీనులు, తదనంతరులు కూడ కలరు సమకాలీనులలో కన్నడిగుడైన పురందరదాసు, అన్నమయ్య కుమారుడైన పెద తిరుమలాచార్యులు చెప్పుకొనదగిన వారు. అట్లే ఉత్తర హిందూ స్థానమున ప్రసిద్ధి గాంచిన కవివరేణ్యుడు సూరదాస్ అను నాతడును (1540)

అన్నమయ్య సమకాలీనుడే ఇతడు లక్షకు పైగా సంకీర్తనలు లేక పదాలు వ్రాసినట్లు డా సంగమేశమ్ గారు వ్రాసినారు

अनुश्रुति है कि सूरदास ने सवा लाख पदो की रचना की थी। भाव प्रकाश मे एक जगह लिखा है कि सूरने सवालाख पदों कि रचना करने का निश्चय किया था और उन मे से एक लाख की पदों की रचना हो चुकी थी..... सूर सारा पली मे भी लिखा हुआ है कि सूरदास ने हरि लीलाके एक लक्ष पद गाये है।

उम्रमे बडा अन्तर होने पर भी अन्नमाचार्य और सूरदास सम कालीन थे (47)

వీరు సమకాలీనులే కాక వయో బేధమున్నను ఇరువురును వైశాఖ మాసమున జన్మించిన వారే. అన్నమయ్యగారు పురందర దాసుతోను, యాగంటి లక్ష్మయ్య తోడను.సమావేశమైన వారు సూరదాసు రామభక్తుడైన తులసీదాసు తో సమావేశ మైనవాడు పురందర సూరదాసులు అన్నమయ్య తులసీదాసులు - వీరందరును విష్ణు భక్తులే కాగా అన్నమయ్య పురందర దాసులు వేంకటేశ్వరుని భక్తులు సూరదాసు కృష్ణ భక్తుడు కాగా తులసీదాసు రామ భక్తుడు ఇది ఇట్లుండ అన్నమయ్య వలెనే సూరదాసు కూడ స్మార్త బ్రాహ్మణుడేనట ఈ విషయమును గూర్చి డా సంగమేశమ్ గారు ఇట్లు వివరించినారు.

जन्म मे ये दोनो भक्तकवि स्मार्त थे, लैकिन बाद मे दोनो की रुचि वैष्णव धर्म एवं सगुण आराधना मे गई। अन्नमाचार्य ने रामानुज के विशिष्ठाद्वैत संप्रदाय मे दीक्षा ली तो सूरदास वल्लभाचार्य के शूद्धाद्वैत संप्रदाय मे दीक्षित हुए। (48)

ఒకరు వెంకటేశ్వరుని భక్తులు - మరియొకరు కృష్ణరూపి యైన శ్రీనాదుని (శ్రీమన్నారాయణుని) భక్తులు

వల్లభాచార్యుడును వైశాఖమున జన్మించిన వారే ఇంతియే కాక దశావతారములలో నొకటి యైన నృసింహావతారము వైశాఖముననే సంబవించినది అన్నమయ్యయు వైశాఖము ననే జన్మించినాడు విశిష్టాద్వైతసిద్ధాంత ప్రతిపాదకులైన రామానుజాచార్యులును వైశాఖముననే జన్మించినారు దీనిని బట్టి చూడ విష్ణు సంబంధము గల భక్తులనేకులు వైశాఖముననే జన్మించినట్లు స్పష్టమగుచున్నది.

ఇట్లు సంకీర్తనలచే తరించిన వారు ఆయన సమకాలీనులును, పూర్వులును గాక తదనంతరులును కలరిన చెప్పియుంటిని అన్నమయ్య మనుమడు చిన తిరుమలాచార్యుడు

కూడ తండ్రి తాతలవలెనే అధ్యాత్మ సంకీర్తనలతో పాటు శృంగార సంకీర్తనలు రచించిన వాడే ఇవియును వైష్ణవ తత్వ ప్రతిపాదకములే

# మధుర భక్తి - మధుర భక్తులు

అన్నమాచార్యుడు రచించిన సంకీర్తనలలో అధ్యాత్మ కీర్తనలకన్న శృంగార సంకీర్తనలే ఎక్కువ. శృంగార సంకీర్తనలలోని శృంగారము అలౌకికము దివ్యమూ అయినట్టిది సకల చరాచర సృష్టికర్తయైన శ్రీమన్మహా విష్ణువు యొక్క లీలాభి వర్ణనతోపాటు రాసక్రీడల వర్ణనము కూడా చేసిన జయదేవకవి రచితమైన సంస్కృత అష్టపదులు కూడ ఈ కోవకు చెందినవే

భక్తుడైన కవి తానుగా నాయికయై ఆ పరమ పురుషుని నాయకునిగ నెంచి ''స్త్రీ ప్రాయమితరం జగత్'' అను వేద వచనము ననుసరించి, ఆయన శృంగార లీలావిలాస వర్ణనము చేయును ఇట్టి నాయికా నాయక భావముతో పరమాత్ముని ఆరాధించు భక్తిని ''మదుర భక్తి'' యందురు ఇది భక్తి మాధుర్యము కేవల అధ్యాత్మిక చింతనలో మాధుర్యముండదని విజ్ఞుల అభిప్రాయము ఆ వైకుంఠధాముని దివ్యావతార శృంగార లీలా వర్ణనల యందే మాధుర్యముండునని వారి మతము.

ఇందలి దివ్య శృంగార మాధుర్యము దైహికమైనది కాదు పాంచ భౌతిక శరీరమును ఇట్టి శృంగారము అన్వయించదు. ఇది కేవలము మానసికమైనది అధ్యాత్మికతా పూర్ణమును, ఆత్మ పరమాత్మల సంబంధియును, అయినట్టిది అదియును నిర్మల జ్ఞాన భక్తి యుతులకు లభించునట్టిది. ఆస్వాదింప దగినది ఇది నిశ్చలమైనది నిరంతర ప్రవాహియగు తైలదారవలె అవిచ్ఛిన్నముగ కొనసాగు నట్టిది. దీనికి పర్యవసానము మోక్షమే మధుర భక్తిని చవి చూచిన ప్రపన్నుడెవడును దానినుండి ఎన్నటికిని దూరము కాజాలడు అది నిరతిశయానంద దాయక మగు భక్తి అట్టి భక్తిని ద్వాపరమున గోపికలు ప్రకటించిరి కలియుగారంభమున నమ్మాళ్వారులు అనుసరించినదియు నీ భక్తి మార్గమే అట్లే 11వ శతాబ్దమునకు చెందిన శ్రీ రామానుజాచార్యులకు సహోదరి యని పిలువబడిన తమిళ భక్తురాలు '' ఆండాళ్'' అనునామెయు మధుర భక్తిని పాటించి తరించినదే. ఇట్టి దానినే 16వ శతాబ్దికి చెందిన ''మీరాబాయి'' అను భక్తురాలును ఆచరించి తరించినట్లు ఐతిహ్యము కలదు. అదే విధముగ ఆదునిక యుగమునకు చెందిన రామకృష్ణుడును మధుర భక్తుడే. ఈయన మనసా, వాచా, కర్మణా, మధుర భక్తుడు. తాను నాయికా వేషమును ధరించి దైవ మును నాయకుడుగా భావించి, తదేక ధ్యానముతో భక్తి నిష్ఠాగరిష్ఠుడై సేవించి తరించిన వాడు.

నవ విధ భక్తి మార్గములలో సంకీర్తనమే ప్రధానమైనదిగ నిరూపింప బడినది. అందును మధుర గీతాలాపన పరమోత్కృష్ట మైనది. గోపికల వలె భగవత్కామూర్తితో తత్సంయోగమునకు తపన చెందుటయే ''మధుర భక్తి''.

కాని నాయికా విరహమును పురుషుడు అనుభవించుట యందే విశేషమున్నది. ''స్త్రీ ప్రాయ మితరం జగత్'' అను వేద వచనము ఇచట స్మరణీయము అనంత కల్యాణ గుణ సంపన్నుడైన ఆ శ్రియఃపతి దక్క స్త్రీ పురుష భేదము లేక సమస్త జీవులును, తక్కిన చరాచర సృష్టియు స్త్రీ ప్రాయమని ఆ వచన భావము.

కనుక పురుష రూపమున నున్న జీవుడు తన స్థితిని తెలిసికొని అనగా ఆత్మజ్ఞాని యై తనమనోనాథుడైన దేవదేవుని విరహమును తాళజాలక (నాయికగా) ఆర్తుడై నానా విధోపచారములచే ఆయన నారాధించుచు మధుర గీతాలాపనము చేయుచు, పరవశుడై స్వామిలో ఐక్య మందుటకు తపన చెందుటయే ''మధుర భక్తి''.

ఇచట ఐక్యత శారీరకమైనది కాదు. మానసికమైనది అదియును లౌకికము కాదు. అలౌకికము, దివ్యము అయినట్టిది తన పూర్వస్థానమైన పరమాత్మలో పునరైక్య మందుటకు ఆత్మ పొందెడి ఆరాటము. ఐహిక సంబంధ సమస్త బంధములను తెగగోసి నారాయణుడు ఒక్కడే తనకు శరణ్యుడనియు, తను చేరుకొన వలసినది వైకుంఠము మాత్రమే అనియు, తెలిసిన మహా జ్ఞాని ఈ మధుర భక్తుడు.

ఇట్టి వారికి మార్గదర్శకురాలుగ భక్త శబరిని ముందుగ జెప్పుకొన వలెను. జీవిత మంతయు రాముని కొఱకు వేచి యుండి ఆయన దర్శన మైనంతనే పరవశురాలై చివఱకు తన ఎంగిలిని కూడ ఆ మహానుభావునిచే తినిపించి తరించిన భక్తురాలు. తదుపరి ద్వాపర యుగపు గోపికలు ఇట్టి భక్తినే ప్రకటించిరి. శబరి అవివాహితురాలు కాని గోపికలు వివాహితలు. పరాధీనలు. ఐనను వారు ప్రాపంచిక విషయములను మఱచి కృష్ణైక్యము నందుటకు ఆరాటపడి నట్టి మధుర భక్తురాండ్రు.

కాని కలియుగమున ఇట్టి భక్తి పురుషులను ఆకట్టుకొనినది కలియుగారంభమున నమ్మాళ్వారు, సూరదాసు, అన్నమాచార్యుడు, పురందరదాసు మొదలైన భక్తులు ఈ కోవకు చెందినవారు మీరాబాయి, ఆండాళు వంటి మహిళా భక్తురాండ్రు న్నప్పటికి వారి సంఖ్య నాతి మాత్రమే. రూపగోస్వామి, వల్లభాచార్యులు, మధుసూదన సరస్వతి, జయదేవుడు, పోతన వీరందరును మధుర భక్తిని ప్రచారము చేసిన వారేయని చెప్పవచ్చును.

కలియుగమున మధుర భక్తులకు ఆదర్శప్రాయుడైన వాడు నమ్మాళ్వారు ఆయన స్వయముగ మధుర భక్తుడై సంకీర్తనా మార్గము ననుసరించి వేలాది పాశురములను తమిళమున రచించి తదనంతర కాల మధుర భక్తులకు మార్గదర్శకుడైనాడు విశిష్టాద్వైతమున విశిష్ట మార్గమైన ప్రపత్తిని మోక్ష మార్గమునకు అనువైన దానినిగ నిరూపించిన వాడీయన. ఆత్మ పరమాత్మల ఐక్యమును బోధించిన వాడీయన.

''వీడుమిన్ ముత్తవుమ్ వీడుశెయ్‌దు, ఉమ్మియర్

వీడు ఉడైయాన్ ఇడై వీడు శెయ్ మినే''

''భగవద్వ్యతిరిక్తములగు సకల విషయ సంగములను వదలి, మీ యాత్మలను ఆత్మనాదుగడు సర్వేశ్వరునికి సమర్పింపుడు'' (49)

ఆయన పిమ్మట దక్షిణ దేశము నందలి మధుర భక్తురాలు '' అండాళ్'' అని చెప్పవచ్చును ఆమెయు సంకీర్తనా మార్గము ననుసరించి మదుర భక్తిని ఆచరించి చివరకా శ్రీరంగనాదునే పెండ్లి యాడిన పరమ పవిత్రురాలు .

నాయిక తన పతికి దూరస్థయైనప్పుడు ఎట్టి విరహవేదనను అనుభవించునో అట్టి స్థితిని స్త్రీయగుటచే ఈమె అనుభవిచుటలో సహజత్వము కలదు. కాని పురుషుడు తన్నుదాను స్త్రీగ భావించుకొని పురుషుడైన శ్రీమన్నారాయణుని తన నాధునిగ ఊహించి అట్టి విరహ వేదనను అనుభవించుటలోనే ప్రత్యేకత గలదు.

అట్టి స్థితిని అనుభవించిన వాడు (ప్రధమ పురుషుడు) నమ్మాళ్వారు పరమోన్నత ప్రపన్న స్థితికి చేరుకొనిన వాడాయన

భక్తి పరవశతలో పాడి, నాట్యమాడి, పొగడి, అలసిపోయిన నాయిక (నమ్మాళ్వార్) ఎంతకును ప్రియుని సమాగమము **కలుగమందునే** అప్రయత్నముగనే కన్నీరు మున్నీరుగ ఏడ్చినదట.

''అబ్జముఖి యాపె భక్తిచే నాడి యాడి

బావము కరంగ నీకతల్ పాడి పాడి

కంట తడిబెట్టి నల్దెసల్ కాంచి కాంచి

'నారసింహా' యటంచు బల్మారు బిల్చు'' (50)

భగవన్నామామృతము వీనుల సోకగనే ద్రవించిన యీ నాయిక, నిద్రకు దూరస్థయగును అథవా నిద్రించినను, అనగా ఏ మాత్రము కునుకు పట్టినను స్వప్నమున తన మనోనాయకుడైన ఆ శ్రియఃపతినే దర్శించును అతని నామమునే కలవరించును పరవశించును అతని చేష్టలనెడి లీలా విలాసములనే స్మరించును దిగ్గున లేచును స్వప్నమని యెంచి దిగులు పడును ఆయనకు దూరయ్యైన ఆమె అనుక్షణము ఆవేదనను అనుభవించును రోదించును, ఈ రోదన మనో వాక్కాయ కర్మలచే ప్రకటితమగును ఇట్టి భక్త్యావేశమునకే మధురభక్తి యని పేరు

ఇట్టి యెడ కవియైన వాడు ఊరకుండునా? ఆ దేవదేవుని అనంతకళ్యాణ గుణములను వర్ణించును అనుకొన కుండగనే అతని గళమున కవితాస్రవంతి జాలువారును మధురాతి మధుర సంకీర్తనలు ఆతని మనోవీధి నుండి కుప్పతెప్పలుగ వచ్చిపడుచుండును అతడీ సందర్భమున నాయిక యగును అట్లే నటించును నర్తించును. నర్తించుచు కీర్తించును కీర్తించుట యనగా మానవ మాత్రులను పొగడుట కాదు. రాజన్యులనో సౌందర్యవతులనో వర్ణించుట కాదు సాక్షాత్తు శ్రీ వైకుంఠధాముని కీర్తించుట. కనుకనే అది సంకీర్తన యైనది అందునను నాయిక ఆ పైన స్వామిపై వలపుగొనును తనకున్న వలపు సుమములను దండగా గుచ్చి కూర్చి శృంగార సంకీర్తనాదామముగ సిద్ధ పరచి తన మనోనాయకుడైన ఆ శ్రీహరిని అలంకరించును షోడశోపచారములను చేయును తనను తాను అలంకరించుకొనును స్వామికి మనసుదీర నచ్చవలయును గదా! ఆయన మెచ్చ వలయును గదా। ఆ తీరులలో ఆ రీతులలో మెలగుచు తానే లక్ష్మియై శేషశాయికి పాదసేవ చేయును ఆపాదములను వర్ణించును కీర్తించును. అంతలోనే ఆసిరులదేవేరికి చెలిమికత్తియగ మారును కొంతసేపటికి ఆ విష్ణువు శ్రీ కృష్ణుడుగ' స్ఫురించును మురళివాదనము వినబడును పరవశయగును తాను రుక్మిణిగనో, సత్యభామగనో, రాధగనో, లేక గోపికగనో మారును. ఆయన కొఱకు తపించును తన మనో బృందావనిలో ఆయనకై వెదకును. అటు నిటు పరుగులు తీయును. ఆ స్వామి దర్శనాభిలాషియై ఎదురు తెన్నులు చూచును. ఆయనతో మనో సంగమమునకై అఱ్ఱులు చాచును. చెలిమికత్తెయగా తనను భావించు కొనినపుడు ఆమె ఆరాటము ఇంతింత యని చెప్పలేము. స్వామి నాయికపై విసరిన వలపు తూపులను తనవిగా భావించును. తన మనమున ఆ తూపులు నాటు కొనును. మోహ పరవశురాలగును ఈ భావము లన్నియు నమ్మాళ్వారు ప్రకటించినవే.

''కలౌ స్మరణాన్ముక్తిః'' అను సూక్తిని ధ్రువ పరచుటకును, కలియుగము నందలి జనులు సంకీర్తనామార్గమున తరించవలయుననెడి సదభిప్రాయముతోడను నమ్మాళ్వారు ''తిరువాయ్‌మొజి'' ని రచించినాడు

అట్లే ఆండాళ్ అనెడి తమిళ భక్తురాలు బాల్యము నుండియే శ్రీ రంగనాధునిపై వలపుగొనినది అవటపత్రశాయిని తన మనోనాధునిగ భావించినది ఆయనను కీర్తించినది పరవశించినది ఆ పరవశత్వమున తానేమి చేయుచున్నదో ఎఱుగని స్థితికి చేరుకొన్నది స్వామి కైంకర్యార్థము తన తండ్రి సిద్ధపరచిన కుసుమ దామములను తన మెడలొ నలంకరించుకొననది కొప్పున ముడుచుకొనినది నీటిలో తన ప్రతిబింబమును చూచుకొని మురిసినది తాను అందముగ మరింత సౌందర్య వంతముగ స్వామికి కనుపించవలయునని ఆమె తపన అట్టైన స్వామి తనను తప్పక చేరదీయు ననెడి ఆశ తనను వివాహమాడునని ఆమెకు గల విశ్వాసము అచంచలమైనది చివరకు కాత్యాయనీ వ్రత మొనర్చి ''తిరుప్పావు' అను పాటలు పాడి సఫలీకృత మనోరథయైనది మచ్చునకు ఆమె పాడిన ముప్పది తిరుప్పావు పాశురముల నుండి ఒకటి -

శిత్తమ్ శిరుకాలే వన్దున్నై చ్చేవిత్తు, ఉన్
పొత్తామరై యడియే పోత్తుమ్ పొరుళు కేళాయ్
పెత్రమ్మేయ్ త్తుణ్ణు మ్‌కులత్తిల్ పిఱన్ద, నీ
కుత్తే వలజ్ఞళై క్కొల్లామల్ పోకాదు,
ఇత్తెప్పఱై కొళ్వానన్రుకాణ్, గోవిన్దా;
ఎత్తెక్కు మేళేళు పిఱవిక్కుమ్, ఉన్దన్నో
డుత్తేమే యావో మునక్కే నామాళ్ శెయ్‌వోమ్,
మత్తైనజ్కా మజ్ఞళ్ మాత్తేలోరెమ్బావాయ్ (51)

ఈ పాశురము యొక్క సారాంశమిట్లున్నది.

'' ఏనాటికిని, ఏడేడు జన్మలకును నీతో విడరాని బంధుత్వము కలవారమే కావలెను నీకే సేవలు చేయువారము కావలెను. మాకు ఇతరము లయిన కోరిక లేమియు లేకుండు నట్లు చేయుము'' (52)

ఇట్లు తాను తరించి, తదనంతర భక్తులను తరింప జేయుటకు తాను చేసిన ముప్పది రోజుల ''కాత్యాయనీ వ్రత సంబంధమైన గీతములను (పాశురములను) రచించి, సంకీర్తనా మార్గమున శ్రీ రంగనాధుని చేరుకొనిని భక్త శిరోమణి గోదాదేవి ( ఆండాళ్).

సంకీర్తనలు రచించి, హరి గుణ గానము చేసి, మదుర భక్తిలో నోలలాడి తాను గోపికయ్యై, శ్రీ రంగనాధునికై తపించి, పరితపించి, చివర కాయననే భర్తగ పొంది ఆయన యందే ఐక్యమైనది ఆ మహాభక్తురాలు, ఆండాళు.

ఈమె వలెనే సంసారసాగరమును సులభముగ తరించిన కృష్ణ భక్తురాలు మీరాబాయి. ఈమె పదునారవ శతాబ్దమునకు చెందినది. ఈమె కాలమును గూర్చి ''శబ్నమ్'' అను వారు ఇట్లు వివరించిరి.

कुछ विद्वान मीरा का जन्म वि. १५६५ सं. मानते हैं। तो अन्य वि. १५६० सं। (53)

ఆమె జన్మ సంవత్సరమును గూర్చి మత భేదము లున్నను, మీరాబాయి 16వ శతాబ్దమునకు చెందినది యని స్పష్టమగుచున్నది

మీరాబాయి పసితనము నుండియే శ్రీకృష్ణుని తన మనోనాధుని నెంచి, సేవించి, కీర్తించి తరించినది అమె రచనలును మధుర భక్తి ప్రపూరితములే అమె రచించిన అసంఖ్యాక కీర్తనలు నేటికిని దేశమందెల్లెడల వ్రజ, పాళీ, రాజస్థానీ మొదలైన బాషలలో బజనకీర్తనలుగా పాడుకొనబడుచున్నవి మచ్చునకు కొన్ని పదములందలి చరణములను ఉదహరింతును

बसो मोरे नैनन में नन्दलाला।
मोहनि मूरत सावरि सूरत नैणा बने विशाल।
अधर सुधारस मुरली राजति, उर बैजन्तीमाला।
छुद्र घन्टिका करि तर सोभित नूपुर शब्द रसाल।
मीरा प्रभु सन्तन सुखदाई भक्त वच्छल गोपाल। (54)

దీనియందు మురళీ కృష్ణుని మనోహర స్వరూప వర్ణన కలదు అట్టి సుందర రూపుడైన నందలాలుని తన కన్నులలోనే నివసించమని కోరుతున్నది మీరా.

हमारे मन राधा श्याम बसी
कोई कहै मीरा भई बावरी - कोई कहै कुल-नासी
खोल के घूँघट प्यार के गती, हरि ढिग नाचत गासी
बृन्दावन के कुन्जगलिन मे भाल तिलक उर लसी
मीरा के प्रभु गिरिधर नागर भक्तिमार्ग मे फंसी। (55)

నా మనసులో రాధాశ్యాముడు నివసించియున్నాడు. మీరా అను పేరుగల నన్ను లోకులు రకరకముల దూషించినారు. ఐనా నేను అడుగు కదిపి గోవిందుని గుణ గానము చేయుచు, బృందావన విహారియైన శ్రీకృష్ణునే ధ్యానించెదను, అని మీరా స్పష్టమొనర్చినది అనగా ఈ ప్రపంచముతో ఆమెకు సంబంధము లేదన్న మాట ఆ ముకుందుని తోడిదే లోకము

ఆమెకు కృష్ణుడే సర్వస్వము ఆయనయే నాధుడు ఈ భావమును వ్యక్తీకరించు ఈ చరణము గమనింతము.

बाई मीरां के प्रभु, ब्रज के वासी
तुम मेरे ठाकुर, मै तेरी दासी (56)

ఇతః పూర్వమే నుడివినట్లు స్త్రీలు నారాయణుని తమ మనోనాధునిగ నెంచుటలో వింత లేదు కాని నమ్మాళ్వారు వంటి పురుషులు సైతము ఇట్టి నాయికా వస్థకు లోనై మధుర భావనావేశపరులై సంకీర్తనలు పాడుట లోనే ప్రత్యేకత యున్నది ఇట్టి ప్రత్యేకత లోని మహిమను గుర్తించిన వాడగుట చేతనే అన్నమాచార్యుడు తానును అదే మార్గమును అవలంభించెను.

సంకీర్తనా సాంప్రదాయమునకు మార్గ దర్శకులు తుంబుర నారదులు వారు అనన్య సామాన్యమైన సంకీర్తనా మార్గము నవలంభించి భగవద్గుణ గానము చేయుచు నిరంతర ధ్యాన నిష్టలో మునిగి ఆ పరమానందము నందలి అనుభూతులను చవి చూచుచు శ్రీ మహావిష్ణువు సాన్నిధ్యమును పొందిన దేవర్షులు వారు. అట్టి సులభ మార్గమును జీవులకు తెలియపరచి, మోక్ష మార్గమును కరతలామలకము గావించుటకు అవతరించిన వారు ఆళ్వారులు ఏతన్మార్గమును అనుసరించి, పండిత పామరు లందరికిని అందుబాటులో నుండగల మధుర సంకీర్తనలను రచించిన వారిలో ఆద్యుడు, ఆంధ్రుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు

బాల్యముననే అధ్యాత్మిక జ్ఞాన పరిపాకము నందిన అన్నమయ్య ప్రపత్తి మార్గము నవలంభించినాడు మధుర సంకీర్తనలచే ఆశ్రియః పతి అనంతావతార కళ్యాణ గుణలీలా వర్ణన గావించి, తాను స్వయముగ పాడి తరించి తన తరువాతి వారందరిని తరింప చేయుచున్నవాడు అన్నమాచార్యుడు

ఈయన రచనలలో ఆ తిరువేంకటాధీశుడే నాయకుడు ఈయనయే నాయిక ఆ పరమాత్ముని వివిధ అవతారముల సారము శ్రీ వేంకటేశ్వరుడే ఏ అవతార విశేషములను వర్ణించినను అవి ఆ శ్రీనివాసునికే చెందును. ఉదాహరణకు ఈ క్రింది శృంగార పదమును గెకొన వచ్చును

''శిఖుత నవ్వుల వాడె శిన్నెకా వీడు
వెఱపెరుగడు సూడవె శిన్నెకా ||శిఖుత||
పొలసుమేని వాడు బోర వీపువాడు
సెలసు మొరవాడు సిన్నెకా।
గొలుసుల వంకల కోరలతో బూమి
వెలసినాడు సూడవె సిన్నెకా ||శిఖుత||

మేటికుఱుచ వాడు మెడమీది గొడ్డలి
సీటకాల వాడు సిన్నెకా
ఆటదాని బాసి అడవిలోరాకాసి
వేటలాడీ జూడవె సిన్నెకా ||శిఖుత||

బింకపు మోతల పిల్లగోవివాడు
సింక సూపుల వాడు సిన్నెకా
కొంకక కలికి య్యై కొసరి కూడె నన్ను
వెంకటేశుడు సూడవె సిన్నెకా (57) ||శిఖుత||

ఈ పాటలో దశావతార వర్ణన ఉన్నది. ఆయన ఎన్ని అవతారములెత్తినను, ఎన్ని వేసములు వేసినను, వెంకటేశ్వరుని రూపము తోనే తనను కూడి నాడు అను భావన నాయిక ప్రకటించినది ఇట్లు అన్నమయ్య ఎన్ని పుణ్యక్షేత్రములు తిరిగినను ఆ యా అర్చామూర్తులను దర్శించి సేవించి తన సంకీర్తనలచే గానము చేసినను వారందరి లోను శ్రీ వెంకటేశ్వరునే చూడ గలిగినాడు ఇట్టిదే గోపాలుని విషయమును.

గోవిందుడీ బాలుడు గోపాలుడు
కావింపరేపల్లె లోని కాంతాలోలుడు ||గోవిందు||

జనియించె గృష్ణుడు పర్వలోక జిష్ణుడు
దనుజాంతకుడు యీతడే విష్ణుడు
పని వడి సజ్జనుల పాలికి వర్ధిష్ణుడు
సనకాదుల మతుల సంచరిష్ణుడు ||గోవిందు||

పెరిగె గంస జైత్రుడు భీషణతేజ మిత్రుడు
వరవసుదేవ దేవకీ పుత్రుడు
సరుస భావించి చూడ సర్వజీవగాత్రుడు
పరగ రుక్మిణీ సత్యభామా కళత్రుడు ||గోవిందు||

వెలసె భూధరుడు విశ్వలోక గురుడు
సులలిత బలభద్ర సోదరుడు
కలిత నిశ్చల శ్రీ వేంకట గిరి సంచారుడు
కలసిన అలమేల్మంగా మనోహరుడు (58) ||గోవిందు||

ఇట్లు దహరించుచు పోయినచో వేలాది సంకీర్తనలు గలవు. ఎన్నియని చెప్పగలము ఇది మాత్రమే గొప్పది యనుటకు వీలు లేనట్టి సంకీర్తనలు గదా!

ఇట్లు అన్నమాచార్యులు తత్పుత్రుడు పెదతిరుమలా చార్యులు, పౌత్రుడు చిన తిరుమలాచార్యులును శృంగార సంకీర్తనలరచన గావించిన వారే. మధుర భక్తిలో తానమాడి ఓలలాడినవారే

అత్యాధునికులలో ఇట్టి మధుర భక్తిలో మునిగితేలినిరంతరము రాముని తన వెంట త్రిప్పికొన్న ఘనత శ్రీ రామ కృష్ణ పరమహంసకు దక్కినది. అయన గొప్ప వేదాంతి భక్తుడు ప్రపన్నుడు. ''ధ్యానమ్తైలధారా వదవిచ్ఛిన్న స్మృతి సంతాన రూపమ్'' అన్నట్లు రామకృష్ణుని సజీవ భక్తి స్రవంతి ఆయన భక్తిలో పరవశుడగును ఉన్మాదియగును. ఏమేమో పలవరించును గంటలు రోజులు దొర్లి పోవును. అయినను బాహ్యస్మృతి యుండదు తానేమి చేయుచుండెన

తానెఱుగడు అట్టి దివ్యస్థితిలో అతను కోటి సూర్య ప్రబా సమానమైన ఒకతేజః పుంజమును గాంచును దానిలో తాను లీనమగును అది ఆయనలో అంతర్లీనమగును

ఒకానొక జటాధారి వలన రామ మంత్రోపదేశమును రామకృష్ణుడు పొందెను. ఆనాటి నుండి బాల రాముడే ''రామలాలా'' ఆతనికి సర్వస్వము. అనేక విధముల రామలాలాను రామకృష్ణుడు సేవించెను తల్లియై లాలించెను జోలపాడెను బుజ్జగించెను. మందలించెను అతడు (రామలాలా) ఒక చోట నుండడట. చెప్పిన మాట వినడట. ''గంగానదిలో ఉఱికి యథేచ్ఛముగా ఈదులాడును ఎంత చెప్పినను వినడు. తామర రేకులను బోలు సుందర నేత్రముల తోడి తన దృష్టి నాపై నిగిడ్చి పకపక నవ్వును. తన కొంటె చేష్టలను మఱింతగా సాగించును'' (59) ఇది వాత్సల్య భక్తి జటాధారి తాను నిత్యము ఉపాసించెడి రామలాలా విగ్రహమును రామకృష్ణుని వద్దనే విడచి పోయెను.

''సాధన కాలమున తొలి నాలుగేండ్లలో శ్రీ రామకృష్ణుడు భగవానుని యెడ ముఖ్యముగా శాంత, దాస్య, ఆపత్య భావముల నవలంభించి వాని యన్నిటి యందును అఖండ విజయోపేతుడయ్యెను కొన్ని సమయములందు శ్రీ దామ సుదామాది శ్రీకృష్ణ మిత్రుల సఖ్య భావమును గూడ అనుసరించెను పిమ్మట వాత్సల్య మధుర భావము లనెడి ప్రేమామృత సాగరోత్తుంగ తరంగములలో నోలలాడ నభిలషించెను'' (60)

శ్రీ రామకృష్ణుడు ఈ అవస్థలన్నియును దాటి మధుర భావభక్తి సాధనకు పూనుకొనెను.

''ప్రేయసి తన ప్రియుని ప్రేమించునట్లు ఏ మహోన్నత భక్తి భావమున బక్తుడు భగవానుని ప్రేమించునో ఏ దివ్య భావము శాంత దాస్యాదికమ్మైన యితర భావములకు ఆలవాలమో అదియే మధుర భావమని గ్రహించ యుంటిమి'' (61)

ఆళ్వారాదులును, అన్నమాచార్యులును తదితరులును సంకీర్తనల చేతనే మదుర బావనలు గల వారై శ్రీహరిని సేవించి తరించిరి. రామకృష్ణునిది మధుర భక్తియే గాని సంకీర్తనా మార్గము కాదు. సేవా భావము మాత్రమే అయినను అది మధుర భావన ఆ భావనా సిద్ధికి ఆతడు స్త్రీవలె వేషము ధరించెను. నటించెను. తానేది సాధింపబూనునో తద్విషయమున ప్రతి సూక్ష్మ వివరమును పాటించుట అతని ప్రవృత్తి.

''మధుర భావ సాధనకై అతడు స్త్రీదుస్తుల నన్నిటిని మధురునడిగి పడసెను. సముచిత సువర్ణా భరణములను (స్త్రీపాత్రధారణమున) నటులు దాల్చు కేశకలాపమును

సైతము మధురుడు సమకూర్చెను ఇక శ్రీరామకృష్ణుని శ్రీకృష్ణ ప్రేమోన్మత్త గోపికా జీవితము ప్రారంభమైనది. శ్రీ కృష్ణుని తమ భర్తగా నొనర్చుమని బృందావన గోపికలు కాత్యాయనీ దేవిని ప్రార్థించినట్లు శ్రీ రామకృష్ణుడు జగజ్జననిని అందులకై ప్రార్థించెను. ఈ సమయమున నాతడు తఱచుపరిచారికగా రాధాకృష్ణులను సేవించును '' (62)

''ప్రాణవల్లభుడగు శ్రీకృష్ణ సమాగమమునకై శ్రీరామకృష్ణుడు మహా పరితాపము నంద సాగెను .. దినములు, నెలలు గడచుచుండెను విరహవేదన దుర్భరమయ్యెను. అన్నపానములను మఱచి అహర్నిశము అతడు విలపించును శ్రీ కృష్ణ సందర్శన మహోత్కంఠ క్రమముగా ప్రేమోన్మాదముగా పరిణమించెను'' (63)

ఇట్లు రామకృష్ణుడు శ్రీకృష్ణుని రాధగా సాధింప నెంచెను తాను రాధగా మారెను

''అపారము, అగాధము, మహోజ్జ్వలము అగు రాధాదేవి శ్రీ కృష్ణ ప్రేమాను రాగములు శ్రీ రామకృష్ణుని యందు అభివ్యక్తమై ''మహాభావము'' అతని యందు రూపు దాల్చెను''

(64)

ఆళ్వారులు, తదితరులు, అన్నమయ్య మొదలైన వారు సంకీర్తనా మార్గమున మధుర భక్తులై తరించిరి. వారెట్టి యవస్థల నందిరో, ఎంత తపన చెందిరో, ఎట్లు భగవానుని సేవించిరో, ఏ యే భావముల ప్రకటించిరో – ఇది యంతయు వారి సంకీర్తనలను గమనించినచో, పరిశీలించినచో తెలియవచ్చును మరి రామకృష్ణ పరమహంస అట్లు కాదు కదా। అతడు సంకీర్తనలు రచించినట్లు గాని, వానిని గానము చేసినట్లు కాని తోచదు అతడిటీవలి వాడగుటచే (19 వ శతాబ్దము) అతని జీవిత చరిత్ర సుస్పష్టముగా మనకు తెలియవచ్చుచున్నది. అతని దివ్యాను భూతులను అతడే తన శిష్యులకు పలు విధములుగ తెలిపెనట. (65)

ఈవిధముగ సంకీర్తనల తోడి మధుర భావన గాని కేవల మధుర భావన గాని మోక్ష మార్గమే యని సుస్పష్టమగుచున్నది

కనుకనే అన్నమాచార్యుడు మధుర సంకీర్తనా గాన మార్గమునవలంభించెను. వేంకటేశ్వరుని నమ్ముకొన్న మధుర భక్తుడాయన ఆది లక్ష్మి నుండి గోపిక వరకు గల అన్ని పాత్రలు అన్నమయ్యవే. చివరకు వారి వారి చెలికత్తెల వరకు తానేయై స్వామిని సేవించినాడు. ''కార్యేషు దాసీ'' అను సూక్తిని అక్షరాల అచరణలో పెట్టినాడు.

ఒకప్పుడు కౌలస్య యగును మరొకప్పుడు యశోదగా మారును మరొక మారు వకుళ మాతగా అవతార మెత్తును ఇట్లు తల్లివలె లాలించును ఉగ్గు పెట్టును, ఊయల లూపును, జోలలు పాడును బ్రతిమిలాడును. ముద్దుగారే సుందర రూపమును తలచుకొని మురిసిపోవును అల్లరి చేసిన మందలించును. బుద్ధులు చెప్పును బుజ్జగించును. పొగడును బయపెట్టును విశ్వరూపము జూచి తాను భయపడును

దాసిగసెవ లొనర్చును చెలికత్తెగ రాయబారము నెరపును. రాధగ అలుక చెందును గోపిక వలె ఆర్తి చెందును విరహ గీతములు పాడును రుక్మిణిగ సేవలొనర్చును సత్యగ సవతి మచ్చరము చూపును మనొనాధునిపై కోపించును. నర్తకియై నాట్యమాడును. అలమేల్మంగ యగును అంతలోనే దూరమగును అలిగి మూలకు ఒదుగును

ఆయనను అందల మెక్కించి పల్లకి మ్రోయును. మోసెడి వారిని ''కులుకక నడవరో కొమ్మలాల'' అని హెచ్చరించును అందలములో నున్నది అలమేల్మంగగా అంతలో ఊహించును కులికితే ఆమె కురులలోని విరులు జల జల రాలునేమోయని కలత చెందును.

ఇట్లు అన్నమయ్య వివిధ శృంగార నాయికలుగా తన్ను తాను ఊహించుకొనును. ఆయనను అన్ని విధముల మురిపించును. మై మరపించును. తాను పరవశ యగును. విరహార్తిచే దుఃఖిత మతి యగును ఆవేశపడును. ఆవేదన పొందును చివర కాయనను పొందును ఈ పొందు శారీరకమైనది కాదు మానసికము. దివ్యమైన సంగమము ఇది అరని తీయని బాధ నుండి పొందిన మధుర ఫలము. ఈ కలయిక ఆత్మ పరమాత్మల విశిష్ట సంయోగము. అదే విశిష్టాద్వైత సిద్ధాంతము. ఇది కాంతాది విషయిక రతి కాదు భగవద్విషయికము ఇందలి మాధుర్యము వర్ణనాతీతము అనుభవైక వేద్యము

# సంఖ్యా సూచి


1. నారద భక్తి సూత్రములు - 2వ సూత్రము

2. శాండిల్య భక్తి సూత్రములు - ప్రథమాధ్యాయము - 2వ సూత్రము 3వ పుట

3 శ్వేతాశ్వతరోపనిషత్తు - 6వ అధ్యాయము - 23వ శ్లోకము

4. శ్రీ వైష్ణవ పత్రిక - స్వర్ణోత్సవ సంచిక - ము - రామకృష్ణమాచార్యులు వారి వ్యాసము - భక్తి ప్రపత్తుల తారతమ్యము నుండి - 136వ పుట.

5. The Philosophy of Visishtadvartha - By P N Sreenivasa Charya - Page 354

6. శ్రీ భాష్యమ్ - గీతావ్యాఖ్యానమ్ - శ్రీ భగవద్రామానుజులు

7,8. శ్రీ వైష్ణవపత్రిక రజతోత్సవసంచిక - భక్తి - ప్రపత్తులు - శ్రీమాన్ ముడుంబై రామకృష్ణమాచార్య వ్యాసము - 137వ పుట

9. ఆంధ్ర శతక సాహిత్యము డా. కె గోపాలరావు - పుట 36

10. The Phylosophy of Visishtadvaitha - by P N Sreenivasa Charya Page 358

11. శ్రీమద్భగవద్గీత - విజ్ఞానయోగము - 17, 18, 19 శ్లోకములు

12. శ్రీమద్భగవద్గీత - భక్తి యోగము - 2వ శ్లోకము

13. శ్రీ గీతామృతము - శ్రీ సీతారామ యతీంద్రుల వ్యాఖ్యానము - 134వ పుట

14 శ్రీమద్భగవద్గీత - ద్వాదశాధ్యాయము - భక్తి యోగము 16, 18 శ్లోకములు

15. భక్తి యోగము - శ్రీ చిరంతనానందస్వామి - 1వ పుట

16 యోగ సూత్ర వృత్తి - భోజదేవుడు

17 The Gospel of Love - Lala Kannomal (1923)

18 The Origin and development of Vaishnavism - S Jaiswal Page 119

19 వైష్ణవాంధ్ర వాఙ్మయము డా. వేటూరి ఆనందమూర్తి - 37వ పుట

20. భాగవతము - వ్యాస ప్రణీతము - 3, 29-11, 12

21. భక్తి యోగము – చిరంతనానందస్వామి – అనువాదము 13వ పుట

22 శ్రీమద్భగవద్గీత – రాజవిద్యారాజగుహ్యయోగము – 33వ శ్లోకము

23. తెలుగు కవులు – భక్తి తత్వము – డా మహతీ శంకర్ 2వ పుట

24. బగవద్భక్తి రసాయనము – ప్రథమోల్లాసము 3వ శ్లోకము

25 భగవద్భక్తి రసాయనము – వ్యాఖ్యాత – దామోదర శర్మ – పీఠిక నుండి.

26. నారద భక్తి సూత్రములు – ప్రథమాధ్యాయము 18వ పుట

27. నారద భక్తి సూత్రములు – దొడ్డ వెంకటరెడ్డి గారి వివరణము

28 నారద భక్తి సూత్రములు – చతుర్థాధ్యాయము 51వ సూత్రము.

29. దివ్య ప్రబంధమాదురి – శ్రీమాన్ కె టి ఎల్ నరసింహాచార్యులు పుట – 20.

30 భాగవతము – 22వ అధ్యాయము – 21వ శ్లోకము

31 భాగవతము – 22వ అధ్యాయము

32 నారద భక్తి సూత్రములు – పంచమాధ్యాయము 82వ శ్లోకము

33 తెలుగు కవులు – ఏడవ అధ్యాయము – 16వ శ్లోకము

34. బగవద్గీత – ఏడవ అధ్యాయము – 16వ శ్లోకము

35 శ్రీమదాంధ్రమహాబారతము – అష్ట మస్కంధము – పోతన

36. శివానంద లహరి.

37. మకున్దమాల – కులశేఖరాళ్వారు

38 శ్రీమధ్భాగవతము – దశమస్కందము – 38వ శ్లోకము

39,40 శ్రీవైష్ణవ పత్రిక రజితోత్సవ సంచిక – పుట 82 కర్మప్రపత్తి వ్యాసము నుండి – శ్రీమాన్ మొలుగురామానుజాచార్యులు.

41. శ్రీమద్భగవద్గీత – ద్వితీయోధ్యాయము – 7వ శ్లోకము

42 శ్రీమద్భగవద్గీత – అష్టాదశోధ్యాయము – 62వ శ్లోకము

43. శ్రీమద్భగవద్గీత – అష్టాదశోధ్యాయము – 66వ శ్లోకము

44. శ్రీవైష్ణవపత్రిక– రజితోత్సవసంచిక– 1976 మే– భక్తి ప్రపత్తుల తారతమ్యములు. వ్యాసము – శ్రీమాన్ ముడుంబై రామకృష్ణమాచార్యులు పుట – 139.

45 శృంగార సంకీర్తనలు – టి టి డి ప్రచురణ – పీఠిక – పుట 15

46. తిరువాయ్ మొజి – పి టి జి వెంకటలక్ష్మి నర్సింహాచార్యులు వారి పీఠిక – నమ్మాళ్వార్ల వైభవ సంగ్రహము నుండి పుట – 1

47, 48.अन्नमाचार्य और सूरदास - डा. एम. सन्नामेशम पुष्ठ २२-२४.

49 శ్రీ శఠగోప గీతామృతము (131వ పద్యము) కే టి యల్ నరసింహాచార్య అనువాదము.

50. శ్రీ శఠగోపగీతామృతము (133వ పద్యము) కె టి. యల్. నరసింహాచార్య అనువాదము.

51 తిరుప్పావు – ఆండాళ్ – 29వ పాశురము.

52 తిరుప్పావు – ఆంధ్రవివరణము – శ్రీమాన్ శ్రీ భాష్యం అప్పలాచార్యులు – పుట 695

53 मीरा - बृहत-पद सग्रह - पद्मावती - शबनम पृ - 3

54 मीरा बृहत पद संग्रह शबनम - पृष्ठ - 142

55 मीरा बृहत पद संग्रह - शबनम पूष्ठ - 155

56 मीरा बृहत पद सग्रह - शबनम - पूष्ठ - 159

57 శృంగార సంకీర్తనలు – 12వ సంపుట టి.టి డి ప్రచురణ, పద సంఖ్య 182

58. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు – పుట 79 పదసంఖ్య 137 తి తి దే ప్రచురణ

59 శ్రీరామకృష్ణ జీవిత చరిత్ర – చిరంతనానంద స్వామి – పుట – 182

60 శ్రీ రామకృష్ణ జీవితచరిత్ర – చిరంతనానంద స్వామి పుట – 179

61 శ్రీ రామకృష్ణజీవిత చరిత్ర – చిరంతనానంద స్వామి పుట – 183.

62 శ్రీ రామకృష్ణ జీవిత చరిత్ర – చిరంతనానంద స్వామి పుట – 184

63 శ్రీ రామకృష్ణ జీవిత చరిత్ర – చిరంతనానంద స్వామి పుట – 185

64 శ్రీ రామకృష్ణ జీవిత చరిత్ర – చిరంతనానంద స్వామి పుట – 186

65 శ్రీ రామకృష్ణ జీవిత చరిత్ర – చిరంతనానంద స్వామి పుట – 187

# శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని
# శృంగార సంకీర్తనలు - మధుర భక్తి

(అన్నమాచార్యుని మధుర భక్తి)

## 5వ ప్రకరణము

పంచమ ప్రకరణము

# అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలు - మధుర భక్తి

శ్రీ కైవల్యమునకు సోపానమును, నిరంతర ఆనంద దాయకమును అగు భక్తియే రసమని మహా మనీషులు, భక్తాగ్రగణ్యులు ఆలంకారికులు అయిన రూపగోస్వామి, మధుసూధన సరస్వతి మొదలగువారు ప్రతిపాదించి నిరూపించినట్లు ప్రకరణాంతరమున వచించి యుంటిని.

అట్టి ''భక్తి రసము''నకు ఆలంబన విబావము భగవంతుడు ఆయన పరమోదాత్త చరిత్రలు విభావములు భగవదాకార చిత్తవృత్తి స్థాయీ భావము అదియే ''బగవద్రతి''. అను భావములు ఆయా సమయములందు జనించిన నేత్రాది వికారములు, నిర్వేద, శంకా హర్షాదులు వ్యభిచారులు ఇవియే పరమానంద స్వరూపమగు ''భక్తి రసము'' గా పరిణమించును జీవాత్మ పరమాత్మల నాలంబముగా గొని నాయికా నాయకుల పరస్పర శృంగార విలసన రూపమున ''దివ్య శృంగారము'' గ గూడ రూపము నొందును'' అని డా వేటూరి ఆనందమూర్తి గారు వివరించిరి (1)

రసస్ఫూర్తి కలుగు వరకు సహృదయుల హృదయముల నుండు భావము స్థాయీ భావము కనుక ఇట్టి స్థాయీ భావమునే రసమని చెప్పవచ్చును

ఇట్టి స్థాయి బావము బక్తి రసమున పుష్కలముగ గలదు

ఏలనన కాంతాది విషయక రతి విషయమునను నిరతిశయానందముకలుగుటకు కారణము లున్నవి కాని అవి మాయా కల్పితములు

కాన దేవాది విషయక రతియందు కలుగు నిరతిశయానందము అనంత *కాలముండునది

* దేవాది విషయమనగా ఇచట ఇతర దేవతలు కాక కేవల పరమానంద స్వరూపుడైన శ్రీమన్నారాయణుని సంబంధ విషయము కనుక అది భగవద్రతి, భగవద్రతి వలన లభించు ఆనందము నిత్యమైనది అట్టి భగవంతుని ఆకారము మనోగతమై పుష్కల రసరూపమును పొందుచున్నది

కాన్తాది విషయకమైన రతివలన కలుగు సుఖము తృప్తితో అంతమగుచున్నది కాని భగవద్రతి అట్లు కాదు ఒక మారు ఆయన దివ్య స్వరూపము మనసున ముద్రితమైనచో ఇతర వికారములెన్ని కలిగినను భగవదాకారతను తుడిచివేయజాలవు ఆయానంద మును హరింపజాలవు

ఈ కారణము చేతనే భగవద్భక్తికి రసమని నిరూపించినారు మధుసూధన సరస్వతి మొదలగువారు

భగవద్విషయక రతి వలన ఆనందము ననుబవించు భక్తుడు దానిని విస్మరించుట గానీ, కోల్పోవుట గాని జరుగదు మదుసూధన సరస్వతిని గూర్చి వ్రాయుచు సన్నిధానం సూర్యనారాయణగారు ఇట్లనిరి

'' అనుబవమాత్రము వలననే సాక్షాత్సుఖ విరుద్ధములయిన శొక, క్రోధ, భయాదులకు రసత్వమంగీకృతమైయున్నది అనుభవ సిద్ధమై మిగిలిన రసముల కన్న వేయి రెట్లెక్కువగా రస్యమానమగుచున్న భక్తిని రసము గాదనుట ఎట్లు ? రసకొవిదుల దేవాది విషయక రతి రసము కాదనియు, బావమనియు చెప్పిరి. ఇతర దేవాది విషయక మగు రతి భావమే

ఏలన, వారును జీవులే యగుట చే పరమానందము గలుగదు పరమాత్మ స్వరూప శ్రీకృష్ణరతి పరమానందమునకు గొంపోవును మరియు కాంతాది విషయకములగు నేరసములందును భగవద్రతి యందు వలె బూర్ణ సుఖము లేక యానందము కలుగును కాన వాని యందు రస పుష్టి లేదు అవి క్షుద్ర రసములు భగవద్రతి పూర్ణ సుఖము. అది మిణుగురు పుర్వుల కన్న సూర్యకాంతి ఎట్లు బలవత్తరమోయట్లే మిగిలిన రసముల కన్న శ్రేష్టతరము, బలవత్తరము'' నని వచించినాడు 2

ఇట్టి భక్తి రసము లోని మాదుర్యమును గ్రహించిన తాళ్ళపాక అన్నమాచార్యులు వేలాదిగ సంకీర్తనలు రచించి తరించినారు. వాని యందు భగవద్రతి సంబంధ శృంగార లీలా వర్ణన గావించి ఆనందడోలికలలొ నోల లాడినారు శృంగార సంకీర్తనల పేరుతో రచించిన ప్రతిపదము భగవద్రతితో ముగింపు ఈయబడినదే వివిద నాయికలు చివరకు శ్రీనివాసునితో తాదాత్మ్యమును పొందినట్లు శృంగార సంకీర్తనలన్నింటి లోను గమనించవచ్చును

అన్నమాచార్యులు రచించినవి ''మధుర భక్తియుత'' సంకీర్తనలు కావున అవి శృంగార సంకీర్తన లయినవి శృంగార సంకీర్తనలగుట చే వాని యందు అలంకార శాస్త్రమున పెర్కొన బడిన అష్టవిద నాయికలు, చతుర్విధ నాయకులు, నాయికా సహాయకులు అందరూ

చేటు చేసికొనినారు ఆ నాయికలు అనుభవించు కామావస్థలు వర్ణింప బడినవి స్వీయ పరకీయ నాయికలు, విప్రలంబ, సంభోగ శృంగారములును వర్ణింప బడినవి సామాన్య నాయికకు తాళ్ళపాక వారి శృంగార పదములందు తావులేదు కాని తరువాతి కాలమునకు చెందిన క్షేత్రయ్య పదములలో భక్తితో పాటు రసదృష్టి కూడ పరిపుష్టమగుటచే వివిధ శృంగార నాయికలకు స్థానము లభించినది అందువలననే క్షేత్రయ్య పిమ్మట వచ్చిన అలంకారికులు సామాన్యను గూడ సమర్థించినారు అక్బర్ షా (బడే సాహెబ్) రచించిన శృంగార రస మంజరి యందు ఈ విషయము గోచరించును.

Love to him (According to the Author of Sringara Manjari) is an emotion which can have only one object whether it be the case of Sviya or Parakeeya, Kulata or Samanya It is some thing which having come into being for some body, produces no desire for any body else It can never before money and yet to be love, and such love arises not by any reason of beauty, Experience shows that such love is a blessing that providence gives us 3

''ఏది ఏమైనను క్షేత్రయ్య మొదలగు పదకవులకు ఒక స్ఫూర్తిని కలిగించి మార్గదర్శకములైనవి తాళ్ళపాక వారి రచనలేయని చెప్పవచ్చును ఈ విషయమున వీరు వేసిన పునాదుల మీదనే తరువాతి కాలమున జరిగిన అలంకార శాస్త్ర నిర్మాణమంతయు నిలువవలసిన దాయెను '' అని డా వేటూరి ఆనందమూర్తి గారు అభిప్రాయము వెలిబుచ్చిరి 4

అట్టి తాళ్ళపాక వారి రచనలలో అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలు ప్రత్యేకతను సంతరించుకొనినవి నాయికా నాయక స్వరూపము స్థితి భేదమును బట్టియు, అవస్థా భేదమును బట్టియు అనేక రీతులుగా గోచరించును

అన్నమాచార్యుని రచనలలో ఏడుకొండలవాడైన తిరువేంకట నాథుడే నాయకుడు లక్ష్మీదేవి, భూదేవి, నీళాదేవి మొదలయిన నాయికలు ఎంతమంది యున్నను, అలమేల్మంగయే ప్రధాన నాయిక, ఇన్నింటినీ మించి అన్నమయ్యయే స్వయముగ నాయికయై విరహము ననుభవించుచుండును మధుర భక్తిని ప్రకటించును సాధారణముగ శృంగార రచనలు చేయు కవులు ఆయా సందర్భముల ననుసరించి శృంగార రస పోషణమున సహకారులగుచుందురు కాన మధుర భక్తులు ఆ సాంప్రదాయమును పాటించుచునే తామే నాయికలగుట విశేషాంశము, అట్టి నాయికలు తమ మనోనాయకుడైన దేవదేవుని సంసర్గముచే

దివ్యాను భూతుల నందుట జగద్విఖ్యాతమే వారి వలెనే మధుర భక్తులైన జీవాత్మలు పరమాత్మతో ఐక్యమై అట్టి అనిర్వచనీయానంద సంసర్గ స్థితిని పొంద గోరుటయు సహజమే, అట్టి మదుర భక్తుడైన అన్నమయ్య తిరువేంకటనాధుని తన మనోనాయకుడుగ నెంచి ఆయన సామీప్యమును మనో వాక్కాయ కర్మలచే కోరుకొనినాడు. తొలినాళ్ళలో ఆయన ఆధ్యాత్మ రచనలు మాత్రమే చేసినను, వైవాహిక జీవిత ప్రారంభము నుండి క్రమ క్రమముగా శృంగార కీర్తనల రచనలు గావించి యుండవచ్చును. అప్పటికి ఆయన భాగవత కావ్యమును సంపూర్ణ అవగాహనతో పఠించి అందలి గోపికా భక్తిని జీర్ణించుకొని యుండవచ్చును. అంతకు మున్నే శ్రీ వైష్ణవ ఆచార్యుల భక్తి రచనలు సర్వము పఠించి సుగ్రాహ్యము గావించు కొనిన వాడగుట చేతను, ఆయనకు శ్రీమన్నారాయణుని దివ్య శృంగార లీలలు మధురోహలను కలిగించిన వనుటలో సందేహము లేదు. అందునను ఆయన కేవల మానవ మాత్రుడు కాడు. నందకాంశ సంభూతుడు హరి భక్తిని తేట తెలుగున ప్రచారము గావించుటకు అవతరించిన దివ్యుడు, కారణ జన్ముడు జన్మించిన తన వంశమును, తన గానామృతముచే సమకాలీనులను, రచనలచేత దనంతర కాలము వారిని తరింపజేయుటకు దివి నుండి భువికి దిగి వచ్చిన మహనీయుడు అయన అందులకే గురువుల శుశ్రూష లేకుండగనే శతకములు చెప్పగలిగెను విష్ణుభక్తుల చరిత్రములు, వారి రచనలు, గురు శుశ్రూష వలన ఆయనకు లభించిన బాగ్యములు. వీనికి తోడు అనుకూల వతులైన ఇరువురు ఇల్లాండ్రు – వెరసి శృంగార పద రచన కావ్య పఠనము, స్వానుభవము జోడై, భక్తి సోపానముల మరొక మెట్టుపై కెక్కించి శ్రేష్టతరమైన మధుర భక్తునిగావించి, అనంతుడైన శ్రీమన్నారాయణునిపై వేలకొలది సంకీర్తనలు రచింపజేసినది

అట్టి దివ్య శృంగార సంకీర్తనలు సాధారణులను సైతము మైమరపింప జేసి పరవశింప జెయు ననుటలో విప్రతిపత్తి యుండరాదు ఆ కీర్తనలను భక్తి పారవశ్యముతో వినువారిని ఆనందడోలికలలొ నూగులాడించుటయే గాక తిన్నగా ఆ శ్రీనివాసుని పద సన్నిధికి గొంపోవు ననుటలో అతిశయోక్తి లేదు

ఇట్లన్నమయ్య శృంగార సంకీర్తనలను గురించి ఎంత చెప్పినను తనివి తీరదు. అట్టి వానిలోని మధుర భక్తిని, తదాలంబన మగు నాయికా నాయక స్థితిని, స్వరూప స్వభావాలను నాయోపిన కొలది పరిశీలించి ప్రకటించుటయే ఈ సిద్ధాంత వ్యాసము యొక్క ప్రధానోద్దేశ్యము

అన్నమాచార్యుని శృంగార రచనలలో అష్టవిధనాయికలు, వారనుభవించిన

దశకామావస్థలు, పూర్వరాగ, విప్రలంబములు, సంభోగశృంగారములు మొదలైన అలంకార శాస్త్రజ్ఞులు నుడివిన విశేషములన్నియు పుష్కలమైన రసముతో చిప్పిల్లినవి ఏ నాయిక యైనను, ఏ యవస్థనందినను, చివరకు తిరువేంకట నాయకునితో సంసర్గము నందుట, అను భావన పరాకాష్ఠనందు కొనుచున్నది ప్రతికీర్తనము నందును ఇట్టి భావములు తప్పక గోచరించును. నాయిక ఎంత ఆవేదన పొందినను, నాయకుడు ఇతర స్త్రీలను మన్నించి వచ్చిన చిహ్నములను గుర్తించినను, ఆర్తి చెందిను, నాయకునిపై అలిగినను, చివరకు ఆ నాయకునిచే తనే మన్నింపబడి అతనితో శృంగార రసవాహినిలో తేలుటయే ప్రతి కీర్తనయందలి అంతిమ ఫలము ముందుగ ''అష్ట విధ నాయికా ల గురించి ప్రస్తావిస్తాను.

స్వాధీన పతిక 12-67

చాలదా యీ చనవులు
మేలపు చేతల నిన్ను మెచ్చించ గలిగె ||చాలదా||

ఎంతటిదిరా నిన్ను నిందాకా రానీక
పంతమాడి వలపించి బాసగొన్నది
ఇంతి నోచి నట్టి నోము ఎటువంటిదో నీ
చెంత జేరి నీ మంచి చెక్కునొక్కగలిగె ||చాలదా||

ఎవ్వతెరా నిన్ను నెలయించి తన నిండు
జవ్వనము విలువిచ్చి జట్టి గొన్నది.
అవ్వలదాని భాగ్యమది యెట్టిదో నీవు
పవ్వళించు పరుపుపై పవ్వళించ గలిగె ||చాలదా||

ఎట్టిదిరా సతి నిన్ను యింటిలోన వెళ్ళనీక
పట్టుకొని కౌగిటిలో బాయనీనిది.
అట్టి నిన్ను తిరువేంకటాధీశుడా నీవు
దట్టించు కౌగిటిలో తగులగ గలిగె ||చాలదా||

ఇందలి నాయిక ''స్వాధీనపతికా' పతిని పూర్తిగా స్వాధీన మొనర్చుకొనినది. తన యిచ్చవచ్చిన రీతి మలచుకొన గలిగినది. తన మేలపు చేతలచే ఆయనను మెప్పించి తిన్నగా నాయకుడైన వేంకటనాధుడు పవ్వళించు పరుపుపై పవ్వళించ గలిగినది తన కౌగిటి నుండి సడలనీయక బంధించినది.

సదా సాకూతా ఆజ్ఞాకర ప్రియ తమా స్వాధీనపతికా'' యని రస మంజరీ కారుని నిర్వచనం 5

''వరుడు కైవసమైన వనిత స్వాధీన పతిక'' 6

''కాంతుడు రతిగుణాకృష్టుడై ఎవతె చెంతను బాయడో విచిత్రవిభ్రమాసక్త ఆనాయిక స్వాధీన పతిక యన బడును'' వేదము వేంకటరాయశాస్త్రి సాహిత్య దర్పణము. పుట 49.

''నాయకుడు సురతాతిరసబద్ధుడై తన పార్శ్వ మందుండగా అధికమగు హర్ష సౌభాగ్య అభిమానములను కలిగి యుండు నాయిక ''స్వాధీన భర్తృక అనబడును'' (నాట్యశాస్త్రము పి ఎస్ ఆర్ అప్పారావు గారు పుట 678 ) 8

2 మదించిన యేనిగకు మావటీడు వంటి దాపె
సదరాన నిన్నిటు వసము చేసుకొనెను ||పల్లవి||

కప్పురాన గొనివేసి కామిని నిన్నిపుడిట్టె
చిప్పిల దనమొకము చేసుకొనెను
ముప్పిరి నంతటి మీద ముంచి చేతులెత్తిమొక్కి
అప్పనము చుట్టముగా నటు చేసుకొనెను ||మదించిన||

తొడమీద గూచుండి తొయ్యలి చన్నులనొత్తి
చిడు ముడితో గిందు సేసుకొనెను
జడిగొనమోవి తేనె చవి చూపి నిన్నింతలో
కడలేక తన సొమ్ముగా జేసుకొనెను ||మదించిన||

సేసవెట్టి పెండ్లాడి చేరి నిన్నలమేల్మంగ
చేసూటి మగనిగా జేసుకొనెను
ఆసల శ్రీ వేంకటేశ అన్నిటా నిన్ను గూడి
పోసరించి పాయరాని పొందు సేసుకొనెను ||మదించిన||

ఇందలి శృంగార నాయిక తన భర్తను సంపూర్ణముగ కైవసము గావించుకొనినది ఆమెను మావటీడు తోను, శ్రీ వేంకటేశుని మదించిన '' ఏనిగె'' తోను అన్నమాచార్యుడు పోల్చి చక్కని పోలిక చెప్పినాడు మావటీడు చెప్పినట్లు ఎంతటి మద గజమైనను నడచుకొన వలసినదేగదా! ఈమె అలమేల్మంగ యగుటచే ''దివ్య'' శుభాక్షతలతో పెండ్లి చేసికొని తన

మగనిగా జేసికొనినది. నాయకుడు ఆదిదేవుడు తన సర్వస్వమును ఆయనకు సమర్పించుకొని మరీ తన వశమొనర్చుకొనినది.

లౌకికశృంగార కావ్య పఠనము వలన పాఠకుడు అమందానందము ననుభవించును మరి ఆ దివ్య దంపతుల శృంగార లీలా వర్ణనము పఠించునపుడు అలౌకికమైన ఆనందానుభూతి కలుగక మానదు. ఇచ్చట శబ్దముల రీత్యా మనకు కొంత ఇబ్బంది కలిగినను, అది లౌకికముతో ముడి పెట్టక కేవలమై ఆత్మ పరమాత్మల సంగమ సన్నివేశమును గ్రహించినచొ ఎంతటి మధురానుభూతి కలుగును. అట్టి మధుర భావములు ఇమిడి యున్నవగుట చేతనే అన్నమయ్యా పదములు మధురభక్తి గీతాలుగా ప్రసిద్ధినందినవి

లౌకికాత్మల సంయమునమునకే పరవశత్వము గలుగు చుండ ఆత్మ-పరమాత్మల సంయోగము ఇతరమును తలపింపజేయునా? నిధికన్నా రాముని సన్నిధి, సేవ సుఖదాయకములు గదా! అని త్యాగరాజు నుడివిన మాటలు ఇచ్చట స్మరణీయములు

మరియొకకీర్తనలో అలమేల్మంగ శ్రీనివాసుని గుండెపై నెలకొన్ని విదమును అన్నమయ్యా ఇట్లు వర్ణించినాడు

గారవించి పతి నీకు గైవశమై వుండగాను

చేరి యంత నవ్వినాను చెల్లునే నీకు

మేర మీరి నిన్నే పొద్దూ మెడగట్టు కండగాను

ఆరితేరి బిగిసినా అందమే నే నీకు 24-255

నిరంతరము నాయిక నెడ బాయ కుండుటకు గాను నాయకుడైన శ్రీనివాసుడు ఆమెను మెడలోనే కట్టుకొనినాడట. ఆమె గట్టిగా బిగుసుకొనినను అది అందమే. మదురమైన బావన

నిరంతర పతిసాన్నిధ్యము లభించుట నాయిక భాగ్యము. పతి సతి మాట మీరని వాడైన మరింత సౌభాగ్యము.

4 మగడు మన్నించిన మగువది భాగ్యము
సొగసియాతడు మోహించుట బాగ్యము

వెగటులేని రతుల వేసరినిది భాగ్యము
మగువల వలపులు మరి ఏమి చెప్పేరే ||చెలులారా||

శ్రీ వెంకటేశుడేలె మచ్చిక నీ సతిది భాగ్య
మా వేళ నాతడు మెచ్చినది భాగ్యము
తాపుకొని యెప్పుడే తన వాడౌటే భాగ్యము
యేవని తల నేరుపులికి నేమి చెప్పేరే ||చెలులారా||

ఇట్టి స్వాధీన పతికలు అన్నమయ్య మధుర భక్తి ప్రపంచమున అసంఖ్యాకముగ గలరు.

ఇంకను ఈ క్రింది కీర్తనలు చూడనగును.

1. మొగ మాయలాడివే మొగని నింతసేసితి (22-486)

2. కంటి మిదె మిమ్మిద్దరి కన్నుల పండువుగాను (28-236)

3 అలుమేలు మంగనీ వభినవ రూపము (12-159)

(ఇది డా వేటూరి ఆనందమూర్తి గారిచే ఉదహరింపబడినది)

## వాసక సజ్జిక

''అద్యమే ప్రియ వాసర ఇతి నిశ్చితయా సురత సామాగ్రీం సజ్జీకరోతి సావాసక సజ్జా, వాసకో వారః'' 10 రసమంజరి.

''ప్రియాగమవేళ గృహము, దనువు సవరించు నింతి వాసకసజ్జ'' (11) ఆంధ్ర సాహిత్య దర్పణము.

'' ఉచిత వాసకము నందు (తగిన కాలమందు - రాత్రి) రతి సంభోగలాలసయై సంతోషముతో అలంకరించుకొను నాయిక''వాసకసజ్జ'' యనబడును (12) నాట్యశాస్త్రము.

ఇదివో మా విన్నపము యిట్టిచిత్తగించవయ్యా
సుదతి వున్న జాడలు చూతువురావయ్యా || ఇదివో||

ఇపుడే వచ్చేవని ఇంట వాకిటను చెలి
కప్పురపు టారతెత్త గాచుకున్నది.
దప్పిదేర నీకు నీయ తట్టిలోన బాగాలు
కుప్పలుగా మీ దెత్తుకొని వున్నది ॥ ఇదివో॥

ఆరగించ వచ్చేవని అన్ని దెరగుల నెల్లా
చేరవిందాయితముగా జేసుకున్నది
గారవాన బాదాలు గడిగే నంటా బన్నీరు
ఆ రీతి బైడి బిందెల నమరించుకున్నది ॥ ఇదివో॥

పవళించవచ్చేవని పట్టిమంచము మీదట
వివరించి పూ బరపు వేసుకున్నది
నివిరి శ్రీ వేంకటేశ నీవు విచ్చేసి కూడగ
తవిలి యలమేల్మంగ తనివితో నున్నది ॥ ఇదివో॥

ఇందలి నాయిక అలమేల్మంగ, తనను తాను శృంగారించుకొని పడక సవరించి, దానిపై పూలు జల్లి పడకటింటిని సిద్ధము చేసి కొననది. నాయకుని కొరకెదురు తెన్నులు చూచుచున్నది నాయకుడు రాగానే కర్పూరపు టారతులు ఎత్తి బాగాలు (తాంబూలము) ఇచ్చుటకు సిద్ధముగ ఉన్నది. పన్నీటి పైడి బిందెలు పాదప్రక్షాళనకు ఆయత్తము చేసినది.

ఇంతటి ప్రయత్నము వ్యర్థమగునా! ఇంతగా మనసార కోరుకున్న మనోనాయకుడు వేంకట నాథుడు రానే వచ్చెను. అన్నులమిన్నయైన అలమేల్మంగను తవిలి కూడెను. ఆమె తనివి నందెను.

వాసక సజ్జక యైన నాయిక నాయకునికై ఎదురుచూచుటయే సామాన్య కావ్యలక్షణములలో చెప్పబడినది కాన యిందు ఆ ఎదురుచూపుల ఫలితముగూడ చెప్పబడినది నాయికమధుర భావనలతో గృహమును మనోహరముగ దిద్ది తీర్చుటకు తగిన ఉపాయము ఆమెకు లభించినది ఇట్టిదే మరియొక పదము.

ఎప్పుడు గాని రాడో యెంత దడవాయ – కాలి
చప్పుడాల కించి మతి జల్లురనె నమ్మా ॥పల్లవి॥

ఇద్దర మదిరి పాటు ఏకాంతాన నాకు కొన్ని
సుద్దులు తలచి మేను చురుకనెనమ్మా
పెద్దగా గస్తురి బొట్టు పెట్టిన నీతడు గోర
దిద్దుట దలచి మేను దిగులనె నమ్మా ॥ ఎప్పుడు॥

పాయక యాతడూ నేనూ బవ్వళించే యింటి వంక
బోయి పోయి కడుచిన్న బోయితి నమ్మా
తోయపు గుబ్బల చన్నుదోయి మీద వాడొత్తిన
పాయపు జంద్రుల జూచి బ్రమసితి నమ్మా ॥ ఎప్పుడు॥

కూడిన సౌఖ్యములందు కొదలేని వాని నా
వేడుక మతిదలచి వెరగాయ నమ్మా
యీడు లేని తిరువేంకటేశుడిదె నా తోడ
నొడి నట్టే నా చిత్త మలరించెనమ్మా ॥ ఎప్పుడు॥

ఇందలి నాయిక పడుకటింటిని చక్కగా సవరించి నాయకునికై ఎదురుచూచి చూచి చివరకాయనతో సంగమింప గలిగినది ఇట్లెదురు చూచుట యందలి తపనను అన్నమయ్య మదురముగ వర్ణించెను. అలమేల్మంగను అడ్డుపెట్టుకొని ఆయన తానే నాయికయై తన మధురభక్తితొ వాక్ప్రసూనములతో ఆ దేవదేవుని దివ్య శృంగార లీలా విశేషములను స్తుతించెను

## విరహోత్కంఠిత

1 ''సంకేత స్థలం ప్రతి భర్తురనాగమన కారణం యా లోచయతి సా ఉత్కా''

అస్యాచేష్టాః - అరతి సంతా। భృంబ్రాంగా కృష్టిః। కంపరుదిత స్వావస్థా కదనాదయః'' (రసమంజరి) (13)

2 పతిరాక తడవుండ నుత్కంఠదాల్చునింతి విరహోత్క (14)

3 అనేకకార్యవ్యాసంగములచే ప్రియుడు రానిచో దుఃఖార్త యగు నాయికవిరహోత్కంఠిత యనబడును (నాట్యశాస్త్రము) (15)

4 వచ్చుటకు ఉద్యుక్తుడయ్యును దైవ వశమున ప్రియుడు రాడేని అతని రామి వలన వగచే పీడితయైనట్టిది విరహోత్కంఠిత యనబడును (సాహిత్య దర్పణము) (16)

ఉత్కంఠిత యనగా విచారించునది అని యర్థము పతిరాక కొరకు ఎదురు తెన్నులు చూచుచు ఆలస్యకారణముగ విచారించునాయిక ''విరహోత్కంఠిత'' నిట్టి పాట వద్దయ్యా

తెగువలు నీవు రాగా దిప్పుకొంటి గాని ||పగవారి||
నీసుద్దులే ఆడుకొంటి నెలతల తోడుత
అసలు మతిబెట్టు అలసితిని

గాసిలిన మీద కాకలు దొట్టించగాను

వీసమంత పొద్దైనా వేగించ రాదాయ ||పగవారి||

చొప్పుగా నీకెదురులు చూచి వాకిటను

రెప్పల ముయ్యగలేక రేసువడితి

వుప్పతిల్లు వలపెల్ల నొక్కమాటే రేగగాను

నిప్పు వంటి తమకము నీగగ రాదాయను ||పగవారి||

కందువకు నీవు రాగా గక్కన గాగిట నించి

యిందుకా శ్రీ వేంకటేశ యిట్టె మెచ్చితి

విందుల నీరతులలొ వేడుక పిక్కటిల్లగా

సందడించి కుచములు సదమద మాయెను ||పగవారి||

పతిరాక తడవైన కారణమున ఎదురులు చూచి చూచి నిద్రవోక వాకిట వేచినది కాకలు రేగినవి వీసమంత పొద్దైనా తాళలేని స్థితిలో నున్న నాయిక ఇందు వర్ణింపబడినది ఇందలి నాయిక స్పష్టముగ సూచింపబడక పోవుటచే మధుర భక్తుడైన అన్నమయ్యయే నాయికయై పరమాత్మ సందర్శనాభిలాష అధికము కాగా ఇంక క్షణకాలమైన ఓర్చుకొనలేని విరహముచే ఆర్తి చెందుచు తన మనోభావము నిట్లు ప్రకటించెను. భక్తి మార్గమున ఆ స్వామి కొరకు తహతహలాడుచు నిప్పు వంటి తమకమును దాచుకొనలేక సతమతమైన ఆత్మస్వరూపము ఇచ్చట సుప్రకటితమైనది చివరకు వేంకటేశుడు ఆమెతొ కూడుటయే ఫలము

''వలచి భక్తి మార్గము తేడ నిన్ను
వర్ణించుచు ఉన్న నాపై - చలమేలరా
సాకేత రామా'' -

అన్న త్యాగరాజ కీర్తన ఇప్పట్టున స్మరణీయము. ఆ కీర్తన యందే చివర తన విరహపు తీవ్రతను ప్రకటించినాడు త్యాగయ్య.

''తందనాలతో పొద్దుపుచ్చనేల
తాళజాలనయ్య త్యాగరాజ నుత - చలమేలరా.

2. ఏమిసేతు నమ్మలాల యిదిపో నాకాపిరము
కామించి వలపుపతి కౌగిలే కోరని ||పల్లవి||
కాయమే కాకలబొందీ గానీ రమణుని బాసి
పాయమే చిగురించీ బైపైనే
చేయి చెక్కిటి మీద జింతలు రేచే గానీ
యే యెడ గనుచూపులు యెదురే చూచీని || ఏమిసేతు||
పని పూని పయ్యెదే పైపై జారీగానీ
ఘనమైన చన్నులైతే గట్టులయ్యీని
గొనకొన్న విరహము కోపము పుట్టించీగానీ
ననుపులసెలవులు నవ్వించిచీనీ || ఏమిసేతు||
గారవపు నాకాగిలి కారాలు పుట్టించీగానీ
వూరేటి మోవి తేనెలు వుట్టి పడీని
యీరీతి శ్రీ వేంకటేశుడింతలోనను గలిసె
తేరేటి మోము కళలు తెలివి సేసీనీ || ఏమిసేతు||

ఈ పదము నందలి నాయిక రమణుని బాయుట వలన కాయము కాకలు బొందినది

చెక్కిటి చేయి చింతలరేపినది. పెచ్చురేగిన విరహము కోపము పుట్టించినది దీని యందు నాయిక విరహ తీవ్రత తారస్థాయికి చేరినది అది సాధారణమైన విరహము కాదు లౌకిక శృంగార నాయికల విరహము అంతకన్నను కాదు దివ్య శృంగారము అన్నమయ్య పక్షమున నాలోచించినచో అది విశిష్టా ద్వైత శృంగారము అభేద తత్వమును ఆకళింపు చేసుకొన్న ఆత్మయనెడి నాయిక పొందిన విప్రలంబ శృంగారము దానికి తగిన ఫలము నాయిక చివరకు పొంద గలిగినది. అంతలోనే శ్రీ వేంకటేశుడు ఆత్మను తనలో లీనము చేసికొనినాడు.

ఇట్టి విరహమునే మీరా పాడిన విరహ గీతికలో మనము గాంచవచ్చును.

హేరీ మై తో దరద్ దివాణీ, మేణీ దరద్ న జాత్రైకోయీ
ఘాయల్ కీ గతి ఘాయల్ జాత్రై జోకోయీ ఘాయల్ హోయ్
జౌహర్ కీ గతి జౌహరిజాణై కీ జిన జూహరి హోయ్
సూల్ ఊపరిసేజ్ హమారి సోవణ కిస్‌విధ్ హోయ్
గగన మండల పర్‌సేజ్ పియాకీ కిన్ విధ్ మిల్ణా హోయ్
దరద్ కీ మారీ బన బన డోలూ బైద్ మిల్యానహి కోయ్
మీరాకే ప్రభు పీర మిటైగీ జబ్ బైద సావలి హోయ్ (17)

అనగా ''బాధాపీడితురాలనైన నా బాధ ఎవరికే విధముగా తెలియును అయ్యో, నా బాధ తీర్చుటకు తగిన వైద్యుడెవరు? ఆ నీలమేఘ శ్యాముడైన శ్రీకృష్ణుడు వచ్చి చికిత్స చేసిననే కాని నామనోవ్యధ తీరదు''. అని ఈ మీరా పదమునకు అర్థము

ఇట్టిదే నమ్మాళ్వార్ అనువైష్ణవ భక్తుని పాశురములలోను గోచరించును

'' ఇట్టక్కాలిట్టకై కళాయిరుక్కు
మెళున్దులాయ్ మయ జ్ఞమ్ కైకూప్పుమ్.
''కట్టమేకాదలెన్ను మూర్చ్చిక్కుమ్
కడల్ వణ్ణా కడియై కాణెన్నుమ్''
వట్టవాయ్ నేమి వలజై యావెన్నుమ్
వన్దిదా యెన్రైత్తే మయజ్ఞమ్
శట్టనే దెళునీర్ తిరువరజ్ఞత్తా
యివళ్ తిరత్తెన్ శన్దిత్తాయే'' 8

ఓ సుందరుడా! నన్ను కనికరించక మిక్కిలి క్రూరుడ వైనావు సుమా! నీపై నాశ మిగుల పెద్దదై నన్ను మిక్కిలి బాధించుచున్నది దాని చేత నే నింత బాధపడుచున్నాను'' అని దీని యొక్క బావము

దీని యందును నమ్మాళ్వారు స్వయముగా తానే నాయికయై పొందెడి విరహ వేదన గోచరమగుచున్నది.

ఇంకను ఈ క్రింది కీర్తనలు తాళ్ళపాక అన్నమయ్య గారివి చూడవచ్చును.

1 ''విన్నవించవే వో రమణీ'' - (16-2)
(ఇది వేటూరి ఆనందమూర్తిగారు ఉదహరించినది)

2 నీరు వట్టుగొన్న చోట నేత దీరునా - (18-242)

3 వెలది చందము లెల్లా విన్నవించితిమినీకు - (28-285)

4 మించి కాలము కింద మీదా యెనే - (30-315)

# విప్రలబ్ధ

1 ''సంకేతమరసి నాధుడు లేమి వెసనార్తయా కాంత విప్రలబ్ధ'' (కావ్యాలంకార సంగ్రహము - 77 పుట)

2 ''సంకేత కేతనే ప్రియ మనవలోక్య సమాకుల హృదయా విప్రలబ్ధ'' (రసమంజరి)

3 ''దూతిని బంపి సంకేతమును జెప్పియున్నప్పటికిని, ఏదేని కారణమున ప్రియుడు రాకపోవుటచే వంచిత అయిన నాయిక విప్రలబ్ధ అగును '' (నాట్య శాస్త్రము)

4 ''వంచనా ప్రయుక్త విరహవేదనావత్ విప్రలబ్ధా'' శృంగార మంజరి - అక్బర్‌షా)

అలంకారికుల మతము ప్రకారము సంకేత స్థలమునకు ప్రియుడు రామిచే కుందు నాయిక విప్రలబ్ధ కాని తాళ్ళపాక వారి కీర్తనలలోని నాయిక సామాన్య కాదు దివ్య, అలమేల్మంగ, అందును శ్రీ వేంకటేశ్వరునకు ఇల్లాలు. ఇట్టి యామె సంకేతస్థలము నేర్పరచు కొన వలసిన పని లేదు తన ఇంటికే వత్తు నన్న స్వామి రాలేదు దూతిని పంపినను ప్రయోజనము లెదయ్యెను అందుకే తాను మోసగించినట్లు భావించి ధుఃఖించుచున్నది ఈ కీర్తన నరసినచో ఇది సుస్పష్టమగును.

1 తలపోసి తలపోసి తమకించీ నా మనసు
తలపు దెఱచి నా దండకు బిలువరే ||పల్లవి||

చెలికత్తెల మాటలు చే కొని వివిన వాడు
యెలమి నిక్కడి దేల రాడే
కలకల నవ్వుతాను కానుకలందిన వాడు
పలుమ్మారు నెక్కడి పరాకున నున్నాడే ||తలపోసి||

ఆసపెట్టి నాకు లేక లంపిన యట్టి వాడు
పాసితా నెక్కడ నేమి పనికున్నాడే
వాసికెక్కి నాపై వలపు చల్లిన వాడు
సేస చేబట్టుక యెంత సిగ్గుతో నున్నాడే ||తలపోసి||

పక్కన నాయండ వచ్చి పవళించి వున్నవాడు
మొక్కలాననే నవ్వలి మోమైయున్నాడే
యిక్కడ శ్రీ వేంకటేశుడే నలమేల్మంగను
మిక్కలి నన్నేలె యెట్టు మెచ్చు తానున్నడే ||తలపోసి||

నాయకునికి చెలికత్తె ద్వారా సందేశ మంపినది వచ్చెదనని లేకలు కూడ పంపినాడాయన కాని రాలేదు. ఆయన గురించి తలపోసి తలపోసి తమకించిన దామె మనసు తహతహ లాడినది

''హరిచరణామృతెన తుల్యం నజానే'' అను కులశేఖరాళ్వారుల శ్లోకము ఇప్పట్టున చింత్యము (19)

అందుకే ఇందలి నాయికహరి ముకుందుని తలపోసి తలపోసి ఆయన సన్నిధి కొరకు పరితపించినది ఆ తపన నిష్ప్రయోజనము కాలేదు ఆయన వచ్చి తన ప్రక్కనే పవళించినాడు మిక్కిలిగా ఆమెను ఏలినాడు

మరియొక ఉదాహరణ -

2. విన్నవించ నేమున్నది వేగినంతాను
ఇన్నిటా నీ సొమ్ము నేను యీ దేర్తువుగాక ||పల్లవి||

యెదురు చూచితి నీకు నింతులచే చెప్పింపితి
వెదికితి నీవుండేటి విడిదలను
చెదరని వలపులు చిమిడితే గొరయా నా
పదను దప్పకుండాను పాలింతువుగాక ||విన్నవించ||

పట్టితి వ్రతము నీకు పైపై దమ కించితివి
బెట్టీపేరు కొని నిన్ను బిలచితిని
పెట్టీగాని మనసిదివేచితేను చవియా నా
యిట్టె పసివాడకుండా నేలుదువు కాక ||విన్నవించ||

వేళలు గాచితి నీకు వేగించితి నిందాక
మూలమైన దేవరకు మొక్కు కొంటిని
యీలీల శ్రీ వేంకటేశ యిటు నన్ను గూడితివి
బాలకి నన్నిట్టే చేపట్టుదువు గాక ||విన్నవించ|| (14-17)

ఇందలి నాయికయు ఇంతులచే నాయకునకు కబురంపినది ఎదురు చూచినది. ఆయన విడిది చేయు తావుల వెదకినది వ్రతము పట్టినది. తమకించినది. పేరు పెట్టి పిలచినది. స్మరించినది. ఇంతకన్న నాయిక వలపు వేదన తీవ్రత ఎట్లు తెలియగలము. ఇందలి విప్రలబ్ధ నాయిక అన్నమయ్య మనోభిప్రాయమును స్పష్టపరచుచున్నది. ఆయన మధుర భక్తి పరాకాష్ఠనందినది. ముగ్ధ, స్వీయ నాయిక. కనుకనే ఇంతటి తపన. మొక్కు కొనిన ఆమెను చివరకు వేంకటేశుడు కూడినాడు. ఆకలయికయే ఆమె ఎదురు చూపుల ఫలము.

ఇట్టివే మరి కొన్ని పదములు

1 ఏమి గట్టుకొనెనె తా నిందు వంకను
దేమటి కోరిక లెల్లా దొడ్డి బెట్టి గదవే ||పల్లవి||

యెదరు చూచితి దాను ఇందాకా విచ్చేసేనని
ఇందివో తా చెలి నంపెనెడుమాటకు

. .          ..    . ..   .. .....   .     ...

. .       . .  .    . ..      .. .

తత్తరించి వుండి తినే దనతో మాటాడేనని

పొత్తుల లేకలంపెదా బొద్దు వోకకు

... ...   ..... . .................... ....  .....

..... ..   ...   .......................... .... (22-260)

సాధారణముగ అన్నమయ్య పదములలో విప్రలబ్దనాయిక సంకేత స్థలములను వెదకుచు బోవదు ఈ విషయమును "శృంగార మంజరీ కారుడైన అక్బర్‌షా అభిప్రాయము వలన స్పష్టమగుచున్నది. అయన విప్రలబ్ద నాయికా లక్షణముల దెలుపుచు "వంచనా ప్రయుక్త విరహ వేదనావతీ విప్రలబ్దా" అని నిర్వచించినాడు ఈ విషయమును వివరించుచు డా. రాఘవన్ గారు ఇట్లు స్పష్టపరచినారు.

"The Author of "Sringara Manjari" Criticises, Bhanudatta's definition that it is not applicable to a sviya on Samanya who do not go to a trysting place, But one experting union on meeting at their own residence and are dis-appointed by the lovers failure to present himself Thus the Sringara Manjari really on larges the scope of the "Vipra Labdha" offers its definition that she is one in the pang of separation consequent on disappointment caused by the lover" (20)

శృంగార మంజరి కారుడు మాత్రము రసమంజరీ కారుని నిర్వచనమును విమర్శించి సంకేత విషయమును అందుండి తొలగించినాడు. అతని దృష్టిలో స్వీయ విషయమున "సంకేతము" నకు ప్రసక్తి లేదు ఆ నాయిక యున్న చోటునే ప్రియుని కొరకు వేచి, యాతడు రామిచే విరహాతిశయము ననుభవించుచున్నది కావచ్చు.

శృంగార మంజరీ కారుని లక్షణమిట్లున్నది.

"వంచనా ప్రయుక్త విరహవేదనావతీ విప్రలబ్ద"

కాన....... . ..స్వీయా విప్రలబ్దా నాయిక స్వరూపమే శృంగార మంజరీ కారుని లక్షణములకు దోహద మిచ్చియుండునని తలపవచ్చును. ఏలన, తాళ్ళపాక వారి శృంగార పదములందలి నాయిక సర్వత్ర స్వీయయే. అందును దివ్య అట్టి జగజ్జనని దివ్య శృంగార వర్ణన సందర్భమున "సంకేత స్థలముల" ప్రసక్తియే యుండదు. ఇక వంచనయన మరి

సర్వాంతర్యామి యగు పరమాత్ముడు తానంతకు బూర్వము ప్రత్యక్షముగ చవులిచ్చిన సతికి ఆ సమయమున వచ్చివేడుక నింపకుడుట వంచనయే యగును గదా।'' (21)

అని డా వేటూరి ఆనందమూర్తి గారు తమ యభిప్రాయమును ప్రకటించినారు

కాని ఇంతకు మునుపు ఈయబడిన ఉదాహరణ పదములో ''విన్నవించనేమున్నది'' అను దానిలో నాయిక ''వెదికితి నీ వుండేటి విడదులను'' అనుట చేత సంకేత స్థలమునకు బోయినట్లే స్పష్టమగుచున్నది కాని ఇతర కీర్తనలన్నిటిలోను, అనగా విప్రలబ్దకు సంబంధించి నంత వరకు ఆమె యున్నచోటనే నాయకుని కొరకు వేదనావతియై వంచింపబడిన దాని వలెనే గోచరించుచున్నది ''శృంగార మంజరీ కారుడు'' తరువాతి కాలము వాడగుటచేత, తనకు పూర్వులైన వారి కొందరి రచనలను పరిశీలించి యుండవచ్చును తాళ్ళపాక వారి రచనలు పరిశీలించెనో లేదో తెలియరాదు కాని అతనిచే నిర్వచింపబడిన ''విప్రలబ్ద'' నాయిక యొక్క లక్షణములు మాత్రము అన్నమయ్య రచనలలో అధికముగ గోచరించును

2 ఇదియేటి దయ్యా యెంత సేసితివి నీవు
చెదరని దయతో విచ్చేయవయ్యా ఇంటికి ||పల్లవి||

చెలులతో యేమని చెప్పింపితివి
యెలిమి నానవాలు యేమిచ్చితివి
కులికి యేమని యాస కొలిపితివి
చెలినిమన్నింతువు విచ్చేయవయ్యా || ఇదియేటి||

3 విచ్చేయవయ్యా వేగమే అక్కడికి
అచ్చమైన కోరికతో నలసే చెలి
వుప్పరిగే లోన నీవు వున్నావంటా వచ్చి
అప్పుడే రావైతి వంటా నడిగే చెలీ
తొప్పదోగ జెమటతో తూగు మంచముపై బండి
ముప్పిరి మోహములోన మునిగే జెలి (25-572)

4 శ్రీ వేటూరి ఆనందమూర్తి గారిచ్చిన ఉదాహరణ

''పొద్దిక నెన్నడు పొడుచునో పోయిన చెలిరాదాయను
నిద్దుర కంటికి దోపదు నిమిషం బొకయేడు'' (12-138)

# 5. ఖండిత

I అన్యోపభోగచిహ్నితః ప్రాతరాగచ్ఛతి పతిర్యస్యా సా ఖండితా - ప్రాతరిత్యుపలక్షణం

అస్యాచేష్టాః - అస్ఫుటాలాప చింతా, సంతాప, నిశ్వాస, తూష్ణీం భావ, అశ్రుపాతాదయః - రసమంజరీ

II ఉచితవాసకము నందు (తనతో కలసియుండవలసిన సమయములో, ప్రియుడు ఇంకొకనాయికతో కలసియుండి తన యొద్దకు రానిచో దుఃఖార్త యగు నాయిక ''ఖండిత'' యనబడును (నాట్యశాస్త్రము)

III ప్రియుడు అన్యతోడి సంభోగ చిహ్నములు కలవాడై ఎవతెకడకు వచ్చునో, ఈర్ష్యా కషాయిత యగు నా నాయికను ''ఖండిత'' యని పండితులు పేర్కొందురు (సాహిత్య దర్పణము)

IV విభుడన్యసతి బొంది వేకువారా గుందు నబల ''ఖండిత'' (కావ్యాలంకార సంగ్రహము)

అప్పటి యెండ చెమట లట్టే వుండేనా
నెప్పు దప్పు బొంకేవునే నెఱంగనా ||పల్లవి||

ఆవుల గాచిన నాటి యడవి కంపల చేర
లావల నేడు మాయక అట్టే వుండేనా
యేవంక నెవ్వతో నిన్ను నెనసి చేసిన చేత
నీ వెంత మొఱగిన నేనెఱుంగనా ||అప్పటి||

వెన్నలు ముచ్చిలు నాడు వేడిపాలార గించిన
అన్నువ నీ మోవి పొక్కులట్లే వుండేనా
వన్నెకాడ యెవ్వతెకో వలల జిక్కిన నీ
నిన్నమొన్నటి సుద్దులు నేనెఱుంగనా ||అప్పటి||

రంగుగ మధురలోని రమణి మెత్తిన నాటి
అంగడి గంధపు బూతలట్టే వుండేనా
చెంగటి మొరగి కలసితివి వెంకట రాయ.
నింగి మోచిన చేతలు నేనెఱుంగనా ||అప్పటి||

నాయకుడు దుష్టుడు, తప్పు చేసియు అనృతమాడువాడు నాయకుడు అన్యనాయికా సంపర్కముచే కలిగిన చిహ్నములు మాయకుండగనే నాయిక ఇంటికి వచ్చెను. అతని శరీరమందలి సంభోగ చిహ్నములు నాయిక గుర్తించి ప్రశ్నించినది అన్నింటికి ఏవియో నెపములు చెప్పి తప్పించుకొన జూచినాడు నాయకుడు. కాని నాయిక ముగ్ధకాదు. ఆమె ప్రౌఢ. ఈతనిమాయ చేష్టలన్నియు బాగుగనెఱింగినది. అందుకే నాయకుని, ఈర్ష్యాకషాయిత యగు యామె, దెప్పిపొడుచుచు దుఃఖించుచున్నది పల్లవి లోనే నాయకుడు బొంకుట, దానిని ఆమె గుర్తించుటయు జరిగినది.

ఈ సంకీర్తనలో కృష్ణలీలలు, బాలకృష్ణుని మధురక్రీడలు, ఆధారముగ గొని అన్నమయ్య స్వయముగ నాయకయ్యై, ఆ స్వామి సన్నిధి కొఱకు ఎదిరి చూచి చూచి, స్వామి కృష్ణావతారమందలి కొన్ని లీలలను ఊహించి, ఖండిత నాయికకు అనువుగా తన్నుదాను మలచికొనినాడు. ఇతర నాయికతో సంభోగ శృంగారము ననుభవించిన స్వామి స్వేద శరీరుడైనాయికా గృహమునకు, రేయి బాగుగగడచినపిమ్మట ఏతెంచినాడు. తనస్వేదమునకు కారణము ఎప్పుడో తాను వ్రేపల్లెలో తోడి బాలురతో కలసి గోవుల కాపరిగ ఎండలో తిరుగుటయే అని చెప్పినాడు. నాయిక బేల కాదు. ''అప్పటి చెమట లట్టే వుండేనా'' అని ప్రశ్నించినది. ఆయన శరీరము పై గల నఖదంతక్షతములు అడవులలో తాను దిరిగినప్పుడు అచటి కంపల చీరులుగా చెప్పగా '' ఆలగాచిన నాటి ఆ గాయములు నేటికిని మాయక అట్టే వుండేనా'' అని అవి ఎవతెయో తమకముతో చేసిన చేష్టలు అనుచు ఆయన గుట్టు బయట పెట్టినది. ఆయన అధరములు కందినవి. అటునట్టి పొక్కినవి గూడ. వానిని వెన్నలు దొంగిలించు రోజులలోని వేడి పాలారగించి నప్పటి పొక్కులుగా ఆయన చెప్పి తప్పించుకొన జూచినాడు. కాని ఆమె ప్రౌఢ గదా ! ఈ చిన్నెలన్నింటిని జూచి ఖండితయైనది ఆయన సమర్థన లన్నింటిని ఖండించినది. ఆ చేతలు మైపూతలు శృంగార చిహ్నములు అన్నియును స్పష్టమగుటచేతనే ఖండిత నాయిక యైనది. కాని ఈమె లౌకిక నాయిక కాదు దివ్య. అన్నమయ్య పరముగ జూచినను మధుర భక్తి తోడి చేతనుడు, మధుర భక్తుడు మై మరచి పరమాత్మయందే మనసునులగ్నము చేసి ఆర్తితో గానము చేసినపుడది నిష్ప్రయోజకమగునా? దానికి సుమధుర ఫలము లభింపదా? అందుకే ఆయన ఆపై చెంగట మొరగి కలిసినాడు. లీలా మానుష విగ్రహుడైన శ్రీకృష్ణుని దివ్య శృంగార లీలా వర్ణన ఈ విధముగ నొనర్చి అన్నమయ్య పదే పదే ఆ వేంకటరాయని సన్నిధిని పొందగలిగెను. దినమున కొక కీర్తనకు తక్కువ కాకుండగ వ్రాయగలుగుట కాతడు మధుర భక్తుడగుటయే కారణము.

''జిహ్వేకీర్తయ కేశవం ముర రిపుం చేతో భజ శ్రీధరం'' (22)

అని కులశేఖరులు ఆనతిచ్చిన ముకుంద మాలను సంపూర్ణముగ అనుసరించిన వాడు అన్నమయ్యా చారిత్రకాధారమును బట్టి 15వ శతాబ్దమునకు చెందిన వాడే యయిన పోతన తన ''భాగవతము'' నందును స్మరణ భక్తికి మిక్కిలి ప్రాముఖ్యమును సంతరించినట్లు మనకు తెలియును ప్రహ్లాదుని వలన స్మరణ భక్తికి, గోపికల మూలమున మధుర భక్తిని ప్రకటించినవాడు పోతన.

''శ్రీనాదు వర్ణించు జిహ్వా జిహ్వా''.
''దేవదేవుని ఓంతించు దినము దినము''
''వైకుంఠబొగడని వక్త్రంబు వక్త్రయే
ఢమ డమ ధ్వని తోడి డక్కగాక''
''చక్రి చింతన లేని జన్మంబు జన్మమే
తరళ సలిల బుద్బుదంబు గాక''
''ముక్తి నిదిగాన వచ్చునే, ముఖ్యమైన
శార్గ కోదండ చింతనాంజనము లేక'' (23)

ఈ తత్వము నెఱింగిన వాడగుట చేతనే అన్నమయ్యా కీర్తనా మార్గము నెన్నుకొనుట అందులకే ఆయన స్వయముగ ఏ నాయిక రూపము ధరించినను చివరకు ఆ శ్రీనివాసుని తోడి అనిర్వాచ్య సంసర్గము నంద గలుగుట

మరియొక కీర్తనలో ఖండిత యగు నాయిక యొక్క విచారము సుప్రకటితము

''బంగారు వంటి దాన పచ్చివిటుడవు నీవు
యెంగిలి నీ మాట వింటి నేమి సేతురా ||పల్లవి||

కందు వగు నీ మేను కౌగలించగానెనామై
చందముగ నీమేని లచ్చన లంటెను
చిందర వందరలైన జీడి వంటిది వలపు
యిందులోనె కానవచ్చెనేమి వచ్చెరా ||బంగారు||

మొక్కితి నీ పాదాలకు ముందర మొక్కినవారి
యెక్కడో కస్తూరి బొట్టు యిదె నన్నంటె

మొక్కలాన ముయికని ముల్లు వంటిది వలపు
యిక్కడనే కాన వచ్చె నేమిసేతురా ||బంగారు||

బాగాలు నీ కిచ్చితేను పాగిన నీ తమ్ములము
పోగులై తేడు తనపుక్కిలి నిండె
బాగుగా శ్రీ వేంకటేశ పంట వంటిది వలపు
యీ గతినే కానవచ్చెనేమి సేతురా ||బంగారు||

ఇందలి నాయిక స్వభావము మేలిమి బంగరు వంటిది నాయకుడు పచ్చివిటుడు ఆయన పలుకునవన్నియును అబద్ధములే ఇతర నాయికలకు చెప్పిన ప్రియోక్తులే ఈమెకును చెప్పెను అందులకే ఆయనవి ఎంగిలి మాటలు ఇతః పూర్వముదహరించిన కీర్తనలోని నాయిక యంతటి జాణ కాదేమో ఆమె నాయకుని శరీరము నందలి ప్రకటిత మగు చిన్నెలనుబట్టి అతని స్థితిని ఊహించ గలిగినది

ఈమె నాయకుని రాకకు వేచి వేచి చివర కాయన దర్శనము కాగానే బిగియార కౌగిలించుకొనినది ఆయన కౌగిలిలో ఆయన శరీరమున కంతకు మున్నె పరస్త్రీవలన అంటుకొనిని మైపూతలు ఈమె శరీరమున కంటుకొనినవి వలపు జీడి వంటిది. జీడియంటు కొనిన గుర్తులు అంత త్వరితముగ మాసిపోవుగదా। ఈ విషయము నామె గుర్తించి ఇందులోనె కానవచ్చె నేమి వచ్చెరా అని విచారించినది

అయినను సహించి పాదములకు మ్రొక్కినది అంతకు మున్నె మ్రొక్కిన వారికి చెందిన కస్తూరి బొట్టు అయన పాదములకు అంటుకొని యుండుటచే అది ఈమె నుదుటికి అంటుకొనినది ఆమె మనసు చివుకు మన్నది. అప్పటికిని ఓపికతో పోకలందించినది ఆ పోకల నోరితో ఆయన ఈమె అధర చుంబనముగావించగా అంతకు మునుపె ఆయన వేసుకొనిన తాంబూలపు ముక్కలు ఈమె పుక్కిలి నిండినది దానితో ఆయన బండారమంతయు బయటపడినది ఈమె దుఃఖాతి శయము తీవ్రమైనది '' ఈ గతినే కానవచ్చె నేమిసేతురా'' అనుచు వ్యధ చెందినది ఇట్లు ఖండిత నాయిక స్వరూప స్వభావములను అన్నమయ్యా చక్కగా చిత్రించినాడు

భక్తి పరముగ నాలోచించినచో పరమాత్ముని పద సన్నిధిని కోరుకొను భక్తులు కొల్లలు. కోరిన వారికి కోటి వరాలను కాదనక గుప్పించు కరుణా స్వరూపుడు ఆ శ్రీనివాసుడు. అన్నమయ్యా గారు నాయికా భావము వహించి ఆయనకై మధుర భక్తితో తపన చెందు

సమయమునకు ఏ భక్తునకు (భక్తురాలికి) అభిమాను భూతి నొసంగుచుండెనో ఎవరి కీర్తనలకు ఉప్పొంగి ఆనందానుభూతిలో నోలలాడుచుండెనో ఎవరి పరిచర్యలందుకొనుచుండెనో, ఎవరెవరి కానుకలు స్వీకరించు చుండెనో, అందుకే ఈ నాయిక (అన్నమయ్య)ను కటాక్షించుటకు వచ్చుటలో అమందమైన జాప్యమే జరిగినది మొత్తము పై ఈయన మొర వినినాడు తక్షణమే బయలుదేరినాడు ఉన్నవాడు ఉన్నట్లు బయలు దేరినాడు తన యవస్థను గమనింపలేదు గజేంద్రుని రక్షించు సమయమున బయలుదేరినట్లు బయలుదేరెనేమో। అంతకు బూర్వము ''అలవైకుంఠ పురంబులో . ఉత్పల పర్యంక రమావినోదియైన శ్రీహరి వివాద ప్రోద్ధత శ్రీకుచోపరి చేలాంచల మైనను వీడకుండ గజప్రాణావనోత్సాహియై'' చనుదెంచినట్లు అన్నమయ్యా గారిని కరుణించుటకు శ్రీ వేంకటేశుడు తానున్న స్థితిని మరచివేంచేసినాడు ఇట్టి ఖండిత నాయికస్థితిని అనుభవించిన అన్నమయ్య ధన్యుడు

ఇట్టివే మరి కొన్ని కీర్తనలు చూడనగును

1 ఏ వూరికే వూరు ఎక్కడికి ఎక్కడ
నీవు మాకు నికనేల నిజమైనా జెప్పరా
అర్ధమ రేతిరి దాకా నందు నిందు నుండి వచ్చి
వద్దువోరా నీకు నింత వలసి నొల్లములు

. . . ..

వద్దు నీకు మా తోడి వట్టిమాటలు
ముద్దులు నీపై గునిసి మురిసెబోయికను ||పల్లవి||

ఈడవచ్చి ప్రియము నాకేమి చెప్పేవిందాకా
గూడి నాకేకే బ్రియము గులుకరాదా।
వాడిక నిందాక నీవు వచ్చిన నేరమికి
సూడు బాడు జెనకే బొ సొలపు చేతలనే ||వద్దు|| (12-50)

3. గరిమతో నిన్నిట్టా గల నీకు
బెరసిన నా మీద బ్రియమున్నదా ||పల్లవి||

తను రోమ రోమ రంధ్రములను బ్రహ్మాండ
జనన సంహార విచారములు
మనసున నీకివి మంత్రములై, నన్ను
గనుగొని కరుణించ గలదా వేళ ||గరిమ|| (30-27)

## 6. కలహాంతరిత

i) పతి మవమత్య పశ్చాత్ పరితప్తా కలహాంతరితా

అస్యాశ్చేష్టా భ్రాంతి, సంతాప, సమ్మోహ, నిశ్వాస, జ్వర ప్రలాపాదయః(రసమంజరి)

ii) ప్రియోక్తులు పలుకుచున్నను ప్రాణనాథుని ఎవతె కోపముచే తొలగించి పిమ్మట తాపము నొందునో అట్టిది ''కలహాంతరిత'' యనబడును (సాహిత్య దర్పణము)

iii) ఈర్ష్యా కలహము వలన వెడలిన ప్రియుడు మరలిరాకుండుటచే అమర్ష వశయగు నాయిక ''కలహాంతరిత'' యనబడును. (నాట్య శాస్త్రము)

iv) అల్కనధిపు దెగడి అనుశయము జెందు సతి ''కలహాంతరిత''

చేసిన నేరమిది నీతో చెప్పక పోదు
దోసము లేదనవయ్యా తొత్తనీకు నేను ||పల్లవి||

పడిబెట్టి నట్టి నా సవతి మచ్చరమున
తొడి బడ నూరలే దూరితి నిన్ను
జడిగొన్న ఆపెతోడి జగడపు వేళనిన్ను
వడిసాకాలు దాకినా వడి మొక్కనైతిని ||చేసిన||

గాటపు బొరుగువారి కాంతాళపు బరాకున
మాటాడినా నీతోడ మాటాడనైతి
నాటగ నాపెదిట్టుతా నాతమ్మ నీపై బడితే
పాటించి తుడుపనైతి బంతమియ్యనైతిని ||చేసిన||

దిమ్మరేచే వారి తోడ దిట్లాడే పరాకున
యెమ్మెతో నీవు వచ్చిన దెఱుగనైతి

కమ్ముక శ్రీ వేంకటేశ గక్కున నన్ను గూడితివి
నెమ్మదిగా సంతసాన నిన్నుమెచ్చనైతిని ||చేసిన|| (18-42)

ఈర్ష్యా కలహములచే నాయకుని కఠినోక్తులాడి పిమ్మట పరితాపము నొందు నాయిక కలహాంతరితయన బడును

ఇందలి నాయిక అసూయా గర్వాదులచే స్వామి యెడల నెన్నియో అపరాదములు చేసినది పిమ్మట తన తప్పులను గుర్తించి పశ్చాత్తాపపడుచున్నది తనను క్షమింపుమని వేడుకొనుచున్నది

సవతి మచ్చరమున అవేశ మధికము కాగా స్వామిని దూరినది. మాటాడకుండ నుండినది అసలు ఆ స్వామి వేంచేసినదే యెఱుగ నంతటి పరాకు చిత్తగించినది

సవతితో పోరు పెంచిన సమయమున స్వామికి తన పాదము సోకినా అది తెలిసికొని అయన కాళ్ళకు వంగి మొక్కలేదట సవతులను తూలనాడు సమయమున ఈమె నములుచున్న తాంబూలము కొంత ఆయనపై పడినను సరకు సేయక, తుడువక అట్లే కలహించెనట

అయినను స్వామి ప్రేమతో ఆమెను కమ్ముకొని కూడెను అప్పటికిని ఆమె సంతోషింపలేదు ఆయనను మెచ్చుకొనలేదు మిక్కిలి ఆలస్యముగ తన తప్పును తెలిసికొని పశ్చాత్తాపపడుచున్నది. నాయిక చేసిన దోసము చెప్పక తీరదన్నట్లు తన నేరములన్నియు, నేకరువు పెట్టి తన దోసములను మన్నించమని వేడుకొనుచున్నది

బక్తులందరును చేసెడి పని ఇదియే స్వామి కరుణా కటాక్షము కొఱకు ఆయనను స్తుతించెదరు కొలిచెదరు. పూజించెదరు. ఆయన గుణ గానము చేసెదరు. చివరకు ఏమేమో పలుకుచు అయనను అదిక్షేపించెదరు. తిరస్కరించెదరు తుదకు బాహ్య స్మృతిలోకి వచ్చి తమ తప్పులను తెలిసికొని పశ్చాత్తాప పడెదరు.

ఉదాహరణకు రామదాసు జీవితము నందలి యొక ఘట్టము విషయమును స్పష్టపరచుచున్నది

రామదాసు చెఱసాలపాలైనపుడు ఆయన ఎంతగనో రాముని వేడుకొనినాడు భటులు పెట్టిడి బాధలెక్కువైనవి తానెన్నెన్ని సేవలు చేసినాడు సీతమ్మవారికి చింతాకు పతకము లక్ష్మణునకు పచ్చల పతకము, ఆయనకు స్వయముగా గుడులు, గోపురములు, చుట్టు ప్రాకారములు ఏర్పాటు చేసెను ఇవన్ని తానుగా చేసినవే, కాని దశరధుడో, జనకుడో చేసినవి

కావు. ఇందులకు ఆరు లక్షల పైకము వెచ్చించినాడు అది చెల్లించు వరకును తనకు శిక్ష తప్పదు రాముడేమో కులుకుచు తిరుగుచున్నాడట అందులకే ఆయనను భక్తిపారవశ్యమున నిలదీసినాడు అట్టి శక్తి భక్తునకు మాత్రమే కలదు సంతాపము తోడి సమ్మోహమెక్కువై ప్రలాపములు పుట్టినవి

''ఎవడబ్బ సొమ్మని కులుకుచు తిరిగేవు రామచంద్రా'' అని నిర్మొహమాటముగ నడిగినాడు. కాని అంతలోనే పశ్చాత్తాప పడి శరణు వేడుకొనినాడు

''అబ్బా తిట్టితినని అయాసపడబోకు రామచంద్రా

దెబ్బల కోర్వక అబ్బా తిట్టితినయ్యా రామచంద్రా''

ఇది ప్రణయ కలహము కాకున్నను భక్తి కలహము భక్తుడు భగవంతుని కరుణ కొరకు ప్రాకులాడు సమయమున చేసెడి ప్రయత్నములలో నిది యొకటి ఆత్మ పరమాత్మను సమీపించ వలెననెడి తపనలో కొనసాగిన భక్తి పారవశ్యము నందలి అవస్థలలో నిది యొకటి

అన్నమయ్య గారి పై కీర్తనలో ఇట్టి భావమే ఇమియున్నది లౌకికముగ చూచినచో మనకు కేవలము కలహాంతరితయనెడి శృంగార నాయిక మాత్రమే కానవచ్చుట కాని ఇందలి నాయిక లౌకిక శృంగార నాయిక కాదు భక్తి శృంగార నాయిక మధుర భక్తిలో పరవశించిన నాయిక. అన్నమయ్యయే స్వయముగ నాయికయై తక్కిన మధుర భక్తులపై మచ్చరముచే నిట్టి కీర్తన రచించె ననిపించును ''భక్తులకు కామ క్రోధములుండునా'' అనెడి సందేహమునకిచ్చట తావు లేదు ఏలనన భక్తి తారస్థాయికి చేరినప్పుడు ఇహ ప్రపంచమును మరచిన భక్తుడు పొందెడి అనేక అవస్థలలో ప్రలాపము అను స్థితిలో తానేమి చేయుచున్నాడు అను ప్రశ్నకు తావులేదు మొహమధికమై ఉన్మాద స్థితివలన ప్రలాపము సంభవించును దీనినే ప్రతిపాదించుచున్న ''రసమంజరీ'' కారుడు ''కలహాంతరిత'' కు నిర్వచనము చెప్పుచు దానియొక్క చేష్టలు ఇట్లు చెప్పినాడు ''అస్యాచేష్టాః - భ్రాంతి, సంతాప, సమ్మొహ, నిశ్వాస, జ్వర, ప్రలాపాదయః''

ఇది లౌకిక నాయికల విషయము ఇక భక్తి రసమున అగ్రస్థాయికి చేరుకొనినప్పుడు భక్తునకు స్వామి సామీప్యము కొరవడి నప్పుడు గాని, స్వామి పరీక్షించినపుడు గాని ఇట్టి స్థితి కలుగుటలో ఆశ్చర్యమేమున్నది. ''రామకృష్ణ పరమ హంస'' ఇట్టి ఉన్మాద స్థితిని ఎన్నియో మారులు పొందినాడు.

ఇట్టి స్థితినే నమ్మాళ్వారులు పొందినట్లు ఈ పాశురము వలన మనకు స్పష్టమగును ఈయన ద్రావిడ వేదమను తిరువాయ్ మొజి అను దానిని రచించెను అది యంతయు మధుర భక్తి సంపన్నము.

''పోకు నమ్బి యన్దామత్తైప్పూరికణ్ణినైశెవ్వాయ్ ముఖువలుమ్
ఆకులజ్గళ్శెయ్యవళి తణ్ణినేత్రమే యామ్
తోకైమామయిలార్ కళ్ నిన్నరుళ్ శూడ్ వార్ శలియో శైవైత్రళ
ఆకల్ పోకవిట్టు కుళలూతు పోయిరున్తే

స్వామి యొక్క సౌందర్యమును తిరస్కరించుచు పెడమొగమైన నాయిక (నమ్మాళ్వారు) ''నీవెవరి కొప్పును చూచిమోహించితివో అక్కడికే పొమ్ము అని కసరు కొనుట ఇందు వర్ణితము. ''వారెచ్చట నున్నారు'' అని స్వామి ప్రశ్నింపగా ''నీవు వేణు గానము చేసినచో వారు అభిసారికలైనీ వద్దకు వత్తురు'' అని నాయిక సమాదానము నిచ్చెను (24)

అన్నమయ్యయు ఇట్టి స్థితినే పొంది ''కలహాంతరిత నాయికయై ఆ స్వామి లోపములనెన్నినాడు. చివరకు ఆయన మనోనాథుడైన శ్రీ వేంకటేశ్వరుని కృపకుపాత్రుడైనాడు

ఇట్టి కలహాంతరితగా ఒండు రెండు కీర్తనలతో దక్క మిగిలిన అన్నింటిలోనూ మనకు అన్నమయ్యయే కన్పించును అలమేల్మంగాది దివ్యనాయికలకు కలహాంతరిత సంబందమైన పదములలో ఒకటి రెండు తావులందే ప్రవేశము కలదు నా దృష్టికి వచ్చిన దివ్యనాయిక గల కీర్తన

ఏమి చెప్పుదు కాతాళమిట్లాయ నావలపు
కామించిన దాన నీకు కరుణించు మికను ||పల్లవి||

కుప్పళించి నిన్న రాని కోపమే జూపితి గాని
చొప్పుగా నెదుట నిన్ను జూడనైతిని
చెప్పకు బుద్దులనుచు చెలికి మొక్కితి గాని
ముప్పిరి జేతులెత్తి మొక్కనైతి మీకును || ఏమి||

తత్తరించి నీవు సేసే తప్పు లే పట్టితి గాని
ఒత్తి నీ విచ్చే బాగాలు పట్టనైతిని

ఇత్తల సవతులతో నెమ్మెలు చెప్పితి గాని
హత్తి నీతో నవ్వుచు బ్రియములు జెప్పనైతి ||ఏమి||

వెక్కసపు మాటాడగా వీగనొత్తితి గాని
తక్కక జూచిన నీపాదా లొత్తనైతిని
నిక్కి శ్రీవేంకటేశుడ నే నలుమేలు మంగను
మక్కువ నేర్చితి గాని మంకు నేర్పనైతిని ||ఏమి|| (20-548)

ఇందలి నాయిక అలమేల్మంగ దివ్య శ్రీనివాసునకు మరియొక దేవి శ్రీదేవి ఆమె యొద్ద కేగి తనను నిర్లక్ష్యము చేసెనను ఈర్ష్యచే కాబోలు అలమేల్మంగ స్వామిపై నిరాదరణ చూపినది. హితములు చెప్పబోయిన చెలికి మొక్కినది గాని స్వామికి మొక్కలేదు. ఆయన తప్పులనెన్నినది సవతులతో మాటాడినది గాని స్వామితో పలుకనైన లేదు. పాదములొత్త లేదు మూర్ఖత్వమును తెలిసికొనలేదు. కాని మక్కువ మీరగ ఆయన కొరకు తపించుట తెలిసినది ఆ మీరిన మక్కువ చేతనే ఆమె అలుక బూనినది అందులకే కలహించినది. ప్రణయ కోపము గడ్డిమంట వంటిది తృటిలో శాంతించినది తన తప్పును తెలిసికొనిన యామె పశ్చాత్తాపము బొంది తన్నుతాను నిందించుకొనుచు స్వామిని వేడుకొనినది.

తక్కిన కీర్తనలలో అన్నమయ్యాయే కలహాంతరిత. మధుర భక్తి పరాకాష్ఠ నందిన స్థితి ఇది ఈ క్రింది కీర్తనలో అన్నమయ్యాయే మనకు గోచరించును

తొలుత నిన్ను దిట్టే దోసకారిని
పలుమారు మాకేల బాతి పడేవయ్యా ||పల్లవి||

నిచ్చనిచ్చనీమీద నేరములు యెంచి యెంచి
పచ్చిసేసే నేనెంత పాప జాతిని
మచ్చరపు దాని నింతే మంచి దాననా నీకు
యిచ్చగించి నాచెఱగు యేల పట్టేవయ్యా ||తొలుత||

పట్టినీవే పెనగ బలిమి దప్పించు కొనే
నెట్టన నేనెటువంటి నిష్ఠూరినో
దిట్టవై శ్రీ వేంకటేశ తేజాన నన్ను గూడితి
విట్టె కదపలోన నేలమొక్కేవయ్యా ||తొలుత|| (20-257)

ఇందలి నాయిక అన్నమయ్యయే నాయికా భావము వహించిన దాను స్వామితో కలహించినాడు. కొంతసేపటికి తన దప్పును దెలిసికొని పశ్చాత్తాప పడిన విషయము ఈ పదము నందు సుస్పష్టము.

ఇట్టివే కొన్ని కీర్తనలు

2. అప్పటి కాతాళాన నంటిగాని నిన్ను
అప్పగించే నా వలపులంటిగా నిన్ను ||పల్లవి||

పీడిన నీనా సంధి విరహ తాపపు వేళ
ఆడరాని మాటలెల్ల నంటిగా నిన్ను
యీడనే నీవు మన్నించే దించుకా నెరుగలేక
ఆడుకోలు మాట దప్పె నంటిగా నిన్ను ||అప్పటి|| (20-316)

నాయిక పశ్చాత్తాపము నందుట ఈ పదమునందు గమనింపవచ్చును.

3 ఏలిన వారి సెలవేమి సేసినా
నాలినా చేత లెల్లాను నవ్వు సేసుకొమ్మీ ||పల్లవి||

తాలిమి లేనిదాన తమకించి నిన్నునిట్టి
వేళతోసె రావనుచు వెంగె మాడితి
నీలాగు నెఱుగక నేరము లెల్లానెన్నితి
వేలవేయ కిక నన్నీ నోరుచు కొమ్మీ ||ఏలిన||

వేటూరి ఆనందమూర్తిగారిచ్చిన ఉదాహరణ

4. ఎంతవాడవైన నిన్ను నింతసేసితి
ఇంతిని నాయపరాదా లెట్టోరి చేవయ్యా ||ఎంత||

మనసు నొప్పించితి మాటలెల్లానాడితి
చెనకగా వద్దని పై జేయి వేసితి
పెనిగిలి నీతోడ ప్రేమరెట్టించగాను
యెనసి నాయపరాధా లెట్టోరి చేవయ్యా ||ఎంత|| (17-565)

## 7. ప్రోషిత పతిక

I దేశాంతర గతే భర్తరి సంతాప వ్యాకులాప్రోషిత భర్తృకా (రసమంజరి)

II ఎవతె పతి నానా కార్యవశమున దూరదేశమేగునో, మదన దుఃఖార్తయగు నామె ప్రోషిత భర్తృకయగును - సాహిత్య దర్పణము.

III నానా కార్యాసక్తుడై ప్రియుడు దేశాంతరము వెడలగా కేశ సంస్కారాదులను వర్జించి యుండు నాయిక ప్రోషిత భర్తృక యగును. - నాట్య శాస్త్రము

IV నిజేశుడు. విదేశ గతుడైన గృశత దాల్చునతివ ''ప్రోషిత పతిక''

- కావ్యాలంకార సంగ్రహము.

అన్నమాచార్యుని కీర్తనలలో ప్రోషిత పతికకు దివ్య శృంగార వర్ణనము నందు స్థానముండుటకు వీలులేదేమో యని డా. వేటూరి ఆనందమూర్తిగారు అభిప్రాయ పడినారు.

''ప్రోషిత బర్తృకా, ప్రవత్స్యత్పధికాది నాయికా భేదములు మాత్రము తాళ్ళపాక కవుల దివ్య శృంగార వర్ణన ప్రదానము లైన పదములందంతగా గోచరములు కావు. తుదిని బేర్కొన్నయీ యవస్థా నాయికలకు లౌకిక శృంగార వర్ణనమున గల స్థానము దివ్య శృంగార వర్ణనమున నుండుటకు వీలు కాదేమోయను కొందును. వైష్ణవాలంకారికులగు రూపగోస్వామి ప్రభృతులు కృష్ణరతి విషయమున సామాన్యాబెదములను బరిగణింపక స్వీయా, పరకీయా నాయికలను మాత్రమే పరిగణించినారు. తాళ్ళపాక కవుల దివ్య శృంగార పదములలోను మనము అట్లే అవస్థా నాయికలను లెక్కించు పట్టున ప్రోషిత పతికా, ప్రవత్స్యత్పతికా భేదముల నంత విస్పష్టముగా గుర్తింప జాలని కారణమున వానిని విడచి విప్రలబ్ధ నాయికను మాత్రమే స్మరింతుము'' (25)

తాళ్ళపాక అన్నమాచార్యుని రచన లన్నింటిని (శృంగార రచనలు) పరిశీలించినచో ఈ విషయము తేటతెల్లమగును స్పష్టముగా గుర్తింప జాలక పోవుట వాస్తవమే అయ్యును అట్టి పోకడలున్న ఒకటి రెండు కీర్తనలను ఇచ్చట ఉదహరింతును.

నిజేశుడు దేశాంతర గతుడై యుండుట వలన మదన దుఃఖార్తయై, కృశత వహించి, కేశ సంస్కారాదులను సైతము వర్జించి యుండు నాయిక ప్రవత్స్యత్పతిక లేక ప్రోషిత పతిక యని యాలంకారికుల మతము.

దేశము అనగా కొన్ని పల్లెలు, పట్టణములు గల భూమియను అర్థముతో పాటు ప్రదేశము అనునది కూడ నిఘంటువులలో చూడనగును అట్లే ప్రదేశము అనగా స్థలము, చోటు, తావు అనియు నర్థములు గలవు. కావున ఉన్నతావు వదలి వేరు తావులకు బోయిన వానిని గూడ దేశాంతర గతుడని చెప్పుకొనన విజ్ఞుల కభ్యంతర ముండదని యనుకొందును ఈ క్రింది కీర్తనను ''ప్రోషిత భర్తృక'' కు ఉదాహరణముగ నీయ వచ్చునను కొందును

ఎప్పుడు వచ్చునో యంటా నెదురు చూచీ బతికి
తప్పిదేరు మోము తోడ దాచలేదు ప్రియము ||పల్లవి||

వేట వోయిన మగడు వీధిరాగా కిన్నెర
మీటుచు దా నిక్కి చూచి మేడపై నుండి
గాటపు గుబ్బల కొంగు గప్పదు జారిన నింత
ఆటది వలచే నేని అపరాదు ప్రియము ||ఎప్పుడు||

తేకువ మెరసి రాగా తిరువేంకటేశు జూచి
వేకపు దురము తోడ విఱ్ఱవీగీని
కాకతోడ జిత్త మెల్ల గరిగి నీరై మించె
యేకట నెవ్వరికైన నెంత గాదు ప్రియము ||ఎప్పుడు||

ఇందలి నాయిక పతి ఎప్పుడు వచ్చునో యనుచు ఎదురు చూచుచున్నది ఆమె ముఖము అలసట గలిగినట్లున్నది ఆ నీరసించిన మొగము ఆమె మనసులో దాగిన పతి యందలి ప్రేమను చాటుచున్నది.

పతి వేటకేగినాడు ఎప్పుడు మరలివచ్చునో యేమో ఎంతకును రాడు జారిన కొంగు సవరింపదు. కిన్నెర మీటుచు మేడపై నుండి నిక్కి చూచును మదన తాపము హెచ్చినది. అందులకే కాకతోడ చిత్తమెల్ల కరిగి నీరైనది ఎవరినైన కోరిక ఎంత పనినైన చేయును.

ఇచ్చట వేటకేగుట యనగా ప్రియురాలిని వదలి ఇతర ప్రదేశమున కేగుట అనగా దేశాంతర మనియే భావము శరీరము కార్శ్యము నొందినట్లు కనబడకున్నను మనసు కరగి నీరైనది. అనగా మదన దుఃఖార్త యైనదనియే గదా భావము స్త్రీ వలచినచో ఆమె ప్రేమను పట్టియుంచుట ఎవరికిని సాధ్యము కాదు. '' ఆటది వలచెనేని అపరాదు ప్రియము'' అని

మొదటి చరణము నందలి చివరి పాదము. దీని వలన వేటకై ఏగిన తన ప్రియుని కొరకు నాయిక మదనార్తయై యున్నదనియు, ఆమె వలపు ఆపరానిదనియు, అందులకే ఆమె మనసు కరిగి నీరైనదనియు తెలియుచున్నది. ఇట్లు అలంకారికులు చెప్పిన "ప్రోషిత పతిక" లక్షణములు కొన్నియైనను కలిగియుండుటచే ఈ పదము నందలి నాయిక ప్రోషిత భర్తృక యని చెప్పవచ్చును. ఈ క్రింది పదము నందును ప్రోషిత పతిక పొడగాంచవచ్చును.

అతనికి నిది పరాకొనో కాదో

కాతరపు భ్రమనే గాచుకున్న దానను (30-102)

ప్రోషిత పతికగా మీరాబాయి నీ క్రింది పదమున గాంచవచ్చును.

మాయీ, మేరా పియా బిన్ అలూణోదేస్
రాగ రంగ్ సిణగార్ నభావై, ఖులిరహ్యై సిర్ కే కేస్
సాదణ ఆయీ సాహిబ్‌దూరే, జాయిరహే పరదేస్
సేజ్ అలూణీ భవన అకేలే, రైణ్ భయంకర్ బేస్
ఆవ సలూణే ప్రీతమ్ ప్యారే, బీతే జో బస్ బేస్
మీరాకే ప్రభు హరి అవినాసీ, తన మన కరూం సబ్‌పేస్
(మీరా బృహత్పద సంగ్రహ్ 34-37)

## 8. అభిసారిక

I స్వయ మభి సరతి ప్రియ మభి సారయతి వాయాసాభిసారికా - రసమంజరి

II మద్యమదము చేకాని, మదన పారవశ్యముచే గాని లజ్జను విడచి కాంతుని యొద్దకు పోవు నాయిక "అభిసారిక" యనబడును. - నాట్య శాస్త్రము

III కాంతాభి సరణ శీల యభిసారికాఖ్యే చెలువు మెఱయు

- కావ్యాలంకార సంగ్రహము

IV ఎవతె మదన వశం వదయై కాంతుని తన కడకు రప్పించుకొనునో లేక తానే యాతని కడకు బోవునో ఆ నాయికను పండితులు "అభిసారిక" యందురు. - సాహిత్య దర్పణము

యిందాకా సిగ్గువడే నిప్పుడు నీవు
కందువలెల్లా నంటి కౌగిలించరాదా ||పల్లవి||

పూచిన తంగేడు వలె బొలతి నిలుచున్నది.
కూచుండు మనరాదా కోరి నీవద్ద
రాచిలుక వలెనే రవళిగా మాటాడీ
చేచేత మెచ్చి సంతోసించగ రాదా || యిందాకా||

యెలమి రాయంచవలె నింటికి వచ్చేనిపుడే
చెలరేగి కాపురాలు సేయరాదా
కొలని తుమ్మెదవలె కోరి నిన్ను బాయలేదు
పిలచి లాలన సేసి బెరయగరాదా ||యిందాకా||

అందపు గోవెల వలె ఆకు కోరికి నీకిచ్చీ
చెంది పొత్తుల వీడెము సేయరాదా
ఇందునే శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
పొందుల రతులు తలపోసి కొనరాద ||యిందాకా||

ఇందలి నాయిక స్వయముగ నభిసరించినది. మధ్యవర్తిగ చెలికత్తె కాబోలును రాయంచవలె ఒయ్యారముగ నడచి కాంతుడున్న ఇంటికి యరుదెంచినది. రాచిలుక వలె మాటాడినది. పూచిన తంగేడు వలె నిలచినది. ఇది బాహ్య సౌందర్యవర్ణనా విశేషము. ఇందలి అంతరార్థము మరియొకటి గలదు. నాయిక నడక రాయంచ వలెనున్నది అనగా అందమైన నడక, నడక యనగా నడత యను కొనినచో నాయిక యొక్క (మధుర భక్తుని) ప్రవర్తన ఉత్తమ మైనదని భావము. ఆమె చూచుటకు పూచిన తంగేడు వలెనున్నది. ఇచ్చట ఆమె యనగా ఆత్మ. ఆత్మ వికసించినది. అనగా భగవత్సంబంధమైన జ్ఞానముకలిగి యున్నదని అర్థము. ఇంక ఆమె పలుకులు చిలుక పలుకులు. చిలుక మనమేది నేర్పించిన దానినే తిరిగి పలుకును. ఇచ్చట భక్తుడైన అన్నమయ్య గురూపదేశమును బొందినవాడు. ప్రహ్లాదుని వలె నోరు నొవ్వంగ హరికీర్తి నుడువువాడు. ఆ శ్రీమన్నారాయణుని స్మరణము దక్క అన్యచింతనలేని వాడు సదా కొలనిలోని తుమ్మెద వలె పద్మమునెడ బాయక పరమాత్మను అంటిపెట్టుకొని యుండు స్వభావము గలవాడు. ఆ కారణముగనే ఆయన ఇంటికే అనగా కోవెలకే అభిసరించినవాడు. కొండంత దేవుని యొద్దకు రిక్త హస్తములతో పోవుట పాడికాదు

గదా! అందులకే ఆకులు (తాంబూలము) కొని పోవుట. కోయిల ఎట్లు ఆకులను కొరికి వేయునో అట్లు అందముగ తాను సిద్ధము చేసిన విడెమును కొరికి మరీ ఆయనకు సమర్పించినది. కొరికినచో నది యెంగిలి యగును గదా! అను సందేహము కలుగక మానదు. కాని ప్రేయసీ ప్రియుల మధ్య ఇట్టి ఎంగిలి మంగలములు అను భేద భావములకు తావు లేదు. వీరు లౌకిక ప్రేయసీ ప్రియులు కారు. అన్నమయ్య సాహిత్యమున లౌకిక శృంగారమునకు తావులేదని ఇతః పూర్వమే పలు మారులు మనవి చేసి యుంటిని. ఇది ఆత్మ, పరమాత్మల మధ్య నడచు దివ్య శృంగారము.

వికసించిన జ్ఞానముతో సత్ప్రవర్తన కలిగిన భక్తుడు పదేపదే హరి నామస్మరణ చేయుచూ నాయికా భావము వహించి అందించిన నైవేద్యమును భగవంతుడు అందు కొనక మానునా? శబరి అందించిన ఎంగిలి పండ్లను భుజింపలేదా? విదురుడు అందించిన అరటి పండు తొక్కలను స్వీకరింప లేదా? అందునను ఇచ్చట తాంబూలమనగా హృదయ మనియే భావించ వలెను. ఆ హృదయము తొలుత అజ్ఞానముతో మలినమైనదే కాన గురూపదేశమైన పిమ్మట దోషరహితమైనదే. అందుకే శ్రీ వేంకటేశుడు ఆమె నట్టే యేలుట. ఈ విషయములన్నియు చెలికత్తె చేత చెప్పించినాడు అన్నమయ్య. అభిసారికగా వచ్చిన నాయికను శ్రీ వేంకటేశుడు ఆదరించి పరిపాలించుటయే ఈ కీర్తనలోని భక్తికి పరాకాష్ఠ.

ఈ క్రింది కీర్తనలో అలమేల్మంగా శ్రీనివాసుల పరమైన దివ్య శృంగార లీలా విశేషము గాంచవచ్చును అలమేల్మంగయే అభిసారికయై శ్రీనివాసుడున్న చోటికి అరిగినది ఈ కీర్తన యందును చెలికత్తె ప్రమేయమున్నది ఇచ్చట చెలికత్తెగా అన్నమయ్యయే పూనుకొనెను.

ఏమి నవ్వులు నవ్వేవు ఎఱిగెఱిగుండీ నీవు
కాముకురాలైన దాని గౌగలించరాదా ||పల్లవి||

చెక్కిట చెమట తోడ చెలినీ వద్దికి వచ్చే
వుక్కుమీరి చన్ను జన్ను నొరయగాను
యెక్కుడైన యాసలతో నెదుట నిలుచున్నది
గ్రక్కన నలవు దీర గౌగలించరాదా ||ఏమి||

క్రొమ్ముడి జారుతోడ గోరి నీ వద్దికి వచ్చే
కమ్మవిరులు వీపుపై గడు రాలుగా
నిమ్మపండ్ల కానుక నీకు నొసగినదే
కమ్ముకొనీ లాలించీ గౌగలించరాదా ||ఏమి||

ముదముప్పొంగ నలమేల్మంగ నీవద్దికి వచ్చె
గుదిగొన్న వాసనలు గుబులు కోగా
ఎదపై శ్రీవేంకటేశ ఇరవాయ గూడితిని
కదిసి ఇంకా నింకా కాగలించరాదా ||ఏమి||

కాముకురాలై కోరి నీవద్దకు వచ్చిన అలమేల్మంగను ఏలుకొమ్మని దూతి చెప్పుటయు, ఆమె తమిదీరునట్లు శ్రీ వేంకటేశుడు ఇరువుగ గూడినట్లును వర్ణితము నాయిక ఏ యవస్థలో స్వామిని చేరినను కోరినను అంత్యమున శ్రీ వేంకటేశ్వరుని ఆలింగన సుఖము లబించుటయే అన్నమయ్యగారి ప్రతిపదము నందలి ముఖ్య విశేషము. ఇంకను ఈ క్రింది కీర్తనలను గమనింపవచ్చును

1. అవధారు చిత్తగించవయ్యా యీకెదిక్కు
కవగూడి యిప్పుడిట్టె కౌగలించవయ్యా ||పల్లవి||

చినుకు చిరుచెమట చెక్కుల వెంట గారగా
వనిత ఇదివో నీవద్దికి వచ్చె
కొనలువేళ్ళ దురుము కొంత గొంత ముడుచుకు
యినలేని తమితోడ నిదె నిలుచున్నది ||అవధారు|| (28-462)

2. అద్దమ రాతిరి కాడ అలపు చూడకవచ్చె
వద్దికతో పీటపై గూచుండ బెట్టుకోవయ్యా ||పల్లవి||

సారె జారు దురుముతో సతినీ ఇంటికి రాగా
జీరల చెమట గారీ జెక్కుల వెంట
చేరి సురటి విసరి చెంగలువలు ముడిచి
గారవించి పరుపుపై గాగలించుకోవయ్యా ||అద్దమ|| (29-420)

3. నేనెఱిగినదే తొల్లి నీ సుద్దులు
మానగద వయ్యా నీ మతకము లెల్లను ||పల్లవి||

నీవున్న యిక్కు లెఱిగి నెలత యీడకే వచ్చె
సేవ సేయరమ్మని చెప్పించితివే
వేవల నీవప్పటిని వొత్తేల పెట్టుకునేవు
దేవరవు గావా నీవు దిమ్మరి తనానకు ||నేనెఱిగినదే||

డా. వేటూరి ఆనందమూర్తిగారి ఉదాహరణ

''కామించి నీవరుగ గలయు నాయకుడు నే
డేమి భాగ్యము సేసెనే తరుణి
కాగిన గుబ్బల మీద కమ్మ జెమటల దొప్ప
దోగిన బయ్యెద కొంగు దూలగను
వేగెన కొప్పున క్రొవ్విరులు దురిమి విబ్బి
వీగుచు నీవెటు వొయ్యేవే తరుణి ||నేనెఱిగినవే|| (12-142)

ఈ పైన నేనుదహరించిన కీర్తన త్రయములో అభిసారిక స్పష్టముగ గోచరించు చున్నది. ఇందలి నాయికలు ఎవరో ప్రత్యేకించి పేర్కొనకపోవుటచే మధుర భక్తుడైన అన్నమయ్యయే నాయికా భావముని అభిసారిక యైనట్లు మనమూహింప వచ్చును. ప్రతి కీర్తన యందును దూతీ ప్రమేయమున్నట్లు సుస్పష్టముగ తోచుచున్నది.

ఇట్లు అలంకారికులచే పేర్కొన బడిన శృంగార నాయికలు (అష్టవిధ) అన్నమయ్యగారి శృంగార సంకీర్తనలలో ప్రత్యక్షమగుదురు. అట్టి నాయికలు ప్రియుని సమాగమమునకు దూరమగుటచే పొందెడి అవస్థలు లౌకిక నాయకులకే వర్తించు ననెడి అభిప్రాయమునకు తావులేదు ఏలనన ఇట్టి శృంగార సంకీర్తనలు మానవ విరచితములు, మానవుడైన అన్నమయ్య అనంత భగవత్ జ్ఞాన సుసంపన్నుడై మధుర భక్తితో సేవించినవాడు. కనుక తానే నాయికగా మారి ఆ స్వామిని చేరుకొనుటకై వివిధ నాయికల భావము వహించినట్లుగనే నాయికలనుభవించు అవస్థలను తానే యనుభవించెను. శ్రీ వేంకటేశ్వరుని కొఱకు శ్రీ, భూ, నీళలు, అలమేల్మంగాది దివ్యనాయికలు అవస్థలు పొందినట్లుగ భావించెను ఆ భావనలో దివ్యాభూతులను పొందెను. ఏ నాయిక ఏ అవస్థలో నుండి స్వామిని గూర్చి చింతించినను ఆయన కొఱకు అభిసారిక యై పోయినను విరహమున తన్నుదా మరచి ఆయనను విమర్శించినను చివరకుస్వామితో పొందు లభించుటయే ఈ కీర్తనలలోని వైశిష్ట్యము స్వామిని సంకీర్తనలచే సేవించుట వలన కలుగు ఫలమిదియే గదా!

ఇట్టి శృంగార నాయికలనుభవించిన దశ కామావస్థల నుండి ఏడెనిమిది అవస్థలకు మాత్రమే ఉదాహరణలుగా అల్పబుద్ధికి తోచినవి. జడత, మరణము అను అవస్థలకు ఒక విధముగ మధుర భక్తిలో తావు లేదన వచ్చును. ఏలనన ప్రతి కీర్తన యందును నాయికకు స్వామి సంసర్గము లభించుచునే యున్నది భక్తులకు మరణముండదు. వారికి స్వామితో సంసర్గమే లభించును అనగా ముక్తి యన్నమాట. ''జడత్వమనగా స్మృతి లేకుండుట.

అంగములు, చేష్టల దక్కుట అట్లే మనస్సు'' అని సాహిత్య దర్పణ అనువాదము (27)

మనసు, శరీరము చేష్టలుడిగినప్పుడు సంకీర్తనా రచన కొనసాగదు. ఈ కారణమున నేమో అన్నమయ్య రచనలలో జడత్వ మరణావస్థలకు తావు లేకుండ పోయినది. అంతియగాక మరణము వలన శృంగారమునకు స్థానము లేకుండ పోవును. రసాభాసమగును పూర్వ కవులెవ్వరును విషాదాంత కావ్యరచన సాగించునట్లు తోచదు. ఆధునిక కాలమున మాత్రమే ''విషాధ సారంగ ధరాది'' కావ్యములు వెలువడినట్లు తోచును అందులకే అన్నమాచార్యాది తాళ్ళపాక కవులు విషాదాంత రచనలకు తావీయ లేదు. భక్తి విషయమున మరణమను మాటకే తావు లేదు. భౌతిక శరీరమునకు నాశన ముండునే గాని ఆత్మకు లేదు కదా। భక్తి శరీరమునకు గాక ఆత్మకు సంబంధించినది. కర చరణాదుల భక్తికి సహాయ కారులు ముక్తి లభించునది ఆత్మకు - అట్టి ఆత్మకు నాశము లేదని శ్రీకృష్ణ భగవానుడు చెప్పెను గదా !

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః

నచైనం క్లేదయం త్యాపో నశోషయతి మారుతః

కనుక విప్రలంభ శృంగారమున అభిలాషాది అవస్థలకు లోనైన శృంగార నాయికా స్వభావమును సంతరించుకున్న సంకీర్తనలను క్రమముగ నుదహరించెదను.

విప్రలంభేచాభిలాష చిన్తా స్మృతి గుణకీర్తనోద్వేగ ప్రలాపోన్మాద వ్యాధి జడతానిధనాని దశావస్థా భవంతి - రసమంజరి (28)

రసమంజరీ కారుని వివరణ ననుసరించి దశకామావస్థలీ విధముగ నిర్ణయించబడినవి.

i) అభిలాష, ii) చింత, iii) అనుస్మృతి, iv) గుణకీర్తనము, v) ఉద్వేగము,
vi) విలాపము, vii) ఉన్మాదము, viii) వ్యాధి, ix) జడత, x) మరణము

## i) అభిలాష

1) సత్సంగమేచ్ఛా అభిలాషః - రసమంజరి (భానుదత్తుడు)

2) అభిలాషయనగా కోరిక :- సాహిత్యదర్పణము (వేదంవారు)

3) తాను కామించిన స్త్రీని (పురుషుని) గూర్చిన జ్ఞానముతో ప్రారంభమై సంకల్ప పూర్వకమైన ఇచ్ఛచే ఉద్రిక్తమై సమాగమోపాయము వెదుకుట.

లక్షణములు - 1 ప్రియుడున్నచోటు నుండి వెడలి మరల ప్రవేశించుట

2. ప్రియుని దర్శన పథమందు నిలచుట.

3. మదన చిహ్నములను ప్రదర్శించుట.

నాట్య శాస్త్రము (పి. ఎస్. అప్పారావు)

అప్పటి నుండి చూచె మాపెనేనీ యిదుటనే
కుప్పళించె పెంజెమాట కుచముల వెంటను ||పల్లవి||

రెప్పలెత్తి నిన్ను జూచు రేసులేక సిగ్గుతోను
కప్పిన పయ్యెద కొంగు కడు బిగించు
చెప్పనొక మాట నీతో చెలియమాటుకు బోవు
ఇప్పటి యీ సతిమొహ మేమందు మిక ||అప్పటి||

సెలవుల కొంత నవ్వు చెక్కున చెయి జేర్చు
అలివేణి నీ మాటే ఆలకించును
తలపులో నిన్ను మన్నించు దగ్గరినీ వొద్ద బొంచు
వలపు లీపెకు నాపవశముగాదిప్పుడు ||అప్పటి|| (20-259)

స్త్రీ పురుషులలో నెవ్వరైనను తాము కామించిన వారితో సమాగమోపాయమును వెదకుచు చేయు ప్రయత్నమునకు ప్రదర్శించు చేష్టలకు అభిలాషయని చెప్పవచ్చును

పై పదముగ నాయికకు గల అబిలాష స్పష్టమగు చున్నందున ఆమె నాయకుని ఎదుటనే తిరుగాడగా చెమటలచే కుచములు కుప్పళించినవి అనగా నిండి పోయినవి ఆయన వైపు రెప్పలెత్తి చూచును కొంగు గట్టిగా బిగించును. ఏదో యొకటి కల్పించుకొని ఆయనతో మాటాడును అంతలోనే అతని దృష్టిపథము నుండి తప్పుకొనును చిఱు నవ్వులు నవ్వును చెక్కిట చేయి చేర్చును. ఆయన మాటలు వినును మనసు నింద అతని రూపమే నించుకొనును. పొంచి చూచును. ఏవేవో సైగలు చేయును. చనవులు చూపును. ఆయన నొక్కమారు కౌగలింప, సమయమున్నకై చూచును.

ఈ చిన్నెలన్నియును ఆమె కాతనిపైగల అభిలాషను ప్రకటించునవే అతని పై తన యనురాగమును సూచించునవే. ఎటులైనను అతనిని తన కౌగిట చేర్చుకొన వలెననెడి తపన ఇందు గొచరించును.

ఇది లౌకిక విషయము ఇంక అలౌకిక శృంగార విషయమును పరిశీలింతము ఇందలి నాయిక ఎవరో ప్రత్యేకముగ పేర్కొన బడలేదు కనుక అన్నమయ్యయే నాయికగా తన్నుదాను మలచుకొన్న భక్తుడాయన. సాక్షాత్ శ్రీ వేంకటేశుడే నాయకుడు భక్తుడనగా ఆత్మ శ్రీవేంకటేశ్వరుడు పరమాత్మయని వేరుగ జెప్పపని లేదు

ఆత్మ పరమాత్మలో లీనమగుటకు పొందెడి ఆరాటము మాత్రమే మనకీ పదమున గ్రాహ్యము చెమటలచే కుచములు కుప్పళించుట యనగా హృదయభాగము భక్తి రసముచే ఆర్ద్రమైనదని చెప్పుకొనవలెను రెప్పలార్పక స్వామిపైపె తదేకదృష్టితో చూచును నడుమునకు బట్ట చుట్టు కొనుట వినయ విధేయతలను భక్తిని సూచించును. నడుమునకు బట్టగట్టిగా చుట్టుకొనును ఇదివైష్ణసాంప్రదాయమునందలి భాగము ఆయనతోనేదోమొర పెట్టుకొనును మాటునకు బోవుట యనగా ప్రదక్షిణము చేయుటగా గుర్తింపవలయును విగ్రహము చుట్టు తిరుగవలెను గదా। అపుడు స్వామి కనుల ఎదుట నుండక పోవుట తటస్థించుట అదియే ''చెలియ మాటుకు బోవుట''

ఆయన లీలలను తలంచుకొని చిరునవ్వు నవ్వును. చెక్కిట చేయి జేర్చుకొని పరమాత్మ గురించి ఆలోచించు చుండును ఆయనమాటలను అనగా ఆయనకుసంబంధించిన మాటలు (కధలు) వినును. మనసు నిండా ఆ స్వామినే నింపుకొని ఆయన సన్నిదినే పొంచియుండి ఆయన కరుణా కటాక్షవీక్షణములకై ఎదురు చూచును. తనను రక్షింపు మని మనసున కోరుకొనుచు తన ముఖ భంగిమలచే ఆ స్వామిని దీనముగ వేడుకొనును ఆయన సంసర్గము కొఱకు ఉబ్బి పోవును ''కన్ని నీ కౌగిటికి పొంకము చూచును. పొంకము అనగా '' ఉబ్బు'' అని సూర్యరాయాంధ్ర నిఘంటువు అనగా పొంగి పోవు నన్నమాట.

ఆత్మ (జీవునకు) పరమాత్మునిలో ఐక్యమగుటకు పొందెడి తపన అనగా ''అభిలాష'' మనకీ పదమున గోచరించును దీనిని ప్రధమ భక్తి దశగా చెప్పవచ్చును

అంత్యమున శ్రీ వేంకటేశ్వరుడు నాయికను కూడుటయే ఆమె భక్తికి ఫలము

మదన చిహ్నములను ప్రదర్శించుటయు అభిలాషను సూచించును ఈ క్రింది కీర్తనను పరిశీలించినచో ఈ విషయము సుబోధక మగును

కొమ్మ నిన్ను చూచి చూచి కొప్పుదువ్వుకొనుటెల్లా
రమ్మనుట గాదా యేల రంతు సేతువు

చెలియ నీమొగమై సిగ్గువడుటిల్లాను
కలసే కొరకేగాదా కాతాళించేవు (31-342)

నాయకుని జూచి జూచి కొప్పుదువ్వుకొనుట, మొగము జూచి సిగ్గిపడుట ఇవన్నియు మదన చిహ్నములకు ఉదాహరణములే.

ఇట్లే - సొలసి సొలసి నిన్ను జూచి జూచి మాటలాడే
యెలమి నాపెనీతో నేటికో కాని
తలుపు మాటున నుండి తనివోక నవ్వీని
చెలరేగి తనునేమి సేసితివో కాని

యెన్నిమారులైన జేతులెత్తి యెత్తి మ్రొక్కీని
పన్నిన తారు కాణా లెట్టివో కాని (28-169)

మాటిమాటికి నీ కొలువునకు వచ్చును నీకు చేతులెత్తి మొక్కును. తలుపు మాటున నుండి నవ్వును. పరవశముతో నిన్ను జూచి నవ్వును. ఇన్ని చేసినను నీవు ఆమె విషయము చూడకుండ అలమేల్మంగనైన నన్ను ఏలితివి. మఱి ఆమె ఎవరు? ఆమెకు నీకు గల సంబంధమేమి? మీ వావి వరుసలేమి? అని అలమేల్మంగ ప్రశ్నించినది.

శ్రీహరి తత్వమెరిగిన వారు అన్నమయ్య శ్రీవైష్ణవ సాంప్రదాయమున లక్ష్మిలేని నారాయణుడు లేడు, సీతలేని రాముడు లేడు, రుక్మిణీ లేని కృష్ణుడు లేడు అదే వైష్ణవ భక్తికి లక్షణము. లక్ష్మి ద్వారా నారాయణుని సేవించుటయే రామానుజ సిద్ధాంతము. అందులకే వారు అను సంధానము చేసెడి ద్వయమంత్రములో ''శ్రీ'' ని చేర్చి యే జపము చేసెదరు.

1. శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే అనియు

2. శ్రీమతే నారాయణాయ నమః అనియు ద్వయమంత్రము.

అదే శ్రీ వైష్ణవ భక్తికి లక్షణము. ముందు లక్ష్మీదేవిని స్మరించిన పిమ్మట నారాయణ స్మరణము జగజ్జననిని స్మరించినచో ఆమెయే భక్తుని గూర్చి భగవంతునకు నివేదించును. అట్టి యెడ కేవలము లక్ష్మినే ప్రార్థించిన సరిపోవదా అను ప్రశ్నముదయించును. నిజముగ అంత మాత్రము సరిపోదు కైవల్యము నిచ్చు అధికారము ఆమెకు లేదు కాని తనను

వేడుకొనిన విషయమును భగవంతునకు నివేదింప గలదు. అందులకే ఇరువురిని కలిపి వేడుకొనుట ముఖ్యము.

ఈ రహస్యము నెరింగిన వాడగుట చేతనే మధుర భక్తుడైన అన్నమయ్య తన యవస్థను స్వామికి నివేదించుకొఱకు అలమేల్మంగ నాశ్రయించినాడు. ఈ మధుర భక్తుని ఆరాటము నామె గ్రహించినది. పై కీర్తనలో (28-169) అలమేల్మంగ చేత అడిగించినాడు చేతులెత్తి మొక్కుచున్న ఆ మధుర శృంగార నాయిక ఎవరు అని ఆమె స్వామి తన నేలిన ఏకాంత సమయమున ప్రశ్నించినది. ఆ భక్తుని గురించి స్వామికి గుర్తు చేసినది

మహా భక్తుడైన రామదాసు కూడ ఈ ధర్మ సూక్ష్మమును గ్రహించిన వాడై సీతమ్మ వారితో మొర బెట్టుకొనినాడు చెఱసాలలో శిక్షలకు గురియైన ఆ భక్తుడు ఎన్నియో విధముల ప్రార్థించినాడు విసిగివేసారి దూషించినాడు. మరల తన తప్పుతెలిసికొని బ్రతిమాలుకొనినాడు అయినను ఫలితము శూన్యము. చాలా ఆలస్యముగనైనను విషయము గ్రహించినాడు సీతాదేవిని ఆశ్రయించినాడు తండ్రితో ఎంత మొరపెట్టుకొన్నను సాధింపలేని పనులు తల్లి యొద్ద చెప్పుకొన్నచో నెఱవేరుట లోకమున చూచుచున్నారము గదా!

అందుకే తనను బ్రోవమని రామయ్యకు చెప్పవలసినదిగా సీతామాతను వేడుకొనెను

నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి
నను బ్రోవమని చెప్పవే
నను బ్రోవమని చెప్పు నారీ శిరోమణి
జనకుని కూతుర జనని జానకమ్మ
ఏకాంత రంగుడు శ్రీకాంత నిను గూడి
ఏకాంతమున నేకశయ్యనుండెడి వేళ ||నను||

ఆయన లక్ష్మీదేవితో ఏకాంతమున ఏకశయ్య నుండెడివేళ నెమ్మదిగా తన గురించి విన్నవించమని ప్రార్థించినాడు.

అన్నమయ్యయు ఇట్టి దారినే నడిచినాడు. ఆయన మొర అజనని వినినది. శ్రీ వేంకటేశునకు ఏకాంత సమయమున ఈ భక్తుని "అభిలాషను" ఆయన కెరుక పరచుటయే ఈ కీర్తన లోని సారాంశము.

చివరకు ఆ స్వామి కరుణించినట్లున్నది ఆయనయె సిగ్గులొలక వేయుచున్న మధుర భక్తుని పలుకరించినాడట నాయకుడు తనతో మాటలాడినట్లు, కూడి యాడినట్లు తలంచుట నాయికలకు సహజమే గదా! అట్టి యెడ మధురభక్తుల భక్తి తీవ్రత ప్రత్యేకముగ జెప్ప పని లేదు

ఈ క్రింది కీర్తనలో ఈ విషయము సుప్రకటితము

తమకమే నీకు నాకు తగుగాక
జమళి సిగ్గులు నేడు సారెకునేలే ||పల్లవి||

చక్కనే నాడేటి పెండ్లి సందడిలో నీ చన్నులు
యిక్కువల నన్నుదాకా నికనేలే
పిక్కటిల్లగోరి వేడి పెరటము వచ్చితివి
మక్కువ వెనక తియ్య మరియేలె ||తమకమే||

పచ్చగాగ నీవు సాకు పసపులు నలచగా
హెచ్చినీ గోరిదే తాకె నిక నేలె
అచ్చుమోవనీవునా అంగము లంటుకొంటివి
తచ్చినే నిన్ను జూడగా దలవలంచ నేలే ||తమకమే||

అనవుగా నీవు నాకు నారతులెత్తగానే
ఎవసె నీడల గాగిలగ నేలే
చెనకి కూడితి నిన్ను శ్రీవేంకటేశుడ ననే
దనిసితివీ సుద్దులు దాచనేలే ||తమకమే|| (22-200)

## 2. చింత

1. సందర్శన సంతోషయోః ప్రకార జిజ్ఞాసా "చింతా" - రసమంజరి

2. ప్రాప్త్యుపాయాదుల నరయుట "సాహిత్య దర్పణము"

3. ప్రియుని సమాగమమునకు ఉపాయమేది? అని దూతితో నాలోచించుట - నాట్యశాస్త్రము

లక్షణములు - 1. భావ సూచక అర్ధనిమీలిత నేత్రములు

2 కంకణమును, వడ్డాణమును, నీవీ బంధమును నాభిని స్పృశించుట

మరులు దెలివియు నాయ మాటలైన నాడరే
అరమోడ్పు గన్నులనేల అలసీ జెలియ ||పల్లవి||

తరుణిమై చెమరించె తలపెందు నున్నదో
విరహపు చింతలలో వెదకేని
కురులెల్ల నెరివిచ్చె గుణమెందు దాగెనో
పరవశములో జిక్కి భావించే నిదివో ||మరులు||

చెక్కులెల్ల పులకించె చిత్తమేమిసేసెనో
మొక్కుల శిరసు వంచి మొరసెని
ముక్కుల నూర్పులు ముంచె ముందునేమి కాగలదో
నిక్కి కుచ గిరులతో నిలువీదీ నదివో ||మరులు||

సిగ్గులెల్ల నుడివొయ చేతలిక నేటివో
కగ్గని శ్రీ వేంకటేశు కాగిటిలోన
అగ్గపు వేడుక లబ్బె నంగన నోము ఫలాన
తగ్గుమొగ్గు లెల్లాదీరి తమకించే నిదివో ||మరులు||

చింత అనగా తదేకమైన ఆలోచన ఇచట నాయికయొక్క ఆలోచన యంతయు నాయకుని పొందుట గురించినదే అభిలాష మిక్కుటమైన స్థితి. దానికి దీనికి ఇంతే భేదము. నాయకుని పొందుటకు తగిన మార్గము నాలోచించుట అరమోడ్పు కన్నులతో భావసూచకమైన ముఖ భంగిమలతో నుండుట

ఈ కీర్తన యందలి నాయిక అరమోడ్పు కనులతో విరహపు చింతలతో నుండుట చేత ఆమెశరీరము చిరుచెమటల గ్రమ్మి యున్నది చెక్కులు పులకించినవి నాయకుని తలచి తలచి నిట్టూర్పుల విడచినది. చివర కామె చింతకు ఫలితము లభించినది "కలౌస్మరణాన్ముక్తిః" అను వచనము ప్రకారము స్మరణ చేత ఆమెకు స్వామి సన్నిధి లభించినది. శ్రీవేంకటేశ్వరుని ఆలింగన సుఖము చవి చూడ గలిగినది. ఇందలి నాయికను అలమేలుమంగగనే గుర్తింపవలయును. ఆ దివ్యదంపతుల విప్రలంభ శృంగారము చక్కగా

ఇందు వర్ణింప బడినది.

చూతువు విచ్చేయ వయ్య సుద్దులు చెప్పగనేల
రాతిరి బగులు జాగరము లాయెను ||పల్లవి||

తగిన చింతా సముద్రాన గోరిక తోడ
దిగిన యట్టు చెక్కు చేతికి వచ్చెను

. ........ ........................

1. ముంచిన వలపు తలమునుకలై వనితకు
దించినట్టు కొప్పువీడి దిగ జారెను
యెంచరాని తమకము ఇగిరించి నట్టుమేన
జంచుల పులకలెల్ల జాజు కొనేను (26-475)

ఇందలి నాయికకు వలపు తలమునకలైనది. ఆ వలపు భారముచే ఆమె కొప్పు ముడి వీడినది చింతా సముద్రమున కోరిక యనెడి ఓడ ప్రవేశించినదా యన్నట్లు ఆమె చేయి చెక్కు నంటుకొని యున్నది యెంచరాని తమకపు వేడి చేత ఆమె మేన పులకలు వాడమినవి. చివరకు శ్రీ వేంకటేశుడు ఆమెను పొందుటయే ఆమె చింతకు ఫలము.

రమణీ భాగ్యము నేడురచ్చలకెక్కె
తమకపు వలపు నీతల కేల యెక్కదో ||పల్లవి||

చెలి తలపులో చింత చెక్కిటి చేతికివచ్చె
యెలమి నీ చిత్తమింకా నేల రాదో
నిలువున కాకలెల్లా నిట్టూర్పుల బుట్టి
తలిరుబోడిపై నీకు దయయేల పుట్టదో ||రమణి||

దట్టపు గోరికలెల్లా తను పులకలు దీరె
యిట్టి విన్నపాల గత లేల తీరవో
చిట్టకపు విరహము చెమటల గాన వచ్చె
గట్టిగా నీమోహమేల కాన రాదో ||రమణి||

ఇందు నాయిక యొక్క చింతావస్థను ఆమె చెలికత్తె నాయకునకు నివేదించుచున్నది. ఆయన కరుణ కొరకు నాయిక తపించుచున్నదని, స్వామి మనసు కరిగి కరుణ కొరకు నాయిక

తపించుచున్నదని స్వామి మనసు కరిగి కరుణ జూపునట్లుగా చెలికత్తె వర్ణించినది. ఇందలి చెలికత్తె మరి యెవ్వరోగాదు అన్నమాచార్యుడే ఆయన చెలికత్తె నుండి నాయిక వరకు అనేక రూపము లెత్తును తన భావనలో భక్తుడు పొందెడి అన్ని అనుభూతులను అన్నమయ్య పొందును. లక్ష్మిద్వారా స్వామికి తన మనోవేదనను విన్నవించుకొనెడి ''శ్రీవైష్ణవ సాంప్రదాయము'' ను బాగుగ ఆకలింపు చేసుకొనిన వారు అన్నమయ్య అందువలననే తాను చెలికత్తెయై అలుమేలు మంగను సేవించుట. ఆమెకు స్వామికి మధ్య రాయబారము నడుపుట, వారి సమాగమము ఏకాంతము తనకు కావలెను. ఆ ఏకాంత సమయమున తన్ను గూర్చి ఆ మాత స్వామికి మనసు కరగునట్లు చెప్పవలెను

చెలి తలపులలో చింత, చెక్కిట చేయి, వేడి నిట్టూర్పులు. దట్టపు కోరికలు, ఇవి అన్నియు ఆమెకు స్వామిపై నున్న చిక్కకపు విరహమును సూచించుచున్నవి. ఇన్నివిధముల ఆమె పరితపించుచున్న ''నీకేల దయరాదయ్యా స్వామీ'' అని చెలికత్తె పాత్ర వహించిన అన్నమయ్య మనవి చేసినాడు చివరకు నాయిక చింత దీరునట్లును, భక్తుని (చెలికత్తె) రాయబారము ఫలింప జేయునట్లును స్వామి కరుణించినాడు.

.. .. . .. .. . . .

ప్రక్కన శ్రీ వేంకటేశ పడతి గూడితి విట్టి
తక్కించి మన్నించ నీకు దరియెట్టాయెనో ||రమణి||

## అనుస్మృతి

1. ప్రియాశ్రిత చేష్టాద్యుద్బోధిత సంస్కార జన్యం జ్ఞానం స్మృతిః - రసమంజరీ
ప్రియ చేష్టాదులను జ్ఞప్తికి చేసుకొనుట స్మృతియని భావము
(రసమంజరికి తెలుగు అనువాదము - శ్రీ నీలకంఠయజ్వ)

2. సదృశజ్ఞానా చింతాదుల వలన పూర్వానుభూతార్థ విషయక జ్ఞానము స్మృతి యనబడును.

(సాహిత్య దర్పణము - వేదంవారి తెలుగు అనువాదము)

3. తరచుగా నిట్టూర్పులు విడచుట, తాను కోరినదానినే చింతించుట, ఇతర కార్యములందు విముఖులైయుండుట.

ముఖ్య లక్షణములు -

1 ఆసన శయ్యాదులలో స్థిరముగ నుండకపోవుట

2 చేయు పనిని ఆలోచనలతో మధ్యలోనే విడచిపుచ్చుట.

- నాట్యశాస్త్రము. డా పి ఎస్ /అప్పారావు

అన్నిటా నీకు బుణ్యమయ్యీగాని
మన్నించి నా తాపము మానుప రాదా

తలపోత ఘనమాయె తత్తర మాపగరాదు
అలిగిసేతో బాసినప్పటి నుండి
పలికితి నీతోను పంతము లిచ్చితి నీకు
మలసిన నావెత మానుప రాదా ||అన్నిటా||

కూచుండ సయించరాదు గుట్టుగ నుండగ రాదు
ఆ చాయ మారు మోమయి నప్పటి నుండి
చెచేత వద్దనుండాన చేతులెత్తి మొక్కితిని
కాచుకొని నన్నిక గరుణించరాదా ||అన్నిటా||

చెప్పరాదు విరహము సిగ్గులు బాయిట బడె
అప్పసము వాదడచి నప్పటి నుండి
ముప్పిరి శ్రీ వేంకటేశ ముంచి నన్ను గూడితివి
దప్పి దేరె నికనన్ను దయ జూడరాదా ||అన్నిటా||

ఈ పదమునందలి నాయిక అలమేల్మంగయే స్వామిపై అలిగినది అప్పటి నుండి ఆయనపై ప్రేమానురాగములు అధికమైనవి తలపోత ఘనమైనది. తత్తరము అనివార్యమైనది ఒక చోట నండలేదు మనసున నుంచలేదు విరహవేదన చెప్పుటకు వీలు లేకున్నది సిగ్గువోయినది ఇవన్నియు స్వామితో ఎడతెగని కలహము పెట్టుకొనినప్పటి నుండి, ఆయనకు మారు మోమయినప్పటి నుండి జరిగినవి అనగా విప్రలంభ శృంగారము ప్రారంభమై, చింత పెరిగి స్మృతియనెడి అవస్థకు చేరుకొనినదన్నమాట ఆయననే నిరంతరము ధ్యానించుచు తనను కరుణించుమని వేడుకొనినది నాయికయైన అలమేల్మంగ ఆ తలపోతకు (స్మృతికి) ఫలము శ్రీ వేంకటేశ్వరునితోడి సంగమమే అందుకే ''ముప్పిరి శ్రీ వేంకటేశ ముంచినన్ను

గూడితివి'' అని చివర అనుచున్నది కాని ఆయున కపుణ అపారము అందు వలనసె త స్వామి తన కరుణాసముద్రమున ఆమెను ముంచుట ఆయున ప్రేమలో ఆమెకు తలమునకలైనది. నాకు అలసట కలుగుచున్నది స్వామీ। నన్నింపుక కరుణించరాదా। అని ప్రార్థించినది

''దప్పిదేరె నిక నన్ను దయ జూడరాదా'' అని వేడుకున్నది ఇందు మొదటి చరణమున ''తలపోత ఘనమాయె'' అనినది నాయిక తలపోత అనగా ఆలోచన అని ''సూర్యరాయాంధ్ర నిఘంటువు'' ఆ స్వామిని గూర్చిన ఆలోచన యన్నమాట తపెక ధ్యానము ఒక కోరిక వలపు తోడి కోరిక అది పెచ్చు పెరిగినది గత స్మృతులు నెమరు వేసుకొన్నది ఆయనపై అలుగుట. మారు మోమగుట. అప్పనము వాదడచుట. ఇవి అన్నియు గతస్మృతులు. ఇట్లు పూర్వానుభూతార్థక విషయ జ్ఞానము కలిగియుండుటచే నిది అనుస్మృతియనబడినది

ఇంక భక్తి పరముగ జూచినచో తలపోత అనగా ఇచట ధ్యానమని చెప్పుకొనవలెను ఇది నిరంతర ధ్యానము ఇతర కార్యముల యందు విముఖులై యుండి. స్వామి లీలా విశేషములనే తలచుచు. బాహ్యప్రపంచమును మరచిపోవుట ''ధ్యానంచ తైలధారా వద విచ్ఛిన స్మృతి సంతాన రూపమ్'' అనినట్లు ఘనమైన తలపోతలచే స్వామిని మెప్పించినది ఈ ఆత్మ అందుకే ఆయన అపార కరుణా కటాక్షమునకు నోచుకొనినది నాయిక

ఇట్టివే ఇంకను ఒందు రెండు కీర్తనలు ఈ క్రింద నుదహరించినవి చూడవచ్చును

''తలపోసి తలపోసి తనువెల్లాకాకరేగె
వలపు దరింపరాదు వాములాయ నిపుడు (25-307)

ఇట్టిపో ధరనెవ్వరికి। తా
బెట్టిన మమతె పెద కొలిమపుసు (30-85)

## 4. గుణకీర్తనము

1 విరహి కాంతా విషయక ప్రతిపాదనమ్ గుణకీర్తనమ్ - రసమంజరి

2. అంగ ప్రత్యంగ లీలలో వాక్కులో. చేష్టలో. నవ్వులో. చూపులో వానిని పోలిన వాడు లేడని చెప్పుట గుణకీర్తన మనబడును - నాట్య శాస్త్రము

లక్షణములు - i) గుణములను కీర్తించుట

ii) గగుర్పాటు నొందుట

iii) కన్నీళ్ళను చెమటను తుడుచుకొనుట.

iv) దూతితో రహస్యముగ తన మనోవేదనను చెప్పుకొనుట

## వరాళి

విన వయ్య నీ దేవుల వేడుకైన సుద్దులు
పెనగొన్న మచ్చికల బెచ్చు పెరిగేని ||పల్లవి||

కోమలి నీ గుణములు కొనియాడు కొంటాను
నాము వార సెలవుల నవ్వు నవ్వేని
ఆముక నీరూపు మతినట్టి తలచు కొంటాను
వేమరు సంతోసాన విఱ్ఱవీగేని ||వినవయ్య||

నెట్టుకొని చెలులతో నీ సుద్దులు చెప్పుకొంటూ
గుట్టుతో లోలోనె సిగ్గులు వడీని
దట్టపు టాసల నీకు దానెదురు చూచుకొంటా
వొట్టుక మనోరథాల నోలలాడీని ||వినవయ్య||

నెమ్మది దెరమాటున నీమాటలే వినుకొంటా
చెమ్మ జెమటల చేత జెలరేగీని
యిమ్ముల శ్రీ వేంకటేశ యీకె అలమేలుమంగ
కమ్మినీ వెట్టి కూడగా గడుమెచ్చీని (28-416) ||వినవయ్య||

ఇందలి నాయిక అలమేలు మంగ ఆమె శ్రీ వేంకటేశ్వరుని లీలలను. గుణములను తలచుకొని విరహవేదన పొందుట ఈ కీర్తన యందు వర్ణితము.

దూతిగ మారిన అన్నమయ్య అలమేలు మంగ పొందుచున్న విరహావస్థను స్వామికి నివేదించుచున్నాడు. ''వినవయ్య నీదేవుల వేడుకైన సుద్దులు'' అని విన్నవించుట గమనింపవచ్చును.

కోమలియైన అలమేలు మంగ ఆయన గుణములనే కొనియాడును. ఆయన రూపును తలపున నిడుకొని అమితానందమును బొందుచున్నది. చెలులతో ఆయనంతటి వాడు మరి లేడని, ఆయన కళ్యాణ గుణములను గూర్చి ముచ్చటించుచున్నది. ఆయనపై గాఢమైన ఆశలు పెంచుకొన్నది. కోరికలలో ఓలలాడుచున్నది. తెరచాటు నుండి ప్రియుని గూర్చిన మాటలను వినుచు, చెమటలను తుడుచుకొనుచుననది. ''నీవు కూడితే తానెంతో మెచ్చునయ్యా శ్రీ వేంకటేశ'' అని రూపధారియైన అన్నమయ్య మనవి ఇచట సగుణోపాసన, స్వామి అనంత కళ్యాణ గుణములను నిరంతరము ధ్యానించుచు, నిర్మలానందాను భూతిని పొందుటయే సగుణోపాసన. అట్టి గుణకీర్తనము చేయుస్థితికినాయిక చేరుకొనిన దన్నమాట. అభిలాష చింతగా మారినది. అను స్మృతిగా మారి ఇప్పుడు గుణ కీర్తన దశకు చేరుకొనిన చతుర్థావస్థ ఇతి

ఈక్రింది కీర్తనయందు నాయికయు ఇట్టి స్థితినే బొందినట్లు గమనింపవచ్చును

ఏమి చెప్పేమయ్యా నీతో నింత సుద్దులూ
కామించే నిన్నూ నీకే గరుణించవయ్యా ||యేమి||

పడతి నిన్నుదలచి బయలు గౌగిట నించు
బడి బడి నీ సుద్దులు భావించును
అడి వాలములు సూచి ఆనందమున మించు
వుడివోని కోరికల నుమ్మగిలును ||యేమి||

తక్కక నిన్ను బేర్కొని తనలోనె సిగ్గువడు
చిక్కినీ మాటాలకించి చెమరించును
మిక్కిలి నీగుణాలకు మెచ్చు లోలో నవ్వు
వొక్కటైన మోవితేనె కూరకే యాకారును ||యేమి||

సమరతు లూహించి సరసపు మాటలాడు
కొమర నీరూపు వ్రాసి గోర గేరును
తమతో శ్రీ వేంకటేశ తగనీ విట్టె వచ్చి
రమణి కూడితివి యీరతులే తలచును ||యేమి||

ఇందలి పడతి యెవరో స్పష్టముగ లేదు ఎవ్వరైనను కావచ్చును. అలమేల్మంగ కావచ్చును. లక్ష్మీదేవి కావచ్చును. రుక్మిణీ, సత్యభామాది దివ్యనాయికలెవ్వరైనను గావచ్చును.

కాని ఇంత సుద్దులు స్వామితో చెప్పెడి వారు మాత్రము నాయికాది స్త్రీ స్వభావము వహించిన అన్నమయ్య గారే అనుటలో సందేహము లేదు

ఆయన గుణగానము చేసెడిపడతి మించిన యానందముతో వుడివోని కోరికతో తపించుచున్నది ఆయన పేరెత్తగనే సిగ్గులు వడుచున్నది ఆయన మాటలు వినగనే చెమరించును ఆయన గుణములు మెచ్చుకొని అనగా కీర్తించి, లోలోన ఉప్పొంగును. ఆమె చేసెడి గుణ కీర్తనమునకు మెచ్చిన శ్రీ వేంకటేశుడు ఆమెను కూడినాడు తన సాన్నిధ్యమిచ్చి ఆమెను ధన్యురాలిని చేసినాడు

ఇంకను ఇట్టి లక్షణములు గల కీర్తనలు ఈ క్రిందివి చూడవచ్చును.

1 తన్నుబాసి నేనెట్లా దరియింతు ననవే
విన్నవించరాదు విన్నవించకుండరాదు ||పల్లవి||

మాటల దన్నునాడివి మరికొంత పొద్దుపుత్తు
కూటములదలచుక కొంత పొద్దు పుత్తునే
పాటలు పాడు కొంటానప్పట కొంత పొద్దు పుత్తు
పూట పూట కేమి తాను పొద్దువోదే చెలియ ||తన్ను||

2 ఎంత నేరుచుకొన్నదీ యీ చిన్నది
చెంతనుండే నిన్ను నిటే చేకొన్నది ||పల్లవి||

తనివోక చెలులతో తలపోతలూ
ననుపులో పొద్దుమానని చేతలూ
పని వడి నీమీది పాటలూ
మొనసి యెప్పుడు నీతో మొగమాటలూ || ఎంత||

ఈ కీర్తనలందు అధికముగ అన్నమయ్య దౌత్యమే గోచరించును. ఈయన దూతియై నాయికా నాయకుల మధ్య రాయబారము నడుపును.

శ్రవణం కీర్తనంవిష్ణోః స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనేవనమ్
( భాగవతమ్ – సప్తమస్కంధః)

సేవించుట అను భక్తి మార్గమును అవలంభించి మధుర భక్తికి ఆలంబనమై తరించిన వాడీయన ఇట్టి గుణకీర్తన విషయమున భాగవతము నందలి గోపికలుగా మారి

స్వామి సేవ చేసిన పోతన గారు తలపునకు రాక మానదు  శ్రీకృష్ణుని వెదకుచునే గోపికలు అలీలామానుష విగ్రహుని కళ్యాణ గుణములను కీర్తించుట ఒక మధురాను భూతి

నల్లని వాడు. పద్మనయనంబుల వాడు. కృపారసంబుపై
జల్లెడు వాడు మౌళి పరిసర్పిత పింఛము వాడు. నవ్వురా
జిల్లెడు మోము వాడొకడు. చెల్వల మానధనంబు దెచ్చె నో
మల్లియ లార మీ పొదలమాటున లేడు గదమ్మ చెప్పరే (29)
అంగజునైన జూడ హృదయంగముడై కరిగించువాడు శ్రీ
రంగ ధురంబు వాడు మధురంబగు వేణు కరంబువాడు మ
మ్మంగజు పువ్వు దూపులకు. నగ్గముసెసె లవంగ లుంగ నా
రంగము లార మీకడకు రాడు కదా కృపనున్న జూపరే (30)
నీ నగవులు నీ చూడ్కులు
నీ నానా విహరణము నీధ్యానంబుల్
నీ నర్మాలాపంబులు
మానసముల నాటి నేడు మఱదవు కృష్ణా (31)

ఇందు గోపికలు కృష్ణుని గుణకీర్తనము చేయుట. సుస్పష్టము. కాని అన్నమయ్యగారు నాయికలచే గుణ కీర్తనము చేయింపక వారు గుణకీర్తనము చేయుచు పొందిన అవస్థలను మాత్రమే వర్ణించిరి. దీనికి కారణ మిట్లని ఊహింపవచ్చును. ఆయన వ్రాసిన అధ్యాత్మ కీర్తనలన్నియు ఇంచుమించు గుణ కీర్తన విభాగమునకు చెందినవే

అటనట జీవుని ఆవేదన. జీవేశ్వర సంబంధము ఇత్యాది అంశములు అధ్యాత్మకీర్తనలల చోటు చేసికొనినను ఇతర కీర్తనలన్నిటియందును స్వామి కళ్యాణ గుణవర్ణనమే సాక్షాత్కరించును అందుకే శృంగార కీర్తనలయందు స్వామిలీలా వర్ణనకు. గుణకీర్తనకు తావీయక కేవలము విప్రలంభ శృంగారము నందు నాయికలు పొందెడి యవస్థలు వారు పొందిన ఆ విరహ వేదనకు తగిన ఫలములు మాత్రమే అన్నమయ్యగారు వర్ణించుట

క్షేత్రయ్యగారు మువ్వగోపాల పదములలో నాయిక స్వామి యొక్క గుణములను కీర్తించినట్లుగనే చిత్రించినారు  ఈ క్రింది కీర్తనలో నాయకుని సౌందర్య గుణములను పొగడుటను గమనించవచ్చును

పల్లవి ఎంత చక్కని వాడే నా సామి వీ
డెంత చక్కని వాడే

అనుపల్లవి ఇంతి మువ్వగోపాలుడు - సంతతము నామదికి
సంతోషము చేసునే ||ఎంత||

మొలక నవ్వుల వాడే - ముద్దుమాటలవాడే
తళుకారు చెక్కుటద్దముల వాడే
తలిరాకు జిగిదెగడదగు మోము గలవాడే
తెలితమ్మిరేకు కన్నుల నమరు వాడే || ఎంత || (32)

అట్లే క్షేత్రయ్య గారి ఈ పదం కూడ చూడవచ్చును

పల్లవి ఎంటువంటి వాడే వాడు ఓయమ్మా వాడు
ఎన్నడూ నీ వీధిని రాడు ||ఎంటువంటి||

అనుపల్లవి కుటిల కుంతల మువ్వ గోపాలుడని పేరు
నల్లని మేను వాడట - నయము లెన్నో చేసునట
చల్లగా మాటాడునట - సరసము వాని సొమ్మట
కల్లకాదట వాడు కళలంట నేర్చునట ఓయమ్మా ||ఎంటువంటి||

బంగరు దుప్పటి వాడట పంతము లాడుకొన్నాడట
అంగన లెందరినైన - అలయక కూడునట
సంగీత లోలుడట - చాల ఈవిగాడట వాడు ఓయమ్మా ||ఎంటు||

ఇందు నాయిక మువ్వగోపాలుని రూపురేఖా విలాసాదుల తో పాటు అయన కళ్యాణ గుణ వర్ణన కూడ చేయుట గమనార్హము క్షేత్రయ్య గారివి అన్నియు శృంగార భక్తి సమ్మిళిత పదములే అందులకే గుణ కీర్తనమందు ప్రత్యక్షముగ చోటు చేసుకొనినవి.

ఇట్టిదే ''పద్మావతీ చరణ చారణ చక్రవర్తి'' నని చెప్పుకొన్న గీత గోవింద కావ్యకర్తయైన శ్రీ జయదేవి కవికృత అష్టపదులలో గాంచవచ్చును

హరి రిహముగ్ధ వధూని కరే
విలాసిని విలసతి కేళి పరే

అను అష్టపదిలో హరి స్వరూప కీర్తనము గనవచ్చును

చందన చర్చిత నీలకళేబర పీత వసన వనమాలీ
కేళి చలన్మణి కుండల మండిత గండ యుగ స్మితశాలీ
హరి రిహ ముగ్ధ వధూనికరే, విలాసిని విలసతి కేళిపరే
కాపివిలాస విలోలవిలోచన ఖేలన జనిత మనోజమ్
ధ్యాయతి ముగ్ధవధూరధికం మధుసూధన వదన సరోజమ్ ||హరి||

(గీత గోవిందమ్ - 4వ అష్టపది)

హరికి సమానులైన దేవత లితరు లెవరును లేరనుచు ''సూరదాసు'' గారు రచించిన హరిగుణ గానము గమనింతము.

''హరి హరి హరి సుమరో సబకోయీ
హరి సుమరిత్ సబ్ సుఖ హోయీ
హరి చరణాని రాఖాచిత గోమయీ (సూరసాగర్ పద్ - 349)

''భజమన నంద నందన చరణ్
పరమ పంకజ అతమనోహర సకల సుఖకే కారన్
సనక శంకర్ధ్యాన ధరత్ నిగమ్ ఆగమ్ కరన్ (సూరసాగర్పద్ 309)

అన్నమయ్యగారి పదములలో నాయిక పొందిన దశావస్థలలో ''గుణకీర్తనమ్'' ఉత్తమమైనది ఇందు నాయిక ఆయన తోడి తానుపొందిన పూర్వపు అనుభూతులను స్మరించుచు ఆయా సందర్భములలో ఆ స్వామి చూపిన నేర్పులు, ఆడిన పరిహాసములు ఆయన రూపురేఖలు అదే పనిగ తలచుకొనుచు వానినే పదములుగ, సంకీర్తనలుగ చేసికొని గుణ గానము చేసికొను ఘట్టములను అన్నమయ్యగారు చక్కగా వర్ణించినారు. అధ్యాత్మభావములను శృంగార పరముగ వ్యక్తీకరించుట గమనార్హము

మీరాబాయి ఇంకొక అడుగు ముందుకు వేసి వారి గుణగానము చేయుచు నాట్యమాడినది.

మైతో హరిగుణగావత్ నాచూంగీ
అపనే మహల్మే బైరకర్ ప్రభుజీ గీత్ భాగవత్ బచూంగీ (34)

## 5. ఉద్వేగము

1 కామక్లేశ జనిత సకల విషయహేయతా జ్ఞానమ్ ఉద్వేగః - రసమంజరి

(మదన బాధల వలన సకల పదార్థముల యందు త్యజింపవలెననెడి బుద్ధి యుదయించుట ఉద్వేగము) రసమంజరి వ్యాఖ్య – శ్రీ నీలకంఠయజ్వ

2 ఆసన శయనముల యందు నిలక లేకుండుటయు, తుష్టిలేక పోవుటయు నిత్యమును ప్రియుని కలియవలెననెడి ఉత్సుకతతో నుండుట '' ఉద్వేగము'' అనబడును.

లక్షణములు – చింత, నిశ్వాసము, ఖేదము, హృదయ తాపము.

3 '' ఆంధ్ర సాహిత్య దర్పణము'' నందు శ్రీ వేదంవేంకటరాయశాస్త్రిగారు లక్షణము నీయలేదు కాని లక్ష్యముగా స్వీయోదాహరణము నిచ్చిరి

ఆది – శ్వాసాన్ముఞ్చతి, భూతలే విలుఠతి త్వన్మార్గమాలోకతే
దీర్ఘంరోదితి విక్షిపత్యత ఇతః క్షామాంబుజావల్లరీం.
కిఞ్చ ప్రాణసమాన కాంక్షితవతీ స్వప్నే పితే సంగమం
నిద్రాంవాఞ్ఛతి, ప్రయచ్ఛతి పునర్దగ్ధో విధిస్మాపి.

''నిట్టూర్పులు పుచ్చును నేలదొరలును నీ వచ్చుదారి నెదురు సూచును. చాలా సేపు ఏడ్చును చిక్కిన బాహువల్లరిని ఇటునటు విసరును. కలలోనైన నీపొందును కోరినదైనిద్రను వాంఛించును. కాని పాడు దైవము దానినైన ఈయడు.

ఉమ్మగిలె వారినేల వుడికించేనే
తమ్మిమోము చూచి – నాపై దయపెట్టదగదా ||పల్లవి||

చెక్కుచేతదనకుగా చింతతో నేనుండగాను
యెక్కడ నుండో వచ్చి ఏల నవ్వీనే
ముక్కుల నూర్పుల తోడ ములుగుచు నుండగాను
పొక్కక తానేల నన్ను పువ్వులవేసేనే || ఉమ్మగిలె||

నేరకనే తను బాసి నేలలు వ్రాయగాను
సారెదా వచ్చి అదేమి చదివీనే

వేరులేక పానుపుపై పెతలబొరలగాను
యీ రీతి నింకా నన్నలేమి సేసీనే || ఉమ్మగిలె||

దిమ్మరేగి కాకలతో దేహమెల్ల వాడగాను
యిమ్మెల కౌగిట నన్ను నేల పట్టీనే
కమ్మి శ్రీ వేంకటపతి గక్కున నన్నుగూడి
చెమ్మ జెమటల నన్ను చెక్కులేల నొక్కీనే || ఉమ్మగిలె||

ఇందలి నాయిక మరెవ్వరో కాదు. సాక్షాత్తు అన్నమయ్యయే తానే నాయిక యై ఇచ్చట ఉద్వేగ అవస్థను అనుభవించుచున్నాడు.

ముందే విరహమున తపించుచున్న తనను మరింత ఉడికించుట యేమి కని తన యాత్మనే ప్రశ్నించుకొనుట ఇందలి విషయము.

చింతవలన చేయి చెక్కిటికి వచ్చినది. ఆ చింతలో ఆమె ఉండగా నాయకుడైన శ్రీనివాసుడు ఎచట నుండో వచ్చి తనను చూచి నవ్వుచున్నట్లుగా ఆమె భ్రమించినది అట్లు నాయకుడు నవ్వుటచే ఆమె మనస్తాపము మరింత హెచ్చినది. అంతట నిట్టూర్పులు హెచ్చినవి ఆ సమయమున స్వామి పొక్కక (చాటున నుండి) పూవులు వేసెనట పూవులు మన్మధ సాయకములుగదా ! మనసులో ఆయన పై విరహము పెరరగా ఆయన తలపులలో తల మునకలైన నాయికకు. మనసు నిండ స్వామియే నిండి యుండి. చిలిపి పనులు చేయుచున్నట్లు తోచుచున్నది అందులకే ఆమె నేలపై కాలి వ్రేళ్ళతో వ్రాయుట. పానుపుపై స్థిరముగ నుండలేక పొరలుట అయినా ఆ స్వామి ఊరకుండలేదు ఏమేమో గుసగుసలు చెప్పును సైగలు చేయును. విరహవేదనతో దేహమంతయు కాకలెక్కి దిమ్మరేగినది తనూలత వాడినది వాడిన యామె శరీరమును బిగికౌగిట బంధించుటచే యామె తల్లడిల్లినది.

ఇట్లు ఉద్వేగముతో తపించు ఆ నాయికను ఆ వేంకటపతి మరి తడవు లెకుండ గక్కున కూడి చెమటల తడిదైన ఆమె చెక్కులను నొక్కెనట.

లౌకిక శృంగారమున నాయిక పొందెడి యవస్థలు మాత్రమే వర్ణింపబడును కాని అననమయ్య గారి పదములు శ్రీనివాసుని దివ్య శృంగార లీలలు మధుర భక్తి ప్రపూరితములు అందులకే ప్రతి పదమునను నాయిక ఏ అవస్థలో నున్నను. భక్తసులభుడై హరి తన భక్తులకు తన సన్నిధిని ప్రసాదించుట చూడవచ్చును. ఆ విధముగ ఇందలి నాయిక ఉద్వేగముతో సొక్కినపుడు నాయకుడైన వేంకటపతి తక్షణమే ఆమెను కూడుటచే సద్యః ఫలితము పొందినది

చెలిగావు మరుడింత చేయ జొచ్చెను
సెలవుల నవ్వులే సిగ్గురేచ జొచ్చెను ||పల్లవి||

చెక్కుపై చేయిడుకొని చింతించగా చెలియకు
వుక్కుమీరి పెంజెమట లూర జొచ్చెను
వెక్కసపు విరహాన వెఱగుతో నుండగాను
మిక్కిలి నిట్టూర్పులు మించ జొచ్చెను || చెలి||

ఎదురు చూచి నీ రాకకే కరుచునుండగాను
పొదలుచు తమకము ఉప్పొంగ జొచ్చెను
అదన నీ పొంగులకు అలయుచు నుండగాను
తుదలేని కోరికలు తొదరగ జొచ్చెను ||చెలి||

తగిలినీ వలపుల దప్పుల పొరల గాను
దగదొట్టి సందులు ఆదరజొచ్చెను
జిగి నలమేల్మంగ శ్రీ వేంకటేశుడు నిన్ను
మిగుల గూడగా మేలు మెరయగ జొచ్చెను ||చెలి||

ఇందలి నాయికయు ఉద్వేగమనెడి కామావస్థలో నున్నదే ఉద్వేగమనగా విరహము వలన కలిగెడి దుఃఖము చింత, నిశ్వాసము, అనంత దుఃఖము, ఎదరు చూపులు ఇవి అన్నియు ఉద్వేగ లక్షణములు మరుని బాదకోర్వలేని ఈ నాయిక స్వయముగ అలమేల్మంగయే.

శ్రీ వేంకటేశుడు ఏడు కొండలు దిగి ఎప్పుడు వచ్చునో ఏమో ఆయన అను నిత్యము కొండలు దిగివచ్చినను. తనను మురిపించి. మైమరపించి వీడ్కొని చనినప్పటి నుండి తిరిగి ఆయన దర్శనము. సాన్నిధ్యము. సాంగత్యము లభించువరకు ఆమెకు విరహమే స్వామి వియోగము సహింపరానిదై ఆయనను గూర్చి చింతించుచు. విరహమున పొరలుచు. చెక్కిట చేయి జెర్చినది. ఎదురు చూపుల తోడనే ఆమెకు చెమటలు గ్రమ్మినవి తాప మధికము కాగా నిట్టూర్పులు హెచ్చినవి. ఆయన పొందుకొరకు అలయు సమయమున అనంతమైన కోర్కెలు మితిమీరుచున్నవి వలపుల దప్పులలో పొరలగా తాపముచే అవయవములు అదిరినవి నాయికయైన అలమేల్మంగ ఇంతటి దురవస్థలో నున్న తరుణమున శ్రీ వేంకటేశుడు ఆమెను కూడినాడు అలరింపజేసినాడు తాపమును ఉపశమింపజేసినాడు ఆమె తాపమునకు

ఉద్వేగమునకు ఫలితము లభించినది. భక్తునిగా అన్నమయ్య జన్మ చరితార్థమైనది. ప్రతి పదమునను అన్నమయ్య స్వామి సామీప్యమును భావించగలిగినాడు సంభోగ, విప్రలంబ. శృంగారములు సుఖదుఃఖములట్లు ఒక దాని వెంట చక్రము వలె తిరిగినవి ఇందు కంతయు వియోగము సహింపని మధురభక్తి బావ సంపన్నములు అన్నమయ్యగారి కీర్తనలు.

ఉద్వేగ భరితమైన ఈ క్రింది కీర్తనలును పరిశీలింపదగినవే.

1. ఎంత గలదే ఇంకా నీ మోహము
ఇంతిరో నీకే చెల్లు నీ మోహము (అ.శృ.సం. 20-255)

2 నాటికి నేటికి మీరే నవ్వరా నన్ను
మేటి జవ్వన మింతయ్యె మించెగానాకు (అ శృ.సం. 22-104)

3. తరువాతి పనులెల్లాదాని యెఱుగు
సిరులవిభున కిట్టి చెప్పరే చెలులు - (అ శృ సం 30-167)

## 6. విలాపము

1. దీనినే రసమంజరీ కారుడు ''ప్రలాపము''గా పేర్కొనెను

''ప్రియాశ్రిత కాల్పనిక వ్యవహారః ప్రలాపః''

2 మనసు మిక్కిలి సుడివడి యాడుట చేత విషయము లేకయే

(వస్తువు) మాటలాడుట ప్రలాపము - ఆంధ్ర సాహిత్యదర్పణము

3 ఇచట నిలచెను, ఇచట కూర్చుండెను. ఇచట నన్ను చేరెను అని విలపించుట విలాపమనబడును - నాట్య శాస్త్రము. తెనుగుసేత.

చిత్తగించవయ్యా నీ సింగారపు దేవులను
హత్తికరుణించరాదా ఆసపడేని ||పల్లవి||

నిండారా దనమీద నీవు ఒత్తిగలవని
యాడనున్న చెలితోడ యాన తిచ్చీని
పండబడి నీవుండిన పరపిది తనదని
వెండియును తన పెనువేల జూపీని ||చిత్త||

చనువున నిద్దరికి సమ ద్రిష్టయనని
తన పొరుగాపెతోడ తలపోసెని
ననచిన యట్టి ప్రాణ నాథుడవు నీవని
వొసర జే కానికలు వొడిబెట్టి పంపేని ||చిత్త||

పెట్టి నీ వొరసు తన పెరు నడిగేవని
చుట్టపు వనితతొ బొంచులాలించీని
యిట్టె శ్రీ వేంకటేశ యేలితివి మగువను
గుట్టుతొడ చనకు నిన్నే గురి సేసేని ||చిత్త||

నాట్యశాస్త్ర లక్షణము ప్రకారము, ఇచట నిలచెను, ఇచట కూర్చొండెను, ఇచట నన్ను జెరెను అనువానికి లక్ష్యముగా ఈ సంకీర్తన యందు నాయిక తన స్వామి అంతకు మునుపు తనను కూడి పరుండిన పరుపు ఇదియే యని తన చెలికి చెప్పుచున్నది ఇద్దరికి చనువు వలన సమదృష్టి కలిగినదని పొరుగామెతో తలపోయుచున్నది బంధువుల వనితలతో తన సంగతి చెప్పుచు, తనను పేర్కొను నేమో యని పొంచులు వినుచున్నది గతమున నాయకుని చేష్టలను తలపోయుటచే ఆమెకు దుఃఖము కలుగుచున్నది ఈ విషయము లన్నియు దూతి లేక చెలిపాత్ర వహించిన అన్నమయ్య స్వామికి నివేదించినాడు భక్తితోడి నివేదనమును స్వామి మన్నించినాడు తక్షణమే దేవిని కరుణించినాడు అదియే ఆమె విలాపమునకు ఫలితము

అన్నమయ్య జగన్నాటక సూత్రధారుడైన శ్రీహరి లీలలను, మధురముగ వర్ణించి తరించిన పద కవితాపితామహుడు. శ్రీ వేంకటేశ్వరుని దివ్య శృంగార లీలలను ఊహించి భావించి రూపకల్పన చేసి జీవము పోసిన మహనీయుడు. అష్టవిధనాయికలను వారు పొందెడి కామావస్థలను అలంకార శాస్త్రములను దృష్టియందుంచుకొని వారిని సృష్టించుటకును దివ్య శృంగార లీలలను లౌకికమునకు జోడించుటకును తపన పడిన వాడు కాదు తన భావనలోనికి ఏ విధముగ ఆ స్వామి లీలలు ప్రవేశించునో తదనుగుణముగ భక్తి పారవశ్యమున తల్లీలు సంకీర్తనా రూపమున చిత్రించిన వాడు మాత్రమే అందులకే అన్ని విధముల నాయికలకు వారు పొందిన కామావస్థలకు తగినన్ని ఉదాహరణలు దొరకుట కష్టము అందునను నావంటి అల్పులకు మరింత దుష్కరమైన పని ''విలాపము'' అనెడి ఈ ఆరవ కామావస్థకు సరియైన లక్షణములు గల పదములు నాకు ఉపలభ్యమైన శృంగార

సంకీర్తనా సంపుటములలో లభింపలేదు అయినను ఈ క్రిందివి పరిశీలనార్హమైనవిగా తోచుచున్నవి

1 చెప్పరాదు చూపరాదు చిగిరించీ భావమెల్ల
తప్పని జవ్వనపు వసంత వేళ కానీ (29-588)

2 ఉవిద విరహమున నొంటి పడె మన
కివల నీకెతో నిది యేపాటు (29-598)

3 మాటలెల మనసుకు మనసే సాక్షి
యేటికే జరాకు సెసె వింత గావవయ్యా (30-188)

## 7. ఉన్మాదము

1 ఔత్సుక్య సంతాపాది కృతమనోవిపర్యాస సముత్థప్రియాశ్రిత వ్యాద్యావ్యాపార ఉన్మాః (రసమంజరీ)

2 చేతనా చేతనముల యందు సైతము అపరిచ్ఛేదము - ఆంధ్రసాహిత్యదర్పణము

3 సర్వావస్థలయందును నాయక సంశ్రితములైన కథలనే ఎన్నుచు ఇతర పురుషులను ద్వేషించుట

ముఖ్యలక్షణములు - 1 అనిమిషదృష్టి

2 దీర్ఘనిశ్వాసము

3 ఏదో ఆలోచించుచునడచుట

4 విహారకాల మందును ఏడ్చుట

నాట్యశాస్త్రము (తెలుగు సేత)

అంగన సుద్దులు నీవు ఏమడిగేవయ్యా
చెంగట నుండి నీవే చిత్తగించవయ్యా ||పల్లవి||

చెలియ నీరూపము చిత్తరుపటాన వ్రాసి
పొలుపు మిగుల దానే పూజించును

కొలువు సెసి మరి కొంతవడి నీపెరు
పలుమారు నొడివి జపము సేసును ||అంగన||

సరుగ పొద్దున వంట చవులుగా వండి వండి
పరగగ నీకు నుపార మిచ్చును
అరిది నీ ప్రసాదము ఆరగించి నీ పతిమ
నురమున బెటుకొని ఉయ్యాల లూచును ||అంగన||

బాగాలునీ కొప్పసెసి భావము నీపైబెట్టి
యోగినియై యానందాన నోలలాడును
యీగతి శ్రీ వేంకటేశ యేలితి వింతలో వచ్చి
ఆ గురుతులెల్లా జాడు మట్టి నీకు మొక్కును ||అంగన||

సర్వకాల సర్వావస్థల యందు నాయక సంశ్రితములైన కథలనే ఎన్నుట అనునది "ఉన్మాదావస్థ" యందలి నాయిక లక్షణము ఈ పదము నందలి నాయిక తన మనోనాథుని చిత్తరువును పటముపై వ్రాసి పూజించును ఆ పటము వద్దనే ఉండి పలుమారు ఆయన పెరునే జపించును చక్కని రుచులతో వంటలు వండి ఆయనకు నైవేద్యమిడును. ఆ ప్రసాదమునె భుజించును ఆ ప్రతిమనే గుండెలపై నిడుకొని ఆయ్యాల లూచును. తాంబూల మందించును భావమున ఆయననే నింపుకొనును యోగినిగా మారి అలౌకిక ఆనందమును పొందును ఇవి అన్నియు ఆయన చిత్తరువునకు లేక ప్రతిమకు చేసిన చేతలు, సేవలు, ప్రతి భక్తుడు విగ్రహారాధన సేయును పై సెవలన్నియు చేయును కాని ఆ విగ్రహమునే తన ప్రక్కనే, గుండెల పైననే పెట్టుకొనడు ప్రత్యేక స్థానమున ఆ విగ్రహము నుంచి పూజించును. ఆటు పిమ్మట లౌకిక వ్యాపారమున మునిగి పోవును. కాని మధుర భక్తిలో మునిగిపోయిన ప్రపన్నుడట్లు కాదు సర్వమును మరచి స్వామితోడిదే లోకముగా నెంచి తన్నుదా మరచి నిరంతర ధ్యాన సమాధిలో మునుగును అందునుండి జాగ్రదవస్థ వచ్చినను, తానెవరిని గూర్చి తపించుచున్నాడో ఆ పరమాత్మనే పూజించును. సేవించును. ఇతః పూర్వ మాయా సందర్భములలో ఉదహరించినట్లు "ధ్యానంచ తైలధారావ దవిచ్ఛిన్నస్మృతి సంతాన రూపమ్" అను దానికి లక్ష్యభూతుడగును

లౌకిక నాయికల ఎడల ఇట్టిది "ఉన్మాద" మను అవస్థగా మన మెంచినను, దివ్యుల యెడల ఈ యవస్థను "అవిచ్ఛిన్నస్మృతి సంతాన రూపము" గనే యెంచవలయును.

ప్రపన్నుల యెడలను ఇట్లే భావింప వలయును. (శరణాగతి) ప్రపత్తి దశకు చేరిన జీవునకు లౌకికవ్యవహారములతో పని లేదు సర్వము పరమాత్మతో డివ్యవహారము. శరీరసంబంధమేమాత్ర ముండదు. ఇది జీవేశ్వరుల సమాగమునకు అంతిమ సోపానము.

అట్టి స్థితికి జేరినది పై పదము నందలి నాయిక. ఆ నాయికావస్థను వర్ణించిన వాడు ప్రపన్నుడైన అన్నమయ్య.

ఇట్టివే ఈ క్రింది కీర్తనలను ఉదాహరణముగ గొనవచ్చును.

1. ఎంత మీదు కట్టెనో యింతి నీకు జవ్వనము
కాంతుడ వేమి సేసితో కానుక లంపె జెలి (26-144)

2. ఏమిసేతు నమ్మలాల యిట్టాయ నా వలపు
ప్రేమము జెప్పగ రాదు పిలువక పోదు (26-220)

3. ఇప్పుడు నీవు వచ్చితి విది చూచి నాకదివో
చొప్పుగా రెండు భావాలు చూపి చెప్పరాదు (30-242)

4 అదియే కాదా సతత మాతని కపుడు
పది యవస్థల బొంగి భ్రమసే కాక (30-242)

పై నుదహరించిన నాలుగు శృంగార సంకీర్తనలలో మూడింటి యందు నాయిక ఉన్మాదావస్థ ఛాయామాత్రముగనే గోచరించును. నాల్గవ దాని యందు పల్లవిలో ''పదియవస్థలు'' నాయికానాయకులు అనుభవించినట్లు పేర్కొనబడినది. ఆ పది యవస్థలు ఏవియో తక్కిన చరణములలో వర్ణింపబడలేదు సంకీర్తన యందలి మూడు చరణములలోను నాయిక అవస్థను లేక స్థితిని మాత్రమే అన్నమయ్య గారు వివరించుట జరిగినది.

## 8. వ్యాధి, 9. జడత, 10. మరణము

1. మదన వేదనా సమత్థ సంతాప కార్శ్యాది దోషా వ్యాధిః - రసమంజరి

2. దీర్ఘ నిశ్వాస పాండుతా కృశతాదులు - ఆంధ్ర సాహిత్య దర్పణము

3. సామ, దాన, అర్థములను ప్రయోగించియు, దూతికలను రాయబారమంపియు, నిరర్థక మగుటచే 'వ్యాధి' జనించును.

- నాట్యశాస్త్రము శ్రీ పి. ఎస్. ఆర్. అప్పారావు

అన్నమయ్యగారి శృంగారసంకీర్తనలలో ''వ్యాధి, జడత, మరణము ' లను అవస్థలకు తావు లేదను పించుచున్నది. దానికి కారణము ఇవి సంకీర్తనలగుటయే. అనగా దైవ సంబంధమైన దివ్య శృంగార లీలా వర్ణనా పూరితము లగుటయే. భక్తుని పరముగ జూచినను సదా హరి చరణారవిందములను సేవించుచు మనమున భావించు భక్తులకు ప్రపన్నులకు గూడ ఇట్టి యవస్థ వచ్చుటకు అవకాశమే లేదు ఇట్టి యవస్థలన్నియు శరీరమునకు జెందినవి. ప్రపన్నులయెడ ఇట్టి యవస్థలు అనగా వ్యాధి మరణములకు తావు లేదు. ఏలననగా ప్రపన్నులు పొందెడి వియోగ వ్యథ ఆత్మకు పరిమితమైనది. సర్వదా హరి నామస్మరణము తప్ప అన్యమెరుగని వారు ప్రపన్నులు. ఆత్మకు నాశము లేదు కదా! ఇట్టి ఆత్మకు దేని చేతను వికారము కలుగదు ''అవి కార్యోయముచ్యతె (36) అని కృష్ణ భగవానుడు గీతలో చెప్పినట్లు ఆత్మకీ లౌకికసంబంధమైన వ్యాధి, మరణములతో పని లేదు. అందుకేనేమో అన్నమయ్య ఈ రెండు అవస్థల విషయ మాలోచింపనే లేదు. నిరంతర ధ్యానము చే శరీరమునకు ప్రకాశము కలుగునే కాని భక్తులకు ప్రపన్నులకు వ్యాధి సమీపింపదు. వారి తపమునకు ఫలము జీవన్ముక్తియే.

ఈ సంకీర్తనలయందలి నాయిక ప్రదానముగ అలమేల్మంగయే. లెదా వివిధ రూపములలో మనకు గోచరుడగు అన్నమయ్యయే. దివ్యయైన అలమేల్మంగకు జరా మరణములు లేవు ప్రపన్నుడైన అన్నమయ్య పరమ పదము చేరునంత వరకు దినమున కొక్క కీర్తనకు తక్కువ కాకుండ సంకీర్తనలు చెప్పివాడే. అట్లు సంకీర్తనలు చెప్పవలయు నన్న ఆరోగ్యము సరిగ నుండ వలయును గదా! ఆరోగ్యము సరిగ నుండి ననే గాని మనసునకు ఏకాగ్రత లభింపదు. ఏకాగ్రత లేనిదే భక్తి కుదరదు. భక్తి, ప్రపన్నతకు మూలము అందుకే మరణ మాసన్నమైనపుడు నారాయణుని చింతనకు, స్మరణమునకు కఫ వాత పిత్తముల కంఠమున అడ్డు తగిలిన చో అట్టి మానవులకు జీవన్ముక్తి లభించుట ఎట్లు ? అని పన్నిద్దరాళ్వారులలో నొకరు, ప్రముఖులు అయిన కులశేఖరాళ్వార్లు ఇట్లు చింతించినారు.

ప్రాణ ప్రయాణ సమయే కఫవాతపిత్తైః
కంఠావరోధనవిధౌ స్మరణం కుతస్తె। (37)

అట్టి యెడ ప్రపన్నుడైన వానికి లభించునది జీవన్ముక్తియే కాని మరణము కాదు. మరణించినచో తిరిగి పుట్టుట జరుగును. ఈ మరణము శరీరమునకే గదా! జీవన్ముక్తులకు "పునరపిజననం పునరపి మరణం'' లేదు. మరణ మనునది జరా, రుజాది కారణములలో

దేనివలననైనను సంభవింపవచ్చును జీవన్ముక్తియనునది భక్తి ప్రపన్నతల వలన లభించునది ఆకోవకు చెందినవాడు అన్నమయ్య అందుకే ఆయన రచనలలో వ్యాధి, జడత, మరణములకు తావు లేదు.

అంతియే కాక అలంకారికులు సైతము మరణమను అవస్థను వర్ణింపరాదనియు విసర్జింప వలయుననియు నిషేధము విధించిరి

''అప్రాప్త కామము నందు మరణమును వర్జించి తక్కిన యవస్థలను పై విధముగ నిరూపించవలెను (38)

ఈ మరణ నిషేధము ప్రత్యేకమైనది ఇంకను ముందు చెప్పెదంత కథ జరుగవలసి యుండగా 'అయోగ' అవస్థ యందే నాయిక లేదా నాయకుడు మరణించుట తటస్థించినచో ఇంకేమున్నది? అందుచే ఇచ్చట మరణము నిరూపింపరాదు. మరి మరణమేల చెప్పబడినదన్నచో ''మరణము కలుగునన్నంతగా వారు తప్తమైనారు'' అని నిరూపించుటకే (39)

ఈ వివరణ నాట్య శాస్త్రమున డా. పి ఎస్. ఆర్ అప్పారావు గారిచ్చినది ఇది నాటకాదులకు మాత్రమే పరిమితము భక్తి ప్రపన్నతలకు చెందినది కాదు ఇందు అనగా ఈ సంకీర్తనలయందు ప్రత్యేక చరిత్ర లేమియు వర్ణింపబడవు అన్నియు విష్ణు కథలే విష్ణు సంబంధ గాథలే విష్ణు భక్తుల కెప్పటికిని మరణము లేదు వారికి కలుగునది జీవన్ముక్తియే అందునను అన్నమయ్య గారు సాధారణ మానవుడు కాదు అవతార పురుషుడనియే చెప్పవలెను ఎందుకనగా ఆయన ''హరి నందకాంశము''న అవతరించినవాడు

## నాయికాత్రయము

''సాచత్రివిధా స్వీయా పరకీయా సామాన్యాచేతి'' అని రసమంజరీ కారుని నిర్వచనము

నాయికలు ప్రధానముగ ముగ్గురని అలంకారిక మతము వారు 1 స్వీయ, 2 పరకీయ, 3. సామాన్య

ఇందు స్వీయ లక్షణమిట్లు చెప్పబడినది

''తత్ర స్వామిన్యే వానురక్తా స్వీయా
అత్ర పతివ్రతా యా ఏవ లక్ష్యత్వాత్'' - రసమంజరి

అనగా పతియందే ప్రేమ గలది పతివ్రత యగునది

అస్యాశ్చేష్టా - భర్తృశుశ్రూషా, శీల సంరక్షణ, మార్జవం, క్షమాచ.

అనగా తన పతి సేవ జేయుట, వంశ గౌరవాదులను కాపాడు కొనుట ఓర్పు కలిగి యుండుట.

ఈ ''స్వీయ''ను మరల మూడు విధములుగ విభజించిరి

స్వీయా త్రివిధా 1. ముగ్ధా, 2. మధ్యా, 3. ప్రగల్భాచ అని

## ముగ్ధా లక్షణములు

''తత్రాంకురిత యవ్వనా ముగ్ధా''

ప్రధమావతీర్ణ యౌవన మదన వికారారతౌవామా

కధితా మృదుశ్చమానే సమధిక లజ్జావతీ ముగ్ధా - సాహిత్య దర్పణము

''క్రియా హ్రియా మనోహరాముగ్ధా''

''కోపే పి మార్దవం నవ భూషణే సమీహా''

అని ఈ విధముగ రసమంజరీ కారుడు స్వీయా ముగ్ధా నాయకా లక్షణములను తెలిపినాడు.

ముందుగ స్వీయ లక్షణములు గల అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలను. వాని యందు గల మధుర బక్తిని ఉదహరించి వివరింతును.

స్వీయ నాయిక - ముగ్ధ లక్షణములు

రాగం - పళవంజరం

సరస గూచుండవే సరసము లాడవే
శిరసు వంచుకోనేల చిన్నదానవటవే

1. పలుకులు నైతేను పచ్చి కప్పురాలు రాలీ
తిలకించి మోవితేనె చిందీని

చెలువుడు చెనకితె సిగ్గుతోడ బెనగేవు
చెలియరో నీవింకా చిన్నదానవటవే ||సరస||

2 మొలక నవ్వుల నైతే ముత్యాలు వొడమీని
నిలువు మూరు వండీని నీ మురిపేలు
బలిమి జన్నులంటితే పయ్యద కొంగు మూసేవు
చిలుక రాదా వలపు చిన్నదాన వటవే ||సరస||

3. సందడి చూపులనైతే చల్లగ వెన్నెల గాసీ
కందువ నెమ్మోమున కళలుబ్బీని
అందపు శ్రీ వేంకటేశు నలమేల్మంగవు నీవు
చెందిమరీ గొసరేవు చిన్నదానవ టవే ||సరస|| (28-193)

ఇందలి నాయిక ముగ్ధ. సిగ్గు చేత మనోహరముగ నుండు నది. శిరసు వంచు కొనినది. ఆమె అలమేల్మంగగా పేర్కొన బడినది. నాయకుడికి ఎడముగా కూర్చున్నది కాబోలు ''సరస గూర్చుండవే అని చెలిచెప్పుచున్నది. భర్త తాకినచో సిగ్గు తో పెనుగు లాడును. వక్షోజము లంట బోయినచో పైట కొంగు కప్పు కొనును ఈ లక్షణము లన్నింటిని చెప్పి చెలికత్తె '' ఇవి నీకు తగవు. నీవింకను చిన్నదానవు కావు సుమా। అను చున్నది. చివరకు ఆ స్వామి ఆమె నేదో యొక విధముగ ఒడబరచి ఆమెను కూడినాడు. ఆయన సంగమమును అలమేల్మంగ కొసరి కొసరి కోరుకున్నదట. అందుకే ''నీవు చిన్నదానవా'' అని చెలి ప్రశ్నించినది.

అన్నమయ్యగారు చక్కని జాన తెనుగున పద రచనచేయ గల దిట్ట అలమేల్మంగ యొక్క ముగ్ధత్వమును తేట తెనుగున మృదు మధురముగ వర్ణించినారు. ఆయన స్వయముగ చెలికత్తె యై జగజ్జననీ జనకుల మేలు కలయికకు దోహదక్రియలొనర్చి, వారినొకచో కూర్చి ధన్యుడైనాడు ఇది దివ్య దంపతుల సంబంధమైన శృంగారము గనుక దీనిని లౌకిక దృష్టితో నెంచరాదు మధుర భక్తి సమ్మిళితమైన ఒకానొక ప్రేమ కావ్యముగ పరిగణింపవలెను. ఇందలి నాయికను ముగ్ధ - నవోఢగా గుర్తింపవచ్చును

## 2. ముఖారి రాగం :

భావమెఱుగని పడుచా వోసి
పోవే పోవే పోవే పడుచా ||పల్లవి||

1 మొరగు మొరగు వింత కరుగుదవేల
పరచు మాటల పడుచా
చురుకు మెరుపు వాలుచూపుకన్నుల
కెరల బొడిచి గిలిగించేవే పడుచా ||భావ||

2. కెలపు మలపు బయిడి గిలుకు మట్టెల
బలుపు మోతల పడుచా
అలపు సొలపు ముద్దులొలుకు మట్టెల
జలుకు వలపు మీద జల్లేవా పడుచా ||భావ||

3. వెదకి వెదకి తిరువేంకటేశ్వరు
బదరి కూడిన పడుచా
కదలు గుబ్బల కలికి చేతల
వుడుటు నడపులనె వొరగేవే పడుచా ||భావ|| (12-269)

ఇందలి నాయిక విస్రబ్ధ నవోఢయగు ముగ్ధ. నర్మగర్భమైన మాటల నాడునట్టిది. ఓర కనుఁ చూచి నాయకుని ఉద్రేకింప జేయునట్టిది. ముద్దులొలుకు నవ్వులతో ప్రసరింప జేయు వలపు చల్లు నేర్పు గలది. అందముగ, ఉత్సాహముగ కదలించుచున్న బంగారు మట్టెలు ధరియించినది. ఆ కదలికలో మట్టెల రవళి అధికమైనది. ఆ నడకల వలన ఆమె ఉరోజములు కదలు చున్నవి. ఇవి అన్నియు కలికి చేతలు, నైపుణ్యము గల చేష్టలు.

ఈ విస్రబ్ధ నవోఢకు లజ్జా, భయ కంపాదులు తగ్గి పోవును. విశ్వసనీయమైన ప్రేమగలదిగ నుండును అంతియె కాక ఈమె యందు స్వీయా ముగ్ధ - విస్రబ్ధ నవోఢ లక్షణములతో పాటు ''అభిసారిక'' లక్షణములు గలవు. ఎందుకనగా ఈ నాయిక వెదకి వెదకి తిరువేంకటేశ్వరుని పదరి (త్వరపడి) కూడినది. కనుక ఈమెను స్వీయా - ముగ్ధ - విస్రబ్ధ - నవోఢ అభిసారికగా చెప్పుకొనవచ్చును.

అన్నమయ్యగారు విష్ణుక్షేత్రము లన్నియు తిరిగినారు. తన మనోనాథుడైన శ్రీహరి కొఱకు వెదకి నాడు. చివరకు తిరువేంకటాద్రిపై నున్న వేంకటేశ్వరుని సన్నిధినే తన శేష జీవితమును గడిపినాడు ఈ కీర్తనలయందలి నాయిక ప్రత్యేకముగ పేర్కొన బడక పోవుటచే అన్నమయ్యయే ఇందలి నాయకయై యుండును

ఇంకను ఈ క్రింది కీర్తనలో ముగ్ధానాయిక లక్షణములు అన్నమయ్య ఇట్లు వర్ణించినాడు.

**మధ్యమావతి రాగం**

వేడుకొన గదవయ్య వేగమె నీవు
వాడి గోరి తాకులకు వడి దిట్ట కుండనా || పల్లవి||
ఆటది చిగురు వంటిది అంత గాసి కోపదు
గాటపు మాటాడితేను కసుగందును
యేటికి బిసికితివి యెగ సక్కేన చన్నులు
గూట జిక్కియిందు కాపె కోపగించకుండునా ||వేడుకొన||
జవ్వని పూవు వంటిది సడిబడ నోపదు
నవ్వితేనే వసువాడినాము వేసును
రవ్వగా గిలిగింతురా రచ్చలోన మార్మములుక
ఇవ్వల నిందుకు నాపె యెగ్గు వట్ట కండునా || వేడుకొన||
కన్నియ పూపవంటిది కాకలకు నోపదు
అన్నిటా శ్రీ వేంకటేశ అలయించి తీ కాగిట
సన్నల నిన్నిందు కాపె సాధించ కుండునా ||వేడు|| (20-99)

ఈ నాయిక నవోఢ. ఏమాత్రపు కఠినపు చేతలనైనను ఓర్చుకొనజాలదు. రతియందు ప్రవీణురాలు కాదు. గోరు గుచ్చుకొనినను, గట్టిగా మాటాడినను, బిగి కౌగిట బంధించినను పూవు వలె వాడిపోయెడి సుకుమారి. లేత పిందె వంటిది. వేడిగాలులకు తట్టుకొనలేదు ముట్టుకొనిన పాలుగాఱునట్టి సున్నితశరీరమామెది. అమాయకురాలైన కన్య. శ్రీ వేంకటేశ్వరుడు ఇట్టి నాయికను కూడి అలయించినాడు. అందులకే తిట్టినది సాధించినది. కోపగించినది. తప్పులనెత్తి చూపినది

ఈ నాయిక చేష్టలన్నియు నూత్నవధువు చేష్టలను తలపునకు వచ్చును. కష్టతరమైన కార్యముల వలన ఆమె మిగుల నొచ్చుకొనును. ఇవి యన్నియును శ్రీమన్నారాయణుడు భక్తితో పరిపక్వత చెందని భక్తులకు పెట్టెడి పరీక్షలు. ఈ పరీక్షలలో భక్తుడు నెగ్గినా స్వామి సన్నిధి లభించినట్లే. పరమాత్మ పెట్టెడు కఠిన పరీక్షలకు తట్టుకొన లేని భక్తుడు పొందెడి ఆవేదన, తపన, అలయిక - ఇవి యన్నియు భక్తుల చరిత్రలు గమనించినచో మనకు సుస్పష్టమగును. రాముని నమ్మిన రామదాసును అనేక బాధలకు గురి చేసినప్పుడు ఆ

భక్తుడు రాముని నిందించుట అందరెరింగిన చరిత్రమే. చివరకు తన తప్పు తెలిసికొని పశ్చాత్తాపము నంది ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రుడైన విషయము ఆ చరిత్ర వలన మనమెరుంగ వచ్చును.

ఇట్టివే మరికొన్ని ఉదాహరణలు పరిశీలనార్థములు.

**1. మధ్యమావతి**

ఇంతులు నోచిన నోమో ఇది నీకు విలాసమో
యెంతైనాను పొగడక యెట్లు మాన వచ్చును 18-180

**2. కొండ మలహరి**

ఏమే యెరుగదా యే కతపు సరసము
కామించిన అతని నింత కాకు సేతుర 24-575

డా వేటూరి ఆనందమూర్తిగారు ఇచ్చిన స్వీయా నాయికకు ఉదాహరణములు (43) స్వీయ (దివ్య)

**ముఖారి**

1 ఇది గాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
యిది గాక వైభవంబిక నొకటి గలదా 12-17

**రామప్రియ**

2 ఏమిసేతుమయ్యా నీవు యింతటి నాయకుడవు
మోము చూచి తొలినీకు మోహించిన దానను 3-188

**వరాళి**

3 కటకట సతి శృంగారము కన్నుల పండువుదోపుచు
యిటువలె నిలచి చిత్తంబిందరి నేసెడిని 12-122

**ముగ్ధ-నవోఢ (దివ్య) గౌళ**

4 ప్రాయపు వనిత నింత పచ్చిసేతురా
మాయక మూసేని చలముల నింతవలపు 3-117

5. ఏమీ నెరంగని నన్ను ఇంత సేసెనే వీడు
సొమము నేరిపేరంటా చవులు పుట్టించేనే 3-609

6. ఎందాక నీ సిగ్గు లేటికి బెంచేవు
పొందులు దొరకెను భోగించ రాదా 17-547

## స్వీయం – మధ్య

1. ''సమాన లజ్జా మదనా మధ్యా'' – రసమంజరీ

2. విచిత్ర సురతయు, ప్రరూఢస్మర, యవ్వనయు, ఈషత్ప్రగల్భ వచనయు, మధ్యవ్రీడితయు మధ్య యనబడును – ఆంధ్ర సాహిత్యదర్పణం

3. మధ్యావిచిత్ర సురతాప్రరూఢ స్మరయవ్వనా

ఈషత్ప్రగల్భవచనా మధ్యమ వ్రీడితామతా – సాహిత్య దర్పణము

అన్నమాచార్యుని కీర్తనలలో ''మధ్యానాయిక'' స్పష్టముగ గోచరించు కీర్తనలు అతి స్వల్పముగ నున్నవి. వానిలో ఒకటి రెండింటిని స్థాలీపులాక న్యాయముగ వివరింతును.

### కాంబోది

1. అల్లదివే చూడరమ్మ అతివబావము నేడు
వెలవిరిబతి వద్ద వింతలాయ గనరే ||పల్లవి||

తప్పక చూచి యింతి తలవంచి సిగ్గుపడి
చిప్పిల గడమ చూపు చిత్తములో జూచెనే
కొప్పుగదల నడచి కొంచి కడమ నడపు
చెప్పక పయ్యదమాటు సేయుచు నడచేనే |అల్లదివే||

సెలవి బారగ నవ్వి సిగ్గున గడమ నవ్వు
కులికి కులికి తన కుత్తుకలో నవ్వేనే
నిలచి కొంత మాటలాడి నీటున గడమ మాట
సెలసి చేయి మరుగు చేసుక మాటాడెనే ||అల్లదివే||

చేతికి నాకు చుట్టిచ్చి సిగ్గుతోడ సగమాకు
చేతనే చిదిమి తన వాతెర గీలించేనే
యీతల శ్రీ వేంకటేశు డింతి భావములు చూచి
కాతరాన గూడగాను గడుసె నిలిచెనే ||అల్లదివో|| 27-484

ఇందలి నాయిక సమానమైన లజ్జయు, మదన వికారములను కలిగి యున్నది. ఒక ప్రక్క తన మనోవికారమును ప్రకటించుచునే సిగ్గు వడుచున్నది విచిత్ర సురతము మాట యెట్లున్నను ఈమె ప్రరూఢస్మరయవ్వనయని ఆమె చూపులు, నడకలు, చెప్పకచెప్పుచున్నవి నాయకుని చూచినట్లే చూచి అంతలోనే సిగ్గుపడుచున్నది నవ్వును గొంతులోనే దాచుకొనుచున్నది. కొంత మాటలాడుచున్నది. మరల సిగ్గుచేత చేయి మరగు చేసి కొని మాటలాడుచున్నది ఆ మాటలును పొడి మాటలు కావు నీటు మాటలు విలాసముగ మాటలాడుచున్నదన్నమాట అనగా ఈషత్ప్రగల్భవచనములు పలుకుచున్నది. నాయకునకు ఆకులు చుట్టి యిచ్చిసగమాకు తానే నోట వెట్టినది.

ఈ చేష్టలన్నియును నాయకుడైన వేంకటేశ్వరుడు గమనించినాడు ఆమె భావములు గ్రహించినాడు ఉత్సాహముతో కూడగా నాయిక గడుసు దానివలె నిలచినది ''వెల్లవిరి బతి వద్ద వింత లాయ గదరే'' అనుటచే ఇందలి నాయికను అలమేల్మంగగనే గ్రహింపవచ్చును. ఆమె మనసు నందలి కోరికకు ఫలము వేంకటేశుడు కూడుటయే

## 2. రామక్రియ

ఎంత నేర్పెనే యీ లేమ పువ్వు
బంతి వాట్లనే బడలేని ||పల్లవి||

వాలుక చూపులు వంచి చెలిపతి
కోలు ముందుగా గొణగీని
చాలుగ నడచి సొరెకు నిలిచి
వీలుచు బయ్యెద విసరీని ||ఎంత||

చెదరిన సెరులటు చెరిగియటు నటు
నుదుటన చెలిపై నొరగీని
కొదలుచు బలికి కోపమె చిలికి
చెదరగ నవ్వులు చిందీని ||ఎంత||

సరసపు సిగ్గులు చల్లీని తన
కరముచెక్కుపై గప్పీని
యిరవుగ శ్రీ వేంకటేశు గలసితా
నరమరపున ముదమందీని ॥ఎంత॥ 26-142

ఇందలి నాయిక తనకు గల వలపును ప్రకటించుటలో కొంత చాతుర్యమును ప్రదర్శించుచున్నది ఓర చూపుల జూచినది చక్కని నడకలతో అటు నిటు తిరుగుచు నాయకున కెదురుగ పదే పదే నిలచును. పైట కొంగు మాటి మాటికి తీసి సవరించుకొనును చెదరిన కురులు సవరించుకొనును. త్రొటుపాటుతో చెలిపై నొరగును. అస్ఫుటమైన మాటలు పలుకును. కోపగించును. అంతలోనే నవ్వును. సిగ్గులు ఒలక పోయును చెక్కిట చేయి చేర్చును చివరకు తన శ్రమకు ఫలితముగ ''అభిలాష'' ను నెరవేర్చుకొనినది శ్రీ వేంకటేశుడు ఆమెను కలిసినాడు

ఈ నాయిక ప్రవర్తన, పలుకులు, సిగ్గులు ఇవి యన్నియు మధ్యానాయికను స్ఫురింప జేయుచున్నవి ఇది శ్రీ వేంకటేశ్వరుని దివ్య శృంగార లీల యగుటజేసి అలౌకికమైన, దివ్యమైన, మధురభక్తి యుతమైన రచనగా గ్రహింపవచ్చును.

రసమంజరీ కారుని నిర్వచనము ''సమాన లజ్జా మదనామధ్యా'' అను ప్రకారము సరియైన ఉదాహరణము డా. వేటూరి ఆనందమూర్తిగారు అన్నమయ్య కీర్తనల నుండి ఇచ్చినారు. (44) అది

తాలిమి చక్కగాని తమక మెంతైనా గద్దు
మేలమాడవయ్యా చెలి మీద మీద నున్నది ॥పల్లవి॥

వనిత పువ్వులు వేసి వలపు నీపై బూసి
తనుదానె సిగ్గువడి తలవంచీని
మనసు నీపై బెట్టి మాటలు మాతో నాడి
పెనగి పిలువవయ్యా పేరు కొని నీవు ॥తాలిమి॥

పడతి నీతో నవ్వి పాయపు టాసలు దవ్వి
చిడుముడి సిగ్గుతోడ జెమరించీని
కడు నిన్నట్టే చూచి కాయము మోపై వేసి
వొడివట్టి తియ్యవయ్యా వొద్దికతో నీవు ॥తాలిమి॥

కలికి నీ కాలు తొక్కి కమ్మటి నీకు మొక్కి
వలవని సిగ్గుతోడ వడబడీని
నెలపై శ్రీ వేంకటేశ నిన్ను గూడె తన్నుదానె
అలమిపై కొనవయ్య అప్పటికి నీవు ||తాలిమి|| 17-298

ఇందు వర్ణిత యైున నాయిక స్వీయా - మధ్య అతి విశ్వాసము చేత లజ్జయును, మదన భావమును సమముగ వ్యక్తీకరించుచుండుట బట్టి అతి విస్రబ్ధనవోఢ'' (45) అని డా. వేటూరి ఆనందమూర్తి గారు చెప్పిరి.

ఇంకను స్వీయా - మధ్య నాయికుకు అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలలో ఈ క్రింది నుదహరించిన వానిని పరిశీలింపవచ్చును.

1. మధ్యమావతి - ఎటువంటి వేడుకలో ఇద్దరికి మీద మీద

ఘటన వెన్నెల పులగము లాడేరదివో 26-21

2. శంకరాభరణము '- ఇంత కంటి నోపము యేదౌతానెఱగము

పంతము లింకానేల పదవయ్యా 26-58

## స్వీయం-ప్రగల్భ (ప్రౌఢ)

1. పతిమాత్ర విషయకేళి కలా కలాపకోవిదా ప్రగల్భా

అస్యాశ్చేష్టా - రతిప్రీతి. రానన్దాత్సమ్మోహః - రసమంజరి

2 స్మరాంధా గాఢ తారుణ్యా సమస్తరతి కోవిదా

భావోన్నతా దరవ్రీడా ప్రగల్భాక్రాంత నాయికా - సాహిత్య దర్పణము

## 1. సామంతం 12-133

కొనచూపులనె వింత కోరికలు దైవార
పెనగొన్న తమకముల బెనగు టిన్నడురా ||పల్లవి||

కమ్మ కస్తురి తావి కప్పురపు వాసనల
తమ్ములము నోరిలో దగ గలికి కులికి

ఉమ్మగింతల రతుల నుడివేని వేడుకల
ఇమ్ములను గూడి సుఖియించుటెన్నడురా ||కొన||

బిగువు కౌగిట జేర్చి బిత్తరపు జూపులను
నగవు దేరగమనసు నాటించి మించి
మొగము మొగమున జేర్చి ముద్దు మాటలను నును
బగడవాతెర గదల బలుకుటెన్నడురా ||కొన||

కడుమోహమున సిగ్గు గదియు టెన్నడు లేక
యెడలేని కూటముల యెచ్చరికె లేక
విడువ కిటు వలెనె తిరువేంకటేశుడా నీవు
వడి దలచి నాకడకు వచ్చుటెన్నడురా ||కొన||

ఈ సంకీర్తన ఈ క్రింది కృష్ణ కర్ణామృత శ్లోకమును స్ఫురణకు తెచ్చుచున్నది

లీలాన నామ్బుజ మధీర ముదీక్షమాణం
నిర్మాణి వేణు వివరేషు నివేశయన్తమ్
డోలాయ మాన నయనం నయనాభిరామం
దేవం కదాను దయితం వ్యతిలోకయిష్యే ||కృష్ణ కర్ణామృతం శ్లో 49

- లీలాశుకుడు

ఇందలి నాయిక రతిప్రీతి మతియైన స్వీయా - ప్రగల్భ నాయకుని తోడి తన సమాగవమును తీవ్రముగవాంఛించుచున్నది ''పెన గొన్న తమకముల బెనగు టెన్నడురా'' అనుటచే ఆమెకెంతటి రతిప్రీతి గలదో తెలియుచున్నది. శృంగారమునకు కావలసిన సంభారము లన్నియు పేర్కొన బడినవి కమ్మకస్తురి, కప్పురము, తమ్ములము, కౌగిలింతలు, బిత్తరచూపులు ముద్దుమాటలు. ఉండియు లేనట్లున్న సిగ్గు - ఇవి అన్నియు సంభోగ శృంగారమునకు ఆలంబనములే. ఇవి యన్నియు కలిగినప్పటి నాయకుని తోడి సంశ్లేషమును కోరుచున్నది నాయిక

ఇది లౌకిక నాయిక విషయమున అవసరమగు ఆలంబన, ఉద్దీపన విభావములు కాని మధుర భక్తుల యెడల ఇవి యన్నియు అవసరమా? యను ప్రశ్నయు దయించును. ముందుగ ఇందలి నాయకుడు సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరుడు. నాయిక అలమేల్మంగాది

దిష్ట్రులలో నెవరైన కావచ్చును లేదా మధుర భక్తుడైన అన్నమయ్యయు కావచ్చును ఇట్టి శృంగార కీర్తనలయందు భక్తి రసము చిప్పిల్లు చున్నది "భక్తి రసమునకు ఆలంబన విబావములు భగవంతుడే ఆయన పరమోదాత్త చరిత్రలు విభావములు భగవదాకారత, చిత్తవృత్తి స్థాయీ భావము అదియే భగవద్రతి". (46)

ఈ రతిని గూర్చి మధు సూధన సరస్వతి ఇట్లు నిర్వచించనాడు

"రజస్తమో విహీనాతు భగవద్విషయా మతిః

సుఖాభివ్యంజ కత్వేన రతిరిత్యభిధీయతే" (47)

అనగా రజస్తమో గుణరహితమైన, భగవద్విషయకమైన జ్ఞానమే (సుఖాబివ్యంజకము కావున) రతియనబడును అంతియ కాక రతి యనుదానికి "పరమ ప్రీతి, తత్పరత, ఆనందము" ఇత్యాది అర్థములు నిఘంటువులందీయబడినవి. (48)

పై కీర్తన యందలి "రతుల" అనుదానికి ఆనందముల, తత్పరతల అను నర్థమునే గ్రహింపవలెను ఇందలి రతికి "సంబోగము లేక మైథునము" అను నర్థములను గ్రహింపరాదు.

ఇందలి నాయికను గోపికగా మనమూహింపవచ్చును. ఆమెకు తీవ్రరతి బావము వర్ణింప బడినది. "వడి దలచి నాకడకు వచ్చుచున్నడురా" అనుటచే ఈమెను నాయకుని కొరకు ఎదురు చూచు విరహోత్కంఠితగా గుర్తింపవచ్చును అతి తీవ్రరతి కొరు బృందావన మందలి గోపికలని "మధుసూధన సరస్వతి" చెప్పినారు.

"వైకుంఠే ద్వారకాయాంచ శ్రీమద్బృందావనే తథా
మృధు తీవ్రామధ్యతీవ్రా తీవ్రతాప్రాచ సాక్రమాత్" (49)

రతినినిర్వచించుచు ఆయన రతియందలి బేదములను వివరించినారు. వైకుంఠము నందలి భక్తులది మృదు తీవ్ర రతి యనియు, ద్వారకా వాసులది మధ్యతీవ్ర రతియనియు, బృందావనము నందలి వారిది (గోపికలది) అతి తీవ్రరతి యనియు విశదీకరించిరి ఇందలి నాయికను బృందావన విహారిణి యగు గోపికగా గుర్తించినచో ఆమెకు కలిగిన భగవద్రతి తీవ్రతను అన్నమాచార్యులు ఎంత మదురముగ భావించెనో తెలియును. ఆ పరమాత్మ తోడి నిసర్గ సంశ్లేషమునే ఈ కీర్తనయందలి జీవాత్మ తీవ్రముగ గోరుచున్నది. ఇచట లౌకిక సంబంధము లేదు.

వైకుంఠమునందలివారు స్వామిసన్నిధినే యుందురు గాన ఆయనను సదా సందర్శించు భాగ్యము వలన నిరంతర ఆనందమును అనుభవించుచునే యుందురు కావున వారిది మృదుతీవ్రరతి

ద్వారక యందలి భక్తులు శ్రీ కృష్ణుని ఏలుబడిలోనే అయనకు సమీప మందే నివసించి ఆయన సందర్శనమును దినమున కొకసారియైనను పొందగలుగుటచే వారిది మధ్యతీవ్రరతి

ఇంక బృందావన మందలి వారు అంతకు మునుపు ఆయనతోడి నిసర్గానందాతిశయమును అనుభవించిన వారు అట్టి అనిర్వచనీయానందమును నిరాటంకముగ అనునిత్యము అనుబవింపవలె ననెడి తీవ్రమైన రతి కలవారు.

ఇటు అన్నమయ్య శేషాచలమునే బృందావనముగ భావించినాడు తనను తాను గోపికగ ఊహించుకొననాడు. శ్రీవేంకటేశ్వరుని శ్రీ కృష్ణునిగా తలంచినాడు

అట్టి శ్రీ వేంకటేశ్వరుని గాఢ సంశ్లేషాను భూతిని పొందుట ఎన్నటికో యని పరితపించుచున్నాడు.

ఈ క్రింది కీర్తన యందును స్వీయ - ప్రగల్భనాయిక చక్కగా వర్ణింపబడినది

**ఆహిరి రాగం**

అయ్యో వీడు నన్నణ కించేనే వీని
కొయ్యతనాలణచక కోపమేల తీరునే ||పల్లవి||

గుట్టున వాడిందురాగ గొబ్బున నీముంగురులు
పట్టుకొని పరపుపై బడదీసి (వేసి)
గట్టున గుబ్బల మీది కస్తూరి చెమటలనే
అట్టు నిట్టు సేయక అలపేల తీరునే ||అయ్యో

గక్కున వాడిందురాగా గడిపెట్టి తమకాన
చెక్కుదోయి నాకొన చేతనే నొక్కి
పుక్కిటి తమ్ములమిడి పాదిగొన్న కౌగిటిలో
నొక్కిన గాని నా నొగులేల తీరునే ||అయ్యో||

కూరిమి వాడించురాగా కొంకక నావాడిగోళ్ళ
జీరలుగా నొడలెల్ల జిమ్ముచుదీసి
ధీరతవేంకటగిరి దేవుడైన వానికినా
నేరుపెల్ల జూపక నానెగులేల తీరునే ||అయ్యో||

ఇందలి స్వీయా(ప్రగల్భ) నాయికను సమస్త రతకోవిదగా గుర్తింప వచ్చును రతి ప్రీతిమతియైన ఈ నాయిక తనకు గల నేరుపంతయు నాయకునకు చూపించి తన నెగులు దీర్చుకొన వలయునను తమకముతో నున్నది

నాయకుడు ఈమెను అణకించెనట. (మోసము చేయు) అట్టి వాని కొయ్యతనములు (దుశ్చేష్టలు కొంటెతనములు) ''అణచకతన కోపమేల తీరునే'' అని తన చెలితో అనుచున్నది. తన కోపమును శృంగార మూలముననే తగ్గించుకొనవలెనని తలచనది ఆయన తన యొద్దకు రాగానే గుట్టుగా నాతనికి బుద్ధిచెప్పవలెను ఆయన యందలి తీవ్రాతి తీవ్రరతితో, ఎడబాటుతో ''విరహోత్కంఠిత'' యై తానేమి చేయనున్నదో తన ప్రగల్భవచనములతో చెలికి చెప్పుకొనినది ఎట్లులైననేమి? ఏ వంకనైన నేమి? ఆయన తోడి గాఢాశ్లేషానందము ననుభవింపవలెను అంత సెసినగాని తన అలపు, నొగులు నెగులు తీరవు. అవి తీరినచో మిగులు నది అమందానందమే.

శ్రీ వేంకటేశ్వరుని నిజ సన్నిధిని వదలి మానవ రూపమున జన్మించిన ''నందకము'' అన్నమయ్య ఆయన కరస్పర్శకు దూరము దాదాపు ఎనుబది సంవత్సరములు ఈ భూలోకమున గడిపినా వాడు అందులకే ఆయన, అంతటి విరహ తాపము ననుభవించుట ఎప్పుడెప్పుడు తన స్వస్థానమును బొంది స్వామి సన్నిధిని ఆ వైకుంఠమున అనిర్వచనీయానందమును నిరంతరము ననుభవించు ఘడియ సమీపించునోయని ఎదురు తెన్నులు చూచినవాడు అన్నమయ్య

శ్రీ వేంకటేశ్వరునకు (శ్రీమన్నారాయణునకు) నందకమై సదా ఆయన చేష్టలను (లీలలను) గమనించిన వాడగుట చేతను, శ్రీహరి నాడి బాగుగ తెలిసిన వాడగుటచేతను, ముఖ్యముగ శ్రీ కృష్ణావతారమున ఆయన గోపికాదులను ఉద్ధరించిన విషయమును ఆమూలాగ్రము నెరింగిన వాడగుట చేతను చివరకు స్వయముగ మోహినీ అవతారమెత్తి రాక్షసులను మోహ పరవశులను జేసి లోకోద్ధరణకు పూనుకొనిన వాడని ప్రత్యక్షముగ యుగ యుగములనుండి ఆరసియున్న వాడును అగుటచేతను నందకాంశసంభూతుడైన అన్నమయ్య

స్వయముగా తాను నాయికా భావమూని ఆ స్వామిని సేవించి తరింపబూనినాడు ఇట్టి భగవత్తత్వము నవగాహన చేసికొనినవాడు కనుకనే నాయికయై పెక్కు బంగుల తన విరహ తీవ్రతను ప్రకటించినాడు వాక్రుసూనములచే నర్చించినాడు శృంగారమునకు పుష్పములు ఉద్దీపనములు. తన వాక్కులనే సుమములు గావించి సంకీర్తనా మాలలను స్వామికి సమర్పించినాడు ఆయన సమర్పించినవి ''వాక్రుసూనములు'' అని ఈ క్రింది పద్యము వలన తెలియును.

''అమ్మకు తాళ్ళపాక ఘనుడన్నడు పద్యశతంబు సెప్పె గో
కొమ్మని వాక్రుసూనముల గూరిమితో నలమేలు మంగకున్
నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మద మంది వర్ధిలుము జవ్వని లీలల వేంకటేశ్వరా।'' (50)

అంతియ కాక ఆయన రచించినవి ''వేంకటశైల వల్లభ రతి క్రీడా రహస్యంబులు'' అని యును ఆయన మనుమడు చిన తిరుమలాచార్యుడు వర్ణించినాడు. ఆ పద్యమిది (51)

''శ్రుతులై శాస్త్రములై పురాణ కథలై సుజ్ఞాన సారంబులై
యతిలోకాగమ వీధులై వివిధ మంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకటశైలవల్లభ రతిక్రీడా రహస్యంబులై
నుతులై తాళులపాక యన్నయ వచోనూత్నక్రియల్ చెన్నగున్''

అందువలన అన్నమయ్య శృంగార సంకీర్తనలలో స్థూలదృష్టికి వచ్చి శృంగార వర్ణన కనిపించినను వారి పరమార్థము జీవాత్మ పరమాత్మ తోడి సంశ్లేషమును కోరుటగానే యెంచవలెను అవి సాక్షాత్తు శ్రీమన్నారాయణుని దివ్య శృంగార లీలా వర్ణనములు గనే గణింపవలెను గాని లౌకిక దృష్టితో వానికి అపార్థము నాపాదింపరాదు

పైన ప్రగల్భానాయికకు ఇచ్చిన రెండవ ఉదాహరణలో కొంత ''సంభోగశృంగారము'' చూడగనే గోచరించును సూక్ష్మదృష్టితో పరిశీలించినచో అందలి పరమార్థము గోచరించును. జీవేశ్వరుల ఐక్యము కొరకు జీవుడు పొందెడి ఆరాటము సుగ్రాహ్యమగును

ఇట్టిదే మరియొక కీర్తన ఇందు నాయికయొక్క రతిప్రీతి తీవ్రత చక్కగా వివరింపబడినది

సామంతం (రాగం)

చాలు జాలు వాడు లేని జన్మమేలా
జాలి నన్నుబెట్టకురే సారె సారె చెలులు ||పల్లవి||

నేడు వాని బాసిన వెన్నెలల బయలేలా
వేడక వాడు గాగిట నుండని నిద్రేలా
కూడి వాడు నేను గప్పుకోని పయ్యెదేలా
వీడని చెక్కుతోడి వెరగే చాలును ||చాలు||

లీలవాని సరసము లేని నవ్వేల
ఆలించి వాడు వినని ఆ మాటలేల
సోలి నిద్దరు నొక్కటై చూడని యద్దమేల
తాలిమితో లోలోనే తలపోతే చాలును ||చాలు||

యీకడ వాడు గూడని యీ జవ్వన మేలా
ఆకు వాడు మడిచి యియ్యని తమ్ములమేలా
వాగక శ్రీ వేంకటాద్రి వాడు నన్ను గూడె నిదె
మాకు పడి జొక్కిన యీ మరపిదే చాలును ||చాలు|| 27-448

ఇందలి నాయిక శ్రీ వేంకటేశ్వరుని పొందులేని తనజన్మ నిర్వీర్యమైనదని చింతించుచున్నది ఆయన తోడి రతిసౌఖ్యము లేని తనపూజకు ఫలము పూజ్యముగా బావించుచున్నది. ఆయన సన్నిదికి దూరమైన తనకీ ప్రకృతి యంతయు శూన్యముగా తోచుచున్నది ఆ స్వామిని ఎడబాసిన తనకు వెన్నెల యైనను, నిద్రయైనను సుఖముల నీయజాలవు ఆయనయు తానును ఒక్కటియై మన వలయును లేని యెడల తన వస్త్ర భూషణాదికములు, తన సౌందర్యము అన్నియు వ్యర్థములై చివరకు తన నవ్వులు, పలుకులు కూడా నిష్ప్రయోజకములే అంత కన్న ఆయన మీది చింతయే తనకు ఆనందము నొసంగును తలపోతలే చాలును అని తన చెలులతో చెప్పుకొనినది

ఇట్టి నాయికకు తగిన ఆధ్యాత్మిక బావన గల పోతనామాత్యుని భాగవతము నందలి ఈ పద్యము ఇప్పుడిన స్మరణీయము

కంజాక్షునకు గాని కాయంబు కాయమే
పవన గుంభిత చర్మ భస్త్రిగాక
వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమ ధ్వని తోడి ఢక్కగాక
హరి పూజనము లేని హస్తంబు హస్తమే
తరుశాఖ నిర్మిత దర్విగాక
కమలేశు జూడని కన్నులు కన్నులే
తనుకుడ్య జాల రంధ్రములు గాక
చక్రి చింత లేని జన్మంబు జన్మమే
తరళ సలిల బుద్బుదంబుగాక
విష్ణు భక్తి లెని విబుధుండు విబుధుడే
పాదయుగము తోడి పశువు గాక (52)

ప్రహ్లాదుని చేత చెప్పించిన ఈ పలుకులు నిజమునకు పోతనామాత్యుని భక్తి తీవ్రతను తెలియ పరచుచున్నవి జీవుని పంచేంద్రియములు, శరీరము చివరకు జీవితము ఆ వైకుంఠుని ఉపయోగార్థమే సృజించబడినవి అవి తత్కార్యమునకు వినియోగింప బడనిచో నిరర్ధకములే

ఈ బావమునే అన్నమయ్య మధుర భక్తి భావమున ప్రకటించినాడు శృంగార సంకీర్తనా పుష్పములతో స్వామి కళ్యాణ గుణములకు వన్నె పెట్టినాడు.

అందుకే ఈ కీర్తనలొ ఆయన పైని చింత, తలపోత చాలుననినాడు చివరకు ఆయన మొర ఆలకించిన వేంకటేశ్వరుడు తనలో ఐక్యము చేసికొనినాడు ఆ సమయమున యావత్ప్రపంచమును ఈ మధుర భక్తుడు మరచినాడు. ఆ మరపునే తాను కోరినాడు బాహ్యస్మృతి లేకపోవుటయే ఆ మరపు అట్టి మరపు తన కెప్పటికిని కలుగ వలయు ననెడి భక్తుని వేదనా తీవ్రతను అతి తీవ్ర రతిని (తత్పరతను) మన మీ పై కీర్తన యందు గమనింప వచ్చును.

డా వేటూరి ఆనందమూర్తిగారు స్వీయా ప్రగల్భా నాయికకు అన్నమాచార్యుని కీర్తనల నుండి ఇచ్చిన ఉదాహరణలు

### సావంతం

''పడన దొలగెడి యబ్తి మంచి వయసున మనకు
తుదిలేని కోరికలు దొరకుటెన్నడురా''
ఉదుట జనుదోయి నీ వురము పై దనివార
నదిమి మోమున మోము నలమియలమి
పదలైన నీవితో వాలు గన్నుల జక్కి
లొదవని మీదనే నొరగు టెన్నడురా
గరగర నీ కురులలో కస్తూరి వాసనలు
విరుల తావుల తోడ విసరగాను
తిరువేంకటాచలాధిపుడు నిను గూడినే
నరమరచి సదమదము తాట యెన్నడురా (53) 3-54

### సాళంగ నాట

పలుకు తేనెల తల్లి పవళించెను
కలికి తనమున విభుని కలిసినది గాన (54) 4-74

## పరకీయం

1 అ ప్రకట పర పురుషానురాగ పరీయా ''రసమంజరి''

(సాచ ద్వివిదా పరోఢా కన్యకాచ కన్యాయాః పిత్రాధ్యధీనతయా పరకీయతా అస్యాగుప్తైవచేష్టా)

2 యాత్రాదినిరతాన్యోఢా కులటా గళిత త్రపా ''సాహిత్య దర్పణము. ''యాత్రయనగా నేదో నెపమున నటు నిటు తిరుగుట ఆదిశబ్దముచే దలవాకిట నిలచుట, కిటికీనుండి తొంగి చూచుట మొదలగు పనులు వీని యందా సక్తురాలును సిగ్గును వదలినదియు '' - కావ్యాలంకార సంగ్రహము

పై లక్షణములను ఇట్లు చెప్పుకొనవచ్చును. తనకు పరపురుషుని యందు గల అనురాగము ఇతరులకు తెలియజేయునది. పరకీయ ఈమె రెండు విధములు 1) పరోఢ, 2) కన్య

పతితో వైవాహిక జీవితమును గడుపుచు పరపురుషుని యందు అనురాగము కలిగి అతనితో సంభోగమును ఆచరించునది ''పరోఢ''.

అవివాహితయై, తల్లిదండ్రుల చాటున పెరుగుచు పరపురుషుని వరించి వానితో సంభోగ శృంగారము నాచరించునది ''కన్య''

ఈ లక్షణములను బట్టి చూడ ''పరకీయ''కు దివ్య శృంగార కావ్య ప్రపంచమున తావు లేదనిపించును ''దివ్య'' లైన నాయికలకు పరపురుషానురాగమను విషయము వర్తింపదు.

ఈ విషయమును డా. వేటూరి ఆనందమూర్తిగారు ఇట్లు వివరించిరి.

'' ఇట్టి నాయికా స్వరూపము తాళ్ళపాకవారి పదములలో పలుతెఱగుల గోచరించును. అలంకారికులు నిర్వచించిన స్వీయాది భేదములలో స్వీయా నాయికా భేదములే కుప్పు తెప్పలుగా వీరి రచనలందున్నవి. రూప గోస్వామి ఉజ్వల నీలమణిలో వర్ణించినట్లే దివ్య శృంగార విషయమున పరకీయా సామాన్య నాయికలకు ప్రవేశము లేదు'' (56)

అందువలన పైన తెలిపిన లక్షణములు దివ్యలైన శ్రీ, భూ, నీళాది నాయికలకు (అలమేల్మంగ తో సహా) ఈ పరకీయా లక్షణముల వర్తింపవనుటలో సందేహింప పని లేదు. విప్రతి పత్తికి తావు లేదు.

కాని పరకీయలైన గోపికాదుల యెడ ఇది వర్తించును. వారు నెరపిన శృంగారము శ్రీ కృష్ణునితో యగుట చేత అది దివ్య శృంగారము గనే పరిగణింప బడవలెను. వారే కాక కలియుగము నందలి అండాళు మొన్న మొన్నటి కృష్ణ భక్తురాలైన మీరా బాయి ఇట్టివారు ఈ కోవకు చెందినవారే

ఇంక అన్నమాచార్యుల సంకీర్తనల పరముగ చూచినచో ఇట్టి పరకీయలు అటనట కాన్పింతురు అన్నమయ్యయే స్వయముగ గోపికా భావమూని విరహతాపము నందుట మనము పెక్కు కీర్తనలలో గమనింప వచ్చును.

ఈ విషయమున గైరిపెద్ది రామసుబ్బ శర్మగారి వివరణము స్వీకరింపదగినదది.

''పురుషునకు నాయికత్వాము సిద్ధించునా యని సందేహింపరాదు వైష్ణవ సాంప్రదాయము నందు ''పుమాన్ విష్ణురితి ఖ్యాతః స్త్రీ ప్రాయ మితరం జగత్'' అను

వచనము సుప్రసిద్ధము ఈ వచనము ఈ పద్ధతి సనాతనమని చాటుచున్నది కావున అన్నమయ్యాది గోపికాభక్తి గోపికలు స్త్రీలుగావున వారికి శ్రీకృష్ణునిపై గల ప్రేమ శారీరకమనరాదు'' (57)

అన్నమయ్యాది నాయికాభావ సంపన్నమై బయటికి శృంగారముగా లోపలికి స్వామి పరముగా జరిగిన ఈ సంకీర్తన రాశి యంతయు గోపికా భక్తికి ప్రతీకగా నిలుచున్నది

కనుక అన్నమాచార్యుని సంకీర్తనలలో ఆటనట గోపికాది పరకీయలు దర్శనమిచ్చుట అసందర్భము కానేరదు అట్టి భావములుగల కొందరు పరకీయానాయికలను గూర్చి పరామర్శింతును.

ముఖ్యముగ నా దృష్టికి వచ్చిన కొన్ని సంకీర్తనలలో మాత్రమే పరోడయగు నాయిక గోచరించుచున్నది

ఈ సంకీర్తనల యందలి నాయికను వివాహితయైన గోపికగా పరిగణింపవచ్చును.

## కొండమలహరి

కొండలో గోవిల గుయ్యా గుండె వగిలె నీ
యండకు రాగా బ్రాణ మంతలో బ్రతికెరా ॥పల్లవి॥

వలచి నిన్ను వెదకి వడినే రాగాను
పులివలె మగడుండే బోనియ్యక
తలచి నాకంతలోనే తలనొవ్వగాను
చిలుకు బులకలెత్తి సిగ్గుమాలె వలపు ॥కొండలో॥

ఏమరించి యుంటివారి నెడిసినే రాగాను
గామైన బిడ్డయేడ్చె గదల నీక
తామసించి యుండలేక తల్లడించగాను
చీమలు మై ప్రాకినట్లు చిమ్మ రేగె వలపు ॥కొండలో॥

వుండలేక యిప్పుడు నీ వొద్దికి నే రాగాను
కొండవలె మరదుండె గోపగించుక
బొండు మల్లెపరపుపై బొరలేటి యిట్టి నన్ను
కొండల రాయడ నిన్ను గూడించెనా వలపు ॥కొండలో॥ 12-324

పరకీయ యైన గోపిక శ్రీకృష్ణుని సమాగమమునకై పరితపించుచుండగా కొండలలో కోయిల కూసినది ఆమెకు గుండె పగిలినంత పని యైనది ఆమె తాపము హెచ్చినది ఎట్లో అవాంతరములు తప్పించుకొని అభిసారిక యై ఆయననుచేరి ప్రాణములు నిలుపుకొనినది.

భర్త, అత్తమామలు, పిల్లలు, మరదులు ఎంత మంది ఈమె నొక కంట కనిపెట్టి యుండిరో! వారందరిని ఏమరించి పోవలెననిన ఎంత కష్టము కొండల రాయని సన్నిధిని పొంద గలుగుట కెన్ని ఆటంకములు! ఎన్ని అవాంతరములు

ఈ విషయమునకు సరిపడు ఉదాహరణము సాహిత్య దర్పణము నందలిది స్ఫురింపక మనదు.

స్వామీ నిశ్వసితే ప్యసూయతి, మనోజిఘ్రః సపత్నీజనః
శ్వశ్రూరింగిత దైవతం, నయనయో రీహాలిహోయా తరః
త ద్దూరాదయ మంజలిఃకి మధునా దృగ్భంగి బావేనతె
వైదగ్ధీమదుర ప్రబన్ధరసిక వ్యర్థోయ మత్ర శ్రమః'' (59)

ఇట్టిదే కావ్యాలంకార సంగ్రహము నందలి పద్యము

''మగడా! ఊర్చిన బ్రేవులెంచు, సవతుల్ మచ్చిత్తముంద్రవ్విచూ
త్రగు నాయత్త గయాళి, పట్టుబసి, యేరాండ్రా? దృగంతంబు
లం దగ భేదింతురు, నిష్ఫలంబు శ్రమ, కన్సన్నల్ వృథా! పొమ్మటన్
వగలాడా! యిదె దొలనుండియె నమో వాకంబులర్పించెదన్'' (60)

ఇందు పరకీయయైన నాయిక పరపు పసునియందను రక్తయై తానాతని యొద్దకు రాలేని తన అశక్తతను తెలుపుచు దూరము నుండియే ఆతనికి నమస్కరించుచున్నది

కాని శ్రీ కృష్ణుని వరించిన భక్తులకు ఆయన సన్నిధి దుర్లభమగునా! అన్నమాచార్యుని పరకీయా నాయికకు శ్రీ వేంకటేశ్వరుని సంగమము లభించినదని పై కీర్తన వలన తెలియునగును

జీవుని పరముగ, నాలోచించినచో ''స్త్రీ ప్రాయ మితరం జగత్'' అనునట్లు జీవుడును (స్త్రీ పురుషులలో నెవ్వరైనను) స్త్రీ సమానులె గదా! అట్టి జీవునకు సంసార బంధము మగని వంటిది ఈ సంసార బంధము అన్నింటికి ప్రతి బంధకమే ఈ శ్వరచింత చేయనీయక తుచ్ఛమగు ఐహిక విషయముల వైపునకు లాగుచుండును జీవుని పై భర్తవలె నాధిపత్యము నెరపు చుండును వాని నన్నింటిని వదిలించుకుని, నిరతిశయానంద ప్రదాత

యుసు ఈశ్వరుని చేరుకొనవలెనని భక్తుడైన జీవుని తాపత్రయము సంసార మనెడి ఈ సముద్రము నుండి తరింపజేయ గలవాడొక్క విష్ణువే. అందులకే ఆయనను శరణు వేడుట ఆయన సాన్నిధ్యమును కొరుట అందుకే అన్నమయ్య తాను స్వామి సన్నిధిని చేరుకొనుటకు తనకు సంసార బంధమెట్లు ప్రతి బంధకమగుచున్నదో ఈ కీర్తనలో విన్నవించుకొనినాడు. స్వామిని యెడబాసి వైవాహిక జీవితము నారంభించి అందు తలమునకలై తన మనోనాయకుడైన శ్రీ వేంకటనాదుని సందర్శనేచ్ఛ తీవ్రమై అటు స్వామిని చేరుకొలేని దశలో ఈ కీర్తన వెలువడినదేమో యని పించును

అన్నమాచార్యుడు శ్రీ వైష్ణవ సాంప్రదాయములు బాగుగ నెరింగిన వాడు. పన్నిద్దరాళ్వారుల చరిత్రలు వారి రచనలు నిశితముగ పరిశీలించినవాడు ఒంటపట్టించుకొనిన వాడు కులశేఖరాళ్వారు అను ఆళ్వారులు రచించిన ''ముకుంద మాల'' లోని ఈ క్రింది శ్లోకము తలంపునకు రాక మానదు.

శ్లో ''తృష్ణాతొయే మదన పవనోద్ధూత మోహోర్మిమాలే
దారావర్తే తనయ సహజ గ్రాహ సంఘాకులేచ
సంసారాఖ్యే మహతి జలధౌ మజ్జతాం నస్త్రిధామన్
పాదాంభోజే వరద భవతో భక్తి నావం ప్రయచ్ఛ''

భక్తి యనెడు నౌక ద్వారా సంసార సాగరమును దాటుటకు విష్ణువును ప్రార్థించు భక్తుని ఆవేదన ఇందు గమనింపవచ్చును అట్టి భక్తి తీవ్రతను గలిగిన గోపికలు తమ వారి నందరిని వదలి శ్రీకృష్ణుని కొరకు బృందావనము నందు, యమునానదీ సైకత శ్రేణులందు తిరుగాడుటయు, వారి భక్తికి మెచ్చి శ్రీ కృష్ణుడు, ప్రత్యక్షమై వారిని సమాధాన పరచుటయు భాగవతము పఠించిన వారందరికి తెలిసిన విషయమే

అందుకే పైనుదహరింప బడిన అన్నమాచార్యుని సంకీర్తన యందు కూడ ఆ నాయిక భక్తి తీవ్రతకు ఫలితముగా కొండల రాయని తోడి పొందు కలిగినది ఇట్టిదే మరియొక కీర్తన.

## రాగం – దేసాళం

2 మంచి వాడ వంతె పో మాధవరాయా
మంచు మాయ మాడుకూరి మాధవరాయా ||పల్లవి||

మోహాన నుండిన నన్ను ముట్టిపేడుకొనే సంహా
మాన మేలంటే వోయి మాధవ రాయా
నేనా సారెకు వచ్చి నీతో నెదురాడేదాన
మానవుగా మాడుకూరి మాధవరాయా ||మంచి||

యొగసక్యానకే మా ఇల్లు చొచ్చి వచ్చేవు
మగసాలి గదవోయి మాధవ రాయ
బిగిపాయక కూచుండి పై దొడవేసేవు నీ
మగువ నా మాడుకూరి మాధవ రాయా ||మంచి||

వోపనన్నా బోనీవు వొడివట్టి తీసేవు
మాపుదాకా నేలోయి మాధవరాయా
కోపుగా శ్రీ వేంకటాద్రి గూడి చూపేవా నీయెమ్మె
మాపైనే మాడుకూరి మాధవ రాయా ||మంచి||

ఇందలి నాయకుడు మాధవుడు. నాయిక గోపికా భావమూనిన అన్నమయ్య. గోపికగా భావించుటచే ఆమెది ప్రేపల్లె. ''మగనాలి గదవోయి'' అనుట ఆమె మరియొకరి ఇల్లాలు అని తేలుచున్నది ఆమెను మోహించిన ఆమెచే మోహింపబడిన మరియొక పురుషుడు మాధవుడు. ఈయన కేవలము ''పర'' పురుషుడు కాడు, మానవ మాత్రుడు అంతకన్నను కాడు. ''పరమ'' పురుషుడు. మధుర భక్తిలో మునిగి తేలెడి జీవులందరిచే వరింపదగిన వాడు. అట్టి పరమ పురుషుని మనో వాక్కాయ కర్మలచే తమ మనోనాథునిగ భావించి సేవించెడి వారు స్వయముగా నాతని సన్నిధిని చేరుకొనలేకపోయిన పక్షమున ఆయన వారిని సమీపించును. తన సన్నిధిని కృప చేయును ఇందులకు గోదాదేవి అని నామాంతరము గల ఆండాళ్ భక్తియే సాక్షి. ఉత్తర దేశమున పాండురంగ విఠలుని భక్తురాలిగ ప్రసిద్ధి గాంచిన సతీ సక్కుబాయి సాక్షి. గోదాదేవి తండ్రి చాటున పెరుగుచు శ్రీ రంగనాథుని వరించి తరించిన భక్తురాలు. సక్కుబాయి వైవాహిక జీవితమును గడపుచునే పాండురంగని సేవించి తరించిన భక్తురాలు మీరా బాయియు ఈమె కోవకు చెందినదే.

ఇట్టి చేతలు శ్రీ కృష్ణునకు సహజములే తన యొద్దకు రాలేని వారి కడకు తను పోవును. అందుకే అన్నమయ్య గారింటికే తరలి వచ్చినాడు ఆయనను తరింప జేసినాడు. భక్తి పొలమును పండించుకొనిని వారికి గాని ఇట్టి అదృష్టము కలుగదు.

## ప్రతాపనాట

మగ నాండ్లము మమ్ము మన్నించవయ్యా
అగడు సేయకు వయ్యా అప్పటిని మొక్కేము ||పల్లవి||

దొడ్డిడు పసుల గాచి దొరవయ్యేవు నేడు
జడ్డు గొల్లెతల బొంది జాణవైతివి
జిడ్డంటి నీ మేనెల్ల చీరలు మాకియ్యవయ్యా
వొడ్డారపు శ్రీకృష్ణుడని వొంటి చేత మొక్కేము ||మగ||

పాలు వెన్నలు మెసవి పాయపు వాడవైతివి
రోల గట్టించుక తొలెఁ రూఢి కెక్కితివి
వేలనీపై జడె మా వొడ్డాణాలే గదవయ్యా
గేలి సేతల కృష్ణుడ కిందుపడి మొక్కేము ||మగ||

దేవల వలపు జల్లి పూరబావవైతివి
కావించి మమ్మునేలి మగడ వైతివి
పూవుల దండలు మావి పాఁడిమితో నియ్యవయ్యా
శ్రీ వేంకటాద్రి కృష్ణుడ సిగ్గుతోడ మొక్కేము (18-540) ||మగ||

ఇందలి నాయికలు గోపికలు. భర్తలున్నవారు. ''మగనాండ్లము మేము'' అని స్వయముగా చెప్పుకొని నారు వారి చీరలు, భూసణాదికములు కొంటె కృష్ణునిచే అపహరింపబడినవి చివరకు ఆయనయె ''కావించివారికి మగడైనాడు కనుక ఇందలి గోపికలు పరకీయలు నాయకుడు దక్షిణుడు అందరి యందు సమసహజానురాగము కలవాడు. ''వేవలవలపు జల్లి పూరబావవైతివి'' అనుటచే అందరి యందు సమరాగుడు అని తెలుచున్నది

## కుంతల వరాళి

4. మాకేఁ యిటువంటివి మగనాండ్లము
యీ కొలది నీకవరు నెమ్మె కాదవందురు ||పల్లవి||

చెక్కు గొరనొక్కకుమీ సిగ్గు తోడి దాన నేను
యిక్కడనె నవ్వేరు నన్నెవ్వరైనాను

నిక్కముగ నివియెల్ల నీ చెక్కుల నుంచితే మేలు
అక్కడి వారు విటుడవని నిన్ను నందురు ||మాకేల||

తుఱుము వంగనియ్యకు దొరపాటిదానను నేను
యెరుగకాడుకొనేరు యెవ్వరైనాను
నెఱి నిటువంటివి నీకు కలిగితే మేలు
గుఱిగా రేపల్లెలోని కోడెకాడ వందురు ||మాకేల||

మోవి గంటు సేయకుమీ మొదలు యిల్లాలినేను
శ్రీ వేంకటేశ దూరేరు చెలులెల్లాను
నీవు నన్ను గూడితివి నీకే వుండితేమేలు
భావించి నిన్నెవ్వరైనా జయకాడ వందురు (20-65) ||మాకేల||

ఇందలి మగనాలి యొకతె శ్రీ వేంకటేశ్వరునిపై మరులుకొన్నది ఆయన కరుణించినాడు కాని వారి సంభోగ శృంగారపు చిన్నెలు సుప్రకటిత మగుచున్నవి అట్లగుట మగనాలియైన ఈ నాయికకు ఇష్టము లేనట్లున్నది ''అప్రకటిత పరపురుషానురాగా పరకీయా'' అని కదా లక్షణము అందుకే శ్రీ వేంకటేశ్వరుని తోడి తన శృంగారమును ఎవరు కనినను, వినినను నవ్విపోదురని స్వామిని ఇట్లని వేడుకొనుచున్నది ''చెక్కు గోరనొక్కకు, తురుమ వంగనీయకు, మోవి గంటు సేయకు'' అని నాయిక బ్రతిమాలు చున్నది. అంతే కాక విటుడని , కోడె కాడని, జయకాడని ఆయననే అనవలె గాని తన విషయము బయట పడ రాదని ఈ నాయిక భావము

విటుడనగా ఎచట అందరి యందు, అనగా జీవులందరి యందు సమరాగుడైయుండు భగవంతునిగా నెంచవలెను కోడెకాడనగా సర్వసమర్థుడని లెక్కింప వలెను జయ కారుడనగా ''విలాస వంతు'' డని సూర్యా రాయాంధ్ర నిఘంటువు ప్రపంచమును నడపుట ఆయనకు లీల వంటిది కను ఆయన లీలా విలాసవంతుడు, జగన్నాటక సూత్రధారి గదా!

ఇందలి భక్తురాలిది గుప్త భక్తిగా నెంచవలెను. భక్తురాలనెడి యశము తన కక్కర లేదు ఆర్తత్రాణ పరాయణుడనెడి పేరు పరమాత్మకు చెందవలెను తనకు ఆ స్వామి సన్నిధి లభించిన చాలును. అదియే ఆమె కోరిక అదియే ఆమె శ్రీ వేంకటేశ్వరుని సేవించుట యందలి పరమార్థము ఐహికముగా వైవాహిక జీవితమును గడుపుచునే పరమపురుషుడైన శ్రీమన్నారాయణుని యందు తత్పరత ( రతి) కలిగి యుండుటయే ఆమె భక్తికి పరమార్థము

భగవంతుడైన శ్రీ కృష్ణుని ఆత్మేశ్వరునిగా భావించి అనిర్వచనీయమైన అమలిన భక్తి యిందు ప్రకటితము కనుక ఈ పరకీయా భక్తిని గోపికా కృష్ణుల దివ్య శృంగారముగ భావింప వలెనే కాని స్త్రీ పురుష సంయోగమునకు సంబంధించిన లౌకికశృంగారముగనెంచి అన్నమాచార్యుని శృంగార సంకీర్తనకు న్యూనత్వమాపాదింపరాదు.

## సావంతం - (రాగం)

5 ఒద్దేల మొక్కేవో వుద్ధవుడా తన
ఉద్దండాలే చెల్లె నుద్ధవుడా ||పల్లవి||

ఊరూర వలపులు ఉద్ధవుడానే
మోరుతుమా యిక నుద్ధవుడా
ఊరడించ వచ్చేవు ఉద్ధవుడా తన
వూరట చెలుములు ఉద్ధవుడా ||ఒద్దేల||

ఒప్పలర మా వురిసిన పుం
డ్లుప్పులు వెట్టించె నుద్ధవుడా
చెప్పకు మమ్మిక చెలువుడాతడే
వొప్పి వుంటే జాలు నుద్ధవుడా ||ఒద్దేల||

గోపికల మమ్ము గూరిమి జిక్కించె
నోపమింతేసి నే ముద్ధవుడా
పైపైనే మమ్మింతా ప్రాణము నిలుప
నోపెగా తానైన నుద్ధవుడా ||ఒద్దేల||

చెల్లించె మాప్రేమ శ్రీ వేంకటేవుడు
వుల్లమలర నేడు వుద్ధవుడా
చల్లని కూటపు జనవిచ్చి మా మా
వొళ్లెల్ల జెనకే నుద్ధవుడా ||ఒద్దేల||

ఇందలి నాయికలు గోపికలనునది సుస్పష్టము మధురలో నివాస మేర్పరచుకొన్న శ్రీకృష్ణుడు వ్రేపల్లెలోని గోపికలెట్లుండిరో చూచి వారి నూరార్చిరమ్మని ఉద్ధవుని బంపినట్లు భాగవతము వలన తెలియనగును.

రమ్మా। యుద్ధవ గోప కామినులు నారాకల్ నిరీక్షింపుచున్
సమ్మోహంబున నమ్మియున్ మఱచియే చందంబునన్ గుందిరో
తమ్మున్ నమ్మిన వారి డిగ్గ విడువన్ దర్మంబు గాదంద్రువే
పొమ్మా। ప్రాణము లేక్రియన్ నిలిపిరో ప్రొద్యద్వియోగాగ్నులన్ (61)

ఈ సంకీర్తన భ్రమర గీతల ఛాయ నున్నది శ్రీకృష్ణుడు ఏ ఒక్కరి సొత్తు కాడు ఆయన జగన్నాధుడు అందుకే ఆయనకు ఊరూర వలుపులు అట్లే ఈ గోపికలను కూడా ''కూరిమి జిక్కించి'' నాడు ఇప్పటికైన తాను స్వయముగా వచ్చి తమవిరహములను శమింప చేయక ఉద్ధవుని రాయబారిగ పంపినాడు. ఒరసిన పుండు మీద కారము, ఉప్పు చల్లినట్లైనది గోపికల స్థితి ఆయనను కూడి ఎన్నియో యుగములైనట్లున్నది. జీవితము రోతగ తోచినది. ఆయన దర్శన మెన్నటికైనను లభింపక పోవునాయని ప్రాణములతో నున్నారు ఉద్ధవుడు వారిని ఊరడించుటకు వచ్చినాడు. అతనితో తమ యవస్థలు విన్నవించుకొనుచున్నారు ఆయన వారికి మొక్కి మరీ శ్రీ కృష్ణ సందేశమును వినిపించెనట తమకు మొక్కవలదని కోరుచు శ్రీకృష్ణుని ఉద్దండాలు ఉద్ధవునకు చెప్పుకొనుట ఈ పదముగ గమనింపవచ్చును

శ్రీ కృష్ణుడు లీలా మానుష విగ్రహుడు ఆయన లీలలను పోతన గారు మధురముగ వర్ణించినారు పై పదము నందలి భావములు భాగవతము నందలి భ్రమర గీతలను తలపించుచున్నవి

మ. భ్రమరా। దుర్జన మిత్ర। ముట్టకుము మాపాదాబ్జముల్ నాగర
ప్రమదాళీ కుచ కుంకుమాంకిత లసత్ప్రాణేశ దామ ప్రసూ
న మరందారుణితాననుండ వగుటన్ నాధుండు మన్నించుగా
క మమున్నేపుచు బౌర కాంతల శుభాగారంబులన్ నిత్యమున్ (62)

పై పదము నందలి పల్లవి మొదలు కొని రెండు చరణములు పోతన గారి పై పద్యమును బోలి యున్నవి అట్లే మూడవ చరణము ఈ క్రింది పద్యమును బోలియున్నవి.

ఒక పువ్వందలి తేనె ద్రావి మధుపా। యుత్సాహివై నీవువే
ఱొకటిం బొందెడి భంగి మన్మధర పీయూషంబునం దేల్చి మా
యకలం కోజ్జ్వల యవ్వనంబు గొని యన్యాసక్తుడయ్యెన్ విభుం
డకటా। యాతని కెట్లుదక్కె సిరి మిథ్యాకీర్తి నమ్మెన్ జుమీ।

ఇట్లు గోపికలలో వివాహితలైన స్త్రీలతో బాటు అవివాహిత లైన కన్యలు గూడ నుండిరి ఒక్కవ్రేపల్లెలోనే కాక మధురా నగర యువతులును శ్రీకృష్ణుని మోహించిన వారే మధురలోని కుబ్జయను కురూపియును పరకీయయే. ఆమెను కన్యగా నెంచవచ్చును. అట్టి కురూపిని సురూపిగా చేసి, ఆమె గృహమున కేగి ఆమె కోరికను దీర్చి తరింప జేసిన దక్షిణ నాయకుడు శ్రీకృష్ణుడు అట్టి వాని దివ్య శృంగార లీలలను తన పదరచనల మూలమున వర్ణించిన మహానుబావుడు అన్నమయ్య వర్ణించినది గోపికా శృంగారమైనను వారిని తరింపజేసినవాడు శ్రీ వేంకటేశ్వరుడే నని అన్నమయ్యగారి బావన. అందుకే గోపికలు ఉద్ధవునితో ''చెల్లించె మా ప్రేమ శ్రీ వేంకటేశుడు'' అని ఉల్లమలరగ చెప్పుకొనినారు

''నాయిక పరకీయ అయిననే గాని ప్రేమ ఉదయించదు'' అని ఉద్ధవానంద దాసు (1800 క్రీ శ) అనే బెంగాలీ కవి తన ''రాధికామంగళ్'' అను కావ్యమున అభిప్రాయపడినాడు (63)

''పరకీయా వినెప్రేమ నాహయ ఉదయ
సతత జాహరె దిఖ ఏక గ్రామవాసే''

ఇవి శ్రీ కృష్ణుడి చేత ఉద్ధవానంద దాసు అనిపించిన మాటలు

ప్రరకీయ వినా ప్రేమ ఉదయించదు. ఒకేవూళ్ళో ఉండి ఎల్లప్పుడూ చూస్తూంటే అనురాగం ఎక్కడుంటుంది అంతరించక'' (64)

కనుక ''దివ్య శృంగార విషయమున పరకీయా, సామాన్యలకు ప్రవేశమే లేదు'' (65) అనునది సరి కాదని చెప్పవచ్చును. మొత్తము మీద ఈ పరకీయ నాయికలందరును (గోపికలు) ''లక్షితలు'' గా గుర్తింపవచ్చును అనగా తమ పరపురుషాను రాగము ఇతరులచే కనిపెట్టబడిన వారిన యర్థము

## దూతి – సఖి

ఇప్పటి వరకు ''విప్రలంబ శృంగారము'' విభాగమున నాయిక నాయకుల శృంగారాద్యవస్థలు ఆయా పదముల యందలి ''మధుర భక్తి'' వివరిపబడినవి.

ఇంక నాయిక సహాయురాలగు దూతీ ప్రసక్తి గల అన్నమాచార్యుని కీర్తనలను పరిశీలింతము

దూతీ లక్షణములు -

1 దూత్యవ్యాపార పారజ్ఞతా దూతీ

తస్యాస్సంఘటన విరహ నివేదనాదీని కర్మాణి - రసమంజరి

2 విశ్వాస విశ్రామ కారిణీ పార్శ్వ చారిణీ సఖీ

అస్యా మండనోపాలంభ శిక్షా పరిహాస ప్రభృతీ కర్మాణి - రసమంజరి

దూతికా భేదములు -

1 దాసి, సఖియును, దాది, కారువును

భాసిలు పొరుగింటి వన్నెలాడియును

లింగిని శిల్పిని లేమ చుట్టాలు

రంగుగ సైదోడు రమణులు వీరు (66)

వీరు నాయకుననుకూల పరచుట యందు నాయిక కెంతయు చేదోడు వాదోడుగ నుందురు. నాయిక తనకుతానే యుక్తి ప్రాబల్యముతో దౌత్యము నడుపు కొనుటయు గలదు

ఆంధ్ర ప్రతాప రుద్ర యశోభూషణము (తెలుగు)

2. దూత్య సఖీ నటీదాసీ, ధాత్రేయీ ప్రతివేశినీ
బాలా ప్రవ్రజితా కారూః శిల్పి న్యాద్యాస్స్వయా తథా

- కావ్యాలంకార సంగ్రహము

నాయికా సహాయులకు పేర్లేవి యున్నను. వారందరును చేయవలసిన కార్యమొక్కటియే నాయికా సందేశమును నాయకున కందించుట ఇరువురి నడుమ ప్రేమ రాయబారము నడుపుట సంది గూర్చుట మొదలైన శృంగార సంధాన క్రియ కొన్ని యెడల నాయిక తన నేర్పుచే తానే దౌత్యము నడుపుకొనుటయు జరుగును

అన్నమాచార్యుని కీర్తనలలో దూతీ ప్రమేయమున్న కీర్తనలు కొల్లలు. అన్నమయ్య అధికముగ దూతీ కార్యము నిర్వహించును

దూత్యాదుల తోడను నాయకుడు శృంగారము నెరపుట జరుగుచుండును కనుక అన్నమయ్య స్వయముగ దూతియై సఖియై, దాసియై రాయబారము వంకతో స్వామి సామీప్య సాన్నిధ్యములను పొందుచు, తత్కాల సంభవమైన అనిర్వచనీయానందాను భూతిని ఆస్వాదించ గలుగు భాగ్యమునకు నోచుకొనును

కేవల సంధాన కర్తృత్వభారము వహించినపుడు దూతీ సంబంధ శృంగార మేమియు నుండదు కాని దూతి నాయకునితో సంభోగ శృంగారము నెరపి నపుడు ఆమె పరకీయ యగును కనుక దూత్యాదుల యందును మ.:కు పరకీయలు గోచరింతురు ఒక్కొక్కపరి నాయికా సహోదరియు దూతీ కార్యము నెరవేర్పవచ్చును.

ఇట్టి దూతీ ప్రసక్తమైన అన్నమాచార్యుని కీర్తనలు కొన్నింటిని నిరూపింతును

## దూతీ రాయబారం - పాడిరాగం 31-81

1 చెలికత్తె గనకను చెప్పకపోదు
కలవంటిది తలపు కడమలు సేతుర ||పల్లవి||

వువ్విళ్ళూర బిలిపించీ వూరకే నీవుండగాను
నివ్వెరగు తోడ నాపె నిలుచున్నది
యెవ్వరు మాటలాడించే రిద్దరు సిగ్గుపడేరు
పువ్వు వంటిది జవ్వనము పొద్దు గడుపుదురా ||చెలి||

పని వడింటికి వచ్చి పరాకు సేసు కుండగ
కనుచాకా మంచము సంగడి నున్నది
యెనయగ మిమ్మిద్దరిని యెచ్చరించే వారెవరు
గని వంటిది వేడుక కట్టిపెట్టవలెనా ||చెలి||

చేయి కాగిటికి చూచి చిరునవ్వుతో నుండగా
ఆయములు నిన్నంటుచు నాకె వున్నది
యీ యెడ శ్రీ వేంకటేశ యిద్దరి మెచ్చనెవ్వరు
చాయవంటిది రతి రచ్చలవేయవలెనా ||చెలి||

ఇందలి నాయిక ముగ్ధ మిగుల లజ్జావతి నాయకుని పిలుపు మేరకు చెలికత్తెతో నాయకునింటికి అభిసరించినది. కాని సిగ్గులు మొగ్గలైనవి నాయకుడును మొగమాటము గలవాడుగ తోచుచున్నాడు. కాలము గడచుచున్నది ఎవరును ఉలకరు పలుకరు ఈ స్థితిని గమనించిన చెలికత్తె ఇద్దరిని హెచ్చరించినది వలపు సుందర స్వప్నము వంటిది దానిని పండించు కొనక తక్కువగా చూతురా। పిలిపించి ఊరకుండుట మంచిది కాదు. మిమ్ముల నెచ్చరించి కార్యరంగమునకు ఉన్ముఖుల చేయు వారెవరు? కౌగిలింతకు చేయి చాచగా అమె నిన్నంటుకొని నిలుచున్నది ఇకనైనా ఆమెను ఏలుకొనుము శ్రీ వేంకటేశా అనుచు చెలికత్తె నాయకుని వేడుకొనుచున్నది

ఇందు దూతి కేవలము సంధానకర్తగనే యున్నది తన విధిని తాను నిర్వర్తించినది దూతిగ వ్యవహరించిన వారు అన్నమయ్యాయే. ఆ విధముగ దివ్య దంపతులకు దాసియై స్వయముగ సేవించి తరించినాడు

చెలికత్తెగా వెళ్ళిన పడతికి నాయకుని తోడి శృంగారము నెరప వలెననెడి కోరిక యున్నది అయన అతిలోక సౌందర్యవంతుడు సాక్షాన్మన్మథ మన్మదుడు గదా। అట్టి ఆది దేవుని తోడి ఐక్యమును కోరని ప్రపన్నుడెవడుండును. కాని నాయికతో సమానముగ చెలిమి కత్తెను మన్నించిన ఆమె ఊరకుండునా। ఎట్లు దండించునో। మనసు ముందునకుసిగ్గువెనుకకు అనునట్లున్నది ఈ క్రింది పదము నందలి దూతీ అవస్థ

## శుద్ధ వసంతం 20-25

2. వలపు కొలది గాదు వద్దు వద్దయ్యా
చెలికోపగించుకొంటే సేసేదేమయా ||పల్లవి||

వూడిగపు దాన నన్ను వొడి వట్టి తీసేవు
యీడ నీ పట్టపు దేవి యేమి సేసునో
వేడుక యీ వేళ నైతే వెనక నాపె చిక్కించు
కేడనైనా బరచగ నేమి సేసేవయ్యా ||వలపు||

దూతిక నింతే నేను తొడికేవు నా చన్నులు
కాతరించి నన్నెంత నీ కాంత దూరునో
యేతులిప్పుడు సేసితే నింటికాడ వచ్చియాపె
చేతులు చాచ వచ్చితే నేమి సేసేవయ్యా ||వలపు||

పరిచారకపు వాన బైకొని నన్నేలితివి
యిరవైన మగువ నన్నెట్టు నవ్వునో
సరుస శ్రీ వేంకటేశ చలివాసి యిక నాపె
గరిసించితే మరి గతి నీవే అయ్యా ॥వలపు॥

ఒకవంక స్వామి అనుగ్రహమునకు పాత్రురాలు కావలెననెడి తీవ్ర వాంఛ. మరియొక వంక అమ్మవారు ఏమనునో యనెడి అమిత భయము. రెండును ముప్పిరిగొన్న మనమున వెనుక ముందులాడుచున్న చెలికత్తెను శ్రీ వేంటేశుడు కరుణా కటాక్షములచే ఏలినాడు ఇదియే ఆమె సేవలకు ఫలము అన్నమయ్యగారి భక్తి పొలము పండినది పంట చేతికి అందినది తాదాత్మ్యము ననుభవించినాడు

## 3. దేసాళం 20-32

నేమటువంటి వారమా నీ వెరగ వింతె గాక
దేమటు ఎందైనాను దొడికేవు గాక ॥పల్లవి॥

నాయిక పనుపు మీద చెలికత్తె నాయకు నింటికి వచ్చినది సందేశము వినిపించుచుండగ కొంగు పట్టినాడు నాయకుడు విడెమందియ్యబోగా కాలుదొక్కి కౌగిలించినాడు. మరొయొక సారి అక్కతో కలిసి అయనింటి కేగగా ఏకముగా పెండ్లియే చేసికొనినాడు ఇవి అన్నియును ఆయనకు పాతలయలవాటులట గొల్లెతలను దొడికిన వాడు రుక్మిణిని ఎత్తుకొని పోయి పెండ్లి చేసి కొననవాడు ఇద్దరిని పెండ్లి యాడిన వాడు కదా అయన అందులకే వీరు వారని చూడక తన వద్దకు ఏ వంకతో వచ్చినను వారినందరను కరుణించు కళ్యాణ గుణ ధాముడైన శ్రీ వేంకటేశ్వరుని ఆశ్రయించి నాడు అన్నమయ్య

''బాంధవమున నైన బగనైన వగనైన
బ్రీతినైన బ్రాణ భీతినైన
భక్తినైన హరికి బరతంత్రులై యుందు
జనులు మోక్షమునకు జనుదు రదిప'' (67)

అని బాగవతమున పోతన శుక మహర్షి చే పరీక్షిన్నరేంద్రునకు చెప్పించెను.

## సౌరాష్ట్రం 14-232

4. ఇదివో నీదొరతనము ఏటిదయ్యా
అదనాయ నేనేమైనా నాడ జెల్లునయ్యా ||పల్లవి||

నాదిక్కు చూచేనాపె నవ్వి తలవంచేవు
యీదెస నీ జాణ తన మేటిదయ్యా
అదిగో నాపె దూతికనై వచ్చితి నీ వద్దికి
పోదుగా నన్నింత సేసి పర్వాకైతి వేమయ్యా ||ఇదివో||

మచ్చాలు వేసీ నాపె మాటలాడేవు నీవైతే
ఇచ్చట నీ జాణ తన మేటిదయ్యా
నెచ్చెలింటికి రమ్మంటే నీవు నన్ను ముట్టితివి
అచ్చలాన గుట్టుసెసే వదేమయ్యా ||ఇదివో||

వెల్లవిరిసేసీ నాపె వింతనీ జాణతనాలు
యిల్లిదె శ్రీ వేంకటేశ యేటి దయ్యా
తొల్లి యాపె గూడి జెల్లెల నన్ను గూడితివి
వుల్లసాన మెచ్చేవు నీవు పనిదేమయ్యా || ఇదివో||

ఇందలి నాయకుడు గొప్ప చాతుర్యము గలవాడు అక్కతో విచ్చేసిన చెల్లెలిని వశము చేసికొనినాడు చాటు మాటు నవ్వులు, మర్మపు మాటలు పొగడ్తలు వీనితో సఖిగా వచ్చిన యాపెను కూడినాడు దూతికయే చెలికత్తె. ఆమెయే చెల్లెలు ముందు నాయికతో సంపర్కము కలిగిన నాయకుడు ఆమె సహాయురాలిని కూడ అనుగ్రహించినాడు

జాణయైన ఒక చెలి నిజముగ నాయకురాలి దాసి ఆమె తన తెలివితేటలతో నాయకుని వశపరచుకొనినది నవ్వుల మాటల్కు తాంబూల సమర్పణము, పాద సంవహనము మొదలైన వానితో నాయకుని కూడ గలిగినది. నాయిక మగని దూరినపుడు చెలికత్తెగా వారి సంభాషణల్ కల్పించుకొని మాటాడినదట నాయిక కౌగిలిలో నున్న నాయకుని పాదము లొత్తినదట శ్రీ వేంకటేశుడే నాయకుడు. అలమేల్మంగయే నాయిక ఆమె చెలి చేష్టలను గమనించినది ఈర్ష్యామాన యైనది చెలిని మందలించినది ఐన నేమి! శ్రీ వేంకటేశ్వరుడు అలమేల్మంగతో పాటు ఈ తెరకత్తెను గూడ ఏలినాడు

## 5. దేసాళం 20-497

ఏకాంతము గదుర మనకిద్దరికిని
దాకొని యీమేలు నీవు తలచుకోవయ్యా ||పల్లవి||

కోమలి పెట్టి పంపిన గురుతు కానిక నీకు
యీ మరగున నిచ్చే నిటు రావయ్యా
నీమేన కస్తూరి యిది నిండా నన్నేపూయుమనె
దీమసము నెరపక తెర వేయించవయ్యా ||ఏకాంత||

వొట్టి తన మారు పాదాలొత్తుతా నన్నుండు మనె
పట్టి మంచము మీద పరుండవయ్యా
జట్టిగా నీ మోవి పండు చవి చూచి రమ్మనె
యెట్టిదే చూతము మొగమెత్తగదవయ్యా ||ఏకాంత||

యెల యింపించె శ్రీ వేంకటేశ నాచే నీ దేవులు
అలమేల్మంగ మతక మంతానాయ్యా
అలరి కాగలించితి మందు కేమి మెచ్చాయ
చెలపటిక ఏలికసాని గూడవయ్యా ||ఏకాంత||

ఈ పాదము నందలి దూతీ వ్యాపారములు, వ్యహారములు అన్నియు అలమేల్మంగ యెఱిగినవే అందుకే తాను వచ్చులోపల తన పతిని సెవింపు మని చెలిని పంపినది ఆమె నాయకుని జెరి చేయ వలసిన సేవలు చేసి ఆయన సంసర్గము నందినది తిరిగి తన ఏలిక సానిని కూడ ఏలుకొనమని నాయకునికి విన్నవించినది

అన్నమయ్య స్వయముగ చెలికత్తెయై అలమెల్మంగ యొక్క ఆదేశమును పాటించినాడు. స్వామిని తనివిదీర సెవించినాడు మనసును శ్రీ వేంకటేశ్వరుని యందు లగ్నము చేసి తాదాత్మ్యమును పొందినాడు ఆ ఆది దంపతుల అనుగ్రహమునకు పాత్రుడైనాడు.

## 6. పాడి 31-56

కలకాల మిందులకె కాచుకొంటివా
చెలికత్తెవైనానేమి సిగ్గు దెచ్చుకొంటివే ||పల్లవి||

చెక్కులపై చెమటలు సెలవుల నగవులు
యెక్కడ నుండి వచ్చెనే ఇంతలో నీకు
చొక్కపు నాపతి బిలుచుకరా వంపితి నింతే
చక్కగ నిప్పుడె యెట్టు సందించు కుంటివే ||కలి||

మోవి మీది చెనకులు ముంగురుల చెదరులు
వేవేగ నమరె గదె వేడుక తోను
సోవల నాతని మై గస్తూరి పూయుమంటి నింతే
తావుకొని యెటువలె తగిలించు కొంటివే ||కలి||

నిలువున బులకలు నిట్టూర్పుల గములు
సులభాన నబ్బెగదె సొంపున నేడు
కలసే శ్రీ వేంకటేశు గాచుకుండు మంటినింతే
లలి జొట్టముగా నెటువలె జేసుకుంటివే ||కలి||

నాయికచే నాయకుని నాహ్వానింప నియోగింప బడిన చెలిమికత్తె తన వంపు సొంపులచే నాయకుని పొందు పొందగలిగినది. ఆమె తిరిగి రాకడలోని ఆలస్యమునకు కారణమూహించినది నాయిక. దానికి తగినట్లు చెలికత్తె చెక్కులపై చెమటలు, సిగ్గుల తోడి నవ్వులు, మోవి గంట్లు చెదరిన ముంగురుల సొంపులు, కస్తూరి వాసనలు, నిలువున బులకలు, నిట్టూర్పుల గములు, ఒకటేమిటి సంభోగశృంగార చిహ్నములన్నియును కొట్టవచ్చినట్లుగా గోచరించినది. నాయిక ప్రౌఢ వెంటనే పసికట్టేది. చెలికత్తెను నిలదీసినది. ఏది ఏమైననేమి? ఎవ్వరేమనుకొనిన నేమి? శ్రీ వేంకటేశ్వరుని తోడి ఐక్యమును అనుభవించిన చెలి ధన్యురాలు.

## 7. పాడి 25-455

దూతికలకు నీతో పొద్దులు పుచ్చదగునా
నీతిగాదు యీడనుండే నిందవచ్చు జామ్మీ ||పల్లవి||

యేమని చెప్పుదు నేను యింతితో మారుమాటలు
నేమాన నన్ను నంపవు నీవును రావు
కోమలినే రమ్మందునో కొంత వోరుచుమందునో
జామువోయె నంపరాదా చాలుజాలు తడవు ||దూతి||

నేను వచ్చిన పనికి నెఱతకుత్తర మేది
పూని నాచేయి విడువవు పొందుగానము
నీ నవ్వులు నెరపెవో నిజము నట్లనో
కానీలె మమ్మంపరాదా కడు చలమేటికి ||దూతి||

అంతే కాదా ఆ పెతోడి ఆడుకొలు మాటనీకు
ఇంతి వాకిట నిలచేవేమో నవ్వేవు
పంతాన శ్రీ వేంకటేశ పడతి గూడితి విట్టే
పొంతనె మమ్మంట రాదా పొసగే మాపనులు ||దూతి||

నాయిక పనుపుపై వచ్చిన దూతిని మాటలలోనికి దింపి ''పొద్దులు పుచ్చు'' చున్నాడు నాయకుడు ''స్వామీ! నీవు రాక నన్ను పంపక జాములు గడిపినచో అపనిందల పాలుగాక తప్పదు ఆ పెనే నీ వద్దకి రమ్మందువా లేక మరి కొంత తడవు విరహము సైపమందువా? ఆమె సందేశమునకు నీ సమాధానమేది? ఎంతకును నా చేయి విడువవేమి? అట్లు నవ్వుచు చూచెదవేమి''? ఇట్లు ప్రశ్నించిన దూతి ప్రశ్నలకు సమాధానముగ స్వామి స్వయముగ ఆమె నబిసరించి నాయిక ఇంటికి రానే వచ్చెను ఇంక నా పని యైనది పంతముతో పడతిని ఆయన కూడినాడు

దూతి సెవ ఫలించినది నాయిక మనోరథము తీరినది మధుర బక్తుడైన అన్నమయ్య జన్మ చరితార్థమైనది.

ఇంకను దూతీ ప్రసక్తి గల ఈ క్రింది సంకీర్తనలు పరిశీలింపదగినవి.

1 అంతె కాదా వుప్పు వేసి అట్లె పొత్తు గలసేవు
వింత లాయ నీవు నొక వినోద కత్తెవు 20-496

2 ఇదివో నీ సుద్దులెల్ల నిటువంటివి
మదమున నీతో మారు మలయగ గలనా 31-137

డా వేటూరి ఆనందమూర్తిగారిచ్చిన దూతీ ప్రసక్తి గల సంకీర్తనలు

1 ఎండాక నీ సిగ్గులేటికి బెంచేవు
పొందులు దొరకెను బోగించ రాదా 17-547

2 పిలిచీరాగవవే ప్రియుడు నిన్ను
బలిమి చేసినంతనే పనులెల్ల దక్కునా 13-363

3 ఏల వెరచేవు నీవు యిదిగో నీ పతి వచ్చె
జాలివాయ నిన్ను గూడి సంతస మిచ్చేవి 13-324

4 అందాకా గాగిన నిన్ను ననరాదుగా
పొందిక లైన మీద బుద్ధి చెప్పేగాని 17-483

ఇట్లు దూతీప్రసక్తమైన సంకీర్తనల యందంతటను రాయబారము నడిపి అమేల్మంగా వేంకట నామల ప్రణయ సంధానుకర్తగా అన్నమాచార్యుడే వ్యవహరించెను నాయిక యొక్క విరహమును నివేదించుటలోను, నాయక ప్రవర్తనమును ప్రేమను నాయికకు వివరించుటలోను, నాయికకు హితము నుపదేశించుటలోను, నాయికకు మారుగా నాయకుని అలరించుట యందును, సేవించుట యందును దూతీ పాత్ర అత్యంత ప్రాధాన్యము వహించుచున్నది ఇది లౌకిక విషయము పార మార్థిక మైన విషయము మరియొకటి గలదు

శ్రవణం, కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్

అను బాగవత వచన ప్రకారము దాసీ కార్యము చేయుటచే మోక్షము పొందవచ్చుననెడి సులభోపాయము నెఱింగిన భక్తులు, పదకర్తలు నైనచో స్వయముగ నిట్టి దూతీ కార్యము నెరవేర్చుటకు పూనుకొని కృత కృత్యులగుదురు అన్నమయ్యగారు పైన తెలిపిన నవ విధ భక్తి మార్గముల నన్నింటిని అవలంబించి తరించినాడు

## చతుర్విధ నాయికలు (కామ శాస్త్రము)

చేష్టావిశేష బెదములచే నేర్పడిన అష్టవిధ నాయికలు దక్క అలంకార శాస్త్రములు యందెవరును కామశాస్త్రములందు ప్రవచింప బడిన హస్తిన్యాది చతుర్విధనాయికలను గూర్చి చెప్పలేదు కాని తాళ్ళపాక అన్నమాచార్యుడు ఈ చతుర్విధ నాయికల గూర్చియు వర్ణించెను అయితే అక్బరుషా అనునామాంతరము గల బడే సాహెబ్ అను నాతడు రచించిన "శృంగార మంజరీ" అను అలంకార గ్రంథ కారుడు ఈ నాయికల గురించి పెర్కొని ఉదహరించినాడు " ఇతడొక్కడే ఈ భేదముల గూర్చి తొలుత ప్రస్తావించిన అలంకారికుడు

''శృంగార మంజరీ గ్రంథము చివర హస్తిన్యాది భేదము లను గూర్చి వివరించినాడు. అదియే ఈతని అలంకార గ్రంథము నందలి ప్రత్యేకత. ఈ యంశమును గురించి వివరించుచు డా. వి. రాఘవన్‌గారు శృంగార మంజరీ పీఠికలో ఇట్లు వివరించినారు.

"The author of the Sringaramanjari" syas at the begining, where he sets forth his method treatment and the topics to be dealt with by him, that one of the special features of his work is the description of the varieties of woman called "Padmini" etc., which the previous treatises on the subject of Nayaka-Nayaki enumarated by him earlier do not deal with (పూర్వోక్త గ్రంథ అవర్ణిత పద్మిన్యాది జాతయః పుట2)

Accordingly, at the end of the work (pp 54-55) he speaks of these four classes of women. He says that so far he has been deeling with the varieties of "NAYIKAS" as dealt with in the "Rasamanjari" on the basis of different kinds of moods and reactions in love and that now he would deal with a classification of both Nayika and nayaka by gunas, following the views of Vatsayana.

'' ఏతావత్ పర్యంతం రసమంజరీ యానుసారేణ చేష్టావిశేషభే దేన నాయికా భేదా నిరూపితాః ఇదానీం వాత్స్యాయన మతాను సారేణ గుణైర్హస్తిన్యాది నాయికా భేదాః భద్రాది నాయకా భేదాశ్చ నిరూప్యంతే'' (81)

ఇంక నిట్టి హస్తిన్యాది నాయిక గుణ భేదములు నరయుదము. ఈ నాయికా బెదములను కామ శాస్త్రములే నిరూపించుట చేత వీరి శృంగార సంబంధ గుణములే ఇట ముఖ్యములు.

రతి రహస్యమను గ్రంథమున హస్తిని యొక్క లైంగిక గుణభేద ములను వివరించుచు ఈ జాతిస్త్రీలు కేశ సంపద అధికముగా గల వారనియు విశాలమైన పెద్దవైన రహస్యా వయములు గలవారనియు తెల్పబడినది. మరియు సంభోగ విషయమున తృప్తి పరచుట మిక్కిలి కష్టసాధ్యమనియు తెలుపబడినది. దీనిని వివరించుచు డా. రాఘవన్ గారు "Having and very broad private parts; very difficult to gratify sexually' అనినారు (32)

అరక్తే నయనేక చాశ్చ కుటిలాస్స్వాత్వాచ వృత్తైస్తనౌ
దీర్ఘంచాంఘ్రియుగం తనుశ్చన తనుః ప్రేమత్వరా చేత్కటా
నైశాద్యః ప్రహారే రతేర్ద్రవ వతీ భూషాంబరే చారుణే
యశ్చాక్షిక్త కటూష్ణ భోజనరతా సాకోపనా హస్తిణీ (83)

అన్నమాచార్యుడును ఈ క్రింది సంకీర్తనలో హస్తిన్యాది జాతులను వర్ణించుచు

కుందణంపు మై గొల్లెత తా
నెందును బుట్టని యేతరి జాతి
కప్పులు దేరెటి కస్తూరి చంకల
కొప్పెర గుబ్బల గొల్లెతలెల్ల
చప్పుడు మట్టెల చల్లలమ్మెడిని
అప్పని ముందట హస్తిణి జాతి ||కుంద|| 12-92

కస్తూరి పూతలతో నీలికాంతుల నీను బాహ మూలములు కలదనియు, కొప్పెర గుబ్బలు గలదనియు, హస్తిణి జాతిస్త్రీగా గొల్లె తను గూర్చి వర్ణించినాడు.

అట్లే చిత్తిణి జాతి గూర్చి డా రాఘవన్ గారు ఇట్లు వివరించినారు రతిరహస్యమున "Private parts soft rotuned, bloated and not very hairy . loves external sport embrace kissing etc" (84)

శృంగార మంజరీ కారుడు యిట్లు వివరించినాడు.

శ్లో లోలాక్షీ ప్రియవక్త్ర వీక్షణపరా కుంబస్తనీ నీచవాక్
దీర్ఘోష్ఠీ బహువాదినీ ఘన తర శ్రేణీ మృషా బాషిణీ
చిత్రాస్వైక రుచిర్హ్వో చిత్ర సురతాయామే ద్వితీయానిశః
చిత్రాలంకృతి రంత్సుకా పరిమళే చిత్రాంబరా చిత్రిణీ (85)

తాళ్ళపాక వారు రతి రహస్యమందలి ఒకటి రెండు లక్షణములను మాత్రమే గ్రహించినట్లు తోచుచున్నది

దుంప వెండ్రుకల దొడ్డ తురుముగల
గుంపెన నడపుల గొల్లెత
జంపుల నటనల జల్లలమ్మెడిని
చెంపల చెమటల చిత్తిణి జాతి ||కుంద|| (12-92)

ఇంక శంఖిణి జాతిస్త్రీ గురించి రతి రహస్యమున .-

చిర చిర లాడెడు చిత్తము గలిగి, సంభోగ చిహ్నములైన నఖక్షతములు గలది మదన తాపము తోడి కోపము గలదిగా చెప్పబడినది.

దీనినే డా॥ రాఘవన్ గారు ఆంగ్లమున నిట్లు వివరించిరి

Scratches with nails in enjoyment, heated and bilions constitution, having a voice of an ass Irascible feat (86)

శృంగార మంజరీ కారుడు ఇట్లు వర్ణించెను

''తన్వంగీ కరినస్తనీ స్మిత శుభాలాపా సుమధ్యాదృఢ
ప్రేమారత్కకరా సునీలవసనా నీలాశ్మభూషావతీ
స్వల్పాహార రతిర్నిశిప్రియ రతిర్యామే తృతీయోశుభా
కాంక్షా కంఠముఖర్యమత్ర దధతీ ప్రోక్తా బుధైః శంఖిణీ (87)

రతి రహస్య లక్షణమునకు శృంగార మంజరీ లక్షణములకును రెండు ముఖ్యమైన విషయములందు బేదము గోచరించుచున్నది నఖక్షతములు, మదన తాపము తోడి కోపము అనువానికి పోలికలు లేవు

కాని ఈ విషయమున అన్నమాచార్యుడు రతి రహస్యము ననుసరించి నట్లు తోచుచున్నది ఆయన శంఖిణీ గూర్చి వర్ణించుచు ఇట్లు చెప్పినాడు

వీపున నఖములు వెడ వెడ నాటిన
కోపపు జూపుల గొల్లెత
చాపున కట్టిగ జల్లలమ్మెడిని
చాపేటి యెలుగున శంఖిణీజాతి ॥కుంది॥ 12-92

చతుర్విద నాయికలలో చివరగా పద్మినీ జాతి నాయికాలక్షణములు రతి రహస్యమున నిట్లు చెప్పబడినవి '' అంకిత భావము గలిగినది, లజ్జావతియైనది, ఆత్మ గౌరవము గలది''

దీనినే డా॥ రాఘవన్ గారిట్లు వివరించిరి. "Devout, lashful preserves her self respect" (88)

స్మేరేందీ వరలోచనా సువదనా రక్తాంఘ్రి హస్తాఘన
శ్రేణీ పీనపయోధరా మృదు తనుర్ముక్తామణీ మండనా
మధ్యోద్భాసివళిత్రయా కుశల సన్మధ్యా సువక్రాలకా
స్వర్ణాంగీ మృదు భాషిణీ మధుర భుక్శుభ్రాంబరా పద్మినీ (89)

అనుచు మరియొక శ్లోకమున నిట్లు చెప్ప బడినది.

కుందా భద్రన్యాశ్చంపేయ నాసికాయాశ్చతుర్ధకే
యామేనిశాయాస్సురతం పద్మిన్యాస్సముదా హృతం (90)

అన్నమాచార్యుడు ఈ లక్షణము లేవియును చెప్పక ఒక్క అంకిత బావమును మాత్రముటంకించెను

''గారవమున వేంకటపతి కౌగిట
కూరిమి బాయని గొల్లెత
సారెకు నతనితో చల్లలమ్మెడిని
బారపు టలపుల పద్మిని జాతి'' 12-92

పై కీర్తన యందలి నాయిక గోపిక యని వేరుగ చెప్ప బనిలేదు అన్ని జాతుల లక్షణములు (ముఖ్యమైనవి) ఒక్కతె యందు ఆరోపింపబడి చెప్పబడినది ఆమే యె జాతిదైనను చివరకు శ్రీ వేంకటపతి కౌగిట కూరిమి బాయని నాయికగా వర్ణింపబడినది. అన్ని లక్షణములు కలది కావుననే యామె నాయకుని ఆదరమునకు పాత్రురాలైనది ఇట్టిదె మరియొక కీర్తన.

## ఆహిరి 12-123

అన్ని జాతులు తానె యై వున్నది
కన్నుల కలికి మాయ గరచెనో యనగ ||పల్లవి||

కన్ను శంఖిణి జాతి గాబోలు వీపునను
సన్నపు మదనాంకములు జడిగొన్నవి
వన్నెలుగ వగరాజు వలపు తలకెక్కించ
పన్నినటు వంటి సోపానములో యనగ ||అన్ని||

తెఱవదల పోయ చిత్తిణి జాతి గాబోలు
నెఱులు విచ్చుచు వీధి నిలుచున్నది.
నెఱతనము మరుడు తను నిండ నేసిన యంప
గతులిన్నియని లెక్కపెట్టు గతిని
కాంత హస్తిణి జాతి గాబోలు కరమూలము

ఒంత కంతకు నలువులై యున్నవి
పంతంపు మరుడు తన బందార మిండ్లకును
దొంతిగా నిడిన కస్తురి ముద్రలనగ ||అన్ని||

ఘనత పద్మిణీ జాతి గాబోలు నీలలన
తనువెల్ల పద్మ గందం బైనది
మినుకుగా మరుడు తామెర లమ్ములనె మేను
కనలించి వడి బువ్వుగట్టినో యనగా ||అన్ని||

ఇదియు జగదేక మోహిని దాని కాబోలు
కదలు కనుగవ కెంపు గలిగున్నది
వదలకిటు వేంకటేశ్వరుని కుంకుమపూత
చెదరి చెలి కనుగొనల జిందెనో యనగా ||అన్ని||

ఈ కీర్తన యందు మోహిని యను మరియొక జాతిస్త్రీని కూడ అన్నమాచార్యుడు వివరించినాడు ఇది ఇంతవరకు ఏ లక్షణ కారుడును పేర్కొనని జాతి. ''కనుగవ కెంపు'' గలిగి యుండుట మోహిణీ జాతిస్త్రీ లక్షణముగ వర్ణింపబడి యున్నది

శంఖిణీ జాతి వనిత వీపున గల నఖక్షతములను తలకెక్కించుటకు వలరాజు పన్నిన సోపానములు గను, చిత్తిణీజాతి తెలివ కేశములు మరుడు సంధించిన అంపగతులుగను, హస్తిణీ జాతి కాంత కరమూల రుచిని మరుడు దొంతులుగా నేర్పరచిన కస్తురి ముద్రలు గను పద్మిని జాతి లలన కలిగియున్న పద్మ గంధమును మరుని తామర పూవుటమ్ములు గను ఉత్ప్రేక్షించుట మనోహరముగ నున్నది

చివరగా మోహిని కనులకెంపును శ్రీ వేంకటేశ్వరుని కుంకుమ పూత చెదరి కనుల చిందిన దానిగా నుత్ప్రేక్షించుట మరియు హృద్యముగ నున్నది ఇన్ని రకముల ప్రత్యేక లక్షణములు గలిగి శ్రీ వేంకటేశ్వరుని సేవించుట చేతనే యామెకు ఆయన సాన్నిధ్యము లభించినది

ఈ పై రెండు కీర్తనలను డా. వేటూరి ఆనందమూర్తిగారి వరకేస్థాలీపులాకన్యాయమున ఉదహరించి చూపినారు (91)

ఈ క్రింది కీర్తన యందు చిత్తిణీ జాతి లక్షణములు మరి రెండు చెప్పబడినవి

పాడి 28-171

చిత్తిణీ గుణము తోడ జెనకీ నిన్ను
హత్తుక అడుగవయ్య ఆపె పేరు నీవు
ఇద్దరము బండుండగ యెవ్వతో సొరణ గండ్ల
వొద్దిక దామర కామ నొరసీ నిన్ను
కొద్ది మీరగా చిమ్మన గోవిని బన్నీరు నించి
అద్దుకొన జిమ్మవయ్యా ఆపె మీద నీవును ||చిత్తిణీ||

నెయ్యపు వేడుక తోడ నీవు నేను మాటాడగ
పయ్యాడి అవ్వల నుండి పాట వాడేని
కొయ్యతనపు మాటల గూరిమితో నొట్టువెట్టీ
నెయ్యాన బిలువవయ్య నీవు నీడ కాపెను ||చిత్తణీ||

అలమేలుమంగ పతివైన నీ తోనే నవ్వగా
తలుపు దెరువు మని తట్టీ జేతులా
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నన్నునిట్టె
కలవవయ్య ఆమెను కామించివున్నది ||చిత్తిణీ||

చిత్తిణీ జాతి లక్షణములు వివరించుచు రతిరహస్యమును ఆంగ్లమున ఉదహరించుచు డా॥ రాఘవన్ గారు "Loves external sports, embrace, kissing etc " అని వ్రాసినారు ఈ విషయము నీ వరకే చెప్పియుంటిని అట్టి కామ ప్రేరకములైన బాహ్య చేష్టలు ఇష్టపడునది చిత్తిణి అట్టి యామెను దగ్గరగా హత్తుకొమ్మని ఒక నాయిక స్వామికి నివేదించుచున్నది.

ఒక నాయికతో స్వామి పరుండి నపుడు ఈ చిత్తిణి అటకు వచ్చి ''తామర కాడతో'' ఆయనను తట్టుచున్నది. ఈ విషయము నాయిక గ్రహించినది చిమ్మన గోవితో ఆమె శరీరమును పన్నీటి మయముగ చేయమని ప్రోత్సహించినది పన్నీరు చిమ్మమని కోరుచున్నది నాయిక. ఈమెకు సుగంధ ద్రవ్యములనిన మిగుల నిష్టము. శృంగార మంజరీ కారుని వివరణ స్మరణీయము ''చిత్రాలంకృతి రుత్సుకా పరిమళే చిత్రాంబర చిత్రిణీ'' ''తామర కామనోరసీ'' అన్నపుడు అన్నమయ్య గారు అన్యాపదేశముగ చిత్తినీ లక్షణమైన ''సన్నదనమును''

నాయిక దేహమునకు కలిగించినారు తామర కాడ సన్నముగా నుండును చిత్తిణి సన్నని ఒక్కపలుచని శరీరము కలది ఇటు రాఘవన్ గారి వివరణ ఇట్లున్నది చిత్తిణి జాతి యొక్క Physical features గూర్చి రతిరహస్యమున గలవానిని తెలుపుచు "Graceful gait, neither the tall nor too short, slim" అని ఉటంకించినారు

ఇచట Slim అనగా సన్నని, ఒక్కపలుచని అని నైఘంటికార్థము (92) తామర కాడ వంటి సన్నని తన దేహముతో నిన్నొరసి కొనుచున్నది ఆమె ననుగ్రహింపుము అను నాయిక నివేదనము గ్రహింపవలెను

ఇంక రెండవ చరణమున వారిరువు మాటాడు చుండ నీచిత్తిణి పాటలు పాడుచున్నది ఆమెను సన్నిధికి పిలుచు కొమ్మని నాయిక కోరుచున్నది చిత్తిణి జాతి అభిరుచులను తెలుపుచు (రతి రహస్యము ననుసరించి) Adept in and devoted to music, dance, painting etc" అని వివరించినారు (93) కాన ఈమెకు సంగీతాది లలిత కళలనిన ఇష్టమని తెలియుచున్నది. ఇతః పూర్వముదహరించిన కీర్తనలలో పేర్కొనని గుణములు ఈ కీర్తనలో అన్నమాచార్యుడు పేర్కొనినాడు చివరకేదొ యొకవిధముగ" ఆమెను కలియవయ్యా" అని నాయిక స్వామికి భక్తురాలి పక్షమున విన్నవించుచున్నది. అట్లు ఫలితము పొంద గలుగుటయే ఈ సంకీర్తన వలన ప్రయోజనము

బాహ్య చేష్టలనిన మిక్కిలి యిష్టములని కదా రతి రహస్యకారుని విరణ. భక్తునకు (నాయిక) బాహ్య శృంగార చేష్టలననేవి యను ప్రశ్నకలుగ వచ్చును. ఇటు బాహ్య చేష్టలన షోడశోపచారములుగా గ్రహింప వలెను. వీనిలో పాద సేవనము ప్రముఖ మైనది స్వామి సన్నిదిని ఉపవసించుట ముఖ్యమైనది. స్వామి విగ్రహములను ఆలింగనము చేసి కొనుట లేదా మనసున నించుకొనుట (రూపమును) ప్రధానమైనవి

ఈ క్రింది కీర్తన నాయిక స్వామికి చేసెడి ఉపచారములు చిత్తిణీ జాతికి పేర్కొనిన బాహ్య చేష్ట ప్రియత్వమును చాటుచున్నది.

## గౌళరాగం 31-24

ఎంత చిత్తిణోయిది నీయిత వెటువంటిదో
చెంత నున్న చెలులెల్లా శిరసులు వంచేరు ॥పల్లవి॥

చిన్ని చేతులనీ కొప్పు చెలరేగి దువ్వుతాను
చన్నుల నిన్ను నొత్తి జవరాలు
పన్నుక నీ వద్దనుండి పాదాలు గుద్దుతాను
సన్నలనే పొందొడల సాము సేసేని ||ఎంత||

యే పొద్దు చూచిన నీతో యేకతాలాడుతాను
రాపుగ నీ బుజము లొరసు కొనీని
తీపుల నీ మాటలకు తేరకొన నిన్ను జూచి
ఆపరాక మెచ్చి మెచ్చి అలము కొనీని ||ఎంత||

చెలరేగి నీ మేనెల్లా సింగారించు కొంటా
సొలసి మర్మము లిటె సోకించేని
అలమేలు మంగ పతివైన శ్రీ వెంకటేశ్వరా
యెలమి నన్నేలగా దానిచ్చేని విడెము ||ఎంత||

అన్నమాచార్యుడు రెండు కీర్తనలలో అన్ని జాతుల లక్షణములు వివరించి మిగితా కీర్తనలలో కేవలము చిత్తిణీ జాతి స్త్రీనే వర్ణించినాడు. బహుశః ''సేవాసక్తి'' యను మార్గమున నుండు పదతి కావునను ( బాహ్యా చేష్టా ప్రియత్వము) జీవేశ్వర సంబంధము ''సెవ'' వలననె దృడపడునది యగుట చేతను ఆయన తన్ను దాను ''చిత్తిణీ'' గా భావించు కొని యుండును

మరియొక కీర్తన యందును మనకు ''చిత్తిణీ'' జాతి నాయికయే దర్శనమిచ్చుచున్నది

## ముఖారి 31-373

నీ తలనే వేగనటే నెలత యీ సద్దులు
ఆతని ననేముగా ఆడువారు కరువా ||పల్లవి||

నగవొచ్చినప్పుడే నంటుకొన దిట్టేది
మొగము చూచి నంతనే మురిచేది
తగిలి వెనుకొంటినే తరితీపుసేసేది
జగతి జిత్తిణీ వారి సాజమింతేకా ||నీతల||

హస్తిన్యాది జాతుల లక్షణములు -

హస్తిని - స్థూలాధర, స్థూలనితంబబింబ, స్థూలాంగుళి, స్థూలకుచ, సుశీల, కామోత్సుక, గాఢరతిప్రియ, నిశాంత, భోక్త్రి అయినట్టి స్త్రీ - (సూర్యరాయాంధ్రనిఘంటువు)

శంఖిణం - నడుము కృశంబు పిన్న జఘనంబు కుచంబులు గట్టి వెంద్రుకల్
నిడుపుల్ గన్నులామెఱుగు నిగ్గులు కాంతకు వింత బొజనం
బడరు బ్రియంబు గోపము నయంబు సమంబులు దాన గొండెమే
ర్పడ వినురక్తపుష్పపట రాగిణి శంఖిని గానెఱంగుమీ.

పద్మిని - భవతి కమల నేత్రా నాసికా క్షుద్ర రంధ్రా
అవిరళ కుచయుగ్మా చారు కేశీ కృశాంగీ
మృదు వచన సుశీలా గీత వాద్యానురక్తా
సకల తను సువేశా పద్మినీ పద్మ గంధా - రతిమంజరి

చిత్తిణి - బవతి రతి రసజ్ఞానాతి ఖర్వాన ధీర్ఘా
తిలక సుమ సునాసా స్నిగ్ధ నీలోత్పలాక్షీ
ఘన కఠిన కుచాఢ్యా సుందరీ బద్ధశీలా
సకల గుణ విచిత్రా చిత్రిణీ చిత్ర వక్త్రా

- రసమంజరి

## నాయకులు

ఇంత వరకు అష్ట విధ నాయికలు వారు పొందెడి అవస్థలు అన్నమయ్య కీర్తనలలో ఎట్లు పొందు పరచబడెనో వివరించితిని శృంగార మన్నప్పుడు నాయికలతో పాటు నాయకులును ఉండవలెను కదా। సాహిత్య దర్పణకారుడు పురుషాధిక్యమునే ప్రకటించునట్లు కామావస్థలను నాయకుడే పొందుచున్నట్లు ఉదహరించెను.

మచ్చునకు చింత యనెడు కామావస్థను పొందినస్థితిని సాహిత్య దర్పణమున నిచ్చిన లక్ష్యము ''కదమీక్షేకురంగాక్షీం సాక్షాలక్ష్మీం మనోభువః ఇతి చిన్తా కులః కాన్తో నిద్రాం నైతి నిశీదినీం'' (40)

కాని మదుర భక్తి యందు నాయకుని విప్రలంబ శృంగారమునకు తావు లేదు ఇది నాయికా పరమైనది ముఖ్యముగ భక్తవరుల సంబంధమైనది భక్తులు తాము స్త్రీలైనను పురుషులైనను తమను తాము స్త్రీలుగనే భావించుకుని జగన్నాటక సూత్రదారియైన శ్రీహరిని ఆయన అవతారాదులను నాయకులుగా ఊహించి పూజించి, సేవించి దదేక ధ్యాన పరవశులై ప్రపన్నులై శరణాగతులై జీవన్ముక్తులగుట మధుర భక్తి లక్షణము.

కనుక నాయికా పరములైన పదములే అన్నమయ్య (పదములలో) రచనలలో మనకు గోచరించును నాయక భేధములగల లేక నాయక లక్షణములను ప్రకటించెడు కీర్తనములలోను నాయిక నాయకుని గుణ స్వభావాదులను తలపోసి చివర కాయన సాన్నిధ్యమును పొందుటయే మనము గమనింపవచ్చును. అట్టి కీర్తనలలో మనకు అలంకారికులు చెప్పిన చతుర్విధనాయకులు లభింతురు. వీరు దివ్యులు మాత్రమే. అనగా ధీరోద్ధతులు అని చెప్పవచ్చును.

చతుర్విధ నాయకుల లక్షణములను చెప్పుచు నాట్యశాస్త్రమున ధీరోద్ధత నాయకులకు ''దివ్యులు'' అని వివరణ ఈయబడినది.

కనుక అన్నమయ్య పదములలో దివ్యులైన నాయకలక్షణములనే సోదాహరణముగ నిరూపింతును దివ్య నాయకులు తిరిగి చతుర్విధములు వారు 1) దక్షిణుడు, 2) దృష్టుడు, 3) అనుకూలుడు, 4) శరుడు

## 1. దక్షిణుడు

i) సకల నాయికా విషయ సమ సహజానురాగోదక్షిణః - రసమంజరి

ii) అనేక స్త్రీల యందు సమరాగుడు దక్షిణుడనబడును. ఆం. సాహి దర్పణం

అన్నమయ్య నాయకులు 1 దక్షిణుడు.

1 కాదు కూడ దనరాదు కమ్మటి నీకు
అది గాని రతి నిన్నే ఆయములంటుదురు ||పల్లవి||

చనువు గలిగి నాపె సణగులు రాల్చితే
నసపు గలిగి నాపె నవ్వజూచును
వొనర నీ విద్దరిని వొక్కటి సేయ జూచితే
వెనుకొని నిన్నే తాము వెంగెము లాడుదురు ||కాదు||

సెసపెండ్లి కూతురు చేతులు జాచితెను
ఆసవద్ద పెండ్లి కూతురడ్డాలు చొచ్చె
వేసరక ఇరుమెలా వెసనీవు గైకొంటే
తాసువలె నీతోనే పంతాలు నెరపుదురు ||కాదు||

భూసతి నీ సెపసేసి బుజము పై నెక్కితేను
శ్రీపతి నీవురము మచ్చిక నెక్కెను
ఆసల శ్రీ వేంకటేశ ఆపెనీ పెనేలితివి
మోసపోక తాము నీపై మోహము చల్లుదురు ||కాదు||

ఇందలి నాయకుడు సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరుడే నాయికలు భూదేవి, శ్రీదేవి ఒకరికి ఆయన పట్ల చనువు ఎక్కువ మరియొకరికి ప్రేమ ఎక్కువ చనువు గలది శ్రీదేవి. ననుపు (ప్రేమ) గలది భూదేవి శ్రీదేవి సణుగులు, భూదేవి నవ్వులు ఉదాత్తమైన ఊహ అన్నమయ్యగారిది ఇద్దరి యందు సమరాగము గల దక్షిణ నాయకుడు వేంకటేశ్వరుడు ఈ ఇద్దరిని ఒకటిగ చేయ జూడగా వారిరువురు ఈయనను చూచి వెంగెము (వ్యంగోక్తులు) లాడిరట.

పెండ్లి కూతురైన లక్ష్మీదేవి తలంబ్రాలు పోయుటకు చేతులు చాపగా నాయకునిపై ప్రేమను పెంచుకొని ఆసలు పెట్టుకొనిని భూదేవి అడ్డముగా వచ్చెనట ఇరువురి మధ్యకు చొచ్చెనట వేసరని వేంకటేశుడు ఇరువురను ఇరుమేల (రెండు ప్రక్కల) చేర్పగా త్రాచుపాములై బుసలు కొట్టుదురట

ఏమైనను భూదేవి సెలు చేసిచేసి వరహావతారమున ఆయన భుజమునే అధిరోహించినది అంతకు ముందే అర్థాంగియైన లక్ష్మీదేవి హృదయముననందే ఆవాస మేర్పరచుకొనినది ఈ విధముగ శ్రీనివాసుడు ఇరువురిని ఏలినాడు వారును మోసపోక ఆయనపై వలపుజలుల్లు కురిపింతురు.

ఇట్లు నాయికలిరువురి యందును సమరాగము చూపించిన దక్షిణ నాయకుడు శ్రీ వేంకటేశ్వరుడు ఇది శ్రీహరి లీలా విలాసము. గీత గోవింద కర్తయగు జయదేవ కవివరేణ్యుడు ఈ విషయము నిట్లు చెప్పెను

అనేక నారీ పరిరంభ సంభ్రమ
స్ఫురన్మనోహరి విలాస లాలసమ్

మురారి మారాదుపచచ్ఛయన్న సౌ
సఖీసమక్షం పునారాహ రాధికా (42)

శ్రీ కృష్ణుడు వేలాది గోపికల యందును, అష్ట భార్యల యందును సమరాగుడై యుండుట మన మెరిగినవ ఇషయమే

కాని శ్రీ మన్నారాయణునకు ఇరువురే భార్యలు కనుక అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుడు ఇరువురిని సమానముగ జూచుకొన్నట్లు వర్ణించినాడు.

ఇచట అన్నమయ్య స్వానుభవము కూడ తోడైనది. తన జీవితమునే దక్షిణనాయకునికి లక్ష్యభూతముగ నొనర్చెనని తోచును. ఆయనకు ఈయనకు భార్యలు యిద్దరు చొప్పున కలరు గదా! శ్రీ భూ కాంతలాయనకు. అక్కలమ్మ, తిరుమలాంబ లీయనకు.

ఇద్దరు భార్యల నడుమ నున్న వాని స్థితి యెట్లుండునో నిజముగ అన్నమయ్యకు తెలిసినంతగా ఇతర కవులకు తెలియదేమో అనిపించును. పోతనాదులు బహు భార్యల నాదుని సంగతి వర్ణించినను వారూహించియే వ్రాసిరని అనుకొనక తప్పదు. అన్నమయ్య అనుభవజ్ఞుడు వైవాహిక జీవితమును పండించుకొన్నవాడు. ఆయనుభవము ఆయన భక్తి ప్రపత్తులకు శృంగార పదమునకు మూల కారణమై యుండనోపు. అట్టి జ్ఞానము తోడనె చక్కని నాయకుని సృష్టించగలిగినాడు. శ్రీవేంకటేశ్వరుని దివ్య శృంగార లీలలను స్వానుభవముతో జోడించిపాడినాడు. పద కవితా పితామహుడైనాడు.

## మంగళ కౌశిక

2 ఇద్దరి నడుమనుండీ ఇదివో తాను
తిద్దుచు జగడములు తేరిచీ గాక
వొక్కరికి బుద్ధి చెప్పె నొక్కరికి చెక్కునొక్కె
చక్కని నాయకుడు సవతులకు
అక్కరతో నింతసేసి నట్టివాడు తానే కాడా
పుక్కట తోరేచుకొని పొడిబడీ గాక ||ఇద్దరి||

వడి వట్టే నాకెను వొడ బరచీ నీకెను
కడు జాడ రమణుడు కామినులకు

ముడికాఢైనవాడు మొదలదానే కాదా
యెడ మాటలాడీ బయలీదు కొనేగాక ||ఇద్దరి||

కలిసేని జవరాలి గాగిలించీ కన్నియను
లలి శ్రీ వేంకటేశుడు లలనలను
యెలిమి నన్నునునేలె నిన్నిట దానే కాదా
వలపులు పడరేచే వసమయ్యీ గాక (24-570) ||ఇద్దరి||

నాయకుడీ పదమున కలహించు సవతులను సర్దిచెప్పి ఇద్దరిని సమముగనేలుటయే గాక అట్లే తనను వలచిన భక్తులను కూడ ఏలుట గమనింప వచ్చును కావున నాతడు దక్షిణ నాయకుడు.

ఇట్టిదే మరియొక కీర్తన.

3 నడుమనే కంటిమి మీనయ గారాలు
వుడివోని కోరికల నున్నారు సతులు
చెరివొకతె తొడపై శిరసు మోపుకవుండి
యేరా పాదాలొకతెపై యిటు చాచేవు
యే రీతి నుండెనో కాని ఇద్దరి ఆడియాసలు
సారెకు చెమటలతో జడిసేరు సతులు ||నడుమనే||

మొక్కుచు మాటలాడేవు మునుపటి యాకె తోడ
నిక్కపు జూపు లీపెపై నివాళించేవు
నిక్కుదమకము లెట్లు నెరపు కొన్నారో కాని
మిక్కిలి నిట్టూరుపుల మోసేరు సతులు ||నడుమనే||

బలిమి శ్రీ వేంకటేశ పట్టపు దేవుల నేలి
చెలిగి కూడితి విట్టి చిన్నదానిని
నిలచిన తరులనెట్లు నిన్ను మెపిపచిరో కాని
పులక మొలకలతో బొదలేరు సతులు ||నడుమనే||

శ్రీ వేంకటేశ్వరుడు పట్టపు దేవియైన లక్ష్మితో బాటు భూదేవికి సమముగ ఏలిన విషయ మిందు వర్ణితము

ఈ క్రింది కీర్తనలో ఏక కాలమున సతులిద్దరును కూడిన గోవిందరాజ స్వామి రూపమున నున్న శ్రీ వేంకటేశ్వరుని లీలలు వర్ణింపబడినవి

4. పరాకు సేయకు రమ్మ పడతులాల
సరాగాన బాగాలేక సతులకు జతికి ||పల్లవి||

మాటలు దేటలు చల్లి మగువ లిద్దరి మీద
కూటువ బాదాలు చాచి కొలువున్నాడు
చాటుచు నవ్వులు నవ్వీ సన్నలు కన్నుల జేసి
వేటలాడీ వలపు గోవింద రాజులదివో ||పరాకు||

వొత్తిగిలి పానుపుపై నుంగరపు వేళ్ళు చూపి
గుత్తపు గుబ్బలంటగ గోరుచున్నాడు
పొత్తుల మోవులు చూపి పూవుల వాట్లువేసి
విత్తీదమకము గోవింద రాజులిదివో ||పరాకు||

లోననే యే పొద్దు నుండి లోక మెల్లాదెలుసుక
మానినుల కాగిళ్ళ మరిగున్నాడు
నానిన చెమటలతో నంటు శ్రీ వేంకటేశుడై
వీనులలో మాటాడీ గోవిందు రాజులిదివో ||పరాకు||

అన్నమయ్య శ్రీహరి అవతారములలో ఏ అవతారమును తన కీర్తనకు ఆలంబనముగ చేసికొని రచనను చేసినను అంత్యమున కీర్తన శ్రీ వేంకటేశుని పరముగనే చెప్పబడును. గోవింద రాజస్వామియే శ్రీ వేంకటేశుడై ఇద్దరు సతులను ఏలినట్లు పై కీర్తనలో చెప్పబడినది.

## 2. ధృష్టుడు

1 భూయో నిశ్శంకకృతదోషోఽపి భూయో నివారితోఽపి భూయః ప్రశ్రయ పరాయణో ధృష్టః – రసమంజరి

2. తప్పు చేసియు నిర్భయుడు. తర్జితుడయ్యును నిర్లజ్జితుడు. దృష్టదోషితుడయ్యును అనృతమాడువాడు – ఆంధ్ర సాహిత్య దర్పణము.

3 కృతాగా అపి నిశ్శంకస్తర్జితో పినలజ్జితః దృష్టదోషోపిమిథ్యావా క్యధితో దృష్ట నాయకః - సాహిత్య దర్పణం

ఇచట తప్పు జేయుట యనగా అన్యకాంతా సమాగమము. అన్య కాంతలతో భోగించియు భయమందని వాడు. అదలింప బడియు అనగా తిరస్కరింపబడియు లజ్జను పొందని వాడు. చేసిన తప్పు ఎదుటివారికి తెలిసినను తానా తప్పులు చేయలేదని అసత్యము లాడువాడు దృష్టనాయకుడు. ఇతర కాంతలతో నుపభోగించిన నాయకుడు. నాయిక వద్దకు నిర్భయముగ వచ్చును. అచ్చటి సంభోగ చిహ్నములు కనబడుచున్నను వానిని వేరొక చిన్నెలుగా జెప్పి ఏమార్చజూచును. నాయికచే తిరస్కరింప బడియు ఆమెతో వినయముగ మాటాడి ఆమెను మచ్చిక జేయ ప్రయత్నించును.

1. అంత మమ్ము జోలిబెట్ట కవులేనీవు - నీ
యంత రంగమే యెఱుగు నంటకురా నీవు ||పల్లవి||

చెక్కులేల చెమరించె జెలితో నవ్వకుండితే
నక్కట బాసలు సేసే వప్పటి నీవు
ముక్కు నూర్పులేలరేగె ముగుదవైపు వుండితేను
చక్కటి చెప్పకునాతో సారె సారె నీవు ||అంత||

అంగమేలపులకించె నాకె యింటి కేగకుంటి
యింగి తాలు మొరగేవు యేరా నీవు
సంగతి గొప్పెల వీడె సతిచేయిదాక కుంటె
జంగిలి వేసాలు నాతో చవిగాదు నీవు ||అంత||

లత్తుకేలనంటె నొసల లలనకు మొక్కకుంటే
వుత్తరాలియ్య వచ్చేవు వొద్దురానీవు
కొత్తలై శ్రీ వేంకటేశ కూడితివి నన్నునేడు
మత్తిలి యితరములు మానవురానీవు ||అంత|| 26-24

ఇంద లి నాయకుడు సర్వలక్షణ సంపన్నుడు, ధృష్టుడు. అనేకసంభోగచిహ్నములతో నాయిక ఇల్లు సొచ్చినాడు. నాయిక ప్రౌఢ, ఖండిత. నాయకుని శరీరము నందలి చిన్నెలు చూచి గుర్తించినది ఆయన ఎవ్వతెనో పొందిపడివడిగా నాయిక యింటికి చేరినాడు. ''నీకు

మాకు ఏమి సంబంధము? ఆ సంగతి నీయంతరంగమునకే యెరుక. నన్నుతాక వలదు''
అని నాయిక తిరస్కరించినది.

కాని స్వామి యూరకుండునా! జగన్నాటక సూత్రధారి కదా! ప్రమాణము చేసినాడు చక్కటి చెప్పినాడు. అనగా తనను సమర్థించుకొనినాడు. తప్పులను ఒప్పులుగా చేయ జూచినాడు. న్యాయము ధర్మముల గూర్చి పలికినాడు. వంచన చేయ నుంకించినాడు ఆమె ప్రశ్నించిన ప్రతి విషయమునకునేదో యొకసాకు చెప్పి తప్పించుకొనుటకు ప్రయత్నించినాడు సమాధాన పరచజూచినాడు.

కాని నాయిక ప్రౌఢయగుటచే నాయకుని చేష్టలన్నియు ఇట్టె కనిపెట్టినది. ఆయన తప్పులను పట్టినది. తిరస్కరించినది.

కానిస్వామి ఊరకుండునా। వచ్చుటయే నిర్ణయముగవచ్చినాడు. తిరస్కరించినను నయగారపు మాటలు పలికినాడు. సిగ్గుపడలేదు. తన తప్పులు నాయికకు తెలిసినను ఆమెను మభ్యపెట్ట చూచినాడు. స్వామి అర్ధరాత్రి అలమేలు మంగ యొద్ద గడిపి తిరిగి శేషాద్రికి చేరుకొని యుండవచ్చును. అందుకే శ్రీదేవి ఎదుట ధృష్టుడుగా నిలువ వలసి వచ్చినది.

అయినను ఆమెను అనునయించి తన కౌగిట బంధించి ఆమందానందమున ఓలలాడించినాడు నాయిక ప్రసన్నయై ''మత్తిలి ఇతరములు మానరా నీవు'' అనునట్లు చేసుకొనినాడు.

మధుర భక్తుడైన అన్నమయ్యయే, సంభోగ శృంగార విహ్వావిలసితమైన స్వామి వారి దివ్య మంగళ విగ్రహమును భావించుకొని ఈ పద రచన గావించి నాడు. అట్టి మధుర భక్తునకునిరంతర పరమపదప్రాప్తి కలిగినట్లు ఆయన రచించిన ప్రతి పదమును పరిశీలించినచో స్పష్టమగును ప్రతి పదాంతమున స్వామి తన భక్తునకు తన సన్నిధిని సమకూర్చినట్లు రచింప బడుట గ్రాహ్యము.

2. ఇంకా వేల దాచేవు యెదురు గుదురు గాను
పొంకపు నీ గుణములు యీ బూమెల్లా నెఱుగదా ॥పల్లవి॥

వుంకించి నిన్నిందరిలో వడివట్టి తీసితేను
జంకించి వద్దనియేల సన్నసేసేవు

కుంకుమ చన్నుల చొప్పు గురిగానీ మేనంటే
ఒంకెల నీ సుద్దులు యీ లలన లెరగరా || ఇంకా||

జలజాక్షులను గూడ జాణవని పొగడితే
నెలమి నోరేల మూసే వింత లోనను
పలుకు సోకుల మచ్చము పట్టి ఇయ్యదొడగెను
వొళవైన నీ వోజ యీ వొద్ది వారెరుగరా || ఇంకా||
సొరిది నీనాసంది చుట్టరి కాలు చెప్పితే
నెరవు సేయకుమని యేల మొక్కేవు
నిరతి శ్రీ వేంకటేశ నిలువెల్లా పచ్చిదేరె
పొరినీ పొందులు ఇరుగు పొరుగు లెరుగరా || ఇంకా|| (25-127)

పరకాంతతో పొందులు కలిగియున్న స్వామిని ప్రత్యక్షముగ నాయిక పట్టుకున్నది. అయినను ఆమెను మభ్యపెట్టుటకు స్వామి ప్రయత్నించినాడు. ఆయన గుణములు, అనగా లీలలు ఎవరికి తెలియవు అని స్వామిని నిలదీసి యడుగుచున్నది నాయిక. అయినను స్వామి ఆమెను మాటలాడవలదని, నలుగురిలో నగుబాటగునని సైగల ద్వారా బ్రతిమిలాడుచున్నాడు.

స్వామి ఒడలిపైనున్న కుంకుమరాగ చిహ్నములు ఆయనను పట్టి ఇచ్చినవి.

జలజాక్షులతో రమించుటలో నీయంతటివాడు లేడని నాయిక దెప్పిపొడిచినది ఆ పలుకులు ఇతరులు వినకుండ స్వామి యామె నోరు మూసెనట. ఆయన పలుకులలోని జాణ తనమే ఆయనను పట్టి ఇచ్చుచున్నదట. రహస్యమైన నీ స్వభావము ఇక్కడి వారెరుగరా అని నిలదీసినది నాయిక "మన సంబంధములు యిక్కడి వారికి చెప్పుచుండగ చెప్పి వద్దని మ్రొక్కుట ఎందుల కని నిగ్గదీసి అడిగినది నాయిక. అయినను స్వామి యామెను వీడక తమి తోడిపొందును తమిదీర అనుగ్రహించినాడు. ఆత్మ పరమాత్మల మేలి కలయిక ఘటిల్లినది.

ఇట్టివే మరి కొన్ని కీర్తనలు చూడవచ్చును.

1. ఎంతైనా నిన్ను నమ్మినా ఎగసక్కెలే కాక
కాంత తొడనీవేల కతలు చెప్పేవు 28-40

2. ఎవ్వరు సాకిరి చెప్పేరిందుకు గాదనకు
వువ్విళ్లూర తనలోనే వూహించు కొమ్మనవే 27-217

ఏడగన్ను నీకు మొక్కేదిందు కింతేపో
ఆడుకోకు నీ పంతాలందు నిందునికను 30-141

అంత సిగ్గువడక నానతియ్యే వయ్యానీ
యంత రంగ మేల దాచనానతియ్యవయ్యా 30-46

## 3. అనుకూలుడు

1 సార్వకాలిక పరిజ్ఞానా పరాఙ్ముఖ త్వే సతి సర్వదా స్వీయా యా మనురక్తో ను కూలః - రసమంజరి

2. ఒక నాయిక యందే ఆసక్తుడు. - ఆంధ్ర సాహిత్య దర్పణము.

సర్వకాల సర్వావస్థలయందు తన భార్యయందే అనురాగము కలిగినవారు, పరస్త్రీ విముఖుడు అనుకూలుడైన నాయకుడు.

1 నీ మగడిందరిలోన నీ పైనే వలపు చూపే
చేముంచి కైవసమెంత సేసుకుంటివో ||పల్లవి||

సారె నీ మొగమాతడు చల్లు జూపులను జూచి
నారువోసినట్లనే నవ్వులు నవ్వీ
నేరుపులెల్లా మెరసి నీతోనె మాటలాడి
దారకాన నీవెంత తపము సేసితివో ||నీ మగ||

చెలినిన్ను రమణుడు చెక్కునొక్కి వేడుకొని
గారవించి నీ గుణాలు కడుమెచ్చీని
చేరువనే కూచుండి సింగారాలు నీకు జేసె
చూరలుగా మనసెంత చొక్కజేసితివో ||నీమగ||

అలమి శ్రీ వేంకటేశు డంది నీకు విడెమిచ్చి
తలకొన లాలించి తమిరేచీని
అలమేలు మంగవు నీ యంకెలనే మెలగీని
పిలిచెనెటువంటి వేళ పెండ్లియాడితివో ||నీమగ||

కుంకుమ చన్నుల చొప్పు గురిగానీ మేనంటే
లంకెల నీ సుద్దులు యీ లలన లెరగరా || ఇంకా||

జలజాక్షులను గూడ జాణవని పొగడితే
నెలమి నోరేల మూసే వింత లోనను
పలుకు సోకుల మచ్చము పట్టి ఇయ్యదొడగెను
వొళవైన నీ వేజ యీ వొద్ధి వారెరుగరా || ఇంకా||
సొరిది నీనాసంది చుట్టరి కాలు చెప్పితే
నెరవు సేయకుమని యేల మొక్కేవు
నిరతి శ్రీ వేంకటేశ నిలువెల్లా పచ్చిదీరె
పొరినీ పొందులు ఇరుగు పొరుగు లెరుగరా || ఇంకా|| (25-127)

పరకాంతతో పొందులు కలిగియున్న స్వామిని ప్రత్యక్షముగ నాయిక పట్టుకున్నది. అయినను ఆమెను మభ్యపెట్టుటకు స్వామి ప్రయత్నించినాడు. ఆయన గుణములు, అనగా లీలలు ఎవరికి తెలియవు అని స్వామిని నిలదీసి యడుగుచున్నది నాయిక. అయినను స్వామి ఆమెను మాటలాడవలదని, నలుగురిలో నగుబాటగునని సైగల ద్వారా బ్రతిమిలాడుచున్నాడు.

స్వామి ఒడలిపైనున్న కుంకుమరాగ చిహ్నాములు ఆయనను పట్టి ఇచ్చినవి.

జలజాక్షులతో రమించుటలో నీయంతటివాడు లేడని నాయిక దెప్పిపొడిచినది ఆ పలుకులు ఇతరులు వినకుండ స్వామి యామె నోరు మూసెనట ఆయన పలుకులలోని జాణతనమే ఆయనను పట్టి ఇచ్చుచున్నదట. రహస్యమైన నీ స్వభావము ఇక్కడి వారెరుగరా అని నిలదీసినది నాయిక "మన సంబంధములు యిక్కడి వారికి చెప్పుచుండగ చెప్పి వద్దని మ్రొక్కుట ఎందుల కని నిగ్గదీసి అడిగినది నాయిక. అయినను స్వామి యామెను వీడక తమి తోడిపొందును తమిదీర అనుగ్రహించినాడు. ఆత్మ పరమాత్మల మేలి కలయిక ఘటిల్లినది.

ఇట్టివే మరి కొన్ని కీర్తనలు చూడవచ్చును.

1. ఎంత్తైనా నిన్ను నమ్మినా ఎగసక్కెలే కాక
కాంత తొడనీవేల కతలు చెప్పేవు 28-40

2. ఎవ్వరు సాకిరి చెప్పేరిందుకు గాదనకు
వువ్విళ్లూర తనలోనే వూహించు కొమ్మనవే 27-217

3 ఏడగన్ను నీకు మొక్కేదిందు కింతేపో
ఆడుకోకు నీ పంతాలందు నిందునికను 30-141

4. అంత సిగ్గువడక నానతియ్యు వయ్యానీ
యంత రంగ మేల దాచనానతియ్యవయ్యా 30-46

## 3. అనుకూలుడు

1. సార్వకాలిక పరిజ్ఞానా పరాఙ్ముఖ త్వే సతి సర్వదా స్వీయా యా మనురక్తో ను కూలః
- రసమంజరి

2. ఒక నాయిక యందే ఆసక్తుడు. - ఆంధ్ర సాహిత్య దర్పణము

సర్వకాల సర్వావస్థలయందు తన భార్యయందే అనురాగము కలిగినవారు. పరస్త్రీ విముఖుడు అనుకూలుడైన నాయకుడు.

1 నీ మగడిందరిలోన నీ పైనే వలపు చూపే
చేముంచి కైవసమెంత సేసుకుంటివే ||పల్లవి||

సారె నీ మొగమాతడు చల్లు జూపులను జూచి
నారువోసినట్లనే నవ్వులు నవ్వీ
నేరుపులెల్లా మెరసి నీతోనె మాటలాడి
దారకాన నీవెంత తపము సేసితివే ||నీ మగ||

చెలినిన్ను రమణుడు చెక్కునొక్కి వేడుకొని
గారవించి నీ గుణాలు కడుమెచ్చీని
చేరువనే కూచుండి సింగారాలు నీకు జేసి
చూరలుగా మనసెంత చొక్కజేసితివే ||నీమగ||

అలమి శ్రీ వేంకటేశు డంది నీకు విడెమిచ్చి
తలకొన లాలించి తమిరేచీని
అలమేలు మంగపు నీ యుంకెలనే మెలగీని
పిలిచెనెటువంటి వేళ పెండ్లియాడితివే ||నీమగ||

ఇందలి నాయకుడు అనురూపుడు నాయిక స్వాధీన పతిక నాయిక పై నవ్వులు వెదజల్లుచు ఆమె మొగమునే సదా తిలకించు చుండును. ఆమె గొప్పతనము చేసినది కాబోలు ఆమె తోడనే మాటలాడును

ఆమె బుగ్గలు పట్టుకొని వేడుకొనును ఆమె గుణములను మెచ్చుకొనును ఆమెను అలంకరించును తాంబూల మందించును లాలించును. సంతృప్తి పరచును ఏ వేళ పెండ్లి యాడినదో గాని శ్రీ వేంకటేశ్వరుడు అలమేల్మంగనే లాలించును అలమేల్మంగా వేంకటేశ్వరుల సంబంధము కలియుగమున అవినాభావమైనది ఇతరావ తారములలొ ఆయన ఎవరెవరిని వలచినను వలపించుకొన్నను వేంకటేశ్వరుడుగ అలమేల్మంగనే వలచి. వలపించుకొనినవాడు అందులకే కలియుగమున శ్రీదేవికి ప్రాధాన్యము లేదు అలమేల్మంగనే ఆయన ఆదరించుట

అట్లే అన్నమయ్య జీవిత కాలమున ఆయనతో సమాన భక్తిప్రపత్తులు గలవారు లేరనియే చెప్పవచ్చును స్వయముగా నాయికా భావము వహించి ప్రపన్నుడైన అన్నమయ్యను సర్వదా ఆదరించినాడు శ్రీవేంకటేశ్వరుడు భౌతిక దేహము ధరించిన అన్నమయ్య ఆత్మ తన భక్తి ప్రపత్తులచే శ్రీ వేంకటేశ్వరుని స్వాధీన మొనర్చుకొని స్వాధీన పతికయైనది అందుకే ఆయన రచించిన పదములను అనునిత్యము వినినాడు వేంకటేశ్వరుడు ఆ మధుర భక్తి యుక్త ఆత్మను తనలో నైక్యము గావించుకొనినాడు

ఇట్లే ఈ గ్రంథమున ''స్వాదీనపతిక'' యగు నాయికకు ఈయబడిన ఉదాహరణము లన్నియు అనుకూల నాయకునకును ఉదహరింపవచ్చును.

1. మదించిన యేనిగకు మావటీడు వంటి దీపె
   సదరాన నిన్నిటు వసము చేసుకొనెను — 20-552

2 మొగమాయలాడి వేమొ గని నింత సేసితి
   చిగురే చాగయ్యితే జెప్పనేటికి — 22-486

3. మరి యేల జెప్పవే మాతో నీవు
   గురుతుగా సంతోషించు కొంటిమేనేము — 24-255

4. కంటిమి మిమ్మిద్దరి గన్నుల పండువలాయ
   జంట నున్న చెలులము సారె బొగడే వేమొ — 28-236

5 చెలులార చూడరే యీ చెలి భాగ్యము
అలుమేలు మంగ యీకె కబ్బెను యీ భాగ్యము 30-274

పై వానిలో 1,3,5 సంఖ్య గల పదములను స్వాధీన పతికకు ఉదాహరణముగ చూపుచు వివరించితిని. మిగిలిన 2, 4 సంఖ్య గలవానిని అనుకూల నాయకునకు ఉదాహరణములుగ నిట వివరింతును

2వ కీర్తన యందలి నాయిక పతిని వశపరచుకొనినది. చిగురు వంటి యామె చాగ యైనది మంతనాలాడి యాడి మరగించు కొన్నది సేవలు చేసి చేసి దగ్గరి చుట్టమైనది వరుసగా మ్రొక్కి వలపింపజేసుకున్నది. నవ్వులతో కైవసము చేసికొనినది. చన్నుల నొత్తి ఆశ్రయురాలైనది కలికి చూపులతో కరగించినది.

ఇన్ని చేసిన పిమ్మట నాయకుడు నిర్లక్ష్యము చేయునా? ఆమెను మాత్రమే అన్ని విధముల ఆదరించినాడు " ఈ రీతి శ్రీ వేంకటేశుడిన్నిటాను నిన్ను నేలె" అని పలశ్రుతి చెప్పినాడు అన్నమయ్య

అట్లె 4వ కీర్తనలో వేంకటేశుడు.

పతియై నాయికను వీడ కున్నాడు. ఆమె పడకను ఆమె సమీపమును వదల లేదు ఆమెను ఆ విధముగ మన్నించి అనుకూలుడైనాడు

దైవ సంబంధముగనిది అలమేల్మంగ శ్రీ వేంకటేశ్వరుల అనురాగమే యైనను ఇందు జీవేశ్వరుల మధురైక్యము ఇమిడి యున్నది. జీవుడు అన్నమయ్య ఈశ్వరుడైన వేంకటేశుని తన భక్తి ప్రపత్తులతో మెప్పించి స్వాధీనము చేసుకొనిన తీరును. జీవుని వేదనను తపనను గ్రహించి ఈశ్వరుడు అనుకూలుడైన విధమును ఈ కీర్తనలలో గమనింప వచ్చును. అనుకూల నాయకుడుగ మనము శ్రీరాముని గ్రహింప వచ్చును

## 4. శఠుడు

1. కామినీ విషయ కపట పటుశ్శఠః - రసమంజరి

2 ఒక నాయిక యందే బద్ధ భావుడై ఇరువురు నాయకల యందును అనురాగము ప్రకటించుచు. ఆ యితర నాయిక యందు గూఢముగ విప్రియముగావించు వాడు - ఆంధ్ర

సాహిత్య దర్పణము.

3. ''ప్రియాశ్రయ మాత్ర నివేద్య విప్రియుండల శరుండు – కావ్యాలంకార సంగ్రహము

4. ఎఱుగగా రాని యా తెఱగున దొసగు

నెఱిజేయునట్టి యా నేర్పరి శరుడు''

నాయికకు దక్క నొరులకు నేరికిని దెలియరాని వడుపున నప రాధము సేయువాడు ''శరుడ'' ను నాయకుడనబడును. – ఆంధ్ర ప్రతాపరుద్రయశోభూషణము.

అన్నమయ్య కీర్తనలన్నియు వేంకటేశుని పరముగనే జెప్పినను అందలి అంతర్గత నాయకులు శ్రీహరి యొక్క రామకృష్ణాద్యవతారమూర్తులై యుందురు. ఒక యెడ నారసింహుడుగను. ఒక్కెడ వరాహ మూర్తిగను, మరి యొక్క యెడ రాముడు గను, మరి యొక యెడ కృష్ణుడు గను శ్రీహరి మనకు గోచరించును. శరనాయకునిగ మనము శ్రీకృష్ణుని గైకొనవచ్చును.

ఈ క్రింది కీర్తనలను పరిశీలించినచో శ్రీహరి శరనాయక లక్షణములు స్పష్టమగును. శ్రీ వేంకటేశుడుగ అలమేల్మంగ యందే బద్ధానురాగుడైనను, శ్రీ రాముడుగ సీతాదేవికే అనుకూలుడైనను. శ్రీ కృష్ణుడుగ ఆయన చతుర్విధ నాయకల లక్షణములు గల వాడైనాడు. ఇతర నాయిక లెంత మంది యున్నను రుక్మిణీ యందే బద్ధబావుడైనాడు గోపాంగన లందరకును సమరాగుడుగా నుండి దక్షిణ నాయకుడైనాడు. రుక్మిణీ మందిరము నుండి సత్యభామామందిరమున కేగినపుడు లేదా గోపకాంతల ఇండ్ల నుండి సత్యా మందిరమున కేగినపుడు ఆయన ధృష్ట నాయకుడైనాడు. రుక్మిణీ పై అధిక ప్రేమ గలిగి యున్న సంగతి సత్యభామకు. తదిర నాయికలకు తెలిసి యుండియు వారి వారి పడకటిండ్లు చేరినపుడు వారి యందే ప్రేమ గలిగినట్లు నటించుచు. రుక్మిణీ యందే బద్ధ భావుడైనందున శరుడైనాడు.

అట్లే తన భక్తులందరి యెడల సమరాగుడైనను తనను శరణు గోరిన ప్రపన్నుల యెడల మాత్రమే బద్ధ భావుడైనందున ఈశ్వరుడు అన్నమయ్య కీర్తనల యందు శరుడైనాడు.

1 ఊరకున్న వారికేల వుడుకులు గట్టేవు

నేరుపులాడనే చూపు నేవెరతు నిందుకు ||పల్లవి||

సేయవయ్య నీవు నీ చేతికి లోనైనఖిల్ల
ఆయములు సోకగ నీవాపెవద్దనే
మాయవలపు ఒక చోట మన్నన నీ కొకచోట
వేయయ్య పచరించేవు వోపనోపనేను ||ఊర||

నగవయ్య నీవు పోయి నాటిన ప్రియము తోడ
అగపడి నీతో నవ్వే ఆపె తోడనే
జిగి నుప్పమ్మ గొందరు చిట్లు మోయ గొందరు
నగు నీతో సరసమరగదు మాకును ||ఊర||

చెప్పవయ్య నీవు నేను చేకొని కూడిన సుద్ది
అప్పసము యెమ్మెలకు నాపె తోడను
యిప్పుడె శ్రీ వేంకటేశ యీడగొంత నాడ గొంత
నప్పటి దిరుగాడితే నది నేను మెచ్చను || ఊర|| 20-429

ఇందలి నాయకునకు ఒక నాయిక యందే మన్నన మరియొక నాయిక యందును అనురాగము ప్రకటించును అట్టి నాయికకు ఈ సంగతి తెలియును అందులకే అలుకతో నాయకుని దెప్పి పాడుచున్నది.

''మాయ వలపు ఒక చోట మన్నన నీ కొక చోట''
''జిగిని ఉప్పమ్మ కొందరు, చిట్లుమోయ కొందరు''

అని ఎక సక్కెమాడినది అక్కడ కొంత ఇక్కడ కొంత వలపు చూపితె నేను మెచ్చను సుమా అని హెచ్చరించినది. ఆమె మాటల వలన ఇందలి నాయకుడు ''శరుడని'' తెలియుచున్నది.

2. ఇది దానావల పంటా యీడు చూపేనే
పదరే నామతికి దా బైకొనరాదా ||పల్లవి||

నిక్కినే విరహమున నిట్టూర్పు నించగాను
పుక్కిట దానేమిసేశో బుసకొట్టేనే
చెక్కు చేతి చింతతో నే చెమరించగాదాను
చిక్కిన సురతముల చెమట దోగెనే ||ఇది||

తనపై మోహమునసే వగ బులకించగాను
పొనిగి తానేమిటికో పులకించేనీ
నినుపు గోరికలనే నివ్వెరగు పడగానే
వెనుకటి చేతలకు వెరగందీనే ||ఇది||

కమ్మర కమ్మరనే కాగిలించగా తాను
కమ్మి యెవ్వతో దలచి కౌగిలించీనే
అమ్మరో శ్రీ వేంకటేశు డట్టి వాడు కాడు నేడు
నమ్మించి నన్ను గూడి నవ్వునవ్వీనే ||ఇది||

ఇందలి నాయిక ఎంత వలపు గుమ్మరించుచున్నను నాయకుడు మాత్రము పరధ్యానముతో నీమెను పట్టించుకొనుట లెదు. ఆమె యొనర్చెడి ప్రతి శృంగార చేష్టయు అంతకు మునపు తాను గూడిన, తన కత్యంత ప్రియమైన నాయిక చేష్టలను స్మరింపజెయుచున్నవి తన చెలికత్తెతో చెప్పుకొని చింతించుచున్నది ఈమె నిట్టూర్పగా ఆయన బుసకొట్టును. చింతతో ఈమె మేను చెమరించగా ఆయనకు అంతకు మునుపు చిక్కిన సురతముల సంగతి తలంపునకు వచ్చి మేను చెమరించెను ఆయనపై మోహము తో నీమె పులకించగా ఆయన మరెందులకో పులకించును నిండు కోరికతో ఈమె నివ్వెరగండగా ఆమె మరెందులకో వెరగందును. ఆయన గత స్మృతులు తలంపునకు వచ్చినవట

ఈమె పదే పదే కౌగిలించగా ఆయనే మరి యెవరినో తలచి కౌగిలించుకొనునట.

ఈ విషయము లన్నియు ఆమె పసిగట్టినట్లు గ్రహించిన ఆ స్వామి ఆమె నెట్లో నమ్మించి ఆమెను కూడి నవ్వుకొనెనట

ఆయునకు ఎందరిపై మక్కువ యున్ననేమి గాక తనను కూడుటయే జన్మ చరితార్థమైనట్లు పరిగణించినది అందులకే ఎవరెటు వంటి వారైనను వేంకటేశుడు మాత్రమట్టి వాడు కాడనుచు సరిపెట్టుకొన్నది

ఇందలి నాయకుడు పరధ్యానముతో నుండుటచే ఆయన కత్యంత ప్రియమైన నాయిక మరియొకతె కలదనియు, ఆమె యందలి బద్ధానురాగముచే నీమెను నిర్లక్ష్యము చేసెననియు. ఇవరకు ఎట్టులైననేమి ఈమె యందును అనురాగము ప్రకటించి నాడనియు తెలుచున్నది ఇట్టి లక్షణములు కలవాడగుటచే ఈ నాయకుడు శఠుడుగా గుర్తింప బడుచున్నాడు

ఇక జీవేశ్వర సంబంధముతో జూచినచో నిందలి నాయకుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు అతడే పరమాత్మ భక్తులు, ప్రపన్నులు ఆయన కత్యంత ప్రియమైన నాయకలు. శ్రీదేవి మొదలగు వారు భక్తులకంటె తక్కువ వారు కారు. అయినను భక్తుల మొరలు వినినపుడు ఆయన శ్రీ, భూ కాంతలను సైతము మఱచి తన భక్తులును, అపన్నులై శరణాగతులైనవారును అయిన జీవుల యందే బద్ధానురాగుడై యుండును అందుకే గజేంద్రుడు మొరలిడినపుడు లక్ష్మీదేవితో వినోదించు నారాయణుడు గజేంద్రుని యందే మనసు లగ్నము చేసినవాడై ఎవరితో నేమియు చెప్పక పరుగులు పెట్టినాడు. ద్రౌపది మాన సంరక్షణ చేసినాడు. కుచేలుని యాదరించినాడు ఇచ్చట ఈ కీర్తనలో వేంకటేశుడు నమ్మించి కూడుట యనగా నమ్మిన భక్తునకు తన సాన్నిధ్యము నొసంగుటగా గ్రహింప వలెను

3 నాకు గాన వచ్చినీ నటన లెల్లా
నీకు జూడ నన్నియును నేరుపులైయున్నవి ||పల్లవి||

తలకొని నాదిక్కు తప్పక చూచేవు గాని
తలపులో వేరొకతె తగిలున్నది
మలసి నిజాలకును మాటలు నాడేవు గాని
యెలమినీ కోరికలు యెక్కడో వున్నవి ||నాకు||

నడుమ నాతో నూరకే నవ్వులేనవ్వేవు గాని
ఆదరిన వలపు వింతై వున్నది.
జడిగొని నాపై జేయి చాచగ వచ్చేవుగాని
చిడిముడిత మి వలసిన చోట నున్నది ||నాకు||

గట్టిగా నీ కాయము నా కాగిట నున్నది గాని
చుట్టరికము లెల్లా జుట్టుకొన్నది
నెట్టన శ్రీ వేంకటేశ నీవు నన్నేలితివి గాని
రట్టడి పంతాలు రతినిట్టి పాయకున్నది ||నాకు||

ఇందలి నాయికకు శఠుడైన నాయకుని ప్రవర్తన కంటగింపుగ నున్నది

నాయకుడీమెవైపు చూచును కాని ఆయన తలపులో వేరొకతె యున్నది. పైకి ఏవోపొడి మాటలు ఆడునే గాని ఆయన కోరికలు ఎవరిపైననో ఉన్నవి. మధ్యమధ్య ఈమెతో నవ్వునే గాని

ఆయనకురిపించెడి వలపు ఈమెపై కాదు ఈమె కొరకు కోరికతో చేయి చాపునే కాని ఆయన తమకము వేరొక యామెపై నున్నది. ఆమె బిగికౌగిలిలో బంధింపబడి యున్నను ఆయన మనసు వేరొకరితో చట్టరికము (సంబంధము) కలిగియున్నది. ఇదీ నాయకుని స్వభావము

అత్యంత ఆర్తులై, శరణాగతులైన వారి ఎడలనే శ్రీమన్నారాయణుని కృపాకటాక్షము ప్రసరించును. ఆయన ఎక్కడ నున్నను ఆపన్న ప్రసన్నుండై రక్షించును. ఎదురుగా నుండి తనను శ్రీ వేంకటేశ్వరుడు కరుణించుట లేదని అన్నమయ్యగారు చింతించుటయు, ఆ స్వామి ప్రసన్నుడై మధుర భక్తుని అనుగ్రహించుటయు ఇందు స్పష్టము.

ఇట్టివే మరి కొన్ని కీర్తనలు పరిశీలనార్థములు

1. చెప్పరా నీకు నాతోడి సిగ్గులింకేల
   రెప్పల తుదల నేడు రిచ్చవడి యున్నది 20-397

2. ఎంత సేసినా నీవు ఇన్నిటికి దగుదువు
   బంతికి బిలుతు సిగ్గువడేవని కాని 25-189

3 నీ జాడలన్నియు నేనెఱగనా । నీవు
   వోజాలు రెండు చోట్లా నొనరించే విపుడు 31-258

''అలుమేలు మంగమాట - అమరు గోవిలపాటు 30-464

## విప్రలంభ శృంగార వర్ణన

శృంగారము సంభోగశృంగారమనియు, విప్రలంభశృంగారమనియు ద్వివిధములు. నాయికా నాయకుల కలయికను సంభోగ శృంగార మందురు. ఇది దర్శన స్పర్శాదులచే కలుగునది అవస్థా భేధములను బట్టి స్వాధీన పతికమొదలగు నాయికలలో ప్రోషిత భర్తృక, విప్రలబ్ధ, ఉత్కంఠిత నాయికలను తప్ప మిగిలిన నాయికలకు ఈ సంభోగ శృంగారము కరతలామలకము వంటిది

కాని ప్రోషిత భర్తృకాదిపై నాయికలు పూర్వ రాగము దలంచుకొని నాయకా సమాగమమున్నకై దశ కామావస్థలం బొసులుచు ప్రవర్తిల్లెదరు అట్టి సమయమున వారి వారి యవస్థలను వర్ణించెడు పదములు విప్రలంభ శృంగారమునకు చెందినవై యుందును.

''కారణ విశేషేణ తయోర్విశేషో విప్రలమ్భః'' - రసమంజరి

ఇతః పూర్వము దశ కామావస్థల గురించిన పదములను సోదాహరణముగ వివరించి యుంటిని. అట్టి యెడల తిరిగి ఈ విప్రలంభ శృంగారమును గూర్చి మరల వివరింప బూనుట చర్వితచర్వణము గాదా యనెడి ప్రశ్న ముదయింపవచ్చును దీనిని ఇంచుక వివరించెదను.

నాయికలు పొందెడి దశావస్థలను గూర్చి వివరించెడి సమయమున ఆయా సంకీర్తనలలో ఆయా అవస్థలను అన్నమయ్యగారు ఎట్లు ప్రవేశపెట్టి కృతకృత్యులైరో మాత్రమే నిరూపించుటకు ప్రయత్నము జరిగినది.

నాయకుని ఎడబాసిన నాయిక ప్రకృతిని ఎట్లుపాలంబించునో ఎట్లు తన దుస్థితికి వగచునో, పూర్వరాగము దలచుకొని ఎట్లు వాపోవునో, మొదలగు విషయములకు గల ప్రాధాన్యమే ఈ విభాగమున వివరించెదను కావున ఈ నా ప్రయత్నము చర్విత చర్వణము కానేరదు అన్నమయ్యగారి రచనలలో ఈ విప్రలంభశృంగారమునకు పెద్ద పీట వేయబడినది.

శృంగార నాయికా నాయకులను నిరూపణ చేసిన పిమ్మటనే రసమంజరీ కారుడు ''శృంగార రస నిరూపణమ్'' అను పేరిట సంభోగశృంగారమును విప్రలంభ శృంగారమును నిరూపించెను. ఏతన్మార్గముననే నేను ఇప్పుడు శృంగార రస నిరూపణము చేయదగిన పదముల నెన్నుకొని ప్రథమముగా విప్రలంభ శృంగారమును నిరూపింతును.

''రతి స్థాయీ భావ శృంగారః సద్విధః సంభోగే, విప్రలంభశ్చ'' - రసమంజరి

(రతి యనగా సంభోగ విషయకేచ్ఛారూప చిత్తవృత్తి విశేషము. అది దేనికి స్థాయీ భావమో అది శృంగారము. ఆ శృంగారము సంభోగమనియు, విప్రలంభమనియు రెండు తెఱంగులనియు తెలియనగును) (68)

అని అమరవాది నీలకంఠ యజ్వగారి అనువాద వివరణము

సంభోగ శృంగార వర్ణన కన్న విప్రలంబమునకే తాళ్ళపాక కవులు ప్రాధాన్యము నిచ్చుటలో కొన్ని కారణములు గలవు వానిలో ముఖ్యమైనది జీవేశ్వర అనైక్య స్థితి రెండవది విప్రలంభ స్థితి ననుభవించి పిమ్మట లభించిన సంభోగము మధురాతి మధురమై అనిర్వచనీయానందము లభించుట

జీవుడు ఈశ్వరుని నుండి వేరు చేయబడి ప్రత్యేక పదార్థముగ లేక చైతన్యుడుగ సృష్టింపబడినవాడు. అట్టి జీవుడు తిరిగి తనకు మూలమైన ఈశ్వరుని పొందుటకు పడెడి విరహవేదనయే విప్రలంబావస్థ. అట్టి అవస్థను వర్ణించుటలో అన్నమాచార్యుడు అగ్రస్థానము నలంకరించినాడు. ఆయన నందకాంశ సంభూతుడు కావున జీవుడుగా ఈ లోకమున నవతరించి, ఇష్టాలేని సుఖదుఃఖముల తోడి జీవితమునిన రోసి తిరిగి ఆ శ్రీనివాసుని సాన్నిధ్యమును చేరుటకై ఆరాటపడినాడు. ఆ ఆరాటమునకు ఫలితమే ఈ శృంగార పదరచన. ఇట్టి విరహ వేదనానంతరము ఉపలబ్యమగు ఆ దివ్య సంసర్గ స్థితి ఎంతయో మధురముగ నుండునది. అనంతమైనది. భక్తుని పరముగ పరిశీలించినచో భక్తుడు పరమాత్మలో ఐక్యమగునంత వరకు అతనికి మిగిలినది విప్రలంబమే. విరహిణీ జీవితమునే అతడు గడుపును. ఈ కారణముల చేతనే అన్నమయ్యగారి కీర్తనలలో ప్రధానముగ విప్రలంబము చోటు చేసికొనినది కనుకనే నేను విప్రలంబ కీర్తనలను ముందుగ వివరించుటకు పూనుకొంటిని.

ఇట్టి విప్రలంభావస్థలను దశకామావస్థలుగా ఇంతకు మునుపే సోదాహరణముగ వివరించుటచే ప్రస్తుతము ఆయా నాయిక నాయకులు ఆయా అవస్థలలో ఎట్లుందురో వారి స్వరూప స్వభావాదులు ఎట్టివో ఇంచుక వివరింతును.

ప్రతి వారికిని సంగమేచ్ఛాభిలాష ఉండును. అది నెరవేరనియెడల తత్సంబంధ చింతాద్యవస్థలను పొందెదరు. అట్టి యెడల వారేయే స్థితులలో నుండిరో అన్నమయ్యగారి కీర్తనలలో నరసెదము గాక।

ఏదేని యొక కారణముచే నాయికా నాయకులకు ఎడబాటు తటస్థించినచో నది విప్రలంబ శృంగార మనబడును

## శ్రీరాగం 12-191

చలిగాలి వేడేల చల్లీనే కప్పురపు
మలయజము తానేల మండీనే ||పల్లవి||

పాపంపు మనసేల పారీనే నలుగడల
చూపేల నలువంక జూచీనే
తాపంపు మెనేల తడవీనే పూవింటి
తూపేల చిత్తంబు దూరీనె ||చలి||

వాయెత్తి చిలుకేల వదరీనే పలుమారు
కొయిలలు దామేల గొణగీనే
రాయడికి నలుగేల రాసీనే మాతోను
కాయజుడు తానేఁ కసరీనే ||చలి||

ఏకాంతమున నేల యెదురైతినే తనకు
లోకాధిపతికేల లోనైతినే
చేకొని మన్నించె శేషాద్రి విభుడు
పైకొనిది మమ్మేల పాలించెనే ||చలి||

నాయకుని ఎడ బాసిన పడతికి ప్రకృతి యందలి రమణీయకమగు వస్తువులన్నియు తాపమును హెచ్చించినవి వెగటుగ దోచినవి

చలిగాలి, కర్పూరపు వాసనలు, చిలుకపలుకులు, కోయిల కూతలు ఇవి యన్నియు ఆమె విరహమును ద్విగుణీ కృతము చేసినవి మదన బాధను మరింత అధికము చేసినవి

ఇవి యన్నియును నాయకునిపైని వలపును రేపినవి. ఆయన కొరకు వెదకుచు అభిసారికయై చనిన కాంత నాయకున కేకాంతమున ఎదురైనది ఆమె నోము ఫలించినది తపము సార్థకమైనది సాక్షాత్తుశేషాద్రివిభుడామెను చేకొనిమన్నించినాడు. పైకొనిపాలించినాడు

''నవినా విప్రలంభేన సంభోగ పుష్టిమశ్నుతే''

అను ఆలంకారిక వచనము ప్రకారము కేవల సంభోగమున కన్న విరహము పిమ్మట లభ్యమాన మగు సంభోగమే రక్తి కట్టును

## ఆహిరి 12-267

ముచ్చట కెవ్వరు లేరు మోహమిది జలుదూరు
యెచ్చట నెవ్వరు లేరు యేటికే నాపెరు ||పల్లవి||

మంచము పై నుండ రాదు మలుగుపై బొద్దువోదు
నించిన వుయ్యాల లోనా నిద్దుర రాదు
అంచెల గన్నుల నీరు ఆపరావాతని బాసి
యించు కంత నిలువలెనెట్లు దరియింతునే ||ముచ్చట||

పచ్చళించే బిల్లు చూచి ప్రాణము నిలుపరాదు
దివ్వెచూచి తాలిమైన దివ్వగరాదు
దువ్వటపు పైయెదపై దోగిన తట్టుపుణుగు
పువ్వుటమ్ము బాసటపై పొక్కనేమి సేతునే ||ముచ్చట||

చింతతో ధరించరాదు చెల్లెబోమేనైన బోదు
ఇంతట చెలులకైన యెఱుక లేదు
ఇంతలోనె వేంకటేశు డింతి మరుగున నుండి
యెంతసేసె గలికి వీడేమని చెప్పుదునే ||ముచ్చట||

నాయికకు ఆపరాని తమకమున విరహము హెచ్చినది మంచమునందైనా, వుయ్యాలలోనైనా ఆమెకు నిద్దుర రాదు. కన్నీరు మున్నీరగు చున్నది పడకటిల్లు చూచి నంతనే ప్రాణము లెగిరిపోవుచున్నవి. దీపము గూట పెట్టిన ఓర్వు నశించుచున్నది పూవుటమ్ముల వాని వేధింపు అధికమైనది. ఇంక ఈ జీవితము పైననే రోత కలుగుచున్నది అట్టి స్థితిలో నున్న ఆమె వేదనా తపః ఫలితముగ వేంకటేశుడు ఆమెను కూడినాడు

## దేసాళం 24-110

చిత్తగించి చూడవయ్య చెలి లాగు
బిత్తరపు జవ్వనము పెచ్చుపెరిగీని ||పల్లవి||

చెలివీనుల జవ్వాది చెక్కుల గరికి జారి
వెలినిన్ను బాసిన విరహానను
మలసిన కోరికలు మతిలో దీగెలుపారే
వలపుల చెమటల వానలను ||చిత్త||

వేవేగ బెట్టిన కొప్పు వెడజారీ మూపు మీద
నీ వొద్దికి వచ్చేటి నిబ్బరానను
పూవుల దండలోని పుప్పొడి దుమ్మురేగి
కావరపు నిట్టూర్పుల గాలిచేతను ||చిత్త||

మునుకొని మెరసీని ముంజెతి కంకణములు
తనివార నిన్నుగూడే తమకమున
యెనసితివి శ్రీ వేంకటేశ యింతలోనె యీకెను
వినయాన నీకు మ్రొక్కి వేడుకలను ||చిత్త||

ఇందలి నాయికను చూచినంతనె, ఆమె ఎంతటి విరహమున తపించుచున్నదో తెలియుచున్నది చూడవయ్యా అని చెలులు నాయకునకు నివేదించుచున్నారు.

కరిగి జారిన జవ్వాది, వానవలె జాలు వారెడి చెమటలు, ముడి వీడి జారిన కొప్పు, నిట్టూర్పులచే వాడిన పూలదండ, మెరయుచున్న ముంజేతి కంకణములు ఇవి అన్నియు చెప్పకనే యామె విరహమును ప్రకటించుచున్నవి. ఆమె తపనకు ఫలితముగా వేంకటేశుడు ఆమెను ఎనసినాడు. అంతకన్న జీవుడు కోరునదేమున్నది. పరమాత్మ తోడి సంయోగమే గదా ఆత్మ యొక్క ఆవేదనకు పరమార్థము, పరమ లక్ష్యము.

ఈ క్రింది కీర్తనయందు నాయిక స్వామి కొరకు ఎదురు చూచుచు ఇంటిలోననే విరహమున నెట్లు బొగులు చున్నదో చక్కగా వర్ణింపబడినది.

## 4. మాళవిగౌళ 29-515

తరితో నీ చేతి దింతే ధర్మపుణ్యము
యెఱుగుదు మన్నియు నిన్నేమనేమయ్యా ||పల్లవి||

చెక్కిటి చేతి తోడ సిగ్గుల నవ్వులతోడ
తక్కక చెలి యింటిలో తానున్నది
చొక్కటా లాడేవు నీవు సుదతుల తోడయీడ
యిక్కడ నిందరము నిన్నేమనేమయ్యా ||తరి||

సింగార భావాల తోడ చెంప చెమటల తోడ
అంగన మేడలోన ఆసాస నున్నది
ముంగిట నీ వైతేను కమ్మిక రచ్చలు సేసేవు
ఇంగితము గంటిమి నిన్నేమనేమయ్యా ||తరి||

కన్నుల తెలల తేవ కమదమకము తోడ
యెన్నికనీ కొగిలిలో యింతి వున్నదీ
మన్నించి శ్రీ వేంకటేశ మంచముపై నున్నాడవు
యిన్నిటాను జాణడవు నిన్నేమనేమయ్యా ||తజే||

విరహమున వేగెడి చెలియకు చెలులు శైత్యోపచారములు చేయుట ఈ క్రింది కీర్తనలో చక్కగా వర్ణింపబడినది

## 5. నాదరామ క్రియ 30-545

విభుని దేడుక వచ్చేవెస నన్నిమంచి వయ్యా
యిభయానకు జేయరే యిట్టివుపచారాలు ||పల్లవి||

వెలదికి చందురు డీవేళ జుట్టమవుగాని
కలువలు కొప్పున గక్కన నించరే
కలుపు కొలున చల్లగాలి మన్నించుగానీ
మలయజ మలదరే మందుగాను మేనను ||విభుని||

ముద్దియకు దాపరని మొకమోడి వుండుగాని
వొద్దిక దామరపై గూచుండ బెట్టరే
గద్దరి వసంతునకు గడు నిచ్చకమే గాని
పొద్దు వొద్దునకు పైపై బుప్పొడి చల్లరే ||విభుని||

పస్సుకొని మేఘానకు బరిణామమువుగాని
చిన్నినెమళ్ళ వ్రాసిన చీరగట్టరే
యెన్నగ శ్రీ వేంకటేశుడికె యలమేలు మంగ
యిన్నిటా విచ్చేసి కూడె యింటనే వున్నాడు ||విభుని||

నాయిక అలమేల్మంగ ఆమె విరహార్తిని పొగొట్టి విచ్చేసిన వాడు శ్రీ వేంకటేశుడు అలమేలు మంగను స్వామితో కలుపుటకై చేసెడు చేతలు చక్కగా వర్ణితములు ఇట్టి విరహ విప్రలంభమునకు దాపలము లైన కీర్తనలు ఈ క్రిందివి చూడవచ్చును

## లలిత

ఇంతకు తొల్లెమియునే నెరుగ బో
మంతనాన దనకేనే మరులైతిబో 27-491

## శ్రీరాగం

ఇందాకా బొరలితివి యెడలేని విరహాన
కందువ నీపాల జిక్కె కాంతుడు నేడిదివో 28-157

## సామంతం

దేవరపు గావా నీవు తెమలి యీ పనులకు
కావరపు వనితలు కదిసితే జాలును 31-286

డా వేటూరి ఆనందమూర్తిగారిచ్చిన విప్రలంభకీర్తనల ఉదాహరణములు

## భైరవి

వనిత భాగ్యంబు దేవర చిత్తము - మాకు
జనిగాదు యింకనీ పాదంబులాన 12-23

## శంకరాభరణము

తరుణి నీయలుక కెంతటి దింత యీవేళ
గరుణించ గదలు వేంకటశైలవాస

## సౌరాష్ట్రం

పతివ్రతమా నాపాలదైవమతడే
ఆతనికిచ్చకము లాడే నింతేకాక

(తంజావూరివ్రాత ప్రతి నుండి) (69)

# పురుష విరహము (విప్రలంభము)

ఇంతవరకు నాయికా విప్రలంభావస్థలు వివరించితిని. అన్నమాచార్యుడు అటనట పురుష విప్రలంభమును గూడ వర్ణించినాడు. భక్తుడు భగవంతునకై ఆరాట పడుట నాయికా పరమైన విప్రలంభముకాగా తన భక్తుని బ్రోచి రక్షించుటకు భగవంతుడు పొందెడి ఆరాటమును పురుష విప్రలంభముగా మనము స్వీకరింపవచ్చును. ఈ విషయమునకు శ్రీకృష్ణుడు చక్కని ఉదాహరణ యగును. ఆయన వ్రేపల్లెను విడిచి మధురకు నేగి కంసవధ గావించి, బలరామునితో గూడ నుపనీతుడై సాందీపని యొద్ద విద్యాభ్యాసము పూర్తి చేసికొని తిరిగి మధుకు జేరుకొనెను. అచట నట్లుండ ఒకానొకనాడేకాంతమున ఆయనకు గోపకామినులు స్ఫురణకు వచ్చిరి అప్పుడిట్లు చింతించెను.

శా నాపై జిత్తము లెప్పుడున్ నిలుపుచున్ నారాక గాంక్షింపుచున్
నా పేరాత్మల నావహించుచు వగన్ నానాప్రకారంబులన్
గోపాలాంగన లెంత జాలి వడిరో కోపించిరో దూఱిరో
వ్రేపల్లెన్ నిజదర్మ గేహములలో విభ్రాంత చేతస్కలై (70)

అని వారి గురించి ఆలోచించానడు వారికి తనపైన ప్రేమను జ్ఞాపకము చేసికొనినాడు. వారికి తనకు గలిగిన వియోగావస్థను తలంచుకొని వారెంత తపించుచున్నారో యని, తన రాక కొరకు వగ చేత తన నెంత దూరు చున్నారో యని మధనపడినాడు. ఎందుకనగా వారు ఆత్మ స్వరూపులు. తాను పరమాత్మ, వారు ప్రపన్నులు, ఇహలోకసుఖములను గాదని పరమాత్మయైన తనను మాత్రమే తన సాన్నిధ్యమును మాత్రమే త్రికరణ శుద్ధిగ గోరినవారు. అందుకే ఆయన ఆరాటము వెంటనే ఉద్ధవుని పిలిపించినాడు ఆయనతో వారి భక్తి ప్రపత్తుల గురించి చెప్పి వారికి తన సందేశమును పంపుచు ఉద్ధవునితో నిట్లని చెప్పినాడు

''లౌకిక మొల్లక నన్నా
లోకించు ప్రపన్నులకును లోబడి కరుణా
లోకమ్ముల బోషింతును
నాకాశ్రిత రక్షణములు నైసర్గికముల్'' (71)

ప్రపన్నులైన వారు లౌకిక బంధములను విడిచి హరిని సెవించినచో ఆయన తప్పక రక్షించునని భావము. అట్టివారిని రక్షించుటకు సదా తన సాన్నిధ్యము నొసంగుటకు ఆయన

సంకల్పించును అట్టి సంకల్పమునకు తన యవతార లక్ష్యమును నెరవేర్చుటలో ఇంచుక ఆటంకము లేర్పడినపుడు ఆయన నాయికకై తపించు నాయకుని వలె విరహము ననుభవించును అదియే పురుష విప్రలంభము.

ఇది ఇట్లుండ కాళిదాస విరచిత ''మేఘసందేశ'' కావ్యము విప్రలంభ శృంగారమునకు ఉదాహరణముగా పేర్కొన వచ్చును. నాయకుడు తన ప్రియురాలికి మేఘము ద్వారా సందేశము పంపుచు తనకు గల విరహ వేదనా తీవ్రతను ప్రకటించినాడు ఏకపత్నీవ్రతుడై కామ క్రోధాదులకు అతీతుడైన రాముడు సైతము సీతాపహరణము పిమ్మట ఆమెకై గత స్మృతులను నెమరు వేసికొని పరితపించినాడు ఇట్లు వాల్మీకాది సంస్కృత కవులు పురుషవిప్రలంభమును వర్ణించినారు.

ఇట్టి విప్రలంభావస్థ నాయిక తోడి సంయోగము ఒక మారు కలిగి పిమ్మట చాలా కాలము వరకు అట్టి సమాగమము జరుగకపోవుట కలుగ వచ్చును లేదా తను కోరిన ప్రియుని లేక ప్రియురాలి తోడి ప్రథమ సమాగమము కొరకు పడెడి ఆరాటము కూడ విరహ విప్రలంభముగనే ఎంచవచ్చును.

(అల్లసాని పెద్దన విరచితమైన మనుచరిత్రలో) వరూధిని యను గంధర్వకాంత యొక్క సౌందర్యాధిక్యమును గాంచి, కామించి, ఆమెచే తృణీకరింప బడిన గంధర్వుడొకడు ఇట్టి విరహమునే అనుభవించెనట

శా. ఏ గంధర్వుడు తద్విలాసములు మున్వీక్షించి తానెంతయున్
రాగాంధుండయి కోరి హత్తక గడున్ రారాపులం గంతుడు
ద్వేగం బందగ జేయ నెవ్వగల నువ్విళ్ళూరుచున్ వేగువా
డా గంధర్వకుమారు డంగభవ విద్యాపారగుం డాత్మలోన్ (72)

ఈ గంధర్వుని ప్రేమ కేవలము శరీర సంబంధమైనది. మోసముతో నిండినది ఇచట కేవలము పురుష విప్రలంభమునకు ఉదాహరణముగ మాత్రమే ఈ పద్యముగైకొనబడినది. ఉత్తమ ప్రేమకు గాని జీవేశ్వర సంబంధమునకు గాని ఇది ఉదహరింప బడలేదు (అనగా ప్రథమ సమాగమాత్పూర్వ విరహమునకు మాత్రమే ఇది ఉదహరణ యని గ్రహింపవలెను )

శ్రీ కృష్ణ పరమాత్ముడు మధురలో నుండి గోపకామినుల గూర్చి అనుభవించినది ప్రవాస విప్రలంభముగ పేర్కొన వచ్చును. ఇట్టి పురుష విప్రలంభావస్థను అన్నమాచార్యుడు

శ్రీనివాసుని పరముగ నూహించి వ్రాయగలుగుట అనన్య సామాన్యము అట్టి కీర్తనలు అరుదుగ మనకాయన రచనలలో కన్పించును

## 1. తెలుగు కాంబోది 29-590

సతివక్కదన మెంతో సరసుని మోహమెంతో
చతురిక లిందరును సరిజూడరమ్మా ||పల్లవి||

కాంత కన్నులు వ్రాసి కడలు వ్రాయగరాక
చింత కొద తలవంచె చెలి విభుడు
పంతపు నడుము వ్రాసి బయలు వ్రాయగరాక
కొంత దడవుస్సురనె గోమలి ప్రాణేశుడు ||సతి||

కలికి కుచాలువ్రాసి కఠినము వ్రాయలేక
తలపోయ దొడగె బంతపు విభుడు
నలినాక్షి మోము వ్రాసి నవ్వులు వ్రాయగరాక
నిలువున వెఱగందె నెలత రమణుడు ||సతి||

వనిత కౌగిట దన్ను వ్రాసిరతి వ్రాయలేక
తనువెల్ల మఱచెను తమకమున
వెనుక ముందర వ్రాసి వేడుక వ్రాయగరాక
చినుకు జెమట వ్రాసె శ్రీ వేంకటేశుడు ||సతి||

ఇచట శ్రీ వేంకటేశ్వరుని విప్రలంభ శృంగారము వర్ణించబడినది అలమేల్మంగ సౌందర్యము వర్ణించుటకు వీలు కానిది చిత్రించుటకు లభింపనిది. ఆమె అంగాంగ సౌందర్యమును వర్ణించుట జగన్నాధునకే అలవి కాని పనియైనది

ఆమె కన్నులు చిత్రించెనే కాని కడలు చిత్రించలేక చింతించినాడు నడుము యొక్క సౌందర్యమును చిత్రింప లెక వుస్సురనినాడు కుచములను చిత్రించెనే గాని కఠినత్వమును చిత్రింపలేకపోయినాడు వానినే తలపోయ దొడగినాడు ఆమె ముఖమును చిత్రింపగలిగినాడు కాని నవ్వులు నింపలేకపోయినాడు నిలువున నివ్వెఱగందినాడు తన కౌగిట యామె బంధింపబడినట్లు వ్రాయగలిగెను కాని రతిని వ్రాయలేక దానిని తలచుకొని మైమరచినాడు

మగువ చనువాడిన మాటలు దలచుకొంటా
తగిన చక్కదనాలు తలచు కొంటా
నగుతా బొందు సేసిన నసుపు దలచుకొంటా
వొగిలోన బవళించి వున్నాడు రమణుడు ||ఆకె||

పడతి పక్కన నుండిన భావము దలచు కొంటా
తడబాటు రతులెల్లా దలచు కొంటా
కడుమనోరథములు కల్పించి తలచు కొంటా
వుడివోని వేడుక తో నున్నాడు రమణుడు ||ఆకె||

అలమేలుమంగ చేతలన్నియు దలచు కొంటా
తలకొన్న నేరుపులు దలచు కొంటా
కలసి ఇప్పుడు తొంటి కతలు దలచుకొంటా
వెలయుచున్నాడు శ్రీ వేంకటరమణుడు ||ఆకె||

పరమాత్మ నుండి పరమాణువుగా విడివడిన జీవుడనెడి పదార్థము తిరిగి మూల పదార్థమైన పరమాత్మను చేరుకొనుటకు ఎంత ఆరాట పడునో, పరమాత్మయు తన నుండి వేరుపడిన అణువులన్నింటిని తిరిగి తనలో లీనము చేసికొనుటకే సంకల్పించు చుండును అట్టి సంకల్పమునకు చక్కని ఉదాహరణ పై కీర్తన నాయిక కొఱకు అనగా ఆత్మరూపమున నున్న, తనకు చెందిన తనను కోరుకొనెడి జీవునకు ఎంత తొందరగ తన సాన్నిధ్యబాగ్యము కల్పింతునాయని ఆయన ఆలోచించుచుండును ఆయన ఆలోచన అంతయు జీవుల గూర్చియే ఎంతటి తప్పులు చేసినను, శరీర సౌందర్యము లేకున్నను ఆత్మసౌందర్యముండినచొ ఆయన తన దరిని చేర్చుకొనును. జీవుడు తనను చేరుకొనునంత వరకు ఆయన జీవుని గూర్చి తలపోయుచుండును

పై కీర్తన యందు అలమేల్మంగ రూపమున నున్నవారు అన్నమయ్యగారే ఆయన అంతకు మునుపు స్వామి నందకముగా నున్నవాడే. నందకము నందలి ఒక అంశ అన్నమయ్యగా అవతరించినది కదా! దాని వలన నందకము యొక్క ప్రకాశము కొంత తగ్గినది దానిని మరల ప్రకాశింప జేయవలె అనగా తన సాన్నిధ్యము ప్రసాదింపవలె. వేద వేద్యుడైన ఆ స్వామి అంతర్యామును. నందక రూపమున స్వామిని నిరంతరము సేవించువాడగుట చేత, అన్నమయ్యగారు అలమేల్మంగను అడ్డము పెట్టుకొని జీవేశ్వరుల పరస్పర అవినాభావ

సంబంధమును లోకమునకు చాటినాడు.

ప్రకరాణాంతరము లందు పలుతావుల మనవి చేసినట్లు పైకి నాయికా నాయకుల శృంగారలీలా వర్ణనవలె పదములు గోచరించినను అన్నమయ్య కీర్తనలలోని అంతర్యము వేరు. ఆయన అంతరంగమున గల జగన్నాటక సూత్రధారి యొక్క అర్తత్రాణ పరాయణత్వమును, ఆయనకు జీవుల యెడ గల నిర్వ్యాజకరుణా కటాక్షమును ప్రపంచమునకు చాటి చెప్పవలెననెడి తపన ప్రతి కీర్తనయందును మనకు గోచరించును

జీవుడు తనను చేరుకొనుటలో ఆలస్యమైనచో ఆయన (పరమాత్మ) ఆరాటపడును. ఎదురు చూచును ఏదో యొక నెపమున జీవుని తన యొద్దకు తిరిగి రప్పించుకొనును. ఆయన సాన్నిధ్యమున లభించు సౌఖ్యము మరెచ్చటను లభింపదను సత్యమును భక్తాగ్రేసరు లెందరో చాటిచెప్పినారు. అన్నమయ్య తరువాతి వాడైన త్యాగయ్య సైతము ఇదేవ ఇషయమును ప్రకటించినాడు.

నిధి చాలా సుఖమా - రాముని స
న్నిధి సేవ సుఖమా - నిజముగ బల్కుమనసా ||నిధి||

ప్రపంచము నందలి రుచికరమైన ఎన్నియో మధుర పదార్థముల కన్న రామనామ మెన్నియోరెట్లు రుచికరమైనదని త్యాగయ్య చాటినాడు.

ఇట్లు పురుష విప్రలంభమును, ఈశ్వరుడు జీవుని తన వద్దకు రప్పించుకొనుటకు పడెడి అరాటముగను, చేసెడి ఆలోచనగను అన్నమయ్యగారు నిరూపించినారు.

ఇంకను పురుష విప్రలంభమునకు ఈ క్రింది కీర్తనను గూడ గ్రహింపవచ్చును. ఈ కీర్తన యందలి నాయకుడు పరాకు చిత్తగించినాడు ఎవరితోడను మాటలాడడు. వెరగందును వీటన్నిటికీ కారణము నాయికతో తాను జరిపిన తొల్లింటి వేడుకలు తలంచుకొనుటయే.

## ముఖారి 30-554

గుట్టు సేసుకున్నాడవు కోరియందరి ముందర
తొట్టినో వేడుకలెల్లా దొరవైవున్నాడవు ||పల్లవి||

అతివ చూచిన చూపు అచ్చొత్తినట్లనీ
మతిలో నున్నదో మాటలాడవు

తతినాకె మాటలు తఱచై సిపెపులలో
బతినాదా లిచ్చెనో పర్రాకైతివి ||గుట్టు||

అంగన మోవి తేనెల అన్నుపట్టెనో నీకు
వుంగిటి గొన్నట్లు వూరకున్నాడవు
సంగడి నాపె పైతావి సారె వాసన వచ్చెనో
అంగవించి యందే వోలలాడుతా నున్నాడవు ||గుట్టు||

అలమేలుమంగ రతుల అట్టె మరిగితివో
వెలయుచు నిలువున వెరగందేవు
అలరి శ్రీ వేంకటేశ ఆకె నిన్ను బోదించెనో
తలచి నన్ను గూడి తమకించేవు ||గుట్టు||

అన్నమాచార్యుని వలె నే అతని కుమారుడు పెద తిరుమలాచార్యుడును శృంగార సంకీర్తనములు రచించెను. ఆయన కీర్తనల లోను పురుష విప్రలంభమునకు మంచి స్థానము గలదు. మచ్చునకొకటి రెండు కీర్తనలుదహరింతును.

### వరాళి 23-25

మగవాడు భ్రమసిన మరి తెలుపగ రాదు
నగుబాటు చూడరమ్మ నాటకీడు కృష్ణుడు

### శంకరాభరణము 23-511

తలపులో విరహమో తరుణిపై మోహమో
చెలియ సింగారమో చెప్పరమ్మ చెలులారా

### వరాళి 23-20

నెలత బాసి వుండలేను నిమిషమెందు నేడ నాకు
తలపులో నీవలెనే తరుణి గలయుటెన్నడే

# శృంగారాభాసము

ఆభాసమనగా ప్రతిబింబము '' ఒకటి మఱియొక దానివలె కనబడుట అనుదోషము'' అనిసూర్యరాయాంధ్ర నిఘంటువు. ''రసాభాసమనగా బాహ్యదృష్టికి రసము వలె గాన్పించుట'' అనియు ఆ నిఘంటువే చెప్పుచు ''రసము ననుచితరీతిని స్పష్టపరచుట'' అనియు వివరించినది

1. సాహిత్య దర్పణ కారుడీ రసాభాసమును గూర్చియిటు లతెలిపెను.

''అనౌచిత్య ప్రవృత్తత్వే త్వాభాసో రస భావయోః'' అనౌచిత్యమ్యాలోక మర్యాదాతి క్రమణము అనగా లోక మర్యాద నతిక్రమించి ప్రవర్తిల్లిన నాయికా నాయకాదుల రసము'' (73) అని సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారి వివరణ.

2 ''తదాభాసా అనౌచిత్య ప్రవర్తితాః'' అని మమ్మట నిర్వచనము (74)

3 ''అనుచిత విభావాలంబత్వం రసాబాసత్వమ్'' అని జగన్నాధపండితుని నిర్వచనము (75)

ఇవి అన్ని రసముల విషయమున చెప్పబడిన లక్షణములు శృంగార విషయమున ఏ యే సందర్భములు రసాబాసములగునో పరిశీలింతము.

1. ''శృంగారవీరరౌద్రాద్భుత రసములు లోకోత్తర నాయకాశ్రయములగు నేనిమిక్కిలియు పరిపుష్టము లగును. కావుననే శృంగార రౌద్ర రసములు మ్లేచ్ఛాది విషయములగుచో రసాభాసములే యగుచున్నవి '' అని చెలమచర్ల రంగా చార్యుల వార్ని వివరణము (76)

2 '' ఏకత్రైవానురాగశ్చేత్తిర్యక్ మ్లేచ్ఛగతే పివా
యోషితే బహుసకితశ్చేద్రసాభాస స్త్రిధామతః'' అని

ప్రతాపరుద్రీయము (77)

3. పలువుర కొక భామినిపై
దలపును, నొక వారసతికి దగ బలువుర్పై
వలపును. మృగ విహగాదుల
కెలవు రసాభాసమయ్యె క్షితినెల్లన్సౌన్'

అని సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారి (కా.సం మునకు) ఆంధ్రవివరణము (78) అట్లేముని, గురు పత్నీగతరతియు రసాభాసమే యగుచున్నది.

4. ఉపనాయకసంస్థాయాం ముని గురు పత్నీ గతాయంచ బహునాయకవిషయాయాం రతౌ తథానుభయ యనిష్ఠాయా'' అని సాహిత్య దర్పణ కారుని లక్షణము (79)

ఈ లక్షణము లన్నిటిని పరిశీలించి చూడ అనౌచిత్య శృంగారము ఆభాస శృంగారముగా నెంచబడునని తెలియుచున్నది. లోకోత్తర నాయకాశ్రయములైనచో శృంగారము మొదలైన రసములు పరిపుష్టినొందుననియు విశదమగుచున్నది. మ్లేచ్ఛాది విషయకముగను తిర్యగాదుల యందును, పరస్త్రీగమనమందును చెప్పబడిన శృంగారము రసాభాసమగుననియు స్పష్టమగుచున్నది.

ఇంక బహునాయక విషయిక రతియు శృంగారాభాసముగనే చెప్పఁబడినది ఇది వేశ్యలకు మాత్రమే వర్తించును. బహునాయకానుర్తయగు ద్రౌపది యెడల నిది వర్తించదు. ఏలనన ఆమెది శాస్త్ర సమ్మతమైన వివాహము. గురుజన అనుమతి మీదఁ పాండవు లేవురును ఆమెను భార్యగా స్వీకరించిరి. ఆమె వారితో శృంగారకలాపము నిర్వర్తించుటకు సమయ నియమమున్నది. ఆసమయమున నామె నియమింప బడిన భర్తతోనే సంగమించును కావున నామె శృంగారము ఆభాసము కాదు.

అట్లే బహునాయికా గమనమును శృంగారాభాసము కాదు. అట్లైనచో దక్షిణ నాయక లక్షణములకు భంగము వాటిల్లును. కనుక దక్షిణనాయకులందీ శృంగారాభాసము వర్తించదు శ్రీ కృష్ణుని వంటి లోకోత్తరనాయకుల దక్షిణనాయకత్వమునకు దోషము లేదు.

ఇంక అన్నమాచార్యుని నాయకుడు దక్షిణుడుగ మనకు గోచరించును. ఆయన అలౌకికనాయకుడు. ఆయన నెఱపు శృంగార క్రియాకలాపములు ఇతర దేవతలతో పోల్పదగినవి కావు. మన లక్షణ శాస్త్రము లన్నియు మన కొరకు మనము సృజించుకొన్న కావ్యముల కొరకు మాత్రమే. అయా కావ్యములందలి పాత్రలు దేవ, మానవ, రాక్షసాది పాత్రలు ఇచటఁ దేవతలు గూడ జీవులే యను విషయము విస్మరిపరాదు. (తృతీయ ప్రకరణమున ఈ విషయము వివరింపబడినది.)

కనుక భగవద్విషయము చర్చించునపుడు లౌకిక దృష్టితో గాక పారమార్థిక దృష్టితో నాలోచింపవలెనమట దోషముగాదనుకొందును.

అయినచో మరి ఈ సంకీర్తనలయందు శృంగారాభాసమునకు తావెట్లు కలిగినది యని సందేహము కలుగ వచ్చును.

ఆభాసమనగా "ప్రతిబింబము" అని కదా నైఘంటికార్థము. అన్నమయ్య కీర్తనల యందు శృంగారాభాసము కలిగినట్లు బాహ్య దృష్టికి దోచును. కాని అంతర్దృష్టితో చూచినచో నదివట్టి భ్రమయే అని స్పష్టమగును. అట్లే అనౌచిత్యమను నర్థమును లక్షణకారులు ఆభాస పదమునకు చెప్పిరి. పరస్త్రీ, పరపురుష గమనాదులు అభాసముగనే వారు సూత్రీకరించిరి.

ఇది శ్రీ కృష్ణునియెడల వర్తించదు. ఆయన పట్ల అనౌచిత్యమను మాటకు తావు లేదనుట నిర్వివాదాంశము. ఆయనతోడి శృంగారము ఆత్మకు సంబంధించినది. సాక్షాద్భగవదవతారమైన శ్రీ కృష్ణునకు లౌకిక సంబంధముల నంటగట్టరాదు.

అట్లే అనౌచిత్య విషయమును పరిశీలించినచో ముఖ్యముగ స్త్రీ ఋతుమతి యైన కాలమున నామెతో సంగమించుట అనారోగ్యకరమైనదిగా పరిగణింతురు. అట్లు అంటరానిదైన స్త్రీ సంభోగము నిషేధింప బడినది. తత్సంబంధమైన శృంగార కీర్తనలు మాత్రమే ప్రస్తుత ముదహరింపబడి నాచే విశదీకరింపబడును. ఏలనన అన్యకాంతా సంభోగము మొదలగునవి ఇతః పూర్వమే ఆయా సందర్భములందు, వేంకటేశుడెట్లు ఆత్మ స్వరూపులై తన యందు భక్తి (ప్రేమ) గల వారిని (ఏ స్థితి యందున్నను) తన దరికి జేర్చి మోక్షము నొసంగునో ఈ క్రింద నుదహరింప బోవు కీర్తన యందు గమనింపవచ్చును.

నాయిక చెఱగు మాసి వున్నది. ఆమె అంటదగని స్థితిలో నున్నది. అయినను నాయకుడామెను వదల లేదు. ఆమె నంటుకొనినాడు. మాటాడినాడు ఆమె పై పూవులను చల్లినాడు ఆమె విరహమును తట్టుకొనలేక కప్పురము చల్లుకొనగా దోసిలొగ్గినాడు ఆమె ధౌతవస్త్రము (మణుగుచీర) కట్టుకోగా తమకమాపుకొనలేక కౌగిలించుకొనినాడు. బలవంతమున ఆమెతో కూడినాడు. శృంగారపరమున జూచినచో నిది అభాసమే. కాని ఆధ్యాత్మిక పరముగ జూచినచో ఇది జీవేశ్వరుల విశిష్ట సంగమముగ ఎఱుగ వచ్చును.

ఇచట జీవుడు పాపములు చేసినవాడు. ఆతని ఆత్మ మలినమైనది. అయినను అతడు హరినామస్మరణ మానలేదు. ఆ నామస్మరణయే ఆ విరహ తాపమే ఆతని దోషములను బోగొట్టినది. ఈశ్వర సన్నిధానమునకు మార్గము సుగమము చేసినది. అందుకే ఆయనయే స్వయముగా వచ్చి నిర్వైరగున నున్న నాయికను, మౌనముగనున్న ఆత్మ స్వరూపమును తనలో నైక్యము గావించుకొనినాడు.

## కాంబోది 31-126

బుద్ధి చెప్పరే పతికి పొలతులాల
అద్దుక యిట్టే జలక మాడుతానుందానను ||పల్లవి||

చెఱగు మాసి నేను సిగ్గుతో నుండగాను
అఱలేక నన్నితడే లంట వచ్చేనే
నెఱయ మోనము తోడ నిలుచుక నేనుండగా
మఱియు నన్నితడేల మాటలాడించేనే ||బుద్ధి||

పాసివున్న తమకాన పర్వాకై నేనుండగాను
వేసరక విరులను వేసేనిదేలే
రాసి విరహాన గప్పురము మేన జల్లుకోగా
దోసమెఱుగక యేల దోసిలొగ్గేనే ||బుద్ధి||

చెలరేగి నేను మణుగు చీరకట్టు కొన గాను
కలసియిప్పుడే యెట్టు కాగిలించీనే
యెలమి శ్రీ వేంకటేశుడిటు నే గాచుకుండగా
బలిమి సేసి యెంత పచ్చిగా గూడెనే ||బుద్ధి||

ఆమె మణుగు చీర ధరించు నంత వరకు ఆమెను సమీపించేనే కాని తాకలేదు. అనగా తాను చేసిన పాపములకై పశ్చాత్తాపము నొంది, మనసా వాచ భగవన్నామస్మరణ చేయువరకు ఈశ్వరుడు జీవుని గమనించినాడు. తన వైపునకు జీవుని మరల్చుకొనుటకు ప్రయత్నించినాడు. జీవుని కేది తాపహరమో అదియే తనకును సమర్పించమనినాడు.

జీవుడు పశ్చాత్తాపము నందు సమయమున అతని సమీపించి మౌనముగ నున్నపుడు తన నామస్మరణ చేయునట్లు చేసినాడు సర్వేశ్వరుడు స్మరణము చేయుచు స్వామి సన్నిధి కొరకు పరితపించుచు పర్వాకైన తనను తన కటాక్షములనెడు కలువపూలతో చైతన్యవంతునిగ జేసినాడు. నామస్మరణ మాత్రమున పాపపంకిలమైన మనసు ధౌత వస్త్రమువలె స్వచ్ఛమైన సమయమున జీవునకు తన సాన్నిధ్యము నొసంగి దరిజేర్చినాడు. తనలో నైక్యముగావించుకొనినాడు.

ఇంటి నాయిక అన్నమయ్యే కావచ్చును ఆయన తనను తాను గోపికగానె మరొక భక్తునిగాని భావించుకొని తన్మయమున రచించిన కీర్తనయిది తన పాప పంకిలమైన జీవిత బంధమును స్వామి యిట్లు తెగ్గోసినాడని ఆయన ప్రకటించినాడు

ఈ సందర్భమున లోక కంటకులుగా ప్రసిద్ధి చెందిన హిరణ్యాక్ష హిరణ్య కశ్యపులు రావణ కుంభకర్ణులు శిశుపాల దంతవక్త్రులు స్మరణీయులు నిజముగ ఇతర భక్తులకన్న వారే ధన్యులు అంటబడగని స్థితిలో నున్న నాయికల వంటివారు వారి నుద్ధరించుటకై స్వయముగ శ్రీమన్నారాయణుడే వైకుంఠము నుండి దిగివచ్చినాడు మోక్షపదవి నొసంగినాడు

అన్నమయ్యగారి కీర్తనలలో శృంగారాభాస విభాగమునకు చెందిన కీర్తనలన్నింటిలోను ''అంటబడగని వాన నేను'' అను భావము గల కీర్తనలె అధికము ఈ క్రింది కీర్తనను గమనింపుడు

## సామంతం 12-13

ఎట్టువోరిచెనో కాని యింత దడవు అప్పు
దట్టునిట్టె దల్లడించె నతడంతలోనని పల్లవి॥

అంటగాక వున్నదానవని యెఱుగకయాత
డింటి కట్టెరాగా నీవు నెదురు వోయి
వొంటకున్న రీతి దవ్వుల నున్న నిన్ను జూచి
అంటజెరి చిన్నబోయె నతడంతలోననే ॥ఎట్టు॥

పేడుక నాతడు రాగా వెనక వెనకకు బోయి
తోడనే సిగ్గును నవ్వు దొలకగాను
వీడి వీడని కొప్పు విసరుచు దలయూచ
నాదనె మూర్ఛవోయె నతడంతలోననె ॥ఎట్టు॥

చయ్యన బన్నీటి మజ్జన మాడి నీవు నేడు
ఉయ్యాల మంచము మీద నుండగాను
నెయ్యపు వేంకటపతి నినుగూడి పరవశ
మయ్యానబ్బురముగ నతడంతలోననే ॥ఎట్టు॥

ఇట్టివే ఈ క్రింది కీర్తన పరిశీలనార్హము

## మంగళ కౌశిక 12-38

తన్నుబాసి నేనింత దంటనట యీ
వెన్నెల బాయట రేయి వేగుటింత జాలదా

* డా వేటూరి ఆనందమూర్తిగారు ఉదహరించిన శృంగారాభాసమున కుదాహరణములు

## 1. శ్రీరాగం

మంచమదె యిల్లదె మాటలేటికి
నించిన వేడుక తోడ నిద్దురించులోనను ||పల్లవి||

ఇంటికి జెప్పియంపితి నిందాకా నేలరావైతి
వంటగార తొలగితి నట్టివుండరా
వెంట వచ్చిన చెలిచే వింటిమి నీ సుద్దులెల్లా
వొంటివైనం బవ్వళించు ఒక్కండవేలొనను (3-521)

## 2. శంకరా భరణము

ఆయద నేమారితినే నంటిపట్టి నిలుపనైతి
కాయమిదె ప్రాయమిదె ఘనుడెందున్నాడో ||పల్లవి||

కాంతునినే గలలోన గౌగలించినట్లాయె
సంతలోనె పులకించి నట్లాయెను
చెతుల నాచెక్కులెల్ల జెమరించినట్లాయె
వింతలెల్లా మేంనగంటి విభుడెందున్నాడో (3-198)

ఈ క్రింది కీర్తనలో ఒకే నాయకుని వలచిన ప్రియురాండ్రిద్దరు తమలో తామె నాయికా నాయకులుగా భ్రమపడి ఆలింగనాదులు చేసికొని తమ తప్పు తెలిసికొనుట చక్కగా
* వర్ణింపబడినది. ఇది పెద తిరుమలా చార్యుని కీర్తన.

ఇద్దరమాడువారమే ఇన్నీరోత
వొద్దిక మాలోనేమే మొత్తి నవ్వితిమిరా ||పల్లవి||

పవ్వళించి నీవు నేను బానుపుపై నుండగాను
యివ్వతో నీవంటా నన్ను నిటులేపెరా
రవ్వగా నీవే నన్ను రతికి బిలిచేవంటా
నెవ్వగ గొగిలించితి నిదుర కన్నులను || ఇద్దరు ||

కదిసి నీవును నేను కౌగలించుకుండగానె
సుదతి నీవంటా నన్ను చేటడిగెరా
మధ్య పరవశాన మరి నీ వంటానాపె
వదనమున వీడెము వడి నేనిడితిరా || ఇద్దరు||

ముచ్చట నీవును నేను ముసుగుపెట్టుకుండగా
మచ్చికె నీవంటా నాతో మాట చెప్పెరా
యిచ్చకాడ శ్రీ వేంకటేశుడ నీ వంటానాపె
నచ్చి నన్ను గూడగా నడుమ నీ వుంటివి || ఇద్దరు|| 23-73

అన్నమాచార్యునివి .-

## హిజ్జిరాగం

1. అది నీకు దారుకాణ వునో కాదో కాని
కదిసి చప్పగ బోతే కతలయ్యీ గాని 27-442

2 ఎన్నటికెన్నటి పొందు యిన్నీ నేను
ఎన్నుకొను నా మనసు యిన్నీ నేను 27-451

# సింహావలోకనము

"వాగర్థా వివసంపృక్తౌ
వాగర్థ ప్రతిపత్తయే"

అనినట్లు అన్నమయ్య పదములనుండి భక్తిని విడదీయలేము. అన్నమయ్య పదములనగనే భక్తి దక్క అన్యము తలంపునకు రాదు ఆ పదములు అధ్యాత్మికములే కావలసిన పని లేదు. శృంగార రస సమ్మిళితములైనను భక్తియే వాని కాలంబనములు.

అట్లు భక్తి చిప్పిల్లెడు కీర్తనలు ముప్పదిరెండు వేలు రచించెను. అన్ని కీర్తనలయందును శ్రీనివాసుడే సాక్షాత్కరించునని ఇప్పటి వరకు లభించిన పన్నెండువేల కీర్తనల వలన తెలియుచున్నది. వీనిలో నాకు ఉపలభ్యమైన శృంగార సంకీర్తనలు రమా రమి ఏడువేలు. అట్టి శృంగార సంకీర్తనలయందు మధుర భక్తిని నిరూపించుటకు ప్రయత్నము చేసితిని.

అన్నమయ్యగారి కీర్తనలలో జీవేశ్వరసంబంధము సుస్పష్టము. శ్రీనివాసుడు పరమాత్మ అన్నమయ్యగారు ఆత్మ. అన్నమయ్యగారిది ఆత్మాశ్రయ కవిత్వమని చెప్పవలెను. ఎందుకనగా ఆయన రచనలు కేవలము ఒక కథనో గాథనో వర్ణించునవి కావు. ఆయన ఆత్మకు ఎప్పటికేది తలంపునకు వచ్చునో, ఏ భావనా పరంపరలు ఎదలోపలి అంచులనుండి ఎప్పుడు పెల్లుబుకునో, శ్రీమన్నారాయణుని ఏ అవతారలీలా విశేషములు మదిలో దోబూచులాడి ఆయనను పరవశింపజేయునో అప్పుడు ఆయా విశేషములు రసనాగ్రమున పదములై, కీర్తనలై, శృంగార సంకీర్తనలై నాట్యమాడును. అటనట హరికథా వర్ణనలు చోటు చేసికొనినను అవి అన్నమయ్యగారి భావనాపరంపరకు ఆలంబనలు మాత్రమే. ప్రస్తుతము లభించిన కీర్తనా ధోరణిని బట్టి చూడగా నూటికి తొంబదివంతులు శ్రీవంకటేశ్వరుని (శ్రీమన్నారాయణుని) శృంగార లీలా వర్ణనమే ప్రముఖస్థానము నాక్రమించినది. ఆత్మ పరమాత్మయందు కేంద్రీకరింపబడి ముప్పిరిగొన్న భక్తి నుండి, గంగాప్రవాహమువలె నిరంతరాయముగ సాగిన రచనా పరంపర అది. మధుర భక్తి రసామృత కలశమా రచాన ప్రక్రియ అది అమూల్యమైనది. దాని యందలి గుణగణములివి మాత్రమే యని నిర్ధారించి చెప్పలేము అనంత కల్యాణ గుణగణ సంపన్నుడైన ఆముకుందుని గురించి కీర్తించిన ఆ సాహితీ ప్రపంచమును గూర్చి ఎంత చెప్పినను తనివి తీరదు శ్రోతలకు. పఠితలకు ఇంకను ఆ ఉక్తిలో ఏదో లోపించినట్లు తోచును అన్నమయ్య రచనా వైచిత్రి. తెలుగు నుడికారపు సొంపులలోని మాధుర్యము అనన్య సామాన్యము.

డా వేటూరి ఆనందమూర్తిగారి మాటలలో

'' ఆంధ్రసాహిత్య నందనోద్యానమున తాళ్ళపాక వారిదొక సుందర బృందావనము. అందలి సాహితీ ప్రక్రియా నికుంజపుంజముల సొంపున, సరసకవితాశాఖాశైత్యంపుమంపున, మధుర భక్తి రసప్రవాహముల ముంపున, మనోజ్ఞరస భావనా కుసుమ సౌరభముల గుబాళింపున శ్రీదేవీ శ్రీనివాసుల ప్రణయ లీలావిలాసములే క్రమముల్తై కముల కింపును గూర్చినవి. వీనులకు విందొనర్చినవి'' (80)

అట్టి రసామృత ప్రవాహమున రాగము మధుర మోహనమై గోపాలుని వంశీజనిత దివ్యనాదమై కొనలు సాగి ప్రపన్నుల హృదయముల నోలలాడినది.

అన్నమయ్య-శ్రీనివాసుల సంబంధము అనన్య సామాన్యము. అన్నమయ్యకుముందు వెనుకల యుగములలో భక్తులెంతమంది యున్నను వారిని అన్నమయ్యతో పోల్చుటకు వీలు లేదని చెప్పుచు తత్కారణములను అన్నమయ్యగారి ఈ క్రిందికీర్తనలో చక్కగా వివరించినారు అంత గొప్పగా శ్రీనివాసుని తోడి ఆత్మ సంబంధము నేర్పరచుకొనిన వాడాయన. అనితర సాధ్యమైన నాయికా నాయక సంబంధము వారిది. ప్రతి పదమున అడుగడుగున సంయోగ వియోగములు అవ్యవధానముగ కొనసాగినవి.

**(24-217)**

ఎందరు లేరు సతులు - ఎన్నెన్ని చందాల వారు
చెందిననీ నా పొందువలె - చెప్పరాదుగాని ||పల్లవి||

వేడుక మాటలెన్నైనా - వేవేలు నాడగవచ్చు
కూడి మాడి వుండేది - గురుతుగాని
చూడ చూడ వినయాలు - సూడిదలు పట్టవచ్చు
యీడు జోడైన వలపు - యెక్కుడు గాని || ఎందరు||

ననిచి యెంతవడైనా - నవ్వులు నవ్వగవచ్చు
మనసెనసి వుండుటే - మర్మము గాని
చెనికి వినోదపు సేతలు - సేయగ వచ్చు
కొనసాగెడు కూటమే - కొరతౌ గాని || ఎందరు||

యెదురు జడి నుండి - ఇంపులు చల్లగ వచ్చు
వదలని కాగిళ్ళే - వైపులు గాని
ఇదివో శ్రీ వేంకటేశ - ఏలితివి నన్నునిట్టి
పొదిగొన్న సంతోసాలే -పోదులౌగాని || ఎందరు||

తమ ఇరువురి సంబంధము అద్వితీయమట ప్రేమకు చిహ్నము కూడిమాడి ఉండుట సహనమైన వలపు కన్న మిన్న యైన కానుక మరొకటి లేదు. కలిసిమెలసి ఎంతగా నవ్వుకొన్నను మనసెనసి ఉండని యెడ అది వ్యర్థపు బ్రదుకే ఎన్ని వినోదములు నడచినను ఇరువురి నడుమ '' కొనసాగెడు కూటమి లేనిచో అది రాణింపదు

''ధ్యానంచ తైలధారావత్ అవిచ్ఛిన స్మృతి సంతానరూపమ్'' అను వివరణకు అన్నమయ్య తెనుగు వివరణ ''కొనసాగెడు కూటమి'' అనునది అంత పొడవైన సంస్కృత నిర్వచనమునకు అన్నమయ్యగారి తెనుగుసేత అపూర్వమైనది. తెనుగు నుడికారపు సొయగము, తీయదనము, నిరాడంబరత అన్నమయ్యగారికి తెలిసినంత మరొకరికి తెలియవనుట అతిశయోక్తి కాదేమో!

''మంగళం మహత్''

# సంఖ్యాసూచి


1 తాళ్ళపాకకవులపదకవితలు - భాషా ప్రయోగవిశేషాలు - డా వేటూరి ఆనందమూర్తి పుట 83

2. కావ్యాలంకారసంగ్రహము పీఠిక 307, 310, శ్రీసన్నిధానం సత్యనారాయణగారు

3 Introduction to Sringara Manjari of saint Akbar shah - edited and published by Dr Raghavan - Page 90

4 తాళ్ళపాకకవులపదకవితలు - భాషా ప్రయోగవిశేషాలు. - డా. వేటూరి ఆనందమూర్తి పుట 84

5 రసమంజరి నీలకంఠ యజ్వ ఆంధ్రానువాదము.

6 కా సంగ్రంహము. సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి.

7 సాహిత్య దర్పణము - వేదం వెంకటరామశాస్త్రి పుట 49

8 నాట్య శాస్త్రము - డా పి యస్ ఆర్. అప్పారావు పుట 67

9 తాళ్ళపాకకవులపదకవితలు - భాషా ప్రయోగవిశేషాలు - డా. వేటూరి ఆనందమూర్తి - పుట 98

10 రసమంజరి

11 కా సంగ్రహము - స సూ శాస్త్రి

12 నాట్య శాస్త్రము - పి యస్ ఆర్. అప్పారావు పుట 678

13 నీలకంఠ యజ్వ - రసమంజరి

14 కా సం

15 నా శా, - డా పి యస్ ఆర్ అప్పారావు

16 సాహిత్య దర్పణము - వేదంవారు

17. मीरा के पद सकलन - चौकंबा प्रैस

18 శ్రీ శఠకోప వాక్సుధ (7-2-4)

19 ముకుందమాల - శ్రీ కులశేఖరాళ్వార్లు - శ్లోక సంఖ్య 11

20 శృంగార మంజరి - Introduction to sringara Manjari of St Akbar Shah by Dr V Raghavan P-79 Pub - 1951

21. తాళ్ళపాక కవుల పదకవితలు - భాషాప్రయోగ విశేషాలు - డా వే ఆనందమూర్తి
పుట - 99,100

22. ముకుందమాల - కులశేఖరాళ్వార్లు - శ్లోకం 17

23. శ్రీ మహాభాగవతము పోతన - సప్తమస్కంధము. పద్య సంఖ్య 169, 170, 171.

24. శ్రీ శఠకోప వాక్సుధ - 6-2-2 కె టి యల్. నరసింహాచార్యులు.

25. తాళ్ళపాక కవుల పదకవితలు - భాషా ప్రయోగ విశేషాలు - డా వే ఆనందమూర్తి
పుట. 100, 101.

25/1. मीरा बृहत पद संग्रह - शबनम - पु.सं. 36, पद.सं. 37.

26. డా వేటూరి ఆనందమూర్తి తాళ్ళపాక కవుల పద కవితలు - భాషా ప్రయోగ విశేషాలు
- పుట 96.

27. సాహిత్య దర్పణము - వేదం వారి అనువాదము

28 రసమంజరి - నీలకంఠ యజ్వ - పుట 54 (అనువాదము)

29. ఆంధ్రమహాభాగవతము - 10 - 1010

30. ,, 10 - 1011

31. ,, 10 - 1044

32. గిడుగు సీతాపతిగారి క్షేత్రయ్య పదములు - 161.

33 ,, 30

34. मीरा बृहत पद संग्रह -शबनम -पु. सं. 226 - पद 281

35. ఆం. సాహిత్య దర్పణము. వే వేం. రాయశాస్త్రి పుట 61

36. భగవద్గీత - 2-25

37. ముకుందమాల -8

38 నాట్యశాస్త్రము - పి యస్ ఆర్ అప్పారావు పుట - 674

39 ,, ,, ,,

40 ఆం సా. దర్పణము వే వేం శాస్త్రి పుట 83

41 నాట్య శాస్త్రము - డా పి యస్ ఆర్. అప్పారావు పుట 704

42 గీతగోవిందం - 3వ అష్టపది

43 తాళ్ళపాక కవుల పదకవితలు. భాషా ప్రయోగ విశేషాలు. ద్వితీయ సంపుటము – డా వేటూరి ఆనందమూర్తి పుటలు 85, 86, 87, 88.

44. ,, ,, పుట – 89

45 ,, ,, పుట – 90.

46. ,, ,, పుట – 83.

47. భగవద్భక్తి రసాయనమ్ – మ.సూ.స. ద్వితీయోల్లాసము – 58 శ్లోకం.

48. సూర్యరాయాంధ్ర నిఘంటువు.

49. భగవద్భక్తి రసాయనమ్ ద్వితీయోల్లాసమ్ – 60వ శ్లోకము.

50 అన్నమాచార్య జీవిత చరిత్ర – పీఠిక. వేటూరి ప్రభాకర శాస్త్రి పుట. 16.

51. చిన తిరుమలాచార్యుని సంకీర్తన లక్షణము – 12వ సంపుటము.

52. శ్రీ మహాభాగవతము – పోతనామాత్యుడు – 7–170

53 తా.ప. కవితలు, భాషా ప్రయోగ విశేషాలు. ద్వితీయ సంపుటము డా. వే. ఆనందమూర్తి – పుట 91.

54. ,, ,, పుట 91

55. కావ్యాలంకార సంగ్రహము – స.సూ. శా. పు–61.

56. తాళ్ళపాక కవుల భాషా విశేషాలు – డా.వే. ఆ.మూ. 87.

57. అన్నమాచార్య శృంగార సంకీర్తనలు – సం.2, పీఠికపు – 15.

58 అన్నమాచార్య శృంగార సంకీర్తనలు పుట. 20. 2వ సం.

60. కా.సం. స.సూ. శాస్త్రం. పుట. 61.

61. శ్రీ మహాభాగవతము – పోతన – 10–1433 పు. 486.

62. శ్రీ మహాభాగవతము – పోతన 10–14–54 పు. 488.

63 ఉత్తర భారత సాహిత్యము – వంగ సాహిత్య చరిత్ర – పురిపండా అప్పలస్వామి – పు. 20, 21.

64. ,, ,, ,,

65. తాళ్ళపాక కవుల పదకవితలు – పు. 87 ద్వితీయ సంపుటము.

66 అం. ప్ర. యశోభూషణము – డా. చ. రంగాచార్యులు. పు. 36.

67. శ్రీ మహాభాగవతము – 10–971 పు. –422 తె.వి.వి. ప్రచురణ.

68. రసమంజరి - అనువాదము నీలకంఠయజ్వ పు-53.
69. తా.పా.క.ప.క.భా.ప్ర.వి. - డా. వే అ మూ. పు. 112, 113.
70. శ్రీ మహాభాగవతము - పోతన, దశమస్కంధము - 1430 పద్యం.
71. " " " 1434 పద్యం
72. మనుచరిత్ర - అల్లసాని పెద్దన
73. కావ్యాలంకార సంగ్రహము - తృతీయా శ్వాసము - పు. 413.
74. కావ్యప్రకాశము - మమ్మటుడు IV 49వ సూత్రము.
75. రసగంగాధరము - జగన్నాథ పండితుడు పు. 99.
76. అం.ప్ర. యశోభూషణము. చె. రంగచార్యులు పు-294
77. ప్రతాపరుద్ర యశోభూషణము. విద్యానాథుడు. రసప్రకరణము.
78. కావ్యాలంకార సంగ్రహము - 142 వ పద్యం - తృతీయాశ్వాసము పు. 413
79. సాహిత్య దర్పణము - విశ్వనాథుడు - తృతీయ పరిచ్ఛేదము.
80. తా.క. పదకవితలు - ద్వితీయ సంపుటము - డా.వే. అ.మూర్తి. పు-102
81. Introduction to sringara Manjari by Dr. V. Raghavan - Page - 33
82. " " page 38
83. శృంగార మంజరీ - అక్బర్ షా విరచితము - పు. 54 శ్లో. 308.
84. Introduction to sringara Manjari Dr. V. Raghavan Page - 39.
85. శృంగార మంజరీ అక్బర్ షా విరచితము పు. 54 శ్లో. 309.
86. Introduction to sringara manjari by Dr. V. Raghavan - page 40
87. శృంగార మంజరి - అక్బర్‌షా - పు. 54, శ్లో. 310.
88. Introduction to sringara Manjari, Page - 41.
89. శృంగార మంజరి - అక్బర్‌షా - పు. 55 శ్లో. 311.
90. " " శ్లో. 312
91. తాళ్ళపాక కవుల పదకవితలు డా. వే. అ. మూ.పు. 102, 103.
92. ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు - తెలుగు అకాడమీ 1978
93. Introduction to sringara Manjari by Dr. V. Raghavan - Page 39
94. తాళ్ళపాక కవుల పదకవితలు - డా. వే. అ.మూ.

# ఉపయుక్త గ్రంథసూచి


1. అన్నమాచార్య జీవిత చరిత్రము (ద్విపద) - తాళ్ళపాక చినతిరుమలాచార్యులు
2. అష్టమహిషీ కళ్యాణము - తాళ్ళపాక తిరువేంగళనాథుడు
3. సంకీర్తనా లక్షణము - తా.చి. తిరుమలాచార్యులు.
4. గీతగోవిందకావ్యము - జయదేవ కవి.
5. సింహగిరి వచనములు - కృష్ణమాచార్యులు - డాక్టర్. ఎం. కులశేఖరరావు గారి పరిష్కృతప్రతి.
6 నాట్య శాస్త్రము - డాక్టర్ పి. యస్. ఆర్. అప్పారావు.
7. ఉత్తర రామచరిత్ర - భవభూతి
8. నారద భక్తి సూత్రములు - శ్రీరామకృష్ణ ఘరప్రచురణ.
9 శాండిల్య భక్తి సూత్రములు ,,
10. శ్వేతాశ్వతరోపనిషత్తు
11 శ్రీమద్భగవద్గీత
12 యోగ సూత్రవృత్తి - భోజదేవుడు
13 శ్రీమద్భాగవతము
14 ముకుందమాల
15 శివానందలహరి
16 తిరువాయ్ మొజి - నమ్మాళ్వారు
17. తిరుప్పావు - గోదాదేవి
18 భగవద్భక్తి రసాయనము - మధుసూదన సరస్వతి
19 అన్నమాచార్య చరిత్ర పీఠిక - డా. వేటూరి ప్రభాకర శాస్త్రి
20. క్షేత్రయ్య పదసాహిత్యము - విస్సా అప్పారావు.
21 త్యాగరాజస్వామి కృతులు
22 రామదాసు కీర్తనలు

23. తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు - డా వే ఆనందమూర్తి.
24. తాళ్ళపాక కవుల పదకవితలు - భాషాప్రయోగ విశేషాలు - డా. వేం. ఆనందమూర్తి
25. తెలుగులో పరిశోధన - రజతోత్సవ సంచిక
26. కావ్యాలంకార సంగ్రహము - సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి.
27. ఆంధ్రప్రతాపరుద్ర యశోభూషణము - డా. చలమచర్ల రంగాచార్యులు.
28. రసమంజరి - అమరవాది నీలకంఠయజ్వ
29. శృంగార మంజరి - అక్బర్‌షా
30. అద్వైతసిద్ధి - మధుసూదన సరస్వతి.
31. సాహిత్య దర్పణము - వేదం వేంకట రాయశాస్త్రి.
32. కావ్య ప్రకాశము - మమ్మటుడు
33. రసగంగాధరము - జగన్నాథ పండితుడు
34. శ్రీ శఠకోపవాక్సుధ - కె. టి. యల్. నరసింహాచార్యులు.
35. ఉత్తరభారత సాహిత్యము - పురిపండా అప్పలస్వామి.
36. మనుచరిత్ర - అల్లసాని పెద్దన.
37. విక్రమోర్వశీయం - కాళిదాసు
38. శ్రీ వైష్ణవపత్రిక - రజతోత్సవ సంచిక, 1976 మే.
39. దివ్య ప్రబంధ మాధురి - కె. టి. యల్. నరసింహాచార్యులు.
40. వైష్ణవాంధ్ర వాఙ్మయము - డా. వే. ఆనందమూర్తి.
41. తెలుగు కవులు - భక్తి తత్త్వము - మహతీ శంకర్.
42. ఆంధ్రవాగ్గేయ కార చరిత్రము - బాలంత్రపు రజనీకాంతరావు.
43. శృంగార పదములు - అజ్ఞాతకవి పీఠిక - డా. వడ్లమూడి రాధాకృష్ణయ్య.
44. తెలుగుసాహిత్యంలో దేశకవిత గేయవాఙ్మయము - డాక్టర్ ఆర్. వి. యస్. సుందరం.
45. తెలుగులో పదకవిత - డా. ఎస్. గంగప్ప
46. శ్రీ భాష్యమ్ - భగవద్రామానుజులు

47. ఆంధ్రశతక సాహిత్యము - డా కె. గోపాల కృష్ణరావు గారు

48. శ్రీగీతామృతము - శ్రీ సీతారామ యతీంద్రులు

49. భక్తి యోగము - చిరంతనానందస్వామి

50. శరకోపగీతామృతము - కె టి యల్. నరసింహాచార్యులు

51 శ్రీ రామకృష్ణ జీవిత చరిత్ర

52. సూర్యరాయాంధ్ర నిఘంటువు.

53. ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు తెలుగు అకాడమీ

54. శ్రీమదాంధ్రమహాభాగవతమ్ - పోతన.

55 Minor works of Tallapakam Poets T.T.D. Publication.

56 The modern study of literature - R.G. Moulton

57 Methods and materials of literary criticism - R G moulton.

58 The great integraters - the saints of India - by V Raghavan.

59 The Philosophy of visishtadvaitha - by P N Srinivasachari.

60 Number of Rasas by V Raghavan.

61. The Bhakti cult in ancient India by Prof. Bhagabat Kumar Shastri M A

62 The gospal of love - by Lala Kannomal.

63 The origin and development of vaishnavism - by S Jaiswal.

64 Introduction to sringara Manjari of St. Akbar Shah - by Dr. V Raghavan.

65 मीरा बृहत पद संग्रह - शबनम

66. सूरदास और अन्नमाचार्य - डा. संगमेशम

# కృతజ్ఞతాంజలి

శ్రీ అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలలో మధుర భక్తి అను నంశముపై పరిశోధనగావింతుననిమనవిచేయగానే అంగీకరించి తగు సలహాలనిచ్చుచు పుత్రవాత్సల్యముతో నన్నభిమానించి, ఈ కార్యక్రమంలో అత్యంతము ప్రోత్సహించిన మా తొలి పర్యవేక్షకులు కీ శే. కోవూరి గోపాలకృష్ణ రావు M.A., Ph D గారికి కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు

వారి అనంతరము విశ్వవిద్యాలయము వారి ఆదేశము మేరకు 1987 నుండి పరిశోధన విషయమున నాకు పర్యవేక్షకులుగా వ్యవహరించుచు అవసరమైన సూచనలు సకాలములో నొసంగుచు ఎనలేని ఆదరాభిమానములు చూపుచు నా పరిశోధనా వ్యాసంగము సంపూర్ణమగుటకు సహృదయంతో నన్ను ప్రోత్సహించిన డా ఎల్లూరి శివారెడ్డి గారికి వినయ పూర్వక కృతజ్ఞతాంజలులు.

నా పరిశోధనాంశమును విని అభినందించి ఆశీర్వదించిన అనాటి (1982) తెలుగు శాఖాధ్యక్షులు బి రామరాజుగారికి, డా. యం కులశేఖరరావు గారికి, శ్రీమతి పి యశోదారెడ్డిగారికి నామనః పూర్వక కృతజతాంజలులు

నేను కోరిన వెంటనే నా కొరకు సమయమును కేటాయించి తమ తిరుమాళిగలో నా సందేహ నివృత్తి చేయుచు, అవసరమైన గ్రంధావళిని దయచేసి, నా అభిప్రాయములను శ్రద్ధగా విన తగు సూచనలిచ్చుచు పరిశోధనకు సమగ్ర స్వరూపము చేకూరుటకు దోహదమొనర్చిన ఆచార్యులు, నాటి తెలుగు శాఖాధ్యక్షులు (ఉస్మానియా విశ్వ విద్యాలయము) గౌరవనీయ డా వేటూరి ఆనందమూర్తి గారికి హృదయ పూర్వక కృతజ్ఞతాంజలులు

పరిశోధనా కార్యక్రమానికి ప్రోత్సహించి అన్ని విధములుగ నాకు అండదండలుగ నిలిచి సోదర వాత్సల్యమున నన్నాదరించిన మిత్రులు శ్రీమాన్ మాడభూషి రంగాచార్యులు (ఆంధ్రోపన్యాసకులు, నల్లగొండ) గారికి నమస్సుమాంజలులు.

సాహిత్య, వేదాంత, భక్తి అంశములలో సంశయనివృత్తి గావించి అవ్యాజకరుణా కటాక్షమున నన్నాశీర్వదించిన గురువర్యులు శ్రీమాన్ మొలుగు రామానుజాచార్యులు వారికి సాష్టాంగ ప్రణామ పూర్వక కృతజ్ఞతాంజలులు

ఈ పరిశోధనమునకు కీర్తనా సాహిత్యము మూలము అట్టి కీర్తనలకు సంబంధించిన గ్రంధరాజములను సంపాదించుటలో తగిన సహాయ సహకారాలందించిన మిత్రులు శ్రీ కె పాండురంగారావు (లైబ్రేరియన్, నల్లగొండ) గారికి మనఃపూర్వక కృతజ్ఞతలు

ఆదే విధముగ ఈ పరిశోధనకు మూలమైన భక్తిరస నిరూపణము కొరకు అవసరమైన గ్రంథసంపాదనమున ఇతోధికసహాయసహకారాలందించిన చి. డా. ఎస్ టి.కె. రంగాచార్యునకు (రాజమండ్రి) మనః పూర్వక ఆశీస్సులు.

ఇంతియ కాక వివిధ గ్రంథాలయాధిపతులు, మిత్రులు, నా సహ ఉపన్యాసకులు, శిష్యులు – ఎందరో నాయీ పరిశోధనా విషయమున బహుముఖములుగ తమ తమ సహాయ సహకారముల నందించినారు. వారందరకు పేరు పేరున కృతజతలు.

అన్నింటికన్నా ముఖ్యమైనది విషయసేకరణ – తదుపరి శుద్ధప్రతి సిద్ధము చేయుట ఈ రెండు విషయములందును నాకు చేదోడు వాదోడుగ నండి, నేను సందర్శించిన గ్రంథాలయములకు ప్రయాసకు నోర్చి నాతో విచ్చేసి లేఖకుడుగ నాకు సహకరించిన మా మేనల్లుడు చి. మొలుగు రామమోహనాచార్యునకు ఆశీస్సులు.

అదే విధముగ నా సోదరులు శ్రీమాన్ అంగలూరు పురుషోత్తమాచార్యులు (ఉపాధ్యాయులు) గారు వ్యాసము నందలి నాలుగు ప్రకరణములకు లేఖకులుగా నుండియు, నాతో కలిసి చెన్నపురికి రెండు మూడు మారులు విచ్చేసి గ్రంథాన్వేషణమునను, రచనమందును అనంతమైన సహకారము నిచ్చినారు. వారికి మనః పూర్వక కృతజ్ఞతలు.

అట్లే పంచమ ప్రకరణము అత్యంత కీలకమైనది. దాని శుద్ధ ప్రతిని తయారు చేసి యిచ్చుటలో తమ సంపూర్ణ సహకారమును లేఖకుడుగా అందించిన మా పెద్దన్నగారు అంగలూరు జగన్నాథ రామానుజాచార్యులకు వినయ పూర్వక కృతజ్ఞతలు.

చివరగా నా యీ పరిశోధనా విషయమున అనేక విధముల ప్రత్యక్షముగ, పరోక్షముగ సహాయ సహకారము లందించిన మహానుభావులు ఎందరో ఎందరెందరో అందరికి వినయపూర్వక వందనములు.

ఇంట గెలిచి రచ్చ గెలువు మని కదా పెద్దల ఉవాచ. అట్లు ఈ వ్యాసంగమును నిరాటంకముగ కొనసాగించుటలో మనః పూర్వకముగ తోడ్పడిన నా సహధర్మచారిణి చి సౌ. అనంతలక్ష్మి (తిరుమలమ్మ) కిని, మా చిరంజీవులకును నా శుభాశీస్సులు.

యథామతిని సమర్పించుచున్న యీ పరిశోధనా వ్యాసమును బుధజనులు క్షీరనీర న్యాయమున గ్రహింపవలసినదిగా కోరుచూ

బుధజన విధేయుడు,

**అంగలూరు శ్రీ రంగాచారి.**

# ప్రస్తావన

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని రచనల గూర్చి నాకు జ్ఞానము కలిగి రమారమి పదునైదు వత్సరములు మాత్రమే అయినది. అప్పటికి నాకు తెలిసి నల్లగొండలో అన్నమయ్య కీర్తనలు గానం చేసేవారు ముడుంబ సోదరులుగా పేరు గాంచిన సీతారామానుజాచార్యుల వారు, లక్ష్మణాచార్యుల వారు మాత్రమే.

ఆ రోజులలో రేడియోలో అప్పుడప్పుడు అన్నమయ్యగారి అధ్యాత్మకీర్తనలు బహుళ ప్రచారములో నున్నవి పది కీర్తనల కన్న ఎక్కువ లేవని చెప్పవచ్చును. లేదా నా జ్ఞాన పరిధిలో అంతకంటే ఎక్కువలేవేమో.

1978 ప్రాంతమున అన్నమయ్యగారి శృంగార రచనలు కూడ కలవనియు అవి పండితులచే నిరాదరింపబడియున్నవనియు తెలిసికొంటిని. అదృష్టవశమున 1979లో శృంగార సంకీర్తనలు గల 12వ సంపుటము నాకు లభించుటయు. దానినామూలాగ్రముగ పఠించుటయు, సంభవించినది ఆ సంపుటమునకు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు వ్రాసిన పీఠిక అన్నమయ్యగారి మనో విశ్లేషణమును తెలియచేసినది నాలో ఆలోచనలు రేకెత్తించినది. అన్నమయ్య శృంగార రచనలలోని భక్తి మాధుర్యమును ప్రకటింపవలెననెడి కుతూహలము నన్ను నిలువనీయలేదు. తిరుపతికి వెళ్ళి అచ్చట లభ్యమైన సంకీర్తనా సంపుటములన్నియు కొని తెచ్చితిని. చదివితిని. అందలి భక్తిరసామృతమును నా యోపిన కొలది గ్రోలగలిగితిని.

అట్లా సంకీర్తనా గ్రంథములను పరిశీలించుచున్నపుడే ''అన్నమయ్య మధురభక్తి'' అను అంశముపై పరిశోధనకు ప్రేరణ కలిగినది ఆది కార్యరూపము ధరించుటకు మరియొక మూడు వత్సరములు గడచినవి విశ్వవిద్యాలయము వారు పరిశోదనకు 1982లో అనుమతి నొసంగినారు. ఇప్పటికి ఇట్లు యథాశక్తిని గురువర్యుల పర్యవేక్షణలో దీనిని పూర్తి చేయగలిగితిని

తాళ్ళపాక వారి సాహిత్యమున అన్నమయ్యగారిది అగ్రతాంబూలము ఇప్పటి వరకు లభించిన 12 వేల సంకీర్తనలలో అధిక భాగము శృంగార సంకీర్తనలే ఇవి అన్నియు మధుర భక్తి ప్రపూరితములు శృంగార నాయికా నాయకులు, దూతికలు. విప్రలంభ శృంగారము మనకు అడుగడుగున కన్పించును ఎవరెట్టి అవస్థలలో గోచరించినను వారికి శ్రీ వేంకటేశ్వరుని

సాన్నిధ్యము లభించుటయే ప్రతిఫలము ఆ భావములు ఆ అనుభూతులు అన్నమయ్యగారి సొత్తు అనంతభక్తి సామ్రాజ్యమున శ్రీనివాసుని సాన్నిధ్యము నిరంతరము పొందగలిగిన వాడు అన్నమయ్య తెనుగులోని తీయదనము, నుడికారపుసొంపులు ఆయనకు తెలిసినంతగా మరెవరికిని తెలియవనుట అత్యుక్తి కానేరదు.

అట్టి మహానుభావుని అంతరంగమును గూర్చి చెప్పబూనుట ఇనమండలమును కరదీపికతో చూపబోవుటవంటిది. నందకాంశ సంభూతుడు, భక్త వరేణ్యుడు అయిన అన్నమయ్యగారెక్కడ? అల్పజ్ఞానుడైన నేనెక్కడ? ఆయన రచనలయందు, ఆయన యందు గల అభిమానముతో ఏదో చెప్పవలెననెడి తపనతో చేసిన స్వల్ప ప్రయత్నమిది.

నాకన్న ముందుగనే డా. వేటూరి ఆనందమూర్తి గారు తమ "తాళ్ళపాక కవుల పదకవితలు – భాషా ప్రయోగవిశేషాలు" అను గ్రంథమున "శృంగారము – పదరచనలు" అను గ్రంధమున "శృంగారము – పదరచనలు" అను విభాగమున వివిధ నాయికా నాయకుల గురించిస్థాలీపులాకన్యాయమున చర్చించి యున్నారు. ఈ గ్రంథము 1976లోనే ప్రచురింపబడినను నేను చూచినది 1983లో మాత్రమే నా వ్యాసరచనా ప్రణాళికకు ఆ గ్రందము కొంత వరకు మార్గదర్శకమైనది.

రసమంజరీ కారుని ప్రకారము స్వీయాది భేదములు, అష్టవిధనాయికలు, అవాస్థా భేదములు, వయోభేదములచే గుణింపగా 1152 మంది నాయికలైరి. ఇంత విపులముగ ఉదాహరణలు వివరణలు ఇచ్చుచు బోయిన గ్రంథము మూడు వేల పుటలు దాటిపోవును. అన్నమయ్యగారి మధుర సాహితీ జలధిని తరింప ఒకరి పరిశోధన, ఒక జీవితము, ఒక తరము సరిపోవు. అందులకే అల్పశక్తి గల నేను అష్టవిధనాయికలు, స్వీయాధి భేధములు, చతుర్విధనాయకులు, నాయికలు, దశావస్థలు, దూతికలు అను భేదములనే నిరూపించుచు, మధుర భక్తి పరిపూర్ణమైన సంకీర్తనలను ఉదహరించి వివరించితిని. గ్రంథ విస్తరణ భీతిచే వివరణ కొంత సంక్షిప్తము కాక తప్ప లేదు.

ఈ విధమున భక్త శ్రేష్ఠుడు, ప్రపన్నుడు అయిన అన్నమాచార్యుని సేవ చేయుటకు అవకాశము లభించుటచే నా జన్మ చరితార్థమైనట్లు భావింతును.

అన్నమాచార్యుని రచనలను సంకీర్తనా భండారము నుండి వెలికి తీయించి వెలుగు చూపించిన వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, రచనలను స్వరపరచి సాహితీ విశేషములను

తెలియపరచిన కీ శే. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు, ఆ కార్యక్రమమును నిర్విఘ్నముగ కొనసాగించుచు పీఠికల మూలమున అమూల్యా విశేషములను ప్రకటించుచున్న గౌరిపెద్ద రామసుబ్బశర్మగారు కామిశెట్టి శ్రీనివాసులు గారు – ఇట్లిందరో మహానుభావులు – పరంపరగా అన్నమయ్య రచనల ద్వారా శ్రీనివాసుని సేవ చేయుచున్న మహానుభావులు వీరందరి క్రియాకలాపములు నన్నెంతో ఉత్సాహపరచినవి. స్ఫూర్తి నిచ్చినవి కార్యోన్ముఖుని చేసినవి వీరందరికిని నేనెంతగనో ఋణపడి యున్నాను. వారు చేసిన సేవలో అన్నమయ్యగారికి సహస్రాంశమైనను నేను చేయలేదేమో అనిపించును అయినను నేనెంతటి వాడను. ఏ పని యైనను సమర్థముగ నిర్వహించుటకు నేను కేవలము శ్రీహరి పరిచారకులలో చివరి వారికి సేవకుడను మాత్రమే ఇప్పట్టున కులశేఖరాళ్వారుల ఈ క్రింది శ్లోకమే నాకు శరణ్యము.

''మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే
మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ
త్వద్భృత్య భృత్య పరిచారక భృత్యభృత్య
భృత్యస్య భృత్య ఇతిమాం స్మర లోకనాథ।

అంగలూరు శ్రీ రంగాచారి.



| | |
|---|---|
| రచయిత | డా. అంగలూరు శ్రీరంగాచార్య |
| జననం | 1940 విక్రమ, జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి పానగల్లు, నల్లగొండ |
| వృత్తి | అధ్యాపకుడు |
| అభిరుచులు అలవాట్లు | మంచి సంగీతం వినడం, పాడడం, వచ్చింది ఉచితంగా అందించడం, బాణీలు కూర్చడం మొ వి ఆధ్యాత్మిక రచనలు - లౌకిక రచనలూ చదవడం, వ్రాయడం - పద్య సాహిత్య ముద్రణను ప్రోత్సహించడం |
| రచనలు ముద్రితం | అన్నమయ్య మధుర భక్తి (ఈ పుస్తకమే) |
| అముద్రితం | 1. భగవద్గీత - గానానుకూలగేయాలు<br>2. ప్రతిమ (తెలుగు వచన నాటకం)<br>3 శృంగార రంగనాథ సంకీర్తనలు<br>4. దైవభక్తి, దేశభక్తి గేయాలు<br>5 వాయుపుత్ర శతకం<br>6 ప్రాకృతాంధ్ర ఉన్మత్తరాఘవ నాటకాలు - ఒక పరిశీలన<br>7 పాఠశాల విద్యార్థులకోసం నాటికలు - నృత్యగేయాలు మొ. వి.<br>8. పోతనపై నమ్మాళ్వారు - గోదాదేవిల ప్రభావం. |
| చిరునామా | డా. అంగలూరు శ్రీరంగాచార్య<br>361, బి. ఎన్. రెడ్డి కాలనీ,<br>వనస్థలిపురం, హైద్రాబాద్. |